
అందమైన రేపటికోసం
మీ అరచేతిలోనే
అవకాశం
యాప్ డౌన్‌లోడ్ కోసం
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
www.epratibha.net

ఈనాడు

ప్రతి క్షణం
మధురమైన పాటలు
మురిపించే మాటలు
మన EFMలో
Keep Listening
EFM ఇది మీ FM
ప్రకటనల కొరకు సంప్రదించండి:
8008003297
Mee FM
91.9 Vijayawada
PART OF THE ఈనాడు NETWORK

విజయవాడ 17-1-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 157
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఏడాదిలో భూ సమస్యల్లేని రాష్ట్రం



గత ప్రభుత్వ హయాంలో రికార్డుల వ్యవస్థ అతలాకుతలం

- ఏడాదిలోగా సమగ్ర భూ సర్వే..
- బ్లాక్‌చైన్ టెక్నాలజీతో రికార్డులకు 'రాజముద్ర'
- పాడి పరిశ్రమలో టెక్నాలజీ పరుగు
- 'పీ-4' విధానంతో పేదరికంపై యుద్ధం
- మెగా సిటీలుగా విశాఖ, అమరావతి, తిరుపతి
- నారావారిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు

డబ్బు ఒక్కటే ఉంటే సరిపోదు.. మేనేజ్‌మెంట్ స్కిల్స్ కూడా ఉండాలి. ఐదు ఎకరాల్లో ఒక రైతు అరకొర పంటనే పండించగలిగితే.. నైపుణ్యం ఉన్న వ్యక్తి అద్భుతాలు సృష్టిస్తాడు. అలాంటి విజ్ఞానాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్తాం.

వచ్చే ఏడాది కాలంలో నెక్స్ట్ లెవెల్ డెవలప్‌మెంట్‌ను చూస్తారు. కేవలం మౌలిక వసతులే కాదు.. ప్రతి కుటుంబంలో ఆదాయం పెంచడం, స్థానికంగానే యువతను 'అంత్రప్రెన్యూర్స్'గా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. ప్రజల సంతృప్తే పరమావధిగా మా పాలన సాగుతుంది. - నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు

ఈనాడు డిజిటల్, తిరుపతి: 'గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల వ్యవస్థను పూర్తిగా అతలాకుతలం చేశారు. యథేచ్ఛగా 22ఏ జాబితాలో చేర్చి గందరగోళం సృష్టించారు. ఆ వ్యవస్థ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాం. ఒక్క రూపాయి అవినీతి లేకుండా ఏడాదిలోగా సమగ్ర సర్వే పూర్తి చేసి, రికార్డులకు క్యూఆర్ కోడింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీతో 'రాజముద్ర' వేస్తాం. ఇకపై భూ రికార్డులను ట్యాంపరింగ్ చేయడం ఎవరి తరమూ కాదు. 2027 నాటికి రాష్ట్రంలో భూ సమస్య అనేదే లేకుండా చేయడం నా ముందున్న అతి పెద్ద బాధ్యత' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా సొంతూరు నారావారిపల్లెకు వచ్చిన ఆయన.. మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, భవిష్యత్ ప్రణాళికలపై కీలక విషయాలను వెల్లడించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

రికార్డుల ప్రక్షాళనే కలెక్టర్ల ప్రథమ కర్తవ్యం


'భూ సమస్యల పరిష్కారం ఒకరోజుతో అయ్యేది కాదు. అందుకే వన్ ఇయర్ ప్రోగ్రాం పెట్టుకున్నాం. ఇందుకోసమే కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు పనిచేయాలి. వచ్చే ఏడాది కాలం వారికి వేరే పని లేదు. ప్రతి నెలా 9వ తేదీన నేనే స్వయంగా పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తా. ఎక్కడైనా తప్పు జరిగితే కఠిన చర్యలుంటాయి. శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తున్నాం. సంపదసృష్టించడం ఎంత ముఖ్యమో.. ఆర్థిక అసమానతలు తగ్గించడం అంతే ముఖ్యం. సంపన్నులు తమ గ్రామాలపై మమకారం (మిగతా 8లో)

దేశానికే దిక్సూచి.. 'స్వర్ణ' చంద్రగిరి 11లో

యూనిట్ విద్యుత్‌కు ₹1.19 తగ్గింపు!

- మూడేళ్లలో ఈ లక్ష్యం చేరేలా ప్రణాళిక
- ఈ ఏడాది 29 పైసలు తగ్గించిన ఇంధన శాఖ
- విద్యుత్ కొనుగోళ్లలో రూ.2,320 కోట్ల మిగులు

ఈనాడు - అమరావతి



విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని రానున్న మూడేళ్లలో యూనిట్‌కు రూ.1.19 మేర తగ్గించేందుకు ఇంధన శాఖ కసరత్తు చేస్తోంది. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడే నాటికి యూనిట్ విద్యుత్ కొనుగోలు వ్యయం రూ.5.19గా ఉంది. మరో మూడేళ్లలో దీన్ని రూ.4కు తీసుకురావాలన్న లక్ష్యం మేరకు 2025-26లో యూనిట్‌కు 29 పైసలు తగ్గించింది. ఇంకా 90 పైసలు తగ్గించేందుకు గల అవకాశాలపై కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో అవసరాలకు ఏటా సుమారు 80 వేల మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్‌ను డిస్కంలు వివిధ వనరుల నుంచి కొంటున్నాయి. ఇప్పటికే యూనిట్‌కు 29 పైసలు తగ్గించినందున కొనుగోళ్లలో ఏటా సుమారు రూ.2,320 కోట్లు ఆదా అవుతుందని అధికారులు చెబుతున్నారు.

వైకాపా ప్రభుత్వం 2023-24లో బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విద్యుత్ కొనడం ద్వారా రూ.8,600 కోట్లు వెచ్చించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వ్యయ నియంత్రణపై దృష్టి పెట్టింది. సాంకేతికతతో ముందస్తుగా డిమాండ్‌ను అంచనా వేసి.. అవసరం మేరకే కొంటోంది. తద్వారా 2024-25లో బహిరంగ మార్కెట్‌లో కొనుగోళ్లు రూ.3 వేల కోట్లకు తగ్గాయి. ఈ ఏడాది రూ.1,700 కోట్లకు తగ్గాయి. 2026-27లో మరో రూ.వెయ్యి కోట్లు తగ్గించేలా ఇంధన శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది. దీనికోసం అంతర్గత సామర్థ్యాన్ని (మిగతా 8లో)

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb FRESH CHICKEN Vencobb No.1 Tastiest Chicken
సూచించిన నేటి గ్రుడ్లు & చికెన్ విజయవాడ జోన్ ధరలు

12 గ్రుడ్ల రిటైల్ ధర ₹ 75	ఫారం దగ్గర లైవ్ బర్డ్	157 కిలో	డ్రెస్సిడ్ స్కిన్‌తో	267 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	184 కిలో	స్కిన్‌లెస్	304 కిలో

Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ముంబయిలో ఠాక్రే కోటకు బీటలు

మహారాష్ట్ర స్థానిక ఎన్నికల్లో భాజపా నేతృత్వంలోని మహాయుతి కూటమి హవా

29 మున్సిపల్ కార్పొరేషన్లలో 25 కూటమి సొంతం 10లో

వేలుపులు ప్రభవించి.. వెలుగులు పంచి

- అంగరంగ వైభవంగా జగ్గన్నతోట ప్రభలోత్సవం 11లో
- ఏకాదశ రుద్రులను ఒకేచోట దర్శించుకున్న భక్తులు




డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వరిచేలోంచి ప్రభను తీసుకొస్తున్న కె.పెదపూడి వాసులు

సైనిక చర్య లేనట్టే!

ఇరాన్‌పై ఇప్పట్లో దాడి చేయబోమని ట్రంప్ సంకేతాలు

- నిరసనకారులకు మరణశిక్షలపై టెహ్రాన్ మెత్తబడటమే ప్రధాన కారణం!
- ఫలించిన ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాల ప్రయత్నాలు

వాషింగ్టన్: ఇరాన్‌పై సైనిక చర్య తప్పదంటూ ఇటీవల వరుస హెచ్చరికలు చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుతానికి వెనక్కి తగ్గినట్టే కనిపిస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు చేపట్టిన నిరసనకారుల అణచివేత విషయంలో టెహ్రాన్ మెత్తబడినట్లు కనిపిస్తోందని పేర్కొన్న ఆయన.. సమీప భవిష్యత్తులో ఆ దేశంపై (మిగతా 8లో)



ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం వద్ద శుక్రవారం ఇరాన్ ప్రభుత్వానికి మద్దతుగా అమెరికా, ఇజ్రాయెల్ దిష్టిబొమ్మల దహనం

నైపుణ్య శిక్షణ.. ఉద్యోగాల కల్పన

- గత ఏడాది 10 వేలకుపైగా యువతకు ఉపాధి కల్పించిన సీడాప్
- జర్మనీలో నర్సింగ్, ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలు
- డీడీయూజీకేవై అమలులో దేశంలోనే ఏపీకి మొదటి స్థానం



సీడాప్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

■ ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన అశోక్ కుమార్ ఎంసీఏ చదువుకున్నారు.. నైపుణ్యాలు లేకపోవడంతో ఉద్యోగం పొందలేకపోయారు. రాష్ట్ర ఉద్యోగ కల్పన, వ్యవస్థాపకాభివృద్ధి సంస్థ (సీడాప్) నిర్వహించిన శిక్షణలో చేరిన ఆయన కమ్యూనికేషన్ నైపుణ్యాలు పొందడంతో ఇప్పుడు ఇన్ఫోసిస్‌లో రూ.60 వేల జీతంతో ఉద్యోగం సాధించారు.

■ ఐటీఐ చదువుకున్న శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టికి చెందిన సవర పవన్ కుమార్ సీడాప్ శిక్షణ పొందారు. ఇప్పుడు హైదరాబాద్‌లో బ్లింకిట్‌లో నెలకు రూ.21 వేల వేతనంతో ఉద్యోగం సంపాదించారు.

■ శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన బాలు నాయక్ డిగ్రీ చదివి చాలా కాలం నిరుద్యోగిగా ఉన్నారు. మూడు నెలలు రిటెయిల్ రంగంలో సేల్స్ అసిస్టెంట్‌గా శిక్షణ పొందిన ఈయనకు జొయలూకాస్ దుకాణంలో రూ.20 వేల వేతనంతో ఉద్యోగం పొందారు. ఇలా ఎంతో మంది యువత నైపుణ్య శిక్షణ పొంది, ఉద్యోగాలు పొందుతోంది.


-వివరాలు 8లో

రూ.18 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు

కాకినాడలో ఏర్పాటుచేస్తున్న ఏఎం గ్రీన్ సంస్థ

నేడు శంకుస్థాపన చేయనున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అతి పెద్ద గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత.. గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు కాకినాడలో ఏర్పాటు కానుందని ప్రభుత్వం పేర్కొంది. గ్రీన్‌కో గ్రూప్‌నకు చెందిన ఏఎం గ్రీన్ సంస్థ ఏర్పాటుచేసే ప్రాజెక్టు ద్వారా జర్మనీ, జపాన్, సింగపూర్‌కు గ్రీన్ అమ్మోనియా ఎగుమతి చేయనుంది. ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ.18 వేల కోట్ల (2 బిలియన్ డాలర్ల) పెట్టుబడిని సంస్థ పెట్టనుంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం ఈ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. నిర్మాణ సమయంలో 8వేల మందికి ఉపాధి లభించనుంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తర్వాత లాజిస్టిక్స్ (మిగతా 8లో)



లోపలి పేజీల్లో

యూపీఐతో ఈపీఎఫ్ నిధి ఉపసంహరణ
ఏప్రిల్ నాటికి అందుబాటులోకి
కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ

ఎగిరిన కోళ్లు.. కోట్లు!
తాడేపల్లిగూడెంలో అత్యధికంగా రూ.1.53 కోట్ల పందెం
ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో భారీగా కోడి పందేలు, జూదాలు

అందుబాటులోకి పశ్చిమ బైపాస్
గుంటూరు జిల్లా కాజ నుంచి కృష్ణాజిల్లా చినఅవుటపల్లి వరకు
రాకపోకలు ప్రారంభం

పాడేరు గిరుల్లో కాఫీ సిరులు



- మరో లక్ష ఎకరాల్లో సాగు విస్తరణకు అడుగులు
- ప్రస్తుతం 2.58 లక్షల ఎకరాల్లో పంట



ఈనాడు, అమరావతి: రానున్న ఐదేళ్లలో పాడేరు ఏజెన్సీ పరిధిలో కాఫీ సాగును ప్రభుత్వం విస్తృతంగా చేపట్టనుంది. లక్ష ఎకరాల్లో పంటను విస్తరించనుంది. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు. ప్రస్తుతం పాడేరు ఐటీడీఏ పరిధిలోని పాడేరు, అరకు వ్యాలీ, చింతపల్లి ప్రాంతాల్లో 2.58 లక్షల ఎకరాల్లో కాఫీ సాగు చేస్తున్నారు. రైతుల్ని ప్రోత్సహించి మరో లక్ష ఎకరాల్లో ఈ పంటను విస్తరించనున్నారు. ఇదికాకుండా కాఫీ పంట పునరుద్ధరణ కింది 75 వేల ఎకరాల్లో సాగును చేపట్టనున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.202 కోట్లు. కాఫీ సాగులో ప్రస్తుతం దేశంలో కర్ణాటక, కేరళ తర్వాత ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉంది. 2031 నాటికి సాగును విస్తరింపచేసి తద్వారా రాష్ట్రాన్ని రెండో స్థానంలో నిలపాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

'వీబీ-జీ రామ్ జీ' అనుసంధానం



కాఫీ పంటకు సూర్యరశ్మి నేరుగా తాకకుండా సరిపడా నీడ ఉండాలి. కొత్తగా చేపట్టే లక్ష ఎకరాల సాగు విస్తరణలో 60 వేల ఎకరాల్ని షేడ్ ప్లాంటేషన్ విధానంలో అందుబాటులోకి తీసుకురానున్నారు. సిల్వర్ ఓక్, మామిడి, నేరేడు, పనస మొక్కల్ని సాగు చేయించి నాలుగో ఏడాది వాటి నీడన కాఫీని పెంచుతారు. మిగతా షేడ్ ప్లాంటేషన్ విధానంలో ఉన్న 40 వేల ఎకరాల్లో కాఫీని సాగు చేసేందుకు రైతుల్ని సన్నద్ధం చేస్తున్నారు. ఇందుకోసం 'వీబీ-జీ రామ్ జీ' (ఉపాధి హామీ) పథకాన్ని (మిగతా 8లో)

(c) eenadu



తల్లిదండ్రులు మీ పిల్లలుగా మారుతారు

కాలం గడిచేకొద్దీ మీ తల్లిదండ్రులు మీకు పిల్లలుగా మారిపోతారు. చెప్పిందే చెబుతూ, అడిగిందే అడుగుతూ, అన్నీ మర్చిపోతూ మీ సహనాన్ని పరీక్షిస్తారు. వారి మీద చిరాకు పడుతూ, గట్టిగా అరుస్తూ వారి మనసులను బాధపెట్టకండి. మీరు చిన్నప్పుడు వారి మీద ఎలా ఆధారపడ్డారో, ఇప్పుడు వారు వృద్ధాప్యంలో మీ మీదే ఆధారపడ్డారు. వారు మీపై చూపిన ప్రేమ, సంరక్షణను తిరిగి వారికి పంచడాన్ని మీ బాధ్యతగా భావించండి.

– శ్రద్ధే కటియార్, వైద్య నిపుణులు

గ్రహం అనుగ్రహం

17–1–2026 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; హేమంత రుతువు, పుష్యమాసం, బహుళపక్షం
చతుర్దశి: ప. 11-57 తదుపరి అమావాస్య
మూల: ఉ. 8-38 తదుపరి పూర్వాషాఢ
వర్జ్యం: ఉ. 6-52 నుంచి 8-38 వరకు
తిరిగి రాత్రి 7-03 నుంచి 8-47 వరకు
అమృత ఘడియలు: తె. 5-28 నుంచి..
దుర్ముహూర్తం: ఉ. 6-37 నుంచి 8-06 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6.38; సూర్యాస్తమయం: సా.5.42
ముక్కనుమ, మాస శివరాత్రి

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	11.2	30.3
విజయనగరం	14.0	27.0
శ్రీకాకుళం	16.0	28.0
హైదరాబాద్	17.7	30.8
కడప	18.0	31.0
తాడేపల్లిగూడెం	18.0	31.0
అనంతపురం	18.6	33.0
తిరుపతి	19.5	30.3
విశాఖపట్నం	19.6	28.4
గుంటూరు	20.0	31.0
రాజమహేంద్రవరం	20.0	33.0
కర్నూలు	20.7	33.0
విజయవాడ	21.0	30.5
నరసాపురం	21.0	31.8
ఒంగోలు	21.4	30.3
నెల్లూరు	22.7	30.6

భూమి లోపలి ప్రపంచాన్ని చూసేలా..!

- జీపీఆర్‌తో 3డీ మ్యాపింగ్ చేస్తున్న ఐఐటీ తిరుపతి
- పెను ప్రమాదాలకు చెక్ పెట్టే అవకాశం

ఈనాడు డిజిటల్, తిరుపతి: భూ ఉపరితలంపైనే కాకుండా దాని కింద ఒక సమాంతర, సంక్లిష్టమైన ప్రపంచం నడుస్తుంది. ఇది గ్యాస్ సరఫరా వ్యవస్థ, అత్యంత సున్నితమైన విద్యుత్ కేబుళ్లు, కమ్యూనికేషన్ ఫైబర్‌లు, మురుగునీటి వ్యవస్థలతో అల్లుకుపోయిన ఒక గజిబిజి ప్రపంచం. ఇక్కడ ఏ ఒక్క చోట తప్పుగా తవ్వినా.. ఆసుపత్రుల్లో సేవలు స్తంభించవచ్చు, గ్యాస్ లీకై పెను ప్రమాదాలు వాటిల్లవచ్చు. ఈ నిశ్శబ్ద ప్రమాదాలను ముందుగానే పసిగట్టడానికి, నగర మౌలిక వసతుల జీవితకాలం పెంచడానికి ఐఐటీ తిరుపతి పరిశోధకులు భూగర్భ ప్రపంచాన్ని క్షుణ్ణంగా 3డీ మ్యాపింగ్ చేస్తున్నారు. ఇందుకు ఇక్కడి జియో ఇంటెల్ ల్యాబ్ వేదికైంది. ల్యాబ్ డైరెక్టర్ డా.రోషన్ కే నేతృత్వంలో ప్రాజెక్ట్ మేనేజర్ అభిలాష్ సైనీ బృందం పరిశోధనలు చురుగ్గా జరుగుతున్నాయి. వారు తెలిపిన ప్రకారం..

ఏఐ సాయంతో

జీపీఆర్ డేటాను మాన్యువల్‌గా విశ్లేషించడానికి సమయం పడుతుంది, అందుకే ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఏది పైపు, ఏది కేబుల్.. అనే నిర్ధారణలను ఏఐ చేసేస్తుంది. పైప్ తయారైన పదార్థం, దాని కొలతలు మొదలైన వాటినీ చెబుతుంది.

మౌలిక వసతుల జీవితకాలం పెంపు

జీపీఆర్ టెక్నాలజీ వంతెనలు, పిల్లర్లు వంటి కాంక్రీట్ నిర్మాణాల పరీక్షల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. చారిత్రక భవనాలు, వంతెనల పిల్లర్లను స్కాన్ చేసి లోపల ఉన్న ఉక్కు కడ్డీలకు ఎక్కడ తుప్పు పట్టిందో, ఎక్కడ బలహీనపడ్డాయో గుర్తించొచ్చు. మొత్తం కాంక్రీట్‌ను పగలగొట్టకుండానే లోపల తుప్పు పట్టిన ప్రాంతాలను గుర్తించి, ఆ చిన్న భాగాన్ని మాత్రమే సరిచేసి ఆ నిర్మాణాల జీవితకాలాన్ని దశాబ్దాల పాటు పెంచవచ్చు.

నేలను చీల్చుకెళ్లే విద్యుదయస్కాంత కన్ను

భూమిని తవ్వకుండానే భూగర్భాన్ని చూడటానికి గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) అక్కరకు వస్తుంది. దీని ద్వారా విద్యుదయస్కాంత తరంగాలను లోపలికి పంపుతారు. ఈ తరంగాలు భూమి లోపల దాగి ఉన్న పైపులు, కేబుళ్లను తాకి వెనక్కి పరావర్తనం చెందుతాయి. వీటిని విశ్లేషించడం ద్వారా, ఎక్కడెక్కడ ఏ వస్తువులు ఉన్నాయి, ఎంత లోతులో ఉన్నాయనే డేటాతో కచ్చితమైన త్రీడీ చిత్రాన్ని సృష్టిస్తారు. ఇలా స్కాన్ చేసిన డేటా తవ్వకాలకు వెళ్లే కార్మికులకు ఒక మ్యాప్‌గా ఉపయోగపడుతుంది. తద్వారా వారు అత్యంత విలువైన, సున్నితమైన నెట్‌వర్క్‌లను రక్షిస్తూ, నిర్మాణాలు సాగించగలరు. అంతేకాకుండా, పైప్‌లైన్లలో ఎక్కడ లీక్ ఉందో, మురుగునీటి కాలువలు ఎక్కడ పూడుకుపోయాయో కూడా ఈ టెక్నాలజీ ద్వారా సెం.మీ. కచ్చితత్వంతో గుర్తించడం సాధ్యమవుతుంది. సాధారణంగా 5 నుంచి 8 మీటర్ల లోతు వరకు ఉన్న నెట్‌వర్క్‌ను ఈ విధానంలో మ్యాప్ చేయవచ్చు. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావడంతో జీపీఆర్ డేటాను ఏఆర్/ వీఆర్ గ్లాసెస్‌తో అనుసంధానం చేస్తున్నారు. తద్వారా ఫీల్డ్‌లో ఉన్న ఇంజినీర్లు, తమ ముందున్న నేల కింద పైపులు ఎక్కడ ఉన్నాయో రియల్ టైమ్ విజువలైజేషన్ ద్వారా చూసి నిర్ణయం తీసుకోవచ్చు.



ఐఐటీ తిరుపతిలోని ఓ రోడ్డుపై జీపీఆర్ స్కాన్ ఇలా..

స్వదేశీ పరిజ్ఞానంతో భవిష్యత్తు

– అభిలాష్ సైనీ



ప్రస్తుతం జీపీఆర్ పరికరాలు విదేశాల నుంచి దిగుమతి అవుతున్నందున ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. నిధులను సమీకరించి ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేయాలని జియో ఇంటెల్ ల్యాబ్ లక్ష్యంగా పెట్టుకుంది. స్వదేశీ జీపీఆర్‌లు, ఇతర పరికరాలను తయారు చేసి, మేధో హక్కులను సాధించడం ద్వారా దేశీయ అవసరాలను తీర్చడమే కాకుండా, విదేశాలకు కూడా ఎగుమతి చేయాలని చూస్తున్నాం.

యూపీఐతో ఈపీఎఫ్ నిధి ఉపసంహరణ



దిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) చందాదారులకు ఏప్రిల్ నుంచి కేంద్ర ప్రభుత్వం సరికొత్త వెసులుబాటు తీసుకురానుంది. ఈపీఎఫ్‌లో ఉన్న నిధిని యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) పేమెంట్ గేట్‌వే ద్వారా, బ్యాంకు ఖాతాల నుంచి నేరుగా ఉపసంహరించుకునే సదుపాయం అందుబాటులోకి రానుంది. దీనివల్ల 8 కోట్ల మంది సభ్యులు ప్రయోజనం పొందనున్నారు. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ప్రస్తుతం ఈ ప్రాజెక్టుపై పని చేస్తోంది. ఈ కొత్త పద్ధతి ప్రకారం, ఈపీఎఫ్ మొత్తంలో కొంత భాగం మినహా, మిగిలిన మెజారిటీ వాటాను చందాదారులు తమ బ్యాంకు ఖాతా ద్వారా, యూపీఐ సహాయంతో ఉపసంహరించుకోవచ్చు. ఈపీఎఫ్ ఖాతాతో అనుసంధానించిన బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేసుకునేందుకు, ఎంత మొత్తం అందుబాటులో ఉందన్న సంగతీ చూసుకోవచ్చు. లావాదేవీని అత్యంత సురక్షితంగా పూర్తి చేసేందుకు సభ్యులు తమ యూపీఐ పిన్ ఉపయోగించాల్సి ఉంటుంది. నగదు బ్యాంకు ఖాతాలోకి చేరిన తర్వాత, డిజిటల్ చెల్లింపులు, ఏటీఎం నుంచి నగదు తీసుకోవడం.. ఇలా తమ ఇష్టానుసారం వినియోగించుకునే వెసులుబాటు చందాదారులకు ఉంటుంది. ఆటో సెటిల్‌మెంట్‌లో భాగంగా ఎలాంటి మానవ ప్రమేయం లేకుండానే, దరఖాస్తు చేసిన మూడు రోజుల్లోనే క్లెయింలు పరిష్కారం అవుతాయి. ఈ పరిమితి గతంలో రూ.లక్ష కాగా, ఇప్పుడు రూ.5 లక్షలకు పెంచారు. అనారోగ్యం, విద్య, వివాహం, గృహ అవసరాల కోసం ఈ వెసులుబాటు చందాదారులకు ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. కొవిడ్-19 మహమ్మారి సమయంలో ఈపీఎఫ్ఓ ఇచ్చిన ఇ ఆటో-సెటిల్‌మెంట్ వెసులుబాటు ఎంతోమందిని ఆర్థిక కష్టాల నుంచి రక్షించిన సంగతి విదితమే.

★ ఈపీఎఫ్ఓ వద్ద బ్యాంకింగ్ లైసెన్సు లేదు. కాబట్టి, సభ్యులకు నేరుగా నగదు ఇవ్వడం సాధ్యపడదు. అందుకే, బ్యాంకు ఖాతాల ద్వారా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు, ఈ విషయంతో సంబంధం ఉన్న ఒక ఉన్నతాధికారి వెల్లడించారు. ఏటా సుమారు 5 కోట్లకు పైగా క్లెయింలు వస్తుండటంతో, ఈ భారాన్ని తగ్గించేందుకు, సమయాన్ని ఆదా చేసేందుకు ఈ సాంకేతిక మార్పులు చేస్తున్నట్లు వివరించారు. గతేడాది అక్టోబరులో కేంద్ర ట్రస్టీల బోర్డు పాక్షిక ఉపసంహరణ నిబంధనలను సరళీకరించేందుకు ఆమోదం తెలిపింది. దీని ప్రకారం.. గతంలో ఉన్న 13 సంక్లిష్ట నిబంధనలను రద్దు చేసి, వాటిని 3 విభాగాలు (అత్యవసరాలు, గృహ అవసరాలు, ప్రత్యేక పరిస్థితులు)గా వర్గీకరించారు. సభ్యుల ఖాతాలో యజమాని, ఉద్యోగి వాటాతో కలిపి కనీస నిల్వ 25 శాతాన్ని కొనసాగించాలి. ఆ తర్వాత అర్హత ఉన్న మొత్తంలో 100% వరకు ఉపసంహరించుకోవచ్చు. ఈ నిర్ణయాలకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే వెలువడే అవకాశాలున్నాయి.

డ్రోన్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

దిల్లీ: దక్షిణ భారతదేశంలో డ్రోన్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవిస్తోందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం తెలిపారు. డీప్ టెక్నాలజీ, ఏఐ స్టార్టప్‌లకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు కేంద్రాలుగా మారాయని అన్నారు. శుక్రవారం ఆయన 'స్టార్టప్ ఇండియా' పదో వార్షికోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. స్టార్టప్ విప్లవం దేశంలో విస్తరించిందని, దాదాపు రెండు లక్షల అంకుర సంస్థలు వివిధ రంగాల్లో ప్రస్తుతం పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు భార్యకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేందుకు కోర్టు నిరాకరణ

ఈనాడు, అమరావతి: వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు కారు మాజీ డ్రైవర్, దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) మర్రి వెంకటరమణ శుక్రవారం హైకోర్టుకు నివేదించారు. ఈ కేసు ఎస్సీ, ఎస్టీ చట్టంతో ముడిపడి ఉన్న నేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులు, ఫిర్యాదుదారు వీధి నూకరత్నానికి నోటీసు ఇచ్చి వారి వాదనలు వినాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథశర్మ.. నిందితుడు అనంతబాబు భార్య అనంతలక్ష్మీదుర్గ ముందస్తు బెయిలు కోసం దాఖలు చేసిన పిటిషన్లో సుబ్రహ్మణ్యం తల్లి నూకరత్నానికి నోటీసు జారీ చేశారు. విచారణను ఈ నెల 20కి వాయిదా వేశారు. అనంతలక్ష్మీదుర్గ తరఫున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు స్పందిస్తూ.. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలని అభ్యర్థించారు. ఈ అభ్యర్థనను తోసిపుచ్చిన న్యాయమూర్తి.. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించారు.

★ సుబ్రహ్మణ్యం హత్య కేసులో తనను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ముందస్తు బెయిలివ్వాలని కోరుతూ అనంతబాబు భార్య అనంతలక్ష్మీదుర్గ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది.

మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై ఎన్‌బీడబ్ల్యూ జారీ

విజయవాడ నేర వార్తలు, న్యూస్‌టుడే: అత్యాచార బాధితురాలి పేరు బయట పెట్టారంటూ విజయవాడ సైబర్ క్రైం పోలీసులు నమోదు చేసిన కేసులో వైకాపా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై విజయవాడ పోక్సో న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. అత్యాచారానికి గురైన బాలిక పేరును బయటపెట్టారంటూ మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ విజయవాడ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గోరంట్ల మాధవ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెల్సిందే. విజయవాడ పోక్సో న్యాయస్థానంలో శుక్రవారం ఉదయం ఈ కేసు విచారణకు వచ్చింది. దీనికి గోరంట్ల మాధవ్ గైర్హాజరయ్యారు. దీంతో అతనిపై నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ చేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. కేసు తదుపరి విచారణను ఈ నెల 30వ తేదీకి వాయిదా వేశారు.

భూమన అభినయ్‌రెడ్డి నమ్మించి మోసగించారు

రోడ్డు విస్తరణ పేరిట రూ.4 కోట్ల ఆస్తి లాక్కున్నారని మహిళ ఫిర్యాదు



నిర్మలమ్మ

ఈనాడు డిజిటల్, తిరుపతి: తిరుపతి మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తమ కుటుంబాన్ని నమ్మించి నట్టేట ముంచారని చంద్రగిరికి చెందిన చిరువ్యాపారి నిర్మలమ్మ వాపోయారు. రూ.4 కోట్ల విలువైన భూమి కోల్పోయిన వైనాన్ని ఆమె శుక్రవారం ఇక్కడ ఆవేదనతో వివరించారు. 'నా భర్త 1982 నుంచి సైకిల్‌పై ఊరూరా తిరుగుతూ నూనె అమ్మి, కడుపు కట్టుకొని దాచుకున్న డబ్బుతో తిరుపతిలోని చింతలచేనులో 50 అంకణాల స్థలం కొనుక్కున్నాం. గత ప్రభుత్వ హయాంలో అభినయ్‌రెడ్డి, ఆయన తండ్రి, అప్పటి ఎమ్మెల్యే కరుణాకరరెడ్డిలు రోడ్డు విస్తరణ పేరుతో ఆ భూమి తీసుకునేందుకు మమ్మల్ని ఒప్పించారు. భూమి ఇస్తే బిడ్డలకు ఉద్యోగాలిస్తామని, టీడీఆర్ బాండ్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. తీరా భూమి లాక్కున్నాక మమ్మల్ని పట్టించుకోలేదు. సుమారు రూ.4 కోట్ల విలువైన ఆస్తి పోగొట్టుకున్నాం. ఆ బాధతో నా భర్త గుండెపోటుతో చనిపోయారు. ఇప్పుడు నేను కూడా గుండె జబ్బుతో బాధ పడుతున్నా' అని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. సీఎం చంద్రబాబు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.



చెన్నైలోని ఎన్టీఆర్ నివాసానికి కొత్త సొబగులు


● ముమ్మరంగా పునరుద్ధరణ పనులు



చెన్నై, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, నటుడు, దివంగత ఎన్.టి.రామారావు నివసించిన చెన్నైలోని ఇంటికి పూర్వపుశోభ తీసుకొచ్చే దిశగా పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఇవి పూర్తయిన తర్వాత ప్రజలు సందర్శించడానికి అనుమతించనున్నారు. త్యాగరాయనగర్‌లోని బజుల్లా రోడ్డులో సుమారు వెయ్యి గజాల విస్తీర్ణంలో ఉన్న ఇంటిని 1953లో ఎన్టీఆర్ తన సతీమణి బసవతారకం పేరిట కొనుగోలు చేశారు. ఈ ఇల్లు ఆయనకు ఎంతో కలిసి వచ్చిందని చెబుతారు. ఎన్టీఆర్ ఇంటి ఎదురుగా దర్శకుడు దాసరి నారాయణరావు ఇల్లు ఉండటంతో ఆయన టీమ్‌తో రాత్రిళ్లు కథాచర్చల్లో పాల్గొనేవారు. తెల్లవారుజామున 3 గంటలకు ఎన్టీఆర్ లేచి దైనందిన కార్యక్రమాలు మొదలు పెట్టేవారు. అందుకే ఆ రెండిళ్లలో ఎప్పుడూ లైట్లు వెలుగుతూ ఉండేవి. దీంతో ఈ వీధిలోని ఏ ఇంటికీ వాచ్‌మన్ అక్కర్లేదంటూ అప్పట్లో చెప్పుకునేవారు. ప్రస్తుతం దాసరి నారాయణరావు ఇల్లు ఉన్న ప్రాంతం షాపింగ్ కాంప్లెక్స్‌గా మారింది. ఎన్టీఆర్ నివాసం అప్పట్లో అభిమానులతో కళకళలాడేది. తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకునే పలువురు అభిమానులు తర్వాత చెన్నై చేరుకుని తమ అభిమాన నటుడు ఎన్టీఆర్‌ను కనులారా చూసి ఆనందించేవారు.

30 మందికిపైగా వారసులు

తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్‌కు తరలడం, ఎన్టీఆర్ కుటుంబం చెన్నైను వీడటం వంటి కారణాలతో ఆ ఇంటిని పట్టించుకునే వారు లేకపోయారు. కొన్నేళ్లకు కళా విహీనంగా మారిన ఆ ఇంటికి పూర్వపు వైభవం తీసుకొచ్చేందుకు పలువురు అభిమానులు ప్రయత్నించినా సుమారు 30 మంది వారసులు ఉండటంతో ఆ ప్రయత్నాలు కొలిక్కిరాలేదు. ప్రస్తుతం ఆ ఇంటిని తాము కొనుగోలు చేసినట్లు నందమూరి కుటుంబానికి సన్నిహితులు, బంధువులైన చదలవాడ బ్రదర్స్ తిరుపతిరావు, శ్రీనివాసరావు వెల్లడించారు. ఆ ఇంటికి మరమ్మతు పనులు ప్రారంభించారు. నిర్మాణశైలిని మార్చకుండా తీర్చిదిద్దుతున్నారు. ఇంటి ముందు ఉన్న ఫ్లైఓవర్ పైనుంచి వెళ్లేవారు చూసినా కనిపించేలా ఇంటి ప్రధాన ద్వారం పైన 'శ్రీకృష్ణపాండవీయం' చిత్రంలో సుయోధనుడి పాత్రలో కనిపించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రజలు ఎన్టీఆర్ ఇంటిని చూసి ఆనందించేలా ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇటీవల చదలవాడ శ్రీనివాసరావు మీడియా ప్రతినిధులతో వెల్లడించారు.



ఎన్టీఆర్ నివాసం





ఎన్టీఆర్ జిల్లా రామవరప్పాడులో విద్యుత్తు వెలుగుల్లో పందేల నిర్వహణ

● ఏలూరు జిల్లా పెదవేగి మండలం దుగ్గిరాల పరిధిలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన బరి వద్ద జనం

ఎగిరిన కోళ్లు.. కోట్లు!

- కృష్ణా జిల్లా కేసరపల్లిలో రూ.కోటి పందెం
- ఉమ్మడి పశ్చిమ గోదావరిలో రూ.250 కోట్ల మేర పందేలు
- ఉమ్మడి తూర్పుగోదావరిలో రూ.500 కోట్ల లావాదేవీలు
- కృష్ణాజిల్లాలో జోరుగా జూదాలు.. చేతులు మారిన రూ.700 కోట్లు

ఈనాడు-ఏలూరు, రాజమహేంద్రవరం, ఈనాడు డిజిటల్-మచిలీపట్నం: పెద్ద పండగ సంక్రాంతి పేరుచెప్పి ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో భారీగా కోడి పందేలు, జూదాలు వెల్లువెత్తాయి. ఈ మూడు జిల్లాల్లోనే దాదాపు రూ.1,450 కోట్ల మేర చేతులు మారినట్లు తెలుస్తోంది. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం బరిలో అత్యధికంగా రూ.1.53 కోట్ల విలువైన పందెం జరిగింది. గతేడాదిలాగే ఈసారీ ఇక్కడ రాజమహేంద్రవరానికి చెందిన రమేశ్‌కు చెందిన డేగ, గుడివాడకు చెందిన ప్రభాకం సేతువ కోళ్ల మధ్య పెద్ద పందెం పడింది. గత సంవత్సరం ప్రభాకర్ కోడి రూ.కోటి గెలవగా, ఈసారి రమేశ్ కోడి రూ.1.53 కోట్లు గెలిచింది. రాష్ట్రంలోనే ఇదే అతి పెద్ద పందెంగా రికార్డు సృష్టించింది. రమేశ్, హైదరాబాద్‌కు చెందిన కొవ్వూరి జానకిరామరాజు బృందం భోగి రోజున రూ.63 లక్షలు, సంక్రాంతి రూ.1.53 కోట్లు, కనుమ రోజున రూ.45 లక్షలు పందేల్లో గెలుపొందినట్లు తెలిపారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో కనుమ రోజు రూ.కోటి పందెం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన ఎక్స్‌ఈఎన్ఈఎక్స్ నిర్వాహకుడు అమర్, ప్రత్యర్థుల సిండికేట్ మధ్య జరిగిన పందెంలో అమర్‌కు చెందిన సేతువ పుంజు విజేతగా నిలిచింది. ఈసారి ప్రతి బరి చుట్టూ 10-15 శిబిరాలు ఏర్పాటుచేసి జూదం ఆడించటంతో రూ. వందల కోట్లు చేతులు మారాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రూ.250 కోట్లకు పైగా పందేలు జరిగాయనేది నిఘావర్గాల సమాచారం. ఉమ్మడి తూర్పుగోదావరిలో ఈ మొత్తం రూ.500 కోట్లని చెబుతుండగా, ఉమ్మడి కృష్ణాజిల్లాలో దాదాపు రూ.700 కోట్లు చేతులు మారినట్లు తెలుస్తోంది.



సినీ, రాజకీయ ప్రముఖుల సందడి



తాడేపల్లిగూడెం బరిలో రూ.1.53 కోట్ల పందెంలో గెలుపొందిన పుంజుతో రాజమహేంద్రవరానికి చెందిన రమేశ్ బృందం

పశ్చిమగోదావరి జిల్లాలో పందేలు చూసేందుకు ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలతోపాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు వచ్చారు. ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎంపీలు బీద మస్తాన్‌రావు, సానా సతీష్‌బాబు, తెలంగాణకు చెంది ఇల్లందు, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, ఆదినారాయణ, నటులు సుశాంత్, ఉత్తేజ్, హీరోయిన్ డింపుల్ హయాతి, గాయని ఎం.ఎం.శ్రీలేఖ, నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు, జబర్దస్త్ బృందంలోని పలువురు వచ్చారు. సేదతీరడానికి గ్రీన్‌రూమ్‌లు, ఆడేవారికి పక్కనే బార్ తరహాలో ఖరీదైన మద్యం, పసందైన భోజనాలు పెట్టారు. మీర్జాపురంతో పాటు మరో ఒకటి, రెండు బరుల వద్ద వివాదం ఏర్పడి కొద్దిసేపు పందేలు నిలిచాయి.

యువతులు పరార్

గణపవరం పరిధిలో ఓ బరి వద్ద గురువారం తెల్లవారుజామున క్యాసినో ఏర్పాటుచేసి నిర్వాహకులు పట్టుబడ్డారు. యువతులను రప్పించి అశ్లీల నృత్యాల కోసం ఏర్పాట్లు చేస్తుండగా పోలీసులు చేరుకుని నిర్వాహకులను అదుపులో తీసుకుంటుండగానే వచ్చిన యువతులు పరారయ్యారు.

ఉమ్మడి తూర్పులో 450కి పైగా బరులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కోళ్లపందేలు, గుండాటలు విస్తృతంగా జరిగాయి. సుమారు 450 వరకు బరులు ఏర్పాటుచేసి పందేలు నిర్వహించారు. మొత్తం రూ.500 కోట్ల మేర చేతులు మారగా.. కోనసీమలోనే రూ.100 కోట్లకుపైగా ఉంది. ఐ.పోలవరం మండలం మురమళ్లలో 20 పందేలతో రూ.20లక్షల చొప్పున జెట్టీ పందేలు నిర్వహించగా, మరో రూ.2 కోట్ల వరకు పైపందేలు కాసినట్లు అంచనా. అందరూ చూసేందుకు వీలుగా ఎల్ఈడీ తెరలు, డ్రోన్ కెమెరాలతో చిత్రీకరణ, బందోబస్తుకు బౌన్సర్లను ఏర్పాటుచేశారు. గుండాట, ఇతర జూదక్రీడల నిర్వహణకు వేలంలో రూ.30 లక్షల వరకు కాకినాడ గ్రామీణం, గోపాలపురం మండలాల్లో దక్కించుకున్నారు. ఆశించిన మేర లావాదేవీలు లేక కాకినాడ గ్రామీణంలో నిర్వాహకులు వేలంలో దక్కించుకున్న మొత్తం చెల్లించలేమని చేతులెత్తేశారు. దీంతో వారిపై దాడి జరిగినట్లు తెలుస్తోంది. నల్లజర్లలో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొనగా, అడ్డుకునేందుకు వెళ్లిన పోలీసులపైనే తిరగబడడంతో వారిని స్టేషన్‌కు తరలించారు. వంద వరకు బుల్లెట్లు, పదుల సంఖ్యలో కార్లను విజేతలకు అందజేశారు.

కృష్ణాలో పలుచోట్ల ఘర్షణలు

ఉమ్మడి కృష్ణా జిల్లాలో పలుచోట్ల పందేల విషయంలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పెదపారుపూడి మండలం భూషణగుళ్ల బరి వద్ద వి.పానకాలు, గుడివాడవాసి అనగాని జగన్నాథం మధ్య కోడి పందెం విషయంలో వివాదం జరిగింది. తిరిగి వెళ్తుండగా పానకాలు కుమారుడు ఈశ్వరరావు బ్లేడ్‌తో జగన్నాథం మెడ కోసేశాడు. ఆయన పరిస్థితి విషమంగా ఉంది. మైలవరం మండలం పొందుగుల బరి వద్ద కోతముక్క శిబిరంలో గురువారం రాత్రి ఓ యువకుడు బీరు బాటిల్ పగలగొట్టి దాడికి యత్నించగా పలువురికి గాయాలయ్యాయి. పెనమలూరు పరిధిలోని ఉప్పలూరు బరిలో క్యాసినో తరహా బరిని తొలగించాలని పోలీసులు ఒత్తిడి తెచ్చారు. శుక్రవారం సాయంత్రం మంత్రి కొలుసు పార్థసారథి అక్కడకు రావడంతో పోలీసులు వెనుతిరిగారు. కేసరపల్లి, రామవరప్పాడు, అంబాపురం, ఉప్పులూరు, విస్సన్నపేట, తిరువూరు, గుడివాడ, ఉయ్యూరులలో క్యాసినో బరులు, ఇంకా విజయవాడ రూరల్ గండేపల్లి, రెడ్డిగూడెం, పెనుగంచిప్రోలు, కంకిపాడు, ఆకునూరు, గుడ్లవల్లేరు, ఉయ్యూరు, యనమలకుదురు, పులిగడ్డ, ఈడ్పుగల్లు తదితరచోట్ల వెలసిన బరుల్లో వందల కోట్లు చేతులు మారాయంటున్నారు. పలుచోట్ల బరుల్లో వరుస పందేలు గెలిచిన పందెంరాయుళ్లకు కార్లు, బుల్లెట్ బైకులు, స్కూటీలు బహుమతిగా ఇచ్చారు.



కేసరపల్లిలో రూ. కోటి పందెం విజేత అమర్‌తో అభిమానులు



బాపట్ల జిల్లా కొల్లూరులో నిర్వహించిన 'కోడి పందేల లీగ్'లో ఎక్కువ పోటీలు నెగ్గిన పుంజు యజమాని ఉదయభాస్కర్‌కు కారును బహూకరిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజా - ఈనాడు, అమరావతి

'ఆంగ్ల మాధ్యమ' జీవోను రద్దు చేయాలి

● తెలుగుభాష పరిరక్షణకు కృషి అవసరం

● ఆంధ్ర సారస్వత పరిషత్తు తీర్మానాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలుగు భాష పరిరక్షణ, వికాసం, విస్తరణకు ప్రభుత్వం, సాహితీ-సాంస్కృతిక సంస్థలు, ప్రజలందరూ సమష్టిగా కృషి చేయాలని ఆంధ్ర సారస్వత పరిషత్తు కోరింది. పరిషత్తు కార్యవర్గ సమావేశం తెలుగు భాషాభివృద్ధికి వివిధ తీర్మానాలను ఆమోదించినట్లు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో వెల్లడించారు. వాటిని శాసన సభాపతి అయ్యన్న పాత్రుడికి అందజేసినట్లు తెలిపారు. వాటిలోని ముఖ్యాంశాలివి..

◆ ఐదో తరగతి వరకు మాతృభాషలోనే బోధన జరగాలి. డిగ్రీ ఐదో సెమిస్టర్ వరకు విధిగా తెలుగు ఒక సబ్జెక్టుగా ఉండాలి.

◆ ఆంగ్ల మాధ్యమంలోనే బోధించాలని ఇచ్చిన జీవోను రద్దు చేయాలి.

◆ చట్టసభలు, ప్రభుత్వ కార్యాలయాల్లో చర్చలు, సమావేశాలు, ఉత్తర్వులు తెలుగులోనే ఉండాలి. న్యాయస్థానాల్లో వాదోపవాదాలు, న్యాయమూర్తుల తీర్పులు తెలుగులోనే సాగాలి.

◆ ప్రాథమిక పాఠశాలల్లో విధిగా తెలుగు పండితులను నియమించాలి.

◆ విద్యాలయాల్లో వారానికి మూడు రోజులు గ్రంథాలయ సమయం ఇవ్వాలి. ◆ దేవాలయాల్లో జరిగే ఉత్సవాల్లో హరికథ, బుర్రకథ, తోలుబొమ్మలాట వంటి కళారూపాలు ఉండాలి.

◆ తెలుగు చలనచిత్రాలకు తప్పనిసరిగా తెలుగు పేర్లు ఉండాలి.

◆ అమరావతిలో ఆధునిక సాంకేతికతతో ప్రాచీన తెలుగుభాష చైతన్య ప్రదర్శనశాలను ఏర్పాటు చేయాలి. శాసనాలు, తాళపత్ర గ్రంథాలను అంతర్జాలంలో పొందుపరచాలి. ఆధునిక ఆంగ్ల, సాంకేతిక పదాలకు తెలుగు నిఘంటువు రూపొందించాలి.

◆ రాష్ట్రేతర ప్రాంతాల్లో తెలుగు భాష పరిరక్షణకు ప్రత్యేక సమితులు ఏర్పాటు చేయాలి. ఇతర రాష్ట్రాల పాఠశాలల్లో తెలుగు బోధనకు ఎదురవుతున్న సవాళ్లను ఆయా ప్రభుత్వాలతో చర్చించి పరిష్కరించాలి.

రాయలసీమ ఎత్తిపోతల్ని కేసీఆర్‌కు తాకట్టుపెట్టిన జగన్

ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజం

ఈనాడు, అమరావతి : భారాస అధినేత కేసీఆర్‌తో లాలూచీ పడి రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని మాజీ సీఎం జగన్ తాకట్టు పెట్టేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. 2020లో తెలంగాణ ఫిర్యాదుతో రాయలసీమ ఎత్తిపోతలపై ఎన్జీటీ స్టే విధించిందని ఎక్స్ వేదికగా గుర్తుచేశారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఎన్జీటీ స్టే విధించిందా? పనులు ఆపిందా? జరిమానా విధించిందా? అని ప్రశ్నించారు. అసలు లిఫ్ట్ పనులు మొదలు పెట్టకుండా, రూ.వందల కోట్లు దోచుకోవడం కోసమే మట్టి పనులకు పరిమితమయ్యారని ఆరోపించారు. "అప్పట్లో తెలంగాణలో అన్న కేసీఆర్ సీఎం..ఏపీలో తమ్ముడు జగన్ సీఎం. ఇద్దరిదీ విడదీయలేని అనుబంధం. 2024 వరకు వీరి హయాంలోనూ ఆ స్టే కొనసాగింది. ఇప్పుడు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని ఆరోపించడం విడ్డూరంగా ఉంది. జగన్‌రెడ్డి సినిమా కథలను ప్రజలు నమ్మరు. వైకాపా నాయకులు నోర్లు అదుపులో పెట్టుకోవాలి" అని సోమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.





'చింతలపూడి' పనులకు అడుగులు

- పర్యావరణ అథారిటీ అనుమతులు వచ్చేలోపు భూసేకరణకు ఏర్పాట్లు
- రూ.151 కోట్లు అవసరమని ప్రతిపాదనలు
- అంచనాలు తాజాగా రూ.8,075 కోట్లకు పెంపు

ఈనాడు, అమరావతి: గోదావరి వరద జలాలను సద్వినియోగం చేసుకునేందుకు చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులను మళ్లీ ప్రారంభించబోతున్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఈ పథకాన్ని తొలి ప్రాధాన్యంగా ఎంచుకున్నా పర్యావరణ అనుమతుల పరంగా ఉన్న ఇబ్బందులు, ఇతర సాంకేతిక కారణాలతో పనులు నిలిచిపోయాయి. పర్యావరణ అనుమతులకు సంబంధించి సుప్రీంకోర్టు నవంబరులో ఇచ్చిన తీర్పుతో ఈ పథకానికి ఊపిరి పోసే అవకాశం ఏర్పడింది. ఇదే అదునుగా జలవనరులశాఖ వరుసగా అడుగులు వేస్తోంది.

ఇలా అడుగులు...

1. ఈ పథకం తొలి దశకు రాష్ట్ర పర్యావరణ అథారిటీ (సియా) నుంచి అనుమతులు తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండటం. ముందుగా పర్యావరణ అనుమతులు పొందని ఏ ప్రాజెక్టుకూ ఆ తర్వాత పర్యావరణ అనుమతులు ఇవ్వవద్దని కిందటేడాది మే 16న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు వల్ల ఇబ్బందులు ప్రస్తావిస్తూ మళ్లీ కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో దాన్ని ఉపసంహరించుకుంటూ 2025 నవంబరు 18న నిర్ణయం వెలువరించింది. దీంతో కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ మార్గదర్శకాలు జారీ చేయాల్సి ఉంది. అందుకోసం 'సియా' ఎదురుచూస్తోంది. కేంద్ర మార్గదర్శకాలు రాగానే ప్రాజెక్టు తొలి దశకు 3 నెలల్లో పర్యావరణ అనుమతులు వచ్చే ఆస్కారం ఉందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

2. సరైన అనుమతులు లేకుండా ఈ పథకం పనులు చేపట్టారంటూ జాతీయ హరిత ట్రైబ్యునల్ రూ.78.60 కోట్ల జరిమానా విధించింది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో తాజాగా సవాల్ చేసింది. జరిమానా తగ్గించుకోవడమో, పూర్తిగా తొలగించుకోవడమో చేయాలనేది యోచన.

3. అవసరమైన భూసేకరణకు రూ.151 కోట్లు తక్షణం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి జలవనరుల శాఖ తెలియజేసింది.

4. చింతలపూడి ప్రాజెక్టుకు ప్రస్తుతం రూ.4,910 కోట్లతో పాలనా అనుమతులు ఉన్నాయి. ఇంతవరకు రూ.4,180 కోట్ల వరకు ఈ పథకంపై ఖర్చు చేశారు. మిగిలిన పనులు చేయాలంటే నిధులు కావాలి. రూ.9,547 కోట్లకు అంచనాలు సవరిస్తూ ప్రతిపాదనలు పంపినా.. ఆనక వాటిని పరిశీలనలో రూ.8,075 కోట్లకు తగ్గించారు. ఆ మేరకు కొత్తగా సవరించిన అంచనాలకు ప్రభుత్వం ఆమోదం తెలియజేయాల్సి ఉంది. ఇందుకు అవసరమైన చర్యలూ చేపడుతున్నారు.

పాత సర్కార్‌లో 5% పనులే...

వైకాపా ప్రభుత్వ హయాంలో కేవలం 5% పనులే చేశారు. అంతకుముందు తెదేపా ప్రభుత్వంలో 40% పనులయ్యాయి. ఆ సమయంలో హరిత ట్రైబ్యునల్ కేసు, భూసేకరణకు సంబంధించి రాష్ట్ర హైకోర్టులో ఉన్న వివాదాల పరిష్కారానికి సరైన ముందడుగు పడలేదు.

రెండు దశల్లో..

53.50 టీఎంసీల వరద జలాలు ఎత్తిపోసి 2 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు, 2.80 లక్షల ఎకరాల స్థిరీకరణకు నీళ్లు ఇవ్వాలనే ఉద్దేశంతో చింతలపూడి ఎత్తిపోతల పథకం రూపకల్పన చేశారు. జల్లేరు జలాశయాన్ని పూర్తి స్థాయిలో నిర్మించేందుకు అటవీ భూమి సేకరణకు ఇబ్బందులు ఉన్న క్రమంలో ఈ పథకాన్ని 2 దశల్లో చేపట్టబోతున్నారు. తొలి దశలో 2.80 లక్షల ఎకరాల స్థిరీకరణకు, 43,600 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీళ్లు ఇవ్వనున్నారు.

4,009 ఎకరాల సేకరణ అవసరం..

తొలి దశలో రెండు స్థాయిల్లో నీటిని ఎత్తిపోయనున్నారు. 5.85 కి.మీ. మేర పైపులతో నీటిని తరలిస్తారు. లీడింగు కాలువ 13.22 కి.మీ. మేర తవ్వుతున్నారు. ప్రధాన కాలువ మొత్తం 106.250 కి.మీ. మేర తవ్వుతున్నారు. దాదాపు 46% పనులు పూర్తయ్యాయి.

◆ ప్రధాన కాలువకు అవసరమైన 3,682 ఎకరాల భూమిలో ఇంకా 674 ఎకరాలు సేకరించాలి. డిస్ట్రిబ్యూటరీలకు కావాల్సిన 3,992 ఎకరాలకు ఇంకా 3,335 ఎకరాలు సేకరించాలి. తొలి దశలో అటవీ భూమి 4.76 హెక్టార్లు సేకరించాలి.



(c) eenadu

ఈనాడు

కొలువులకు తగిన నైపుణ్యాలేవీ?

యువతకు తగిన ఉద్యోగ, ఉపాధులు లభించిన చోట కుటుంబ ఆదాయాలు పెరిగి జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. చదువుకు, సామర్థ్యానికి సరిపోయే కొలువులు దొరకనప్పుడు విలువైన సృజన శక్తులు ఒట్టిపోతాయి. అలాంటి అవాంఛనీయ పరిస్థితులు సమాజ సమ్మిళిత ప్రగతిని దెబ్బతీస్తాయి. దేశీయంగా అటువంటి దుస్థితే నెలకొనడం దురదృష్టకరం. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం, మొన్న నవంబరుతో పోల్చితే డిసెంబరులో 15 ఏళ్లు, అంతకు పైబడిన భారతీయుల్లో నిరుద్యోగిత రేటు స్వల్పంగా పెరిగింది. గ్రామీణంతో పరిగణిస్తే పట్టణ ప్రాంతాల్లో అది ఇంకా ఎక్కువగా 6.7శాతంగా నమోదైంది. సాధారణంగా డిగ్రీ పట్టభద్రులెందరో ప్రభుత్వ ఉద్యోగాల సాధనే ధ్యేయంగా కష్టపడుతుంటారు. కానీ, కాలక్రమంలో సర్కారీ కొలువుల భర్తీ తగ్గిపోతోంది. సాగు రంగంలో సంక్షోభం వల్ల పల్లె యువత పట్టణాల బాట పడుతోంది. ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు కొరవడటం, చదివిన చదువులకు తగిన కొలువులు లేకపోవడం... ఈ రెండింటితో ఉపాధి వేటలో యువత డస్సిపోతోంది. మార్కులూ ర్యాంకులే తప్ప వాస్తవిక సామాజిక అవసరాలు పట్టని రొడ్డకొట్టుడు కోర్సులు, భవిష్యత్తుకు భరోసానివ్వని వెలవెలబోయే చదువులు యువభారతం కలలను కల్లలు చేస్తున్నాయి!

ఇండియాలో ఏటా కోటి మందికి పైగా యువతీ యువకులు కొత్తగా పట్టాలు పుచ్చుకుంటున్నారు. వారిలో చాలా తక్కువ మందికే కొలువులకు తగిన నైపుణ్యాలు ఉంటున్నాయన్నది నిష్ఠుర సత్యం. మన ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో 80శాతానికి ఉద్యోగాలకు కావాల్సిన సామర్థ్యాలు లోపిస్తున్నాయి. జీవికకు అత్యావశ్యకమైన మెలకువలు పట్టుబడక, ఇతరత్రా కారణాలతో 90శాతానికి పైగా పట్టభద్రులు తమ చదువులతో సంబంధం లేని జాబులో కుదురుకుంటున్నారు. ఇలాంటి వారిలో సగానికి పైగా గుమాస్తాలు, యంత్రాల నిర్వాహకుల వంటి అంతగా నైపుణ్యాలతో పనిలేని పనుల్లో సర్దుకుపోతున్నారు. ఇలా అధికశాతం యువజనం ఈసురోమంటూ భారంగా బతుకులు వెళ్లదీస్తుంటే దేశాభివృద్ధి ఎలా వేగవంతమవుతుంది? తమ సౌరశక్తి పరికర కేంద్రాల నిర్మాణం కోసం చైనా ఇంజినీర్ల నియామకానికి అనుమతివ్వాలని అదానీ గ్రూప్ లోగడ ప్రభుత్వాన్ని అభ్యర్థించడం- దేశీయంగా నిపుణుల కొరతను పట్టిచూపించింది. మన జనాభాలో 65శాతం నవతరమే అయినా, ఆయా నవీన రంగాల్లో తగిన సత్తా ఉన్నవారికోసం దేశీయ సంస్థలు విదేశాల వైపు చూడాల్సి వస్తోందంటే సమస్య ఎక్కడ ఉంది?

భారతదేశంలో 40 రంగాల్లో 250కి పైగా ఉపాధి మార్గాలను ఎంచుకునే అవకాశముంది. కానీ, వాటిపై అవగాహన కల్పించే వాతావరణం విద్యాలయాల్లో కనిపించట్లేదు. దాంతో యువతరంలో 93శాతం ఇంజినీరింగ్, మెడిసిన్, ఐటీ, మేనేజ్‌మెంట్ వంటి ఆరేడు విభాగాలనే గంపగుత్తగా ఎంచుకుంటోంది. నైపుణ్యాల పెంపుపై శ్రద్ధలేని చాలా కాలేజీల నిర్వాకాలకు తోడు ఆ కొద్ది రంగాల్లో అభ్యర్థుల సంఖ్యకు తగినన్ని ఉద్యోగాల్లేక విలువైన మానవ వనరులు వృథా అవుతున్నాయి. ఏఐ, రొబోటిక్స్, హరిత ఇంధనాలు, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, బ్లాక్ చెయిన్, డిజిటల్ మార్కెటింగ్, డ్రోన్ సాంకేతికత తదితరాలు రాబోయే రోజుల్లో ఎన్నో కొత్త అవకాశాలను మోసుకురానున్నాయి. ఒక్క పునరుత్పాదక ఇంధన రంగంలోనే 17 లక్షల నూతన ఉద్యోగాలు అందివస్తాయని అంచనా. వాటిని ఒడిసిపట్టేలా దేశీయ యువతను సిద్ధం చేయాలి. తరగతి గదులు, పరిశ్రమల మధ్య అంతరాన్ని తొలగిస్తూ చదువుల్ని సమూలంగా ప్రక్షాళించాలి. అప్పుడే నిపుణశక్తుల నారుమడిగా భారతావని ప్రగతి వెలుగులు విస్తారమవుతాయి!



చదవడం వచ్చిన ప్రజలు ఉండటం మంచిదే కానీ ఏది చదివితే మంచిదో తెలిసిన వాళ్లుండటం దేశానికి అవసరం. చదువుకున్న వాళ్లతో చేసిన ఒక అధ్యయనం ఏం చెబుతోందంటే- 97శాతం ప్రజలు సొంతంగా ఆలోచించరు. వాళ్లు విన్న, చూసిన, చదివిన వాటినే నమ్ముతారు.

– నానీ పాల్కీవాలా

వందేళ్ల చరిత... మారితేనే భవిత!

కమ్యూనిస్టులు ప్రజలకు దూరమయ్యారా, ప్రజలే వారికి దూరం జరిగారా? నాటి సోవియట్ యూనియన్ నుంచి నేటి బెంగాల్, త్రిపుర వరకు కమ్యూనిస్టుల వైపు జనం ఎందుకు తిరిగి చూడట్లేదు? వీటన్నింటికీ సమాధానాలు వెతుక్కునే తరుణమిది. ఈనెల 18-20 తేదీల్లో ఖమ్మంలో సీపీఐ వందేళ్ల జాతీయ వేడుకల సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సాఫల్య వైఫల్యాలు, భవిష్యత్తుపై ఒక విశ్లేషణ ఇదీ!

భారతావనిని విశేషంగా ప్రభావితం చేసిన, చేస్తున్న రెండు పరస్పర విరుద్ధ సిద్ధాంతాలు వందేళ్ల వేడుకలు జరుపుకొంటున్నాయి. 1925 విజయదశమి రోజున రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్), 1925 డిసెంబరు 26న భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆవిర్భవించాయి. ఆర్ఎస్ఎస్ ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ, నూరేళ్లలో శాఖోపశాఖలుగా దేశమంతటా విస్తరించింది. రాజకీయ పార్టీగా సీపీఐ గత వందేళ్లలో అనేక చారిత్రక పోరాటాలకు నేతృత్వం వహించింది. ఉత్తుంగ తరంగంలా జనప్రవాహంలో మొదలై నేడు ఒక సన్నని ధారగా మిగిలింది.



సోవియట్ యూనియన్‌లో 1917లో లెనిన్ నాయకత్వంలో మొదటి కమ్యూనిస్టు రాజ్యాన్ని స్థాపించారు. ఆ ప్రేరణతో అనేక దేశాల్లో విప్లవకారులు, ప్రగతిశీల వాదులు కమ్యూనిస్టు పార్టీలను స్థాపించారు. ఈ పూర్వరంగంలోనే కాన్పూర్‌లో సీపీఐ పురుడు పోసుకుంది. దేశస్వాతంత్ర్యం కోసం వీరోచిత పోరాటాలు నిర్వహించి 1934లో నిషేధానికి గురైంది. విద్యార్థి, యువజన, కార్మిక, కర్షక, మహిళా ప్రజాసంఘాలను స్థాపించి అన్ని వర్గాల్లోకీ చొచ్చుకుపోయి వెళ్లింది. ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) ద్వారా వేలమంది కళాకారులను తయారు చేసి జనానికి చేరువైంది. దేశవ్యాప్తంగా పలు భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను సీపీఐ ముందుండి నడిపింది. నాటి కాంగ్రెస్ మితవాద ధోరణులపై అతివాద పోరాటాలతో విభిన్న వర్గాల్లో చైతన్యం రగిలించింది.

కొంపముంచిన వ్యూహాత్మక తప్పిదాలు

మాజీ ప్రధానులు ఐకే గుజ్రాల్, వాజ్‌పేయీ వంటి వారు విద్యార్థి దశలో ఏఐఎస్ఎఫ్‌లోనే పనిచేశారు. మృణాల్‌సేన్, పృథ్వీరాజ్ కపూర్ వంటి బాలీవుడ్ దిగ్గజాలు, అల్లురామలింగయ్య, నాగభూషణం, మిక్కిలినేని, జగ్గయ్య, జి.వరలక్ష్మి వంటి తెలుగు సినీప్రముఖులూ సీపీఐ అనుబంధ ప్రజానాట్యమండలిలో చురుగ్గా ఉండేవారు. ముఖ్యంగా బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా ఈ సంస్థ ప్రగతిశీల భావజాలాన్ని వ్యాప్తి చేసింది. తెలంగాణలో నిజాం వ్యతిరేక సాయుధ పోరాటం, బెంగాల్‌లోని తేభాగాలో భూస్వామ్య వ్యతిరేక పోరాటం, కేరళలో పున్నప్రావాయలార్ సంస్థానాధీశుడికి వ్యతిరేకంగా సాయుధ పోరు కమ్యూనిస్టుల ప్రభావాన్ని చాటిచెప్పాయి. ఉద్యమాలు, త్యాగాలు, నిషేధాలు, నిర్బంధాలు ఇవేమీ కమ్యూనిస్టులకు కొత్త కాదు. కానీ కమ్యూనిస్టు నాయకత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాలు, వ్యూహాత్మక తప్పిదాలు ఆ పార్టీ ఎదుగుదలకు దెబ్బకొట్టాయి. 1942లో దేశంలో ఉవ్వెత్తున క్విట్ ఇండియా ఉద్యమం సాగుతోంది. మరోపక్క హిట్లర్ నియంతృత్వానికి వ్యతిరేకంగా నాటి సోవియట్ యూనియన్, బ్రిటన్ కలిసి పనిచేశాయి. ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమాన్ని బలహీనపరచకూడదనే భావనతో బ్రిటిష్ పాలకుల పట్ల కొంతకాలం మెతక వైఖరి అవలంబించడం సీపీఐ ఇమేజ్‌ని దెబ్బతీసింది. నిజాం సంస్థానం భారత్‌లో కలిశాకా సాయుధ పోరాటాన్ని కొనసాగించడం కోలుకోలేని నష్టాన్ని మిగిల్చింది. ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీ నాయకత్వాన్ని బలపరచడం సీపీఐ పరపతిని బాగా మసకబార్చింది.

ప్రపంచ కమ్యూనిస్టులకు పెద్దదిక్కుగా సోవియట్ యూనియన్ మాత్రమే ఉండేది. 1949లో మావో నేతృత్వంలో కమ్యూనిస్టులు చైనాలో అధికారంలోకి రావటంతో మరో శిబిరం తయారైంది. ఈ రెండు దేశాల సైద్ధాంతిక వైరుధ్యాల మధ్య సీపీఐలో భిన్నగొంతుకలు వినిపించాయి. సీపీఐకి సైద్ధాంతిక దిశానిర్దేశం చేసే సోవియట్ యూనియన్ అనుకూలంగా భారత్‌లో నెహ్రూ ప్రభుత్వం పనిచేసేది. నెహ్రూ సోషలిస్టు భావజాలంతో ఉండటంతో ఆయనపై ఎలా వ్యవహరించాలనే విషయంలో సీపీఐలో గందరగోళం ఉండేది. 1962లో చైనా మన దేశంపై దాడిచేసినప్పుడు దాన్ని వ్యతిరేకించాలా, సమర్థించాలా అనే విషయంలోనూ సీపీఐలో విభేదాలు నెలకొన్నాయి. రాజ్యాధికారం కోసం బ్యాలెట్ మార్గం అని ఒక వర్గం, బుల్లెట్ మార్గమే సరి అని మరో వర్గం వాదించాయి. భావజాల వైరుధ్యాలు అంతిమంగా సీపీఐని రెండుగా చీల్చాయి. సీపీఎం ఆవిర్భావానికి దారితీశాయి. అక్కడి నుంచి దశల వారీగా పదుల కొద్దీ కమ్యూనిస్టు పార్టీలు, గ్రూపులు ఏర్పడ్డాయి. చీలికల నుంచి పేలికలుగా, పేలికల నుంచి పోగులుగా కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడింది. వర్గపోరాటంలో భాగమే కులసమస్యకు పరిష్కారం అని భావించి మొదట్లో కులాన్ని నిర్లక్ష్యం చేయటమూ కొంతమేర నష్టం చేసింది.

మార్పు దిశగా ముందడుగేస్తారా?

'ప్రపంచ కార్మికులారా ఏకంకండి' అని పిలుపిచ్చే కమ్యూనిస్టులు మాత్రం ఒక్కటి కారని విమర్శలో న్యాయం లేకపోలేదు. దేశంలో కమ్యూనిస్టులు అందరూ ఒక్కతాటిపై ఉంటే చిన్నచిన్న స్వరాలన్నీ గర్జనగా మారతాయి. ప్రజాస్వామ్యం బతకాలంటే ప్రశ్నించే వాళ్లు ఉండాలి. ఇప్పుడు దేశంలో పార్టీలన్నీ దాదాపుగా ఒకే తాను ముక్కలని జనం భావిస్తున్నారు. విశ్వసనీయ రాజకీయ పక్షం అవసరం. ఈ నేపథ్యంలో, సీపీఐ ఆత్మశోధన చేసుకోవాలి. ఈరోజు అన్ని కమ్యూనిస్టు పార్టీల్లాగే సీపీఐకి కూడా ప్రధాన సమస్య పార్టీకీ ప్రజలకూ మధ్య దూరం పెరగటం. రాజకీయ శిక్షణ తరగతుల పేరిట పాత చరిత్ర గురించి కథలు కథలుగా చెప్పడం తప్పించి ఈ ఏఐ యుగంలో ఎలా కొత్త అవతారం ఎత్తాలి అనేది ఎవరూ చెప్పట్లేదు. ప్రజలను ఎలా ఆకర్షించాలో తెలియక దిష్టిబొమ్మల దహనం లాంటి మూస నిరసనలకే పరిమితమవుతున్నారు. ఇటీవల శ్రీలంక, నేపాల్‌లో జరిగిన ఉద్యమాలు, మన దేశంలో రైతు చట్టాల వ్యతిరేక పోరాటం ఇవన్నీ ప్రజలను సోషల్ మీడియా ద్వారా సమీకరించినవే. టెక్నాలజీ గురించి తెలుసుకోవడం, సోషల్ మీడియాలో చురుగ్గా ఉండటంలో కమ్యూనిస్టులు వెనకబడ్డారు. జెన్‌జీ, మధ్యతరగతి, టెక్నోక్రాట్స్... వీళ్లందరికీ కమ్యూనిస్టులు చాలాదూరంలో ఉన్నారు. వారిని చేరుకోవాలంటే ముందు తమ పోరాట స్వరూపాలను మార్చుకోవాలి. కాలం చెల్లిన ప్రసంగాలను విడిచిపెట్టాలి. సీపీఐతో పాటే వంద వసంతాలు జరుపుకొంటున్న ఆర్ఎస్ఎస్ నిర్మాణపరంగా ఎందుకంత బలంగా ఉంది? తాము ఎక్కడ విఫలం అవుతున్నాం? అనే అంతఃశోధన సీపీఐకి తక్షణావసరం. ఖమ్మం జాతీయ వేదికపై అది జరుగుతుందని ఆశిద్దాం.

– పోచిరాజు శ్రీరామ్

రవీంద్రకి మంచి పెళ్లి సంబంధం వచ్చింది. పెద్దవాళ్లు అన్ని విషయాలూ మాట్లాడుకున్నారు. రవీంద్ర కూడా అమ్మాయిని కలిసి మాట్లాడాడు. ఇక పెళ్లి గురించి నిర్ణయం తీసుకోవడమే తరువాయి. ఆ అమ్మాయి అంగీకారం తెలిపింది. కానీ, ఎన్నాళ్లయినా... రవీంద్ర నుంచి సమాధానం లేదు. అమ్మానాన్నా అడిగినప్పుడల్లా 'నాకు కొంచెం టైమివ్వండి' అంటూ తప్పించుకుంటున్నాడు. ఆ కొంచెం ఎంత అన్నది అర్థం కాక, అవతలి వాళ్లకు ఏం చెప్పాలో తెలియక ఇబ్బందిపడుతున్నారు తల్లిదండ్రులు.

పెళ్లి విషయమే కాదు, గతంలో ఉద్యోగం విషయంలోనూ అంతే. రెండు మంచి కంపెనీల్లో అవకాశాలు వస్తే ఎందులో చేరాలో నిర్ణయించుకోలేక ఆలోచిస్తూ నెలలు గడిపాడు.

ఆలోచిస్తూనే ఉంటారా?



ఇంతలో ఒక కంపెనీ జాయినింగ్ టైమ్ అయ్యేపోయింది. దాంతో తప్పనిసరై రెండో దాంట్లో చేరిపోయాడు. ఓవర్ థింకింగ్ సమస్యతో బాధపడే రవీంద్ర లాంటి వాళ్లు చాలా మందే ఉంటారు. ప్రతి విషయానికీ విపరీతంగా ఆలోచిస్తూ ఎటూ తేల్చుకోలేక సతమతమవుతుంటారు. వీళ్లకి తమ మీద తమకు నమ్మకం ఉండదు. దాంతో ఏ నిర్ణయం తీసుకుంటే ఏమవుతుందో అన్న ఆందోళన వారిని వేధిస్తుంటుంది. నిర్ణయానికి బాధ్యత వహించే ధైర్యం ఉండదు. అందుకని నిర్ణయమే తీసుకోకుండా తాత్సారం చేస్తారు. పొరపాటు నిర్ణయం తీసుకుంటామన్న భయానికి తోడు ఒత్తిడి, ఆత్మన్యూనత, కుంగుబాటు లాంటి సమస్యలు ఉంటే సాధారణంగా ఇలా జరుగుతుంది. వారి మెదడే వారి పాలిట శత్రువులా మారి 'అప్పుడూ ఇలాగే జరిగింది... గుర్తుందా' అంటూ పాత వైఫల్యాలను జ్ఞాపకం చేస్తూ ఉంటుంది. ఫలితంగా అవకాశాలను కోల్పోతారు.

కెరీర్, పెళ్లి లాంటి ముఖ్యమైన విషయాల్లో ఆలోచించి నిర్ణయం తీసుకోవడం అవసరమే. అయితే ఆ ఆలోచన జీడిపాకంలా సాగితేనే కష్టం. ఏ నిర్ణయమైనా నూటికి నూరుపాళ్లు మంచిదవుతుందో కాదో ఎవరూ చెప్పలేరు. కాలమూ అనుభవమూ చెప్పాల్సిందే. అందుకని 'పర్ఫెక్షన్' గురించి ఎక్కువ ఆలోచించకూడదు. పొరపాట్లు జరగడం సహజం. జరిగితే సరిదిద్దుకోగలమన్న ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి. కచ్చితంగా ఒక సమయాన్ని నిర్దేశించుకుని ఆ టైంలోగానే పూర్తి ఏకాగ్రతతో సదరు విషయం తాలూకు మంచీ చెడులను బేరీజు వేసుకుని ఒక నిర్ణయానికి వచ్చేయాలి. ఇక ఆ తరవాత దాని గురించి ఆలోచించకూడదు. కొంతమంది పలువురి సలహాలు తీసుకుంటారు. అదీ మంచిది కాదు. నమ్మకం ఉన్న స్నేహితులతోనో, తల్లిదండ్రులతోనో, శ్రేయోభిలాషులతోనో చర్చించాలి తప్ప వ్యక్తిగత విషయాలను అందరిముందూ పెట్టకూడదు. అది బలహీనతగా ముద్రపడిపోతుంది.

ఎడతెగకుండా వచ్చే ఆలోచనలను కొనసాగనివ్వకుండా మనసును ఇతర కార్యక్రమాలకు మళ్లించాలి. అందుకు శారీరక వ్యాయామం బాగా తోడ్పడుతుంది. గతంలో ఏం జరిగింది? భవిష్యత్తు ఏమవుతుందో? అనే ఆలోచనలు వదిలేసి ప్రస్తుతంలో జీవించాలి. ప్రతిక్షణాన్నీ ఆస్వాదించాలి. కొత్త అవకాశం వచ్చినప్పుడు 'నేను దీనికి అర్హుణ్ని' అని ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే సమస్యే ఉండదు.

– గుడుగుంట్ల లోషిత

తొలి వెలుగు

మన లోపల ఉండే భావాలు, అనుభూతులు అనంతమైనవి. అవన్నీ ప్రకటితమవ్వవు. అవ్వాల్సిన అవసరమూ లేదు. అయితే ప్రకటితమవ్వాల్సినవి కూడా ఒక్కొక్కసారి కావు. ఆ భావాన్ని మాటల్లో చెప్పాలన్న ఆలోచనా, చెప్పగల భాషాపటిమ లేకపోవడం కారణం కావచ్చు. వీటిలో కొన్ని మనసులో మాగి మాగి ఏదో ఒక క్షణాన బయటికి వస్తాయి. అలా మన మనోభావాలు, అనుభూతులు వెలుగులోకి రావడమే ఉన్మేషం. మనలో నిద్రాణమైన భావనలు, మేలుకుని అభివ్యక్తం కావడమే ఉన్మేషం.

మొగ్గ తన రేకలను విప్పార్చుకుంటూ సంపూర్ణంగా వికసించి పరిమళాలు వెదజిమ్మినట్టు; సూర్యుడు మేఘాలను తొలగించుకుని బయటికి వచ్చి ప్రకాశించినట్టు... ఉన్మేషం ఆవిష్కృతమవుతుంది. అలా వచ్చింది ఒక అద్భుతమైన చిత్తరువు కావచ్చు, శిల్పం కావచ్చు. గొప్ప ఆలోచన, పాట, కథ, మహత్తర కావ్యం, నూతన ఆవిష్కరణ... ఏదైనా కావచ్చు. మన మనసనేది ఒక సముద్రం లాంటిది. నిరంతరం వచ్చే అనంతమైన ఆలోచనలు అలల వంటివి. ముందుకు వస్తూ ఉంటాయి, వెనక్కి పోతుంటాయి. వాటిలో ఒకటో రెండో మనకు స్పష్టంగా అవగాహనయ్యే క్షణం... ఉన్మేషమే! ఓ కళాకారుడికి, ఓ శాస్త్రవేత్తకు- ఒక ఆలోచనో, భావనో మెరుపులా మెరుస్తుంది. అది మొదట అస్పష్టమైన ఊహగానే ఉంటుంది. మెలమెల్లగా ఒక రూపు దాల్చి ఒక్కసారిగా వెలుగులోకి వస్తుంది. అదే ఉన్మేష క్షణం.



అంతర్యామి

బ్రహ్మం అంటే పరమాత్మ. ఆయనది శుద్ధ చైతన్య స్వరూపం. ప్రపంచం లేని స్థితిలో ఆయన ఒక్కడే. నిశ్చలస్థితిలో ఉన్న ఆయనలో ఒక సూక్ష్మమైన చలనం కలిగింది. ఆ చలనమే సృష్టికి మొదటి కదలిక. అదే ఉన్మేషం - సృష్టి పుట్టుకకు ఆది. అది ఇంతటి విస్తృతమైన, వైవిధ్యమైన జగత్తుకు, ప్రకృతికి, దాని అందచందాలకు, ఆనందాలకు నిలయమైంది. మన ఆలోచన మాటగా మారే నాలుగు దశలు ఉంటాయి. 'పశ్యంతి' నుంచి 'మధ్యమా' స్థితికి మారే క్షణం- భావం మాటగా రూపుదిద్దుకునే సున్నితమైన క్షణం... ఉన్మేషం. ఆలోచన మాట లేదా అక్షర రూపం దాల్చనంతవరకూ అది ఎంత అద్భుత ఆలోచననైనా, భావమైనా మనసు పొరల్లోనే ఉంటుంది.

ఉన్మేషం అంటే జ్ఞానోదయం. ఆత్మను లౌకిక చింతలు కమ్మేస్తాయి. వాటినుంచి అది బయటికి రానంతవరకు దానికి ప్రకాశమే ఉండదు. జీవాత్మ గమనం, గమ్యం ఆ పరమాత్మలో ఐక్యం కావడమే. అది గ్రహించి, అటువైపు పయనించడమే ఉన్మేషం. ఆత్మ వెలుగులోకి రావటమంటే అదే. లౌకిక ఆందోళనలతో మన నిజమైన స్వరూపాన్ని మర్చిపోతాం. ఈ అజ్ఞాన నిద్ర నుంచి బయటపడటమే ఉన్మేషచిత్తులు కావడమంటే. ఉన్మేషమంటే దైవ స్వరూపాన్ని గ్రహించే తొలి వెలుగు. ఒక లేగదూడ పాల కోసం తల్లి వైపు చెంగు, చెంగున గంతులు వేస్తూ పరుగులు తీసినట్టు జీవాత్మ పరమాత్మ వైపు వెళ్లాలన్న తపన మనలో రావాలి. ఆ తపనే ఉన్మేషం. అదే పరమాత్మ సాక్షాత్కారం, పరంజ్యోతి దర్శనం.

– బొడ్డపాటి చంద్రశేఖర్

అభివృద్ధికి చేయూత

భారతదేశంలోని సంస్థలు తమ గత మూడేళ్ల సగటు నికర లాభాల్లో రెండు శాతాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)కు కేటాయించాలి. ఆ డబ్బును విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి వాటికి ఖర్చు చేయాలి. కంపెనీల చట్టం షెడ్యూల్ ఏడులో పేర్కొన్న కార్యకలాపాలకే వాటిని వెచ్చించాలి. స్వచ్ఛ గంగా నిధి, స్వచ్ఛ భారత్ కోశ్, ప్రధాన మంత్రి జాతీయ రిలీఫ్ ఫండ్, పీఎం కేర్‌కు ప్రత్యేకిస్తున్న నిధులు సైతం సీఎస్ఆర్ పరిధిలోకే వస్తాయి. గడిచిన అయిదు ఆర్థిక సంవత్సరాల్లో ఇండియాలో సీఎస్ఆర్ కింద వివిధ పనులకు ఎంత ఖర్చు చేశారంటే... (కోట్ల రూపాయల్లో)

2019–20	24,965
2020–21	26,210
2021–22	27,141
2022–23	30,932
2023–24	34,908

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

రహదారి భద్రతకు ప్రతిజ్ఞా మార్గం!

పూర్వ కాలంలో పాము కాట్లు, అడవి జంతువుల దాడులతో ప్రాణాలకు ఎక్కువగా ముప్పుండేది. మనిషి వాటిని సమర్థంగా అధిగమించాడు. దాంతో మరణాల సంఖ్య తగ్గింది. తుపాను లాంటి ప్రకృతి వైపరీత్యాలను సైతం ఆధునిక సాంకేతికతతో ఎదుర్కొంటూ మరణాలను చాలా వరకు తగ్గించగలిగాం. అయితే, ఆధునిక కాలంలో ఏ యుద్ధంలోనూ జరగనంత ప్రాణ నష్టం రోడ్డు ప్రమాదాల కారణంగా సంభవిస్తుండటం విచారకరం. దశాబ్ద కాలంగా భారతదేశంలో దాదాపు 15 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. సుమారు 40 లక్షల మంది గాయాల పాలయ్యారు. ఎన్నో కుటుంబాలు దిక్కులేని స్థితికి చేరాయి. అమెరికాలో ఏటా రోడ్డు ప్రమాదాల్లో సుమారు 40వేల మరణాలు చోటుచేసుకుంటున్నాయి. మనదేశంలో ఏటా దాదాపు అయిదు లక్షల ప్రమాదాలు సంభవిస్తే, సుమారు లక్షన్నరకు పైగా మరణాలు ఉంటున్నాయి. హెల్మెట్ ధరించకపోవడం, సీటు బెల్టు పెట్టుకోకపోవడం, అతి వేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రికి చేరుకోలేకపోవడం వంటివన్నీ కారణాలుగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితిలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉంది.



అభివృద్ధి చెందిన దేశాల్లో ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే జరిమానాలు, శిక్షలు కఠినంగా ఉంటాయి. మన దేశంలో ట్రాఫిక్ నిబంధనలు గట్టిగా అమలుకాని దుస్థితి నెలకొంది. దీంతో ఏటా ప్రమాదాలతోపాటు మరణాల సంఖ్యా పెరుగుతోంది. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు నిక్కచ్చిగా పాటిస్తేనే ప్రమాదాలు, మరణాలను అరికట్టవచ్చు. జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు 'జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు' నిర్వహిస్తున్న సందర్భంగా...

పిల్లల ద్వారా ప్రభావం

ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం రోడ్డు ప్రమాదాల వల్ల మన దేశానికి జీడీపీలో దాదాపు మూడు శాతం నష్టం వాటిల్లుతోంది. దీనివల్ల మానవ, ఆర్థిక వనరులపై దెబ్బ పడుతోంది. దేశంలో ఏటా వాహనాల సంఖ్య భారీగా పెరుగుతోంది. ప్రమాదాలు, మరణాలు కూడా అంతేస్థాయిలో పెరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల విషయంలో ఇంజినీరింగ్, ఎడ్యుకేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ అనే నాలుగు 'ఈ'లు కీలకాంశాలుగా మారుతున్నాయి. ఇందులో మూడు ప్రభుత్వ బాధ్యతలు. వాహనదారులను, పాదచారులను చైతన్యపరచడం అందరి బాధ్యత. ముఖ్యంగా విద్యాలయాలు ఈ గురుతర బాధ్యతను అందిపుచ్చుకోవాలి. ఎన్జీవోలు, పౌర సమాజం వంటివారంతా ఇందులో భాగస్వాములవ్వాలి. దేశంలో చట్టాల అమలు పటిష్ఠంగా లేకపోవడం, వివిధ రాష్ట్రాల్లో రహదారి ఉల్లంఘనలకు శిక్షలు ఒకే విధంగా లేకపోవడం కూడా సమస్యగా మారుతోంది. దీనివల్ల తరచూ నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే శిక్షలను సముచితరీతిలో పెంచాలి. రాష్ట్రాలు, ప్రాంతాల వారీగా ఒకే తరహా శిక్షలను అమలు చేయాలి. ఈ విషయంలో ఏఐ వంటి ఆధునిక సాంకేతికతను సమర్థంగా ఉపయోగించుకోవాలి. వీటన్నింటికి తోడు పిల్లలపై ప్రేమ తల్లిదండ్రులను మార్చగలదనేది నిర్వివాదాంశం. పిల్లల ద్వారా తల్లిదండ్రుల ప్రవర్తనలో మార్పు తీసుకురావచ్చు. ఇలాంటి కార్యక్రమాన్ని ఒక విప్లవంలా ముందుకు నడిపించేందుకు విద్యాలయాల్లో సామూహిక ప్రతిజ్ఞలు చేయించడం ద్వారా రహదారి భద్రతపై పిల్లల్లో అవగాహన పెరుగుతుంది. విద్యార్థులంతా తమ తల్లిదండ్రులతో ముఖ్యంగా తండ్రులతో ప్రతిజ్ఞ చేయిస్తే, మంచి ఫలితాలు కనిపిస్తాయి.

తల్లిదండ్రులకు చేరవేయాలి...

ప్రభుత్వాలు జనవరిలో చేపట్టే రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలూ విస్తృతంగా సహకరించాల్సిన అవసరం ఉంది. రోడ్డు భద్రత అనేది ప్రభుత్వ బాధ్యత, ప్రభుత్వ యంత్రాంగం చేపట్టే కార్యక్రమం మాత్రమే కాదు. ఇది ప్రజలందరికీ సంబంధించిన అంశం. పౌర సమాజం, విద్యాసంస్థలు, ఎన్జీవోలు, వివిధ శాఖలు, సామాజిక స్పృహ కలిగిన ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములవ్వాలి. బాధ్యతలను పంచుకోవాలి. ఈ విషయంపై ప్రతి ఇంట్లోనూ చర్చ జరగాలి. విద్యార్థులే తల్లిదండ్రులకు రోడ్డు భద్రతపై కౌన్సెలర్లుగా మారాలి. ప్రతి విద్యార్థి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయాలి. ఆ ప్రతిజ్ఞను తల్లిదండ్రులకు చేరవేయాలి. కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రతిజ్ఞ చేయించాలి. ఈ కార్యక్రమాన్ని దేశంలోని దాదాపు 26 కోట్లమంది విద్యార్థుల ద్వారా వారి కుటుంబ సభ్యులకు చేర్చవచ్చు. తద్వారా భావి భారత పౌరుల ద్వారా పెద్దల్లోనూ గణనీయమైన మార్పును తీసుకొచ్చే అవకాశం ఉంటుంది. రోడ్డు ప్రమాదాల విషయంలో చట్టాల అమలు ద్వారా పరిస్థితుల్లో మార్పు రాకపోతే, ప్రేమాభిమానాలతో విజయం సాధించవచ్చు.



డాక్టర్ ఎ.వి.గురవారెడ్డి

ఛైర్మన్, సర్వేజనా ఫౌండేషన్

ఈ దుస్తులు వేరు..!

హాయ్ ఫ్రెండ్స్... మనం రోజూ రకరకాల దుస్తులు వేసుకుంటాం కదా! కొన్ని వేసుకుంటే చాలా వెచ్చగా ఉంటుంది. ఇంకొన్ని ధరిస్తేనేమో కాస్త చల్లగా అనిపిస్తుంది. అన్నట్లు మనం వేసుకునే దుస్తుల్లో ఒక్కొక్కటి ఒక్కోలా తయారవుతుంది. వీటిలో ఖాదీ దుస్తుల గురించి తెలుసుకుందామా!

ఖాదీ దుస్తులు అనగానే మన తాతయ్య వేసుకునే చొక్కాలే గుర్తొస్తాయి కదూ! అవి సాధారణమైన వాటి కంటే కాస్త మందంగా ఉంటాయి. మన దగ్గర అయితే శ్రీకాకుళంలోని పొందూరుతో పాటు ఆ చుట్టుపక్కల గ్రామాల్లో నేసే ఖాదీ దుస్తులు చాలా ఫేమస్. ఇందులో సాదాఖాదీ, సన్నఖాదీ అని రెండు రకాలు ఉంటాయి. సాధారణంగా పత్తిలో చాలా రకాలుంటాయి. అందులో కొండపత్తి ఎక్కువ నాణ్యమైన నూలుని ఇస్తుందట. అందుకే ఖద్దరు దుస్తుల తయారీకి కొండపత్తిని



ఎక్కువగా వాడతారు. పత్తిని ముందుగా శుభ్రంచేసి, నూలు తయారు చేస్తారు. తరవాత దాని మందం, నాణ్యతను బట్టి 60, 80, 90, 100 అనే నంబర్లతో వర్గీకరిస్తారు. నంబరు ఎంత ఎక్కువైతే, నూలు అంత నాజూగ్గా ఉంటుంది. మగ్గం మీద దుస్తులు నేసేటప్పుడు ఏ నంబరు నూలు వాడతారన్న దానిపైనే వస్త్రం నాణ్యత, మృదుత్వం ఆధారపడి ఉంటాయి. ఇలా తయారైన వాటిని కోరా, కూంబ్డ్ మెటీరియల్స్‌గా అమ్ముతారు.

తక్కువ నంబరు నూలు ముతకగా ఉంటుంది కాబట్టి, నేయడం సులువవుతుంది. అందుకని, వాటితో తయారయ్యే దుస్తులు తక్కువ ధరకే లభిస్తాయి. అదే పెద్ద నంబరు నూలుతో దుస్తులు నేయడం చాలా కష్టం. కాబట్టి, వాటితో తయారయ్యే దుస్తుల ధరలు కాస్త అధికంగా ఉంటాయి. ఇవి వేసవిలో చల్లదనాన్ని, శీతాకాలంలో వెచ్చదనాన్ని ఇస్తాయి తెలుసా! ఇటీవలే పొందూరు ఖద్దరుకు జీఐ ట్యాగ్‌తో ప్రపంచ గుర్తింపు లభించింది. మన ఇంట్లో కూడా రకరకాల దుస్తులు ఉంటాయి కదా. ఒకసారి వాటిలో తేడా ఏంటో గమనించండి నేస్తాలు!

– పిల్లా తిరుపతిరావు

ఆ ఒక్కటి ఏది?

కింద ఇచ్చిన పదాల్లో ఒక్కటి మాత్రం మిగతా వాటికి భిన్నంగా ఉంటుంది. ఆ ఒక్కటి ఏదో కనిపెట్టండి చూద్దాం.

1. ఫ్యాన్, ఏసీ, కూలర్, బల్బు
2. బుధుడు, సూర్యుడు, శుక్రుడు, భూమి
3. షటిల్, కాక్, వికెట్స్, నెట్
4. ఎడారి, చెరువు, సముద్రం, నది

(c) eenadu

సంక్రాంతి వైభవం.. కనుమా!


ఆనంద పరవశం..
కంకిపాడు: ఈడుపుగల్లులో కోడిపందేలు తిలకిస్తూ..


కంకిపాడు: ఉప్పులూరులో భారీ బరులు


రంగవల్లుల వైభవం
వీరులపాడు: పెద్దాపురంలో....

ఊరంతా రంగవల్లులు...
వీధివీధిన గొబ్బెమ్మలు...
ఆకాశాన పతంగులు..
అపురూప పిండివంటలు..
కదలి వచ్చిన బసవన్న..
శుభము పలికిన హరిదాసన్న..
ముద్దులొలికిన పరికిణీలు..
ముచ్చటగొలిపిన పట్టుపంచెలు..
కత్తి దూసిన పందెంకోడి..
కనులారా చూడ తరలివచ్చారండి..
సరిలేని సంప్రదాయ క్రీడలు..
సగర్వమైన సాంస్కృతిక కళలు..
పుడమి పుత్రుని రాజసం..
పరవశించె సకల జగం..
భాగ్యములొసగిన భోగి..
కాంతులు నింపిన సంక్రాంతి..
ఆనంద వైభవం కనుమా...
మూడు రోజుల పండగ..
మురిసె మోము నిండుగా..

– అమరావతి డెస్క్


భళారే బొమ్మల కొలువు:
మైలవరం: లీలావతి గిరిజన పాఠశాలలో సందడి


హరిలో రంగ హరి
గంపలగూడెంలో కానుకలు స్వీకరిస్తున్న హరిదాసు


పొంగళ్లు సిద్ధమండి
నందిగామ గ్రామీణం: మునగచర్లలో


బందరు: మేకావానిపాలెంలో విజేతలకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచిన బుల్లెట్, తదితర వస్తువులు


జన జాతర
ఈడుపుగల్లులో జూద క్రీడల శిబిరాల వద్ద..


పండగంతా ఇక్కడే
ఉప్పులూరులో కోడి పందేలు ఆడేందుకు వచ్చిన వారి కార్లు..


రైతే రాజని...
గంపలగూడెం: పెనుగొలనులో అన్నదాతలకు సత్కారం


సై..
నువ్వా.. నేనా..!


తగ్గేదేలె..
ఈడుపుగల్లులో జూద శిబిరం...


ఆట.. పాట..
జగ్గయ్యపేట: ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం తదితరుల నృత్యం



అలరించే కళ
నాగాయలంక : నటరాజ్ అకాడమీ కళాకారుల నృత్య ప్రదర్శన


వృషభ రాజసం
ఘంటసాల: పశు ప్రదర్శన పోటీల సందడి

కొ..క్కొ..కొ..క్కొ..కోట్లు

జోరుగా జూదాలు.. పలుచోట్ల ఘర్షణలు

కోడిపందేలు, జూదం జోరు కనుమ వరకు పెద్ద ఎత్తున కొనసాగింది. గోదావరి జిల్లాలను తలపించే స్థాయిలో ఉమ్మడి కృష్ణాలో ఈసారి క్యాసినో, హైటెక్ బరులు వెలిశాయి. విజయవాడ నగరంలో ఇద్దరు ఎమ్మెల్యేలు పోటాపోటీగా బరులు వేయడంతో గతంలో ఎన్నడూ లేనంతగా కోడిపందేలు, జూదాలు భారీగా జరిగాయి. గుణదల-రామవరప్పాడు మధ్యలో, నున్న పవర్‌గ్రిడ్ మార్గంలో, అంబాపురం, హైదరాబాద్ వెళ్లే మార్గం, పాముల కాల్వ వద్ద, తిరువూరు, విస్సన్నపేట తదితర ప్రాంతాల్లో క్యాసినో తరహా హైటెక్ బరుల్లో రూ.కోట్లు ఎగిరాయి.


రామవరప్పాడులో పొట్టేళ్ల పందేలను వీక్షిస్తున్న జనం..

కాయ్ రాజా కాయ్...

సంక్రాంతి, కనుమ రోజుల్లో పెద్దఎత్తున ప్రజలు బరుల వద్దకు తరలివచ్చారు. పలుచోట్ల కూలినాలి చేసుకునేవారు పందేలు కాసి భారీగా డబ్బులు పోగొట్టుకున్నారు. హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రూ.లక్షలు పోగొట్టుకొని దిగాలుగా వెనుదిరిగారు. దాదాపు అన్ని బరుల వద్ద మహిళలు, పిల్లలు కనిపించారు. గుండాట, కాయ్ రాజా కాయ్ వంటి ఆటల్లో డబ్బులు పోగొట్టుకొని వెనుదిరిగారు.

తాగుడు.. తన్నుడు..

మద్యం ఏరులై పారడంతో గొడవలు కూడా ఎక్కువగానే జరిగాయి. అవనిగడ్డ పరిధిలోని పులిగడ్డ, కంకిపాడు దగ్గర ఉప్పులూరు, పెదపారుపూడి పరిధిలోని భూషణగుళ్ల, ఇబ్రహీంపట్నం లోని కేతనకొండ, మైలవరం మండలంలోని పొందుగుల తదితరచోట్ల ఘర్షణలు జరిగాయి.

అప్పులు చేసి మరీ...

రూ.లక్షలు పోయినా జూదరులు వెనక్కి తగ్గకుండా అప్పులు చేసి మరీ పందేలకు దిగారు.

సరిహద్దుల నుంచి జూదరులు...

■ తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట మండలాలకు ఖమ్మం, నల్గొండ జిల్లాలు సరిహద్దు కావడంతో పెద్దఎత్తున జూదరులు తరలివచ్చారు. మూడు రోజుల ముందే పోలీసులు, అధికారులు, బరుల నిర్వాహకుల సమక్షంలో గదులు, హోటళ్లలో అద్దెకు దిగి రూ.కోట్లల్లో పందేలు కాశారు.

■ తిరువూరు ఆర్డీవో కార్యాలయం పక్కనే మామిడితోటలో, ముత్తగూడెం రోడ్డు తెలంగాణ సరిహద్దు, సంత మార్కెట్ తదితర చోట్ల కోడిపందేల మాటున భారీగా కోతముక్క నిర్వహించారు. హైటెక్ బరుల్లో కోడిపందేల కంటే కోతముక్క, గుండాట ఇతర జూదాల్లో రూ.కోట్లు ఎగిరాయి.

■ విస్సన్నపేట పరిధిలోని తాటకుంట్లలో పొలాల్లో ఏసీ గదుల సెట్టింగ్ వేసుకొని కోతముక్క నిర్వహించారు. క్యాసినో తరహా బరిలో భారీగా నగదు చేతులు మారింది.

ఇదే అదునుగా పలువురు శిబిరాల్లో రూ.వందకు గంటల లెక్కన రూ.10-100 వరకు వడ్డీలకు తిప్పారు. పలుచోట్ల డబ్బుల విషయంలో కొట్లాటలు జరిగాయి. నగదు లావాదేవీలకు క్యూఆర్ కోడ్ స్కాన్.. నగదు చెల్లింపులకు మిషన్లు.. ప్రత్యేక స్టాల్స్‌లో ఏటీఎం, క్రెడిట్ కార్డులు, యూపీఐలపై నగదు ఇచ్చారు. పలుచోట్ల బరుల వద్దే ఫైనాన్స్ ప్రతినిధులు ఆభరణాలు తాకట్టు పెట్టుకొని నగదు ఇచ్చే సదుపాయం కల్పించారు.

– ఈనాడు డిజిటల్ – మచిలీపట్నం, న్యూస్‌టుడే బృందం

మాయగాళ్లు... అద్దెరిపోవాల్సిందే!



- అద్దె ఖాతాల గుట్టు రట్టు సులభం ఇక...
- బ్యాంకర్లకు ప్రత్యేక లాగిన్‌లు ఇచ్చిన పోలీసులు

ఈనాడు, అమరావతి

చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో నగదు లావాదేవీలకు ఉపయోగించేందుకు సైబర్ నేరగాళ్లు మూలాలు అమాయకులతో బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నారు. ఆనక వీటిని ఐందుకుల దారితింది నేరగాళ్లకు చేరవేస్తున్నారు. వీటితో పెద్దఎత్తున బెట్టింగ్, సైబర్ నేరాల్లో కొల్లగొట్టిన సొమ్ము బదిలీ చేస్తున్నారు. చివరకు దర్యాప్తులో అమాయకులే దొరుకుతున్నారు. పేర్లు వర్గాలే వెలుగు చూస్తున్నాయి. బ్యాంకు స్థాయిలో పని గట్టి వివరాలు రాబట్టేలా వారికి పోలీసులు ప్రత్యేకంగా లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చారు.

తొలి దశలో నగర బ్యాంకుల్లో..

డబ్బు ఆశ చూపించి కరెంట్ ఖాతాలు తెరిపించి, వాటిని విక్రయిస్తూ పంపిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నగరంలో ఓ బాధితుడి ఫిర్యాదుతో ఇది వెలుగుచూసింది. ఈనేపథ్యంలో ఐజీలు సీపీ రాజశేఖర్ బాబు.. బ్యాంకర్లతో సమీక్షించారు. సైబర్ నేరాల నియంత్రణకు.. వారికి క్రెడెన్షియల్స్ ఇచ్చారు. దీనిని ప్రయోగాత్మకంగా నగరంలోని బ్యాంకులు, వాటి శాఖల్లో అమలు చేస్తున్నారు. ఇది విజయవంతమైతే జిల్లావ్యాప్తంగా విస్తరిస్తారు. తమ శాఖల్లో అనుమానాస్పద ఖాతాలు, లావాదేవీలను గుర్తిస్తే.. ఆ వివరాలను ఇందులో నమోదు చేస్తారు. ఇవి పోలీసులకు చేరతాయి. ఇప్పటి వరకు లాగిన్‌ లో నమోదైన అనుమానాస్పద ఖాతాల వివరాలను పోలీసులు బ్యాంక్ ఎండ్‌లో పరిశీలిస్తున్నారు.

బ్యాంకుకో కానిస్టేబుల్..

సైబర్ నేరాలపై అవగాహన కోసం పోలీసులు ప్రత్యేకంగా ఓ వెబ్‌సైట్ రూపొందించారు. ఇందులో సైబర్ సురక్ష పేరుతో ఒక ఆప్షన్ పెట్టారు. నగదు బదిలీ చేసేందుకు బ్యాంకుకు వెళ్లిన ఖాతాదారులకు ఏ ఆధారంగా పనిచేసే దీనిని ఉపయోగిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఇందులోకి వెళ్లి డిజిటల్ అరెస్టుపై అవగాహన కల్పించే అంశాలను చదివాకే ఓటీపీ వస్తుంది. తర్వాతే బ్యాంకర్లు నగదు బదిలీకి అనుమతిస్తారు. ఓటీపీ పరిశీలనకూ బ్యాంకర్లకు ప్రత్యేక లాగిన్ ఇచ్చారు. ఇప్పటికి 4,329 మంది ఇందులోకి లాగిన్ అయి తెలుసుకున్నారు. ఇందుకు ప్రతి బ్యాంకుకు ఒక కానిస్టేబుల్‌ను కేటాయించగా బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు వీరు డిజిటల్ అరెస్టుపై అవగాహన కల్పిస్తున్నారు.

ఔనంటే ఎరువు.. కాదంటే దరువు!

ఈనాడు, అమరావతి

అడ్డగోలు ధరలకు యూరియా అమ్మకాలు


తిరువూరు: మునుకుళ్ల సొసైటీలో యూరియా కోసం పడిగాపులు

యూరియా కృత్రిమ కొరత సృష్టించడం.. అధిక ధరకు అమ్మడం.. తెలంగాణకు అక్రమ రవాణా.. ఇలా యూరియా అమ్మకాల్లో ఏ అక్రమాలు జరిగినా వ్యవసాయ అధికారులు అడ్డుకట్ట వేయలేకపోయారు. విజిలెన్స్ తనిఖీలు పేరిట కంటితుడుపు సోదాలు చేయించడం తప్ప.. చిన్నపాటి చర్యలు తీసుకోలేకపోవడంతో.. వ్యాపారులు మేమింతే మారమంటూ అన్నట్లు అదే దందా చేస్తున్నారు.

మోత మోగుతోంది...

● ఇతర ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని తిరువూరులో ఓ రైతుతో రూ.5 వేల విలువైన కాంప్లెక్స్ ఎరువులు కొనిపించారు.
● నందిగామలో ఓ రైతు రెండు బస్తాల యూరియా కావాలంటే.. మూడు బస్తాల కాంప్లెక్స్ ఎరువు తీసుకుంటేనే ఇస్తామని తెగేసి చెప్పడంతో చేసేది లేక రూ.5 వేల విలువైన ఎరువును అవసరం లేకున్నా కొన్నారు. ● అలా దుకాణాల్లో కొనే స్తోమత లేక సొసైటీలకు వెళితే అక్కడ గోదాం నిల్వలు పరిశీలించి మంది రైతులు పడిగాపులు కాస్తున్నారు.
● ఉదయం వెళితే సాయంత్రమైనా యూరియా దొరుకుతుందో లేదో గ్యారంటీ లేదు. నిల్వ అయిపోతే మళ్లీ వచ్చినప్పుడు ఇస్తామని కాగితంపై రాసి పంపుతున్నారు.

చిమకుట్టినట్లైనా లేదే...

● జిల్లాలో వరి, మొక్కజొన్న, మిర్చి, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. యూరియా డిమాండ్ ఎక్కువగా ఉంది. ● సొసైటీల్లో వచ్చిన నిల్వలు అందరికీ సరిపోవడం లేదంటూ తప్పక ప్రైవేటు దుకాణాల్లో కొంటున్నారు. ● జడేశపురంలో రూ.266.50కు అమ్మాల్సిన బస్తా యూరియా రూ.350-400కు అమ్ముతున్నారు. ● నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు తెలంగాణ సరిహద్దు ప్రాంతం కావడంతో అధిక ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ● ఈ దందాపై 'ఈనాడు'లో కథనాలు ప్రచురించగా నందిగామ, తిరువూరు, విస్సన్నపేటలో విజిలెన్స్ తనిఖీలు మొక్కుబడిగా చేపట్టారు. ● నందిగామ, తిరువూరులో కొన్ని దుకాణాల నిర్వాహకులకు షోకాజ్‌లిచ్చి మమ అన్పించారు. ● అధిక ధరలు, అక్రమ రవాణా పరిశీలించకుండా దస్త్రాలు చూసి సరిపెట్టారు. ● విస్సన్నపేటలో అయితే అంతా బాగుందని ధ్రువీకరించారు.

నిల్వలు పెంచుతాం...

కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. అధిక ధరలకు అమ్మే దుకాణదారులపై తప్పక చర్యలు తీసుకుంటామనీ.. సొసైటీల్లో నిల్వలు పెంచేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

తాగినోళ్లకు.. తాగినంత!

- జూద శిబిరాల వద్ద అనధికార అమ్మకాలు
- చాలాచోట్ల రెట్టింపు ధరలు వసూలు

ఈనాడు - అమరావతి: సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన బరుల వద్ద మద్యం ఏరులై పారింది. కోడి పందేల శిబిరాలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో పెద్ద, చిన్న బరులు పెద్దసంఖ్యలో ఈసారి ఏర్పాటయ్యాయి. వీటిల్లో అనధికార మద్యం దుకాణాలు వెలిశాయి. భోగి, సంక్రాంతి, కనుమ సందర్భంగా మూడు రోజులు జూద క్రీడలు, కోడిపందేలు పెద్దఎత్తున నిర్వహించారు. శిబిరాల బయట, లోపల జోరుగా మద్యం అమ్మకాలు సాగాయి. సందట్లో సడేమియా అన్నట్లు నిర్వాహకులు రద్దీని సొమ్ము చేసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే అమ్మకాలు భారీగా జరిగాయి. పందేలు వేసేందుకు పెద్దసంఖ్యలో రావడంతో చాలాచోట్ల రెట్టింపు ధరలకు అమ్మారు.


పెడనలో మద్యం కౌంటర్

చెంతకే మద్యం...

★ ఈడ్పుగల్లు, కేసరపల్లి, గుడివాడ, విస్సన్నపేట మండలం తాటకుంట్ల, రామవరప్పాడు, తదితర ప్రాంతాల్లో నిర్వహించిన బరుల్లో క్యాసినో తరహా జూదక్రీడలు జరిగాయి. వీటిల్లో నేరుగా పందెం రాయుళ్ల వద్దకే మద్యం సరఫరా చేశారు. శిబిరాల్లో మద్యం అమ్మకాలు నిర్వాహకులకు భారీగా ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. దాదాపు అన్నిచోట్లా శిబిరాలను రాజకీయ నేతల కనుసన్నల్లోనే ఏర్పాటు చేశారు. వీరి ఆధ్వర్యంలోని మద్యం సిండికేట్ నుంచే శిబిరాలకు సరఫరా అయింది.

★ అన్ని శిబిరాల నిర్వాహకులు పెద్దఎత్తున స్టాక్‌ను సమకూర్చుకుని బరుల వద్దకు వాహనాల్లో తెచ్చారు. బరుల బయట కూడా అమ్మకాల కోసం శీతల పానీయాల దుకాణదారులతో ఒప్పందం చేసుకుని.. వారి ద్వారా అమ్మించారు. శిబిరాల్లో మాత్రం పూర్తిగా నేతలే విక్రయాలు సాగించారు. పలు శిబిరాల్లో బహిరంగంగానే లూజ్‌గా కూడా అమ్మారు. పందెం కాసేందుకు వచ్చే వాళ్లు రెట్టింపు ధరలు పెట్టినా కొనుగోలు చేశారు. కొన్ని చోట్ల నేతలు వేలం వేసి.. ఎక్కువ పాట పాడిన వారికి మద్యం అమ్మకాల కాంట్రాక్టును కట్టబెట్టారు.

★ ఎన్టీఆర్ జిల్లాలో నిరుడు జనవరిలో రూ. 65 కోట్ల వరకు మద్యం అమ్మకాలు జరిగాయి. ఐఎంఎల్ 80,197 కార్టన్లు, బీర్.. 43,605 కార్టన్లు అమ్ముడయ్యాయి. ఈ ఏడాది అమ్మకాలు పెరిగాయి. ఐఎంఎల్.. 1,12,957 కార్టన్లు, బీర్.. 39,171 పెట్టెలు విక్రయాలు జరిగాయి. వీటి విలువ రూ.80 కోట్లు. ఈ విక్రయాల్లో ఎక్కువ భాగంగా కోడిపందేల శిబిరాలకు తరలినట్లు తెలిసింది.

విశాఖపట్నం-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 08517 ప్రత్యేక రైలు ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3.50గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి 19వ తేదీ ఉదయం 7.30గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు 08518 చర్లపల్లిలో ఉదయం 9 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి 12.30గంటలకు విశాఖపట్నం చేరుతుంది. ఈ రైలు దువ్వాడ, అనకాపల్లి, ఎలమంచిలి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, రాయనపాడు, ఖమ్మం, వరంగల్, ఖాజీపేట స్టేషన్లలో ఆగుతుంది.



వై జంక్షన్ సర్వీసు రోడ్డు పునరుద్ధరణ

సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వచ్చిన వారు తిరిగి హైదరాబాద్ బయలుదేరుతున్నారు. వీరు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వెళ్లటానికి జాతీయ రహదారిపై నందిగామ వై జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డును పునరుద్ధరించారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికుల వాహనాలు ఆగకుండా ముందస్తుగా అధ్వానంగా ఉన్న సర్వీస్ రోడ్డు అభివృద్ధి చేశారు. ఆ రోడ్డుపై వాహనాల సంఖ్య పెరిగి ట్రాఫిక్ ఆగిపోతే ఎత్తువంతెన మీదుగా పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా ఫ్లైఓవర్ పైన కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలు వెళ్లేందుకు వీలుగా రోడ్డును సిద్ధం చేశారు. పండగ సెలవులు ముగియటంతో కొంత మంది శుక్రవారం మధ్యాహ్నం నుంచే హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. దీంతో హైవేపై వాహనాల సందడి నెలకొంది.

- న్యూస్‌టుడే, నందిగామ


నకిలీ అనుకున్నా... నిజమే

- సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్
- రూ.5వేలు వచ్చాయంటే నమ్మొద్దు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

'మొదట ఇది నకిలీ అనుకున్నారు, కానీ నిజంగా నాకు రూ.5వేలు వచ్చింది. మీరు కూడా ప్రయత్నించి చూడండి..!'

సంక్రాంతి సందర్భంగా ఫోన్ పే పేరుతో సామాజిక మాధ్యమాల్లో 'లింక్'తో వచ్చిన సందేశం ఇది. ఈ లింక్ క్లిక్ చేస్తే డబ్బులు వస్తాయంటూ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. ఇలాంటి లింక్‌లతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.


మొదట ఇది నకిలీ అనుకున్నాను, కానీ నిజంగా నాకు ₹5,000 వచ్చింది! మీరు కూడా ప్రయత్నించి చూడండి!

https://iom.qmtyw.xyz/X6rcidlmw/ddd89e69a409c4ae1fcdb6c5002_t1768471694151&p=w

సామాజిక మాధ్యమాల్లో లింక్‌తో కూడిన సందేశం

లింక్‌తో పొంచి ఉన్న ప్రమాదం.. సైబర్ నేరగాళ్లు మోసం చేసేందుకు ఇలాంటి లింక్‌లను సృష్టించి దానికి ఆకర్షణీయమైన సందేశం పెట్టి సామాజిక మాధ్యమాల్లో పెడతారు. వీటిని నమ్మి ఎవరైనా క్లిక్ చేస్తే వెంటనే వారి చరవాణి హ్యాక్ అవుతుంది. దానిలో ఉన్న సమాచారం మొత్తం సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లిపోతుంది. ఆ తరువాత మీ బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసేస్తారు.

బహుమతులు ఊరికే ఇవ్వరు.. పండగ రోజు ఊరికే ఎవరూ బహుమతులు ఇవ్వరని పోలీసులు చెబుతున్నారు. క్లిక్ చేస్తే డబ్బులు వస్తాయనేది పూర్తిగా తప్పు అని, ఇది సైబర్ నేరగాళ్ల పన్నాగమని హెచ్చరిస్తున్నారు. మీకు తెలిసిన వ్యక్తులు ఈ లింక్ మీకు ఫార్వార్డ్ చేసినా వాటిని నమ్మవద్దని సూచిస్తున్నారు. ఎవరైనా లింక్ క్లిక్ చేసి డబ్బులు పోగొట్టుకుంటే తక్షణం 1930కి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి


ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

పెట్టుబడి ఒక్కసారి... ఆదాయం 20 ఏళ్లు

రైతేరాజు

కరివేపాకు సాగులో కౌలు రైతుకు లాభాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

కరివేపాకు పంటపై ఒక్కసారి పెట్టుబడి పెడితే ఇరవై ఏళ్ల నికర ఆదాయం వస్తుంది. ఒక్కసారి ఈ పంటపై పెట్టుబడి పెడితే ఇరవై ఏళ్లపాటు నికర ఆదాయానిస్తుంది. నీటివసతి ఉన్న రైతులు ఈ పంటసాగు చేస్తే వ్యాపారులే పొలాలకు వచ్చి కొనుగోలు చేస్తారు. పాతకంచల గ్రామానికి చెందిన రైతు రామిరెడ్డి సీతయ్య కంచికచర్ల మండలం కీసరలో ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. మూడేళ్ల క్రితం గుంటూరు జిల్లా పెద వడ్లపూడి రైతుల నుంచి కరివేపాకు విత్తనాలు కొన్నారు. ఎకరాకు వంద కిలోల విత్తనం వేశారు. ఇందుకు రూ. 2.50 లక్షలు కాగా, రూ. 5 లక్షలతో డ్రిప్ ఏర్పాటు చేసి పంటకు నీటి తడులిస్తున్నారు. నాలుగు నెలలకు ఒకసారి కరివేపాకు కోస్తారు. ఇలా ఏడాదిలో మూడుసార్లు దిగుబడి వస్తుంది. ఎకరాకు సరాసరి ఒక్కో కోతకు అయిదు టన్నులు వస్తుంది. టన్ను రూ.20 వేల వంతున పెదవడ్లపూడి, కుంచనపల్లి వ్యాపారులు కొన్నారు. మూడు కోతల్లో ఎనిమిది ఎకరాలపై 120 టన్నుల దిగుబడి రాగా రూ. 20 లక్షల ఆదాయం వచ్చింది. తొలి ఏడాది రూ. 12 లక్షలు పెట్టుబడి పోగా రూ. 8 లక్షల ఆదాయం సమకూరింది. రెండో ఏడాది పెట్టుబడి తగ్గింది. మొక్కలు ఎదగడానికి మందుల పిచికారీ, కూలీల, కౌలు ఖర్చులు పోగా ఏడాదికి రూ. 10 లక్షల ఆదాయం వస్తోంది. 20 ఏళ్ల వరకు ఆదాయం వస్తుందని రైతు తెలిపారు. వ్యాపారులు కరివేపాకును చిత్తూరు, విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు, మహారాష్ట్ర మార్కెట్లకు ఎగుమతి చేస్తున్నారు.



కరివేపాకు తోటలో రైతు సీతయ్య



ప్రశ్న : కూరమిరప (బెంగళూరు మిర్చి) రకాలను తెలపండి?
- బి.వెంకట్, రైతు, పూషడం

సమాధానం : కూరమిరపలో 4 రకాలుగా ఉన్నాయి. ● **కాలిఫోర్నియా వండర్ :** కాయలు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. పంట కాలం 140-150 రోజులు. దిగుబడి ఎకరాకు 6-8 టన్నులు వస్తుంది. ● **ఆర్కగౌరవ్ :** లేత కాయలు ముదురాకు పచ్చగా ఉండి, పూర్తిగా పెరిగిన దశలో నారింజ రంగుకు మారుతాయి. కాయలు చాలా పెద్దవిగా ఉంటాయి. కాయ బరువు 180- 200 గ్రాములు ఉంటాయి. పంట కాలం 120 రోజులు. హెక్టారుకు దిగుబడి 6-8 టన్నులు వస్తుంది. ● **అర్కబసంత్ :** కాయలు లేత పసుపు రంగులో ఉంటాయి. పంటకాలం 125- 140 రోజులకు వస్తుంది. ఎకరాకు దిగుబడి 6-7 టన్నులు. ● **భారత్ (హైబ్రిడ్) :** కాయలు ముదురాకు పచ్చగా ఉంటాయి. పంట దిగుబడి హెక్టారుకు 14- 16 టన్నులు దిగుబడి వస్తుంది.

- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల

– ఘంటసాల, న్యూస్‌టుడే

కొబ్బరి తోటల విస్తరణకు ప్రాధాన్యం

విజయవాడ కేంద్రంగా కొబ్బరి బోర్డు కొనసాగుతున్నా.. తెలంగాణలోనూ కొబ్బరి తోటల విస్తరణకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని కొబ్బరి అభివృద్ధి మండలి (సీడీబీ) ఉప సంచాలకుడు డాక్టర్ మంజునాథరెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కొత్తగా 500 హెక్టార్లలో కొబ్బరి తోటలు విస్తరించాలని ప్రణాళికలు రచించినట్లు వెల్లడించారు. అశ్వారావుపేటకు శుక్రవారం వచ్చిన ఆయన 'న్యూస్‌టుడే'తో ముచ్చటించారు. ఆ వివరాలు మీ కోసం..

– అశ్వారావుపేట, న్యూస్‌టుడే



సీడీబీ ఉప సంచాలకుడు మంజునాథరెడ్డి

హెక్టారుకు రూ.56వేల రాయితీ.. కొబ్బరి తోటలు సాగు చేసే రైతులకు హెక్టారుకు రూ. 56వేల రాయితీని సీడీబీ అందజేస్తుంది. ఒక్కో రైతుకు రెండు హెక్టార్ల వరకు రాయితీ లభిస్తుంది. ఆరునెలల వయసున్న తోటల నుంచి కొత్తగా తోటల పెంపకానికి సిద్ధమవుతున్న రైతులందరూ అర్హులే. కొత్తగా తోటలు వేసేవారు మొక్కలు నాటి క్షేత్రంలో జియో ట్యాగ్ ఫొటోతో దరఖాస్తుకు జతపరచాలి. కొబ్బరి నర్సరీల ఏర్పాటుకూ సీడీబీ రాయితీ ఇస్తుంది. ఒక్కో నర్సరీలో గరిష్ఠంగా 10వేల మొక్కలు పెంచుకోవచ్చు. ఒక్కో మొక్కకు రూ. 22 రాయితీ వర్తిస్తుంది.

అందుబాటులో బీమా పథకం.. కొబ్బరి బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. కేరా సురక్ష పథకం కింద రైతుకు రూ. 143, కూలీకి రూ. 143 కలిపి ప్రమాద బీమా ప్రీమియం చెల్లిస్తే సీడీబీ రూ. 813 భరిస్తుంది. ప్రమాదంలో మృతిచెందితే బాధిత కుటుంబాలకు రూ. 7లక్షల చొప్పున పరిహారం అందుతుంది. చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు రూ. 3లక్షలు, పెద్ద పరిశ్రమలకు 25శాతం లేదా రూ. 3కోట్ల వరకు రాయితీ పొందే వీలుంది. ఉద్యానశాఖ ద్వారా అంతరపంటల సాగు, బిందు సేద్యం పరికరాలకూ సాయం పొందొచ్చు.

బెండలో తెల్లదోమ నివారణ

బెండ సాగులో తెల్లదోమ నివారణకు ఉద్యానశాఖ పొన్నూరు విస్తరణాధికారి ఎం.శ్రేయ సూచనలు చేశారు. పంట పూతకు ముందు చిన్న, పెద్ద పురుగులు ఆకు అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చేస్తాయి. దీంతో ఆకులు పసుపు రంగులోకి మారతాయి. అవి శుంఖు రోగాన్ని వ్యాప్తి చేస్తాయి. తద్వారా ఆకులకు నష్టం జరుగుతుంది. దీని నివారణకు లీటరు నీటికి డైమిథోయేట్ 2 మి.లీ. కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి. పసుపు రంగు డబ్బాలకు గ్రీజు లేదా అముదం పూసి పొలంలో అక్కడక్కడ పెట్టి తెల్లదోమలను ఆకర్షింపజేసి నాశనం చేయాలి. దీపపు పురుగు సోకినప్పుడు ఆకుల పైకి దోనె మాదిరిగా ముడుచుకుని పండుబారి రాలిపోతాయి. వీటి నివారణకు మిథైల్ డెమెటాన్ 2 మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తద్వారా తెగులును నివారించవచ్చు. బెండసాగులో ఆది నుంచి సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి. సాగు ఆరంభం నుంచి వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే మంచి దిగుబడి వస్తుంది. – పొన్నూరు, న్యూస్‌టుడే



బెండ తోట

ఒక్కరోజే రూ.22.01 లక్షల ఆదాయం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా శుక్రవారం రికార్డు స్థాయిలో రూ. 22.01 లక్షల ఆదాయం దర్శన టికెట్ల రూపంలో వచ్చినట్లు ఈవో శీనానాయక్ తెలిపారు. ప్రస్తుతం రెట్టింపు ఆదాయం రావడానికి కారణం స్పానింగ్ పాయింట్ వద్ద పాలకమండలి సభ్యులతో కలిసి పర్యవేక్షించడమే కారణమని ఈవో తెలిపారు. రూ. 100 దర్శనం టికెట్లు ఆఫ్‌లైన్లో 728, ఆన్‌లైన్లో 2616, రూ. 300 దర్శనం టికెట్లు ఆఫ్‌లైన్లో 408, ఆన్‌లైన్లో 709, రూ. 500 దర్శనం టికెట్లు ఆన్‌లైన్లో 1233, ఆఫ్‌లైన్లో 1831 విక్రయించినట్లు పేర్కొన్నారు.



క్యూలైన్లో కిక్కిరిసిన భక్తులు

భక్తుల రద్దీ: సంక్రాంతి సెలవులు ముగుస్తుండడంతో వేకువ జాము నుంచి భక్తులు క్యూలైన్లో బారులు తీరారు. ఘాట్ రోడ్డు, కనకదుర్గనగర్ లిఫ్టుమార్గాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. దీంతో వన్‌టౌన్ పోలీసులు, శాంతి భద్రతల విభాగం పోలీసులు సంయుక్తంగా ట్రాఫిక్‌ను నియంత్రించారు. క్యూలైన్లో సర్వదర్శనానికి రెండు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, సభ్యులు పద్మావతి ఠాకూర్, సరిత, ఈవో శీనానాయక్ క్యూలైన్లు, స్పానింగ్ పాయింట్ వద్ద ఉండి నియంత్రించారు.

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా
మాల కుల వధూవరులకు సువర్ణావకాశం
నేడు, రేపు మాల కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



తెలుగింటి వివాహ పరిచయాల ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, మాల కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. విజయవాడ, ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, బి బ్లాక్, 3వ అంతస్తులోని ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబసభ్యులు **నేడు, రేపు (17 & 18 జనవరి 2026)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ పోస్ట్ యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లకు సంప్రదించి వాట్సాప్ చేయగలరు.

మరిన్ని వివరాలకు
95501 28306 & 92475 20500
ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

జగ్గయ్యపేట (గ్రామీణం), న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. పట్టణంలోని పోతుల్నగర్ వద్ద ఉన్న వైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ కొండపల్లి శ్రీదేవి, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ మున్సిపల్ ఛైర్మన్ శ్రీరాం సుబ్బారావు తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత విఘ్నేశ్వరస్వామి దేవాలయం వద్ద నుంచి పాత పేటగేట్ వరకు మహిళలు వేసిన ముగ్గులను అతిథులు తిలకించారు. అనంతరం సంప్రదాయ కంగ గంగిరెద్దులు, కోడిపందేలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యం అలరించింది. మహిళలు నృత్యం చేస్తుండగా ఎంపీ శివనాథ్ వారితో పాదం కలిపారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చేసిన కర్రసాము ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లా మొత్తం సంక్రాంతి సంబరాల్లో మునిగిపోయిందన్నారు. తెలంగాణ ప్రజలు తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాలకు వచ్చి సంక్రాంతి సంబరాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. నెట్టెం రఘురాం మాట్లాడుతూ పల్లె సంస్కృతి పరిరక్షణకు సంక్రాంతి సంబరాలు దోహదపడతాయన్నారు. శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

ఆధ్యాత్మిక.. భయభక్తులతోనే జీవితానికి సార్థకత

ముగిసిన బ్రదర్ జోసెఫ్ తంబి తిరునాళ్లు

పెదఅవుటపల్లి(గన్నవరం గ్రామీణం): వ్యక్తిగతంగా ఎదుర్కొనే అనారోగ్య, ఆర్థిక బాధలు కన్నా.. ఆధ్యాత్మిక భయభక్తులతో చేసిన తప్పులను సరిదిద్దుకున్నప్పుడే జీవితానికి సార్థకత అని విజయవాడ కథోలిక పీఠాధిపతి తెలగతోటి రాజారావు అన్నారు. గురువారం ఉంగుటూరు మండలం పెదఅవుటపల్లిలో ప్రసిద్ధ బ్రదర్ జోసెఫ్ తంబి 81వ వర్ధంతి మహోత్సవాలు ముగింపు కార్యక్రమానికి బిషప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పేదలు, నిరాశ్రయులను ఆదుకోవడంలో తంబి ఎప్పుడూ ముందుండే వారని చెప్పారు. క్రీస్తు అనుభవించిన పంచగాయాలను పొందిన బ్రదర్ జోసెఫ్ తంబి ధన్యుడయ్యాడన్నారు. అనంతరం ప్రత్యేక జపమాల, దివ్యపూజాబలిని మేరీమాత కపూచియన్ ప్రావిన్స్ ప్రొవిన్షియల్ ఫా. మరియదాసు, రెక్టర్ పాలడుగు జోసఫ్, విచారణ కర్త గోపు ఆల్బర్ట్, ఇతర గురువులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ రాజారావును పుణ్యక్షేత్ర బృందం సత్కరించింది. క్రైస్తవ విశ్వాసులు భారీగా పాల్గొన్నారు. … ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసు బందోబస్తును డీఎస్పీ శ్రీనివాసరావు బృందం పర్యవేక్షించింది.



దివ్యపూజాబలి అర్పిస్తున్న బిషప్ రాజారావు, ఫాదర్లు మరియదాసు, జోసఫ్, ఇతర మత గురువులు

జగన్మాత సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ జయసూర్యకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న...

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. అర్చకులు మండపంలో వేదాశీర్వచనం అందించారు. దేవస్థానం ఏఈవో వెంకటరెడ్డి వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

వివాహిత దారుణ హత్య

ఆమె కుమార్తెపై రోకలితో దాడి
సహజీవనం చేస్తున్న యువకుడు నిందితుడు

మధురానగర్, న్యూస్‌టుడే: భర్త వదిలేసిన మహిళను చేరదీశాడు. 14 సంవత్సరాలుగా ఆమెతో సహజీవనం చేశాడు. ఆమెను అనుమానిస్తూ నిత్యం గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఆమెతో గొడవపడి ముఖంపై దిండుతో అదిమి హత్య చేశాడు. అడ్డువచ్చిన యువతి కుమార్తెను రోకలిబండతో కొట్టి తీవ్రంగా గాయపరిచిన ఘటన పండగ రోజు కేదారేశ్వరపేటలో కలకలం సృష్టించింది. ● కేదారేశ్వరపేట 8వ లైనులో ఉండే హుస్సేనా (39)కి 22 ఏళ్ల కిందట వివాహం జరిగింది. భర్తతో విభేదాల కారణంగా రెండేళ్లకే విడిపోయింది. ఆమెకు ఒక కుమార్తె, ఒక కుమారుడు. ఆ తరువాత గుంటూరు జిల్లా నులకపేటకు చెందిన ఆటోడ్రైవర్ సాయి శివకుమార్ ఆమెకు పరిచయం అయ్యాడు. పెళ్లిళ్లకు డెకరేషన్ చేసే సాయికుమార్ ఆమెతో కలిసి కేదారేశ్వరపేట 8వ లైనులో ఉంటున్నారు. మహిళ కుమార్తె (19)కు రెండేళ్ల కిందట వివాహం చేశారు. భర్తతో విభేదాల కారణంగా ఆమె విడాకులు తీసుకుని తల్లితో ఉంటున్నారు. ఈ క్రమంలో మహిళ కుమార్తెకు రెండో వివాహం చేయాలని తల్లి నిర్ణయించగా శివకుమార్ అభ్యంతరం వ్యక్తం చేశాడని పోలీసుల విచారణలో తేలింది. ఈ విషయమై వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి.

అనుమానంతో వేధింపులు: నిత్యం అనుమానించడంతో, ఆమెతో గొడవ పడేవాడని బంధువులు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి కూడా ఈ విషయమై గొడవ పడ్డారు. తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో హుస్సేనా ముఖంపై దిండుతో అదిమి హత్య చేశాడు. అడ్డువచ్చిన ఆమె కుమార్తె కేకలు వేసింది. … ఆమె భయంతో బయటకు పరుగులు తీస్తుండగా వెనుక నుంచి రోకలి బండతో ఆమె తలపై కొట్టాడు. దీంతో ఆమె తలకు బలమైన గాయమైంది. స్థానికులు గమనించి అక్కడకు చేరుకోగా సాయి శివకుమార్ అక్కడి నుంచి పారిపోయాడు. 108 సిబ్బందికి, అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. … అజిత్‌సింగ్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

కేతనకొండలో రెండు సామాజికవర్గ యువకుల వివాదం

దాడులకు కోడి పందేలే కారణమంటున్న స్థానికులు

ఇబ్రహీంపట్నం (గ్రామీణం), ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : కొందరి యువకుల మధ్య చెలరేగిన వివాదం, రెండు సామాజిక వర్గాల కొట్లాటగా మారిన సంఘటన ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన గోపీచంద్, కిరణ్‌లు తమ ద్విచక్ర వాహనంపై ఓ సామాజిక వర్గం అధికంగా ఉండే నివాసాల వద్దకెళ్లి కేరింతలు కొట్టి హల్‌చల్ చేశారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న రామచంద్ర అనే యువకుడితో వాగ్వాదం జరిగింది. దీన్ని మనసులో పెట్టుకున్న యువకులు మరి కొందరి స్నేహితులను తీసుకొచ్చి రామచంద్రపై దాడి చేయగా అతని మెడ వద్ద, చెవిపై తీవ్రంగా కత్తి గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న రామచంద్ర తాలూకు సామాజిక వర్గం ఆందోళనకు దిగారు. సి.గోపీచంద్, కిరణ్, వాసులతో పాటు మరికొందరిని విచక్షణారహితంగా కొట్టారు. ఈ దాడి జాతీయ రహదారి(65)పై చేరడం, ఇరు వర్గాల వారు భారీగా అక్కడికి రావడంతో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. … ఇబ్రహీంపట్నం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఈ గొడవలు పునరావృతం కాకుండా ఏసీపీ దుర్గారావు ఆధ్వర్యంలో … పికెట్ ఏర్పాటు చేశారు. శాంతి భద్రతల విఘాతం కలిగించినందుకు ఒక వర్గంపై 307, మరో వర్గంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.



జాతీయ రహదారిపై నిలిచిన ట్రాఫిక్, పరిస్థితిని సమీక్షిస్తున్న పోలీసులు

శిబిరంలోనే వివాదం?: … కోడి పందేల శిబిరం … గురువారం మధ్యాహ్నం ఇరు వర్గాలకు చెందిన యువకులు పందేలు వేస్తున్నారు. అందులో ఒక వ్యక్తి కోడి గెలవకపోతే చెవి కోసుకుంటానని బాహాటంగా అన్నాడు. ఆ పందెంలో కోడి నేలకొరగడంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు. పందెంలో గెలిచిన వర్గానికి చెందిన యువకులు రాత్రి గ్రామంలో ఉన్న ఆ యువకుడిని చెవి కోసుకుంటావా అని నిలదీశారు. … వివాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. … వాహనంపై ఉన్న యువకులపై … ఒకరి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది.

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.ల్లో)

కేదారేశ్వరపేటలో మందుబాబుల హల్‌చల్

బీరు సీసాతో ఒకరిపై దాడి

మధురానగర్, న్యూస్‌టుడే: కేదారేశ్వరపేటలోని ఒక బార్ వద్ద రాము, సాల్మన్ అనే ఇద్దరు యువకులు మద్యం మత్తులో హల్‌చల్ చేశారు. బీరు సీసాతో ఒక వ్యక్తి తల పగలకొట్టారు. అడ్డుకున్నవారిపై తిరగబడి దాడి చేశారు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి జరగ్గా దీనిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఇటీవల బబ్బూరి గ్రౌండ్స్ వద్ద రౌడీ షీటర్ కారుతో హల్‌చల్ చేసిన ఘటన మరువక ముందే తాజాగా బార్ వద్ద మద్యం మత్తులో విచక్షణా రహితంగా దాడులకు తెగబడడం తీవ్ర చర్చనీయాంశమైంది. ● కేదారేశ్వరపేటకు చెందిన మోహన్‌కుమార్ ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటారు. గురువారం మధ్యాహ్నం కేదారేశ్వరపేటలోని మాధురి బార్ వద్దకు వచ్చారు. కౌంటర్‌లో పార్శిల్ తీసుకుంటుండగా అయోధ్యనగర్‌కు చెందిన రాము, సాల్మన్‌లు అతనిపై దాడి చేశారు. ముందుగా సాల్మన్ బీరు సీసాతో మోహన్ తలపై కొట్టారు. ఇది గమనించిన స్థానికులు అతడిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా రాము వారిపై తిరగబడ్డాడు. ఇద్దరూ బీరు సీసాలతో మోహన్‌కుమార్‌పై విచక్షణారహితంగా కొట్టారు. తీవ్ర గాయాలైన బాధితుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జరిగిన ఘటనపై మోహన్‌కుమార్ అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు. ఈ కేసును రాజీ చేసేందుకు స్థానికంగా ఉన్న వైకాపా నేత ఒకరు రంగంలోకి దిగారంటూ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది.

పాత దర్యాప్తుపై సమీక్షకే సీబీఐ పరిమితమైంది

హైకోర్టు ఆదేశాల మేరకు తాజా దర్యాప్తు చేయలేదు
ఆయేషామీరా తల్లిదండ్రుల తరఫు న్యాయవాది శ్రీనివాస్ వాదనలు

ఈనాడు, అమరావతి, గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: 'ఆయేషామీరా హత్య కేసును తాజాగా దర్యాప్తు చేయమని హైకోర్టు సీబీఐని ఆదేశించింది. కానీ సీబీఐ కొత్తగా శోధించకుండా గతంలో జరిగిన దర్యాప్తును సమీక్షించేందుకే పరిమితమైంది. ఇది హైకోర్టు తీర్పునకు విరుద్ధమని' ఆయేషామీరా తల్లిదండ్రుల తరఫు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ వాదించారు. ఆయేషామీరా హత్య కేసు శుక్రవారం విజయవాడలో సీబీఐ కేసులు విచారించే ప్రత్యేక కోర్టులో విచారణకు వచ్చింది. హైకోర్టు ఆదేశం మేరకు పునర్విచారణ నివేదికను మృతురాలి తల్లిదండ్రులకు ఇటీవల సీబీఐ అధికారులు అందజేసిన సంగతి తెలిసిందే. ఈ నివేదికలోని పలు అంశాలను న్యాయవాది శ్రీనివాస్ కోర్టులో చదివి వినిపించారు. పంచనామా నిర్వహించిన పలువురు రెవెన్యూ అధికారుల సాక్ష్యాలను మళ్లీ సీబీఐ నమోదు చేసిందని, గతంలో తాము ఒత్తిళ్లకు లొంగి వాంగ్మూలం ఇచ్చినట్లు వారు వెల్లడించారని చెప్పారు. ఈ సందర్భంగా సీబీఐ కొత్తగా నమోదు చేసిన సాక్షుల స్టేట్‌మెంట్లను డిఫెన్స్ న్యాయవాది చదివి వినిపించారు. గతంలో తాము పోలీసుల ఒత్తిళ్లకు తలొగ్గి ఖాళీ కాగితాలపై సంతకాలు పెట్టి ఇచ్చినట్లు ఉందని ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు. సాక్షులు చెప్పిన దాని ప్రకారం కూడా దర్యాప్తు సాగలేదన్నారు. పాత దర్యాప్తుపై సమీక్ష వల్ల ఒనగూరిన ప్రయోజనం ఏమీ లేదన్నారు. సీబీఐ పునర్విచారణ నివేదికపై ఆయేషామీరా తల్లిదండ్రులు రాతపూర్వకంగా అభ్యంతరాలను కోర్టులో ఫైల్ చేస్తారని, దీనికి సమయమివ్వాలని న్యాయవాది కోరారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును సీబీఐ కోర్టు న్యాయాధికారి అన్నపూర్ణ.. ఈనెల 29వ తేదీకి వాయిదా వేశారు.

బాలికను పెళ్లాడి.. ఠాణాకు వచ్చి..

కేసులో ఇరుక్కున్న యువకుడు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: బాలికను ప్రేమించి పెళ్లి చేసుకుని రక్షణ కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కేసులో ఇరుక్కున్నాడో యువకుడు. అతడు పెళ్లి చేసుకుంది మైనర్‌ని అని గుర్తించిన పోలీసులు రక్షణ కోసం వచ్చిన యువకుడిపైనే కేసు పెట్టారు. ఈ ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఒక యువకుడు స్థానికంగా ఉన్న ఒక బాలిక (17)ను ప్రేమించాడు. శుక్రవారం వారిద్దరూ పెళ్లి చేసుకున్నారు. పెద్దల నుంచి రక్షణ కావాలని కోరుతూ సదరు యువకుడు బాలికను తీసుకుని అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. పోలీసుల విచారణలో బాలిక అని తెలియడంతో యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించారు. నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసేందుకు పోలీసులు రికార్డు సిద్ధం చేస్తున్నారు.

మద్యం కుంభకోణం కేసులో నిందితులకు రిమాండ్..

ఈనెల 30 వరకు పొడిగించిన విజయవాడ ఏసీబీ కోర్టు

ఈనాడు - అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితులకు కోర్టు రిమాండ్ పొడిగించింది. వీరికి విధించిన రిమాండ్ గడువు శుక్రవారంతో ముగియనుండడంతో సిట్ అధికారులు నిందితులను విజయవాడలోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితులకు రిమాండ్ పొడిగించాలని ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాది కోర్టులో మెమో దాఖలు చేశారు. దీనిపై నిందితుల తరఫు న్యాయవాది సుందర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈనెల 30 వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. బెయిల్‌పై ఉన్న వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి కోర్టుకు హాజరయ్యారు. న్యాయాధికారి నుంచి అనుమతి తీసుకుని వెళ్లిపోయారు. బాలాజీ గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి రాలేదు. వీరి తరఫున న్యాయవాదులు గైర్హాజరు పిటిషన్ వేశారు. రిమాండ్ పొడిగింపు అనంతరం నిందితులను విజయవాడ, గుంటూరు కారాగారాలకు తరలించారు.

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కాలేజీ స్టైల్	సా. 5 - రా. 9
ఈఎఫ్ఎం సరాగాలు	రా. 9 - రా. 11
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 11 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఉభయగోదావరి జిల్లాలో, వైజాగ్, విజయవాడ అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఏసంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్‌లోన్. సిబిల్ అవసరంలేదు. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి బ్యాంక్. ✆ 93969 99669

REAL ESTATE

FLAT FOR SALE

మన శ్రీసిటీ కన్‌స్ట్రక్షన్స్ వారి తాడేపల్లి బైపాస్‌లోని ప్రైమ్ లొకేషన్ నందు 9 ఫ్లోర్స్ లగ్జరీ అపార్ట్మెంట్ ఫ్లాట్స్ మరియు విజయవాడ క్లబ్ రోడ్‌లో రివర్ వ్యూ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్ ఫ్లాట్స్ కొరకు సంప్ర: 98493 03315, 84494 58449.

గురునానక్ కాలనీ మెయిన్ రోడ్ పక్కన ప్రైమ్ ఏరియాలో టాప్ ఫ్లోర్ 3 BHK, 3 ఎటాచ్డ్ బాత్‌రూమ్స్ న్యూ ఫ్లాట్ అమ్మకం. ✆ 98853 99999

LAND FOR SALE

గన్నవరం, తెంపల్లి గ్రామం, చిన్న అవుటపల్లి to తెంపల్లి రోడ్ ఫేసింగ్ 1.42 ac. Industrial Land. RCC షెడ్‌తో. ✆ 89782 66665.

PLOT FOR SALE

మన శ్రీసిటీ వారి గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్స్ బందరురోడ్, వెస్ట్ బైపాస్‌లలో ఓపెన్ ప్లాట్స్, విల్లాలు LP నంబర్‌తో అమ్మకానికి కలవు. బ్యాంక్ లోన్, స్పాట్ రిజిస్ట్రేషన్ ✆ 98493 03315, 84494 58449

రిజి. శ్రీ కంచికచర్ల దగ్గర - చెవిటికల్లు రోడ్డులో- HYD హైవేకి 500 మీ|| పరిటాల రైల్వేహాల్ట్‌కి, ఐకాన్ బ్రిడ్జికి దగ్గరలో CRDA ప్లాట్లు. లోన్ కలదు. ✆78427 58859

Labbipet, Vijayawada | Prime Plot 750 sq.yds. East facing. MG Road proximity. Call: 98662 19067

VJA, కంచికచర్ల ఔటర్‌రింగ్‌రోడ్డు DTCP & APCRDA ఇళ్ళ మధ్య ప్లాట్స్ చ||గ|| 3,900/- నుండి 7,900/- వారధికి 9కిమీలలో చ||గ|| 14,500/-. ✆ 96031 45395

NH-65, **బెల్** కంపెనీ, మచిలీపట్నం పోర్ట్, గన్నవరం ఎయిర్ పోర్ట్, ORR లకు దగ్గరలో, పామర్రు కార్పోరేషన్ పరిధిలో, బందర్ రోడ్, గంగూరులలోను CRDA అప్రూవ్డ్ వెంచర్లో ప్రీమియం ఓపెన్ ప్లాట్స్ బ్యాంక్ లోన్ సౌకర్యంతో కలవు & పరిటాల హైవే ఫేసింగ్‌లో మరో నూతన CRDA వెంచర్ త్వరలో ప్రారంభం. 7799334555.

7 లక్షలకే సెంటు 70% బ్యాంక్ లోన్‌తో
పెనమలూరు హైస్కూల్ దగ్గరలో 33 అ|| రోడ్లతో పంచాయితీ అప్రూవ్డ్ ప్లాట్లు అమ్మకమునకు కలవు.
✆98486 67454

ప్లాట్స్ అమ్మబడును. డి.టి.సి.పి. లేఔట్‌లో మచిలీపట్నంలో మంచినీటి కాలువ దగ్గర వాసవినగర్‌లో ప్లాట్స్ అమ్మకమునకు కలవు. ✆79817 81688, 78158 50952

మచిలీపట్నం, ఈడేపల్లి బాలభాను విద్యాలయం రోడ్‌లో 265 గజాలు కమర్షియల్ ప్లాట్ అమ్మకం కలదు. PH.No: 98482 10397, 95559 93366.

PROPERTY FOR SALE

3BHK Flat at HRT Plaza near Benz Circle & 275 Sq.Yds. Open Plot Bharathi Nagar behind Novatel, 5000 Sq.Yds. Vadeswaram. Sale. ✆ 90043 77068.

TO LET

COMMERCIAL

Tolet for Corporate Offices Ground Floor 360 S.Ft Near A Plus Convention Hall, Vijayawada ✆ 90146 33050

SECOND SALE

Furniture for Sale. (Good Condition) Related to Readymade Garment Store @ MG Road, Vijayawada. 97043 87132, 99895 51919.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

JOBS

ప్రముఖ గైనిక్ హాస్పిటల్‌లో పనిచేయుటకు లేబర్‌రూమ్ అసిస్టెంట్, O.T అసిస్టెంట్, O.T కాంపౌండర్ కావలెను. ✆ 93973 41745

VJAలోని ఆటోమొబైల్ హోల్‌సేల్ డిస్ట్రిబ్యూటర్స్ దగ్గర పనిచేయుటకు అకౌంటెంట్ (F) కావలెను. EXP. కాలి 3YRS. 10Am to 5Pm ✆ 92464 92455.

NTR, కృష్ణాలలో జగ్గయ్యపేట, కైకలూరు, పామర్రు, అవనిగడ్డ, గుడివాడలో మార్కెటింగ్‌కు PROలు కావలెను. జీతం : 40K, 50K,60K ✆ 89195 20094

కరీంనగర్‌లోని డాక్టర్ గారి ఇంట్లో వంట చేయడానికి అనుభవం కలిగిన, ఏ బాదరాబందీ లేని 45 ఏళ్ళ వయస్సు పైబడిన మహిళ కావలెను. ఆకర్షణీయమైన జీతం. 98480 14512.

టూ వీలర్ ఫైనాన్స్ కంపెనీ, పటమట, విజయవాడలో పనిచేయుటకు టెలీకాలర్స్ (స్త్రీ అభ్యర్థులు) కావలెను. అనుభవం 0-2సం||. ✆ 88862 99444.

టూ వీలర్ ఫైనాన్స్ కంపెనీ, పటమట, విజయవాడలో పనిచేయుటకు ఆఫీస్ సేల్స్ అభ్యర్థులు కావలెను. అనుభవం 0-2 సం||. ✆ 63098 80999.

టూ వీలర్ ఫైనాన్స్ కంపెనీ, పటమట, విజయవాడలో పనిచేయుటకు కలెక్షన్ ఏజెంట్స్ కావలెను. అనుభవం 0-5సం||. ✆ 88866 55588.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్ ప్రారంభం



మాట్లాడుతున్న కృష్ణా వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ జె.నవీన లావణ్యలత, పక్కనే రాజేశ్వరి, రమేష్ తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో నాలుగు రోజుల పాటు జరిగే సౌత్ జోన్ అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను కృష్ణా వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ జె.నవీన లావణ్యలత ప్రారంభించారు.

ఆత్మీయ కలయిక... ఆనంద వేడుక


నాటి గురువులతో పూర్వ విద్యార్థుల బృందం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండల పరిధి పుట్రేల గ్రామంలోని అక్షర పాఠశాలలో 2006- 07లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాలలో తిరుగుతూ సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారు తమ అనుభవాలను మిత్రులతో పంచుకుని ఆనందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



స్పందన: రెడ్డిగూడెం పంచాయతీ 4వ వార్డులోని డ్రెయిన్లలో పూడిక పేరుకుందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారులకు తెలిపారు. ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి ఎస్.నాగబాబు స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

? జి.కొండూరు పీహెచ్‌సీకి వెళ్లే సీసీ రోడ్డుపై వివేకానంద పాఠశాల సమీపంలో కృష్ణా జలాల పైపులైను లీకై నీరంతా వృథాగా పోతోంది. **- ఎస్.లోకేష్** ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందితో పైపులైనుకు మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికడతాం. **- బసవ లింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, జి.కొండూరు

? కొండపల్లి ఆరు పంపుల కూడలిలో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. దానికి సంబంధించిన మెటీరియల్ కూడలిలో ఉంచడం వల్ల వాహనదారులకు ఇబ్బందిగా ఉంది. **- ప్రకాష్, కొండపల్లి** ✔ నిర్మాణ గుత్తేదారులతో మాట్లాడి వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- పవన్, పారిశుద్ధ్య మేస్త్రీ**

? కొండపల్లి బ్యాంకు కూడలి మెడ్‌ప్లస్ దుకాణం వద్ద మురుగు రహదారిపైకి వస్తోంది. గతంలో సమస్యను తాత్కాలికంగా పరిష్కరించినా అదే పునరావృతం అవుతోంది. సమస్య పరిష్కరించాలి. **- అలీఖాన్, కొండపల్లి** ✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి మురుగును మళ్లిస్తాం. **- పవన్, పారిశుద్ధ్య మేస్త్రీ** - న్యూస్‌టుడే, కొండపల్లి

కెనోయ్ స్లాలమ్, కయాక్‌లో సత్తా


పతకాలతో నాగిడి గాయత్రి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లోని సహస్రధారలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరిగిన 13వ జాతీయ కెనోయ్ స్లాలమ్, 3వ జాతీయ కయాక్ క్రాస్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి ఆడిన నాగిడి గాయత్రి (కృష్ణా) సత్తా చాటి రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకుందని రాష్ట్ర కెనోయింగ్, కయాకింగ్ సంఘం అధ్యక్షుడు బి.బలరాం నాయుడు తెలిపారు. గతంలోనూ పలు పతకాలు సాధించిన గాయత్రి ఈ ఛాంపియన్‌షిప్‌లో మరో సారి ప్రతిభను నిరూపించుకుందని పేర్కొన్నారు.

తోలకాలకు తెరలేపారు.. జేబులు నింపుకొంటున్నారు!

మైలవరం, రెడ్డిగూడెం, న్యూస్‌టుడే


నీరు లేక అడుగంటిన మైలవరం ఎర్ర చెరువు

కాసులు కురిపించే మట్టి, గ్రావెల్‌పై కసరత్తులు ప్రారంభించారు. ఒకట్రెండు చెరువుల నుంచి మట్టి తోలకాలకు ఇప్పటికే తెరలేపారు. గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళల్లో మట్టిని ప్రైవేటుగా తరలించి, జేబులు నింపుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. మైలవరం నియోజకవర్గంలో ఇటుక బట్టీలు పెద్ద సంఖ్యలో ఉండటం, రియల్ ఎస్టేట్ వెంచర్లకూ అవసరమవడంతో గిరాకీని సొమ్ము చేసుకునే పనిలో కొందరు తలమునకలవుతున్నారు.

దశాబ్ద కాలంగా...

ఈ ఏడాది నియోజకవర్గంలోని చెరువులకు సమృద్ధిగా నీరు చేరింది. అదే స్థాయిలో ఇటుక బట్టీల నిర్వహణ సాగుతోంది. కుటీర పరిశ్రమలా ఉన్న బట్టీలకు మట్టిని అమ్మి, రూ.కోట్లు గడించడం దశాబ్ద కాలంగా నియోజకవర్గంలోని కొందరికి పరిపాటిగా మారింది. ఈ సంవత్సరం అదే తరహాలో మట్టి తవ్వకాలకు వ్యూహాలు పన్నుతున్న నాయకులకు మొన్నటి వరకు నిండుగా ఉన్న చెరువుల్లో నీరు అడ్డొచ్చింది. క్రమేపీ నిల్వలు తగ్గడంతో తవ్వకాలకు అనుకూలంగా మారుతోంది. దాంతో రాత్రి వేళల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలింపు చర్యలు ప్రారంభించారు.

రాత్రి వేళ ట్రాక్టర్లతో..

మైలవరం ప్రాంతంలో ప్రధానంగా ఉన్న మైలవరం, పొందుగల పరిధిలోని ఎర్ర చెరువులో ఇప్పటికే దాదాపు నీరు అడుగంటింది. దాంతో రెండ్రోజులుగా రాత్రి వేళ పెద్ద ఎత్తున ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించారు. అర్ధరాత్రి ప్రారంభించి తెల్లవారుజాముకే పని ముగించేశారు.

★ రెడ్డిగూడెం మండలం మద్దులపర్వలో వైకాపా హయాంలో దాచిన మట్టిని, పది రోజుల కిందట తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని అయిదు టిప్పర్లను స్వాధీన పర్చుకున్నారు. మైలవరం మండలంలో బట్టీలున్న ప్రాంతాల్లో చెరువుల్లో నీరుండటంతో అక్కడి నుంచి తరలింపు చేపట్టినట్లు చెబుతున్నారు.

★ మైలవరం మండలం వెల్వడం మీదుగా తరలిస్తున్న టిప్పర్లకు స్థానికులు అడ్డు తిరగడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

★ మైలవరం మండలం ఎదురుబీడెం గట్టు నుంచి గుట్టుచప్పుడు కాకుండా టిప్పర్ల ద్వారా రాత్రివేళల్లో పెద్ద ఎత్తున తరలుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మధిర కాల్వకు సాగర్ జలాలు విడుదల

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు శుక్రవారం కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 1200 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు. గంపలగూడెం మండలం సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 587 క్యూసెక్కులు చేరగా దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు-1కరి 80, పెదకొమిర 30, మధిర 60, నిదానపురం 70 క్యూసెక్కులు చొప్పున సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు.


పనులు పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ ఎస్సైలు

ట్రాఫిక్ పోలీసుల చొరవతో దీపాలకు మరమ్మతులు

కొండపల్లి, న్యూస్‌టుడే : జాతీయ రహదారిపై విద్యుత్తు దీపాల మరమ్మతుకు ట్రాఫిక్ పోలీసులు చొరవ చూపారు. ఇబ్రహీంపట్నం- ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారి(30) ఇబ్రహీంపట్నం నుంచి కొండపల్లి ఐడీఏ వరకూ ఆ రోడ్డును పదేళ్ల కిందట నాలుగు వరుసలుగా నిర్మించి విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. అవి కొంత కాలం మాత్రమే వెలుగులందించగా కొన్నేళ్లుగా రాత్రి సమయాల్లో అనేక ప్రమాదాలు సంభవించాయి. దీన్ని గమనించిన ట్రాఫిక్ ఎస్సైలు కృష్ణ, లక్ష్మణరావు ఎన్‌హెచ్‌ఏఐ నిర్వహణ గుత్తేదారులను సంప్రదించి సమస్యను వివరించారు. శుక్రవారం ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది, స్థానిక డిస్కం లైన్‌మెన్లు ఆయా మరమ్మతులను ప్రారంభించారు.


గంపలగూడెం- మధిర రోడ్డులో ఉదయం పది గంటలకు లైట్లతో వస్తున్న వాహనాలు

పొగ మంచు.. పొంచి ఉన్న ముప్పు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల ప్రజలు పొగ మంచుతో అవస్థలు పడుతున్నారు. దీంతో మనుషులకే కాదు పంటలకు నష్టం జరుగుతోంది. వారం రోజులుగా పల్లెలను మంచు దట్టంగా కప్పేయడంతో అయిదారు అడుగుల దూరంలో ఉన్న వారు కూడా కన్పించడం లేదు. ఈ నేపథ్యంలో చోదకులు ఉదయం పది గంటల వరకు వాహనాలకు లైట్లు వేసుకుని నడుపుతున్నారు. రహదారి మలుపుల్లో ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించక ప్రమాదాలకు గురవుతున్నారు. పొగ మంచు కారణంగా మిరప, మామిడి తోటల్లో పూత, పిందెలు దెబ్బతినే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్తు కార్మికుల ఆశ అడియాస

అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న కార్మిక వర్గాలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : గత బకాయిలు, సర్వీస్ ఇన్‌సెంటివ్‌లు వస్తాయని అనుకున్న విద్యుత్తు సంస్థల కార్మికుల ఆశ అడియాసగా మారింది. ఇందుకు కారణం ముమ్మాటికీ అధికార యంత్రాంగమేనని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యుత్తు సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు సంబంధించి గత బకాయిలు, ఇన్‌సెంటివ్‌ల కోసం 2025 సెప్టెంబరు 10న ఎన్టీటీపీఎస్‌తో పాటు ఇతర విద్యుత్తు ఉత్పాదన కేంద్రాల వద్ద కార్మిక సంఘాలు దీక్షలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో యాజమాన్యాలు కార్మిక సంఘాలతో చర్చలు జరిపాయి. గత బకాయిలు చెల్లించడంతో పాటు 20 ఏళ్ల విధుల్లో కొనసాగిన కార్మికులకు సర్వీస్ ఇన్‌సెంటివ్ ఇవ్వడానికి ప్రభుత్వం, విద్యుత్తు సంస్థల యాజమాన్యాలు అంగీకారం తెలిపాయి. అందులో భాగంగానే జనవరి- 2026 వేతనాలతో కలిపి దశల వారీగా వాటిని చెల్లించాలని ప్రభుత్వం జీవో విడుదల చేయగా కొద్దిమంది కార్మికులకు మాత్రమే నగదు జమైంది. అయితే కార్మికులకు సంబంధించిన సర్వీస్ వివరాలు ఎస్ఈ, డీఈ కార్యాలయాల నుంచి విద్యుత్తు కేంద్ర కార్యాలయానికి వెళ్లాల్సిన జాబితా జాప్యం చోటు చేసుకుంది. దీంతో అర్హత కలిగిన కార్మికులందరికీ వేతనాలతో కూడిన బకాయిలు చెల్లింపులు జరగలేదు. ఈ క్రమంలో కేవలం జనవరి వేతనాలకే పరిమితమయ్యామని ఎన్టీటీపీఎస్ కార్మికులు వాపోతున్నారు.

బకాయిల చెల్లింపులపై హర్షం

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీర్ఘ కాల బకాయిలను ప్రభుత్వం చెల్లించడం హర్షణీయమని డీపీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.కోటేశ్వరరావు, ఆర్వీఎస్ రామకృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలోని బకాయిలతో కలిపి 60 నెలలకు సంబంధించి రూ.1100 కోట్లు చెల్లించడంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాల్లో సంక్రాంతి సంతోషం రెట్టింపు అయ్యిందని వారు తెలిపారు.

కంభంపాడులో ముగిసిన క్రికెట్ పోటీలు


విజేతలకు ట్రోఫీ అందిస్తున్న పోలీసు అధికారులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : సంక్రాంతి సందర్భంగా ఎ.కొండూరు ఎస్సై గంధం మహాలక్ష్మణుడు ఆధ్వర్యంలో మండలంలోని కంభంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో మూడ్రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఇందులో ఎ.కొండూరు యువత, పోలీసు జట్టు, వల్లంపట్ల యువత వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ట్రోఫీలు, ప్రోత్సాహక నగదు, జ్ఞాపికలతో పాటు అక్కడి నాగసింధు స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం ఆర్థిక సౌజన్యంతో 'మాదక ద్రవ్యాల వినియోగం వద్దు.. శిరస్త్రాణం ధరించి ప్రాణాలు కాపాడుకుందాం' అనే నినాదం ఉన్న జెర్సీలను ఏసీపీ ప్రసాదరావు, సీఐ గిరిబాబు అందజేసినట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా గోదారంగనాయకులకు గ్రామోత్సవం


ప్రత్యేక అలంకరణలో..

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని వైష్ణవాలయాల్లో ధనుర్మాసోత్సవాలు వైభవంగా ముగిశాయి. నెమలి, గోసవీడు, పెనుగొలను, గంపలగూడెం, వినగడప, ఊటుకూరు గ్రామాల్లోని కృష్ణాలయాలు, రామాలయాలు, రంగనాయక స్వామి ఆలయాల్లో నెల రోజుల పాటు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గుడుల్లో వేకువజాము నుంచి భక్తులతో సందడి నెలకుంది. గురువారం కల్యాణ మహోత్సవం నిర్వహించి గోదారంగనాయకస్వామి ఉత్సవమూర్తులకు మేళతాళాలతో గ్రామోత్సవం చేశారు.


మైలవరం : పూలతో జూద శిబిరానికి ఏర్పాటు చేసిన ఆహ్వాన ద్వారం


జి.కొండూరులో విద్యుత్తు దీపాల వెలుతురులో..


రెడ్డిగూడెంలో కోసాట

కూడికలు... తీసివేతలు

నగదు లెక్కల్లో నిర్వాహకులు తలమునకలు

మైలవరం, న్యూస్‌టుడే : సంక్రాంతి సందర్భంగా తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో మూడ్రోజుల పాటు నిర్వహించిన కోడి పందేలు, జూద శిబిరాలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. ఈ నేపథ్యంలో జరిగిన లావాదేవీలకు సంబంధించి లెక్కల్లో మునిగారు.

మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని పొందుగలలో కోడి పందేలు నిర్వహిస్తున్న జూద శిబిరంలో గురువారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తుల మధ్య పందేం విషయంలో జరిగిన వివాదం ఘర్షణకు దారి తీసింది. వేరే గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడగా, ఒక వ్యక్తి బీర్ బాటిల్ తీసుకుని పొడుస్తానంటూ హల్‌చల్ చేయడంతో అక్కడున్న వారు హడలిపోయారు. వెంటనే అతడిని అడ్డుకుని సర్ది చెప్పగా వివాదం సర్దుమణిగింది.

జి.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని గ్రామాల్లో విద్యుత్తు దీపాల వెలుతురులో రాత్రులు సైతం కోడి పందేలు, కోత ముక్క, మూడు ముక్కలాటలను నిర్వహించారు. కొన్నిచోట్ల రాత్రులు పందేలు నిర్వహణకు విద్యుత్తు చౌర్యం జరిపారు.

గంపలగూడెం: మండలంలోని నెమలి, ఊటుకూరు, పెదకొమిర, తునికిపాడు, పెనుగొలను, గుళ్లపూడి తదితర గ్రామాల్లో కోడి పందేలు, జూదం యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. కోత ముక్క రూ.కోట్లలో జరిగింది. పందేల నిర్వాహకులు కోసు ఆటను ఇతరులకు విక్రయించి అక్రమార్జన చేశారు. మామిడి తోటల్లో ఏర్పాటు చేసిన కోడి పందేల బరులు, జూద శిబిరాల వద్ద మద్యం సీసాలను రెట్టింపు ధరకు అమ్మారని పలువురు వాపోయారు. ఈ ఏడాది బరుల వద్ద నిర్వాహకులు బౌన్సర్లను ఏర్పాటు చేయడం విశేషం.

తిరువూరు: తిరువూరు మండలంలోని కాకర్ల, మల్లెల, విస్సన్నపేట మండలం తాతకుంట్ల తదితర గ్రామాల్లో రూ.కోట్ల మేర పందేలు జరిగాయి. తిరువూరులోని శ్రీరస్తు వద్ద జరిగిన పందేల్లో బుల్లెట్ ద్విచక్ర వాహనాన్ని బహుమతిగా ప్రకటించారు. విస్సన్నపేట మండలం తాతకుంట్లలో నిర్వాహకులు ఇండికా డిజైర్ కారు, రెండు బుల్లెట్ ద్విచక్ర వాహనాలను బహుమతులుగా అందించారు. కోడి పందేల నిర్వహణతో కొన్నిచోట్ల ప్రధాన రహదారులపై వాహనాలను నిలిపి ఉంచడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఇబ్రహీంపట్నం: కొండపల్లి పురపాలికతో పాటు మండల శివారు గ్రామాల్లో నిర్వహించిన కోడి పందేల్లో రూ.కోట్లు చేతులు మారాయి. జూద శిబిరాలతో పాటు ఇతర ఆటలు కొనసాగాయి. మద్యం ఏరులై పారింది.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలో కోడి పందేలతో పాటు కోసు(జూదం), నలుపు, ఎరుపు, గుండాటలు యథేచ్ఛగా సాగాయి. పెద్ద ఎత్తున మద్యం అమ్మకాలు జరిగాయి. గురువారం నూజివీడు రహదారిలోని బరిలో పందెపు రాయుళ్ల మధ్య ఘర్షణ జరగడంతో సాయంత్రం పందేలను నిలిపేశారు. ఇరువర్గాల పందెపు రాయుళ్లు మాట్లాడుకుని శుక్రవారం యథావిధిగా పందేలు నిర్వహించారు.

కోడి పందేల నిర్వహణలో వివాదం

జి.కొండూరు, న్యూస్‌టుడే : సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన కోడి పందేలను శుక్రవారం సాయంత్రం ముగించే సమయంలో వివాదం చోటు చేసుకుంది. గంగినేని గ్రామంలో పందేలు ముగిసిన సందర్భంగా గ్రామానికి చెందిన కొందరు యువకులు సందడి చేస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం రేమిడిచర్ల నుంచి పందేలకు వచ్చిన గోసి పరమేశ్వరరావు అనే వ్యక్తి పక్కనే ఉన్న బండి వద్ద నూడిల్స్ తింటూ గంగినేనికి చెందిన వ్యక్తులను కామెంట్ చేయగా వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో పరమేశ్వరరావుపై గంగినేనికి చెందిన యువకులు ఘర్షణ పడి దాడి చేయగా అతను అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడిని వెంటనే ఎర్రుపాలెం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ వివాదాన్ని ఆపేందుకు వెళ్లిన కానిస్టేబుల్‌ను సైతం పక్కకు తోసేసి దురుసుగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. వివాదానికి కారణమైన వ్యక్తులను జి.కొండూరు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

సంక్రాంతి సందడి.. ఊరూరా కాంతి


మైలవరం: వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు


తిరువూరు: చంద్రమౌళిశ్వర స్వామి ఆలయంలో..


నెమలి కృష్ణాలయం గోశాలలో..

తిరువూరు, న్యూస్‌టుడే : మకర సంక్రాంతిని పురస్కరించుకుని గురు, శుక్రవారాల్లో తిరువూరు పట్టణంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : స్థానిక శ్రీరాజగోపాల స్వామి దేవాలయంలో బుధవారం రాత్రి శ్రీగోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణ వేడుక జరిపారు. గురువారం గ్రామంలో ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలో సంక్రాంతి పండగను ప్రజలు ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. ఇంటింటా పిండి వంటలతో మహిళలు సందడి చేశారు. బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంటా పండగ వాతావరణం నెలకొంది. హరిదాసులు త్యాగరాయ కీర్తనలు ఆలపిస్తూ కానుకలు స్వీకరించారు. అందమైన రంగవల్లులు వేసేందుకు యువతులు పోటీ పడ్డారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు : మైలవరం, న్యూస్‌టుడే: కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక లీలావతి గిరిజన పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, విద్యార్థులు పలు వేషధారణలతో అలరించారు.

పెనుగొలనులో పుడమి పుత్రులకు సన్మానం.. పెనుగొలను (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలనులో కనుమ పండగ సందర్భంగా శిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో 18 మంది రైతులను సత్కరించినట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. కనుమ రోజున గోవులను పూజించడం, అన్నం పెట్టే పుడమి పుత్రులను సన్మానించడం సంప్రదాయమని నిర్వాహకులు చెప్పారు.

ప్రత్యేక పూజలు.. మైలవరం, న్యూస్‌టుడే : కనుమను పురస్కరించుకుని శుక్రవారం ద్వారకా తిరుమల దత్తత దేవాలయమైన స్థానిక శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు గోవులకు పూజలు నిర్వహించారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : మండల పరిధిలోని గ్రామాల్లో గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెవుటూరు, వెల్లటూరులోని గో ఆశ్రమంలో భక్తులు గోమాతలను దర్శించుకుని ప్రదక్షిణలు, ప్రత్యేక పూజలు చేసి వాటికి పశుగ్రాసం తినిపించారు.

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో గోపూజ నిర్వహించారు. తెదేపా నాయకుడు బెల్లం మధుసూదనరావు, భక్తులు పాల్గొన్నారు. రాత్రి ఆలయంలో అష్టోత్తర శత దీపాలంకరణ సేవ చేపట్టారు.

శాస్త్రోక్తంగా కపిల గోమాత పూజ


శ్రీచక్రనవావరణార్చన సేవ నిర్వహిస్తున్న అర్చకుడు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కనుమ పండగను పురస్కరించుకొని కపిల వర్ణ గోమాతకు శుక్రవారం శాస్త్రోక్తంగా అర్చకులు పూజ నిర్వహించారు. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్‌లతో అర్చకులు పూజ చేయించారు. దుర్గమ్మ దర్శనానికి వచ్చిన పలువురు భక్తులు గోపూజ చేశారు. ✦ దుర్గగుడి ఈవో శీనానాయక్ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి ప్రతి రోజు గోశాలలోని ఆవు పాలను మాత్రమే శ్రీచక్రార్చనకు వినియోగించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రతి రోజు 6 లీటర్ల పాలను అమ్మవారి ఆలయంలో వివిధ పూజల నిమిత్తం దేవస్థానం గోశాల నుంచి తీసుకొస్తారని అధికారులు తెలిపారు.



కిరాణా దుకాణంలో నగదు అపహరణ

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలో దొంగలు రెచ్చిపోయారు. ఓ కిరాణా దుకాణాన్ని లక్ష్యంగా చేసుకున్న గుర్తు తెలియని దుండగులు రూ.లక్ష నగదును అపహరించారు. రాత్రి సమయంలో దుకాణం తాళాలు పగలగొట్టి లోపలికి వచ్చి నగదుతో పాటు కొన్ని విలువైన వస్తువులను తీసుకెళ్లారు. గురువారం ఉదయం దుకాణం తెరవడానికి వచ్చిన యజమాని తాళాలు పగిలి ఉండడాన్ని గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ


దొంగలు కాల్చేసిన ఆస్తి పత్రాలు

గోసవీడు (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని గోసవీడులో వజినేపల్లి వెంకటేశ్వరరావు ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడి వివరాల మేరకు. ఇంటికి తాళం వేసి బుధవారం వైరాలోని తన బంధువుల ఇంట వేడుకకు వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా వెళ్లారు. గురువారం మధ్యాహ్నం తిరిగి రాగా ముఖ ద్వారం తలుపులు తెరిచి ఉండడం గమనించి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.2.30 లక్షలు, 140 గ్రాములు బంగారం, సుమారు 3 కిలోల వెండి వస్తువులు అపహరణకు గురి అయ్యాయని బాధితుడు వాపోయారు. తన స్థిర ఆస్తులు, బ్యాంకు పుస్తకాలు, ఇతర పత్రాలను చోరీకి పాల్పడిన వారు ఇంట్లోనే కాల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై గురువారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఆ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం గోసవీడు చేరుకుని చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి బాధితుడి నుంచి వివరాలు తీసుకున్నారు. ఇంట్లో ఎవరూ లేరని గమనించే దొంగతనానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

అతి వేగంతో విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన కారు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామం వద్ద ఓ కారు విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన ఘటన గురువారం చోటు చేసుకుంది. అతి వేగంగా వస్తున్న కారు రోడ్డుపై ఉన్న కుక్కను తప్పించే క్రమంలో అదుపు తప్పి రహదారి పక్కనున్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొనడంతో కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణించే వారికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. విద్యుత్తు శాఖ సిబ్బంది వచ్చి విద్యుత్తుకు అంతరాయం కలగకుండా వెంటనే మరమ్మతులు చేపట్టారు.



(c) eenadu

నైపుణ్య శిక్షణ.. ఉద్యోగాల కల్పన

ఈనాడు, అమరావతి: కళాశాలలు, విద్యా సంస్థల్లో నేర్చుకున్న కోర్సులకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటోంది. తగిన నైపుణ్యాలు లేకపోవడంతో చాలా మంది ఉద్యోగాలు పొందలేకపోతున్నారు. ఇలాంటి వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వంలోని సీడాప్ నైపుణ్య శిక్షణను అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన (డీడీయూజీకేవై) కింద శిక్షణకు 60% నిధులు ఇస్తుండగా.. 40% రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. అనుభవం కలిగిన సంస్థల ద్వారా యువతకు మూడు నెలల నుంచి సంవత్సరం వరకు నైపుణ్య శిక్షణ ఇప్పిస్తున్నారు. అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. గతేడాది ఇప్పటి వరకు 13,778 మందికి నైపుణ్య శిక్షణ ఇవ్వగా.. 10,609 మందికి ఉద్యోగాలు లభించాయి.

ఉపాధి కల్పనలో ఏపీకి ప్రథమ స్థానం..

దేశ వ్యాప్తంగా డీడీయూజీకేవై కింద ఉద్యోగాలు కల్పిస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. జాతీయ స్థాయిలో శిక్షణలో మూడో స్థానంలో ఉన్న ఏపీ, నియామకాల్లో మొదటి స్థానంలో ఉంది. గతేడాది మార్చిలో కేంద్రం 16,177 మందికి నైపుణ్య శిక్షణకు నిధులు మంజూరు చేయగా.. ఆగస్టు నాటికే ఈ లక్ష్యాన్ని సీడాప్ పూర్తి చేసింది. మరో 6 వేల మందికి నిధులు ఇవ్వాలని కోరగా.. కేంద్రం మంజూరు చేసింది. ఈ ఏడాది నుంచి ఏటా 40 వేల మందికి శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక రూపొందించింది.

జర్మనీలో ఉద్యోగాలకు శిక్షణ..

జర్మనీలో నర్సులు, ఎలక్ట్రీషియన్లుగా ఉద్యోగాలు పొందేందుకు సైతం సీడాప్ శిక్షణ అందిస్తోంది. జర్మనీ భాషపై మొదట శిక్షణ ఇస్తోంది. ఇప్పటి వరకు 175 మంది నర్సులకు శిక్షణ ఇవ్వగా.. వీరిలో 31మంది జర్మనీలో ఉద్యోగాలు పొందారు.. 78 మంది స్లాట్‌కోసం నిరీక్షిస్తున్నారు. మరో 12మంది జర్మనీకి వెళ్లనున్నారు. ఫిబ్రవరిలో మరో 19మంది జర్మనీకి వెళ్లనున్నారు. ఎలక్ట్రీషియన్లుగా 60 మందికి శిక్షణ ఇవ్వగా...వీరిలో 13 మందికి జర్మనీలో ఉద్యోగాలకు వీసా ప్రక్రియ కొనసాగుతోంది. 47 మందికి స్లాట్‌కు ఉద్యోగాలు లభించాయి.

యువతకు నైపుణ్య పోర్టల్..

బీటెక్, డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ నైపుణ్యం పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఈ పోర్టల్‌లో రెజ్యూమె తయారు చేసుకుంటే అర్హతల ఆధారంగా ఉద్యోగావకాశాలు కనిపిస్తాయి. ఈ నెల చివరి నాటికి లక్ష మంది ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులు ఇందులో నమోదయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు.

సైనిక చర్య లేనట్టే!

(మొదటి పేజీ తరువాయి)

దాడి చేయబోమన్న సంకేతాలిచ్చారు! ఇరాన్‌పై దాడులకు దిగితే ఆ దేశంలో అనిశ్చితి మరింత పెరిగే ముప్పుండటం, ప్రాంతీయంగా తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తే అవకాశాలు ఉండటం, వాషింగ్టన్ పరిమిత స్థాయి సైనిక చర్యతో ఆగిపోకుండా దీర్ఘకాలం పాటు దాడులు కొనసాగించక తప్పని పరిస్థితులు తలెత్తొచ్చన్న అంచనాలు.. ఇవన్నీ సైనిక చర్యపై ట్రంప్ నిర్ణయం మార్పునకు కారణమైనట్లు తెలుస్తోంది.

ఒక్కరోజులో మారిన స్వరం

24 గంటల్లోనే టెహ్రాన్‌పై వాషింగ్టన్ సైనిక చర్యకు దిగడం ఖాయమనీ విశ్వసనీయ వర్గాలు బుధవారం వెల్లడించాయి. గతంలో ఇరాన్ విధించిన మరణశిక్షల తాలూకు వీడియోలను ట్రంప్ వీక్షించారని.. తాజా నిరసనల్లో పాల్గొన్నవారికి అలాంటి పరిస్థితి తలెత్తనీయబోమన్న కృతనిశ్చయంతో ఆయన ఉన్నారని తెలిపాయి. అయితే గురువారంకల్లా పరిస్థితి మారిపోయింది. "ఇరాన్‌లో హత్యలు ఆగిపోయాయని ఆవలి వైపు నుంచి చాలా ముఖ్యమైన వర్గాల ద్వారా సమాచారం అందింది" అని ట్రంప్ ప్రకటించారు. ఒక్కరోజులో ట్రంప్ స్వరం మారడం చూసి అమెరికా సైనిక వర్గాలూ ఆశ్చర్యపోయినట్లు తెలుస్తోంది. నిజానికి ఆ సమయానికి ఇరాన్‌లో నిరసనకారులపై హత్యాకాండ నిలిచిపోయినట్లు అమెరికా నిఘావర్గాలేమీ నివేదించలేదని సమాచారం. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో పాల్గొన్న ఎర్ఫాన్ సొల్తానీ అనే 26 ఏళ్ల యువకుడికి చివరి నిమిషాల్లో ఇరాన్ మరణ శిక్ష అమలును నిలిపివేసింది. ట్రంప్ వెనక్కి తగ్గడానికి ఇది బాగా ఉపయోగపడిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నెతన్యాహూ వద్దన్నారు!

ఇరాన్‌పై దాడుల విషయంలో ట్రంప్ వెనక్కి తగ్గడానికి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ కూడా ఓ ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈ ఇద్దరు నేతలూ బుధవారం మధ్యాహ్నం (అమెరికా కాలమానం ప్రకారం) ఫోన్‌లో మాట్లాడుకున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం- ఇరాన్ అంత తేలికగా తలొగ్గబోదని ట్రంప్‌నకు నెతన్యాహూ చెప్పారు. దీర్ఘకాలం దాడులు కొనసాగించాల్సి వస్తుందన్నారు. దీంతో ట్రంప్‌ను పునరాలోచనలో పడేసింది.

నెతన్యాహూ, పెజెష్కియాన్‌లకు పుతిన్ ఫోన్..

ఇరాన్‌కు అమెరికా హెచ్చరికల కారణంగా పశ్చిమాసియాలో సంక్షోభం తరహా పరిస్థితులు నెలకొనడంతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పందించారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌లతో ఫోన్‌లో ఆయన విడివిడిగా మాట్లాడారు. ప్రాంతీయ భద్రత కోసం దౌత్యమార్గాల్లో కృషిచేయాలని వారికి పిలుపునిచ్చారు. ఇందుకోసం అవసరమైతే మధ్యవర్తిత్వం నిర్వహించేందుకు మాస్కో సిద్ధమన్నారు.

మిత్రదేశాల దౌత్యమంత్రం

సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్ వంటి దేశాలతో పాటు ఈజిప్టు సైనిక చర్య నివారణకు ట్రంప్‌తో ముమ్మరంగా దౌత్య ప్రయత్నాలు చేశాయి. ఇరాన్‌పై దాడులు ప్రాంతీయంగా యుద్ధమేఘాలకు కారణమవుతాయని ఆయనకు సూచించాయి. ట్రంప్ సైతం వాటి వాదనతో ఏకీభవించారు! ఆపై కొన్ని గంటలకే ఎర్ఫాన్ సొల్తానీ మరణశిక్షను టెహ్రాన్ నిలిపివేయడం, 'ఇది శుభవార్త.. ఇదే కొనసాగుతుందని ఆశిస్తున్నా' అంటూ ట్రంప్ గురువారం వ్యాఖ్యలు చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిరసనకారుల మరణశిక్షలను నిలిపివేసినందుకు ఇరాన్‌కు ట్రంప్ కృతజ్ఞతలు తెలపడం గమనార్హం.

అన్ని ఐచ్ఛికాలనూ పరిశీలిస్తున్నారు: శ్వేతసౌధం

ఇరాన్‌పై దాడులు చేయబోమని ట్రంప్ అధికారికంగా ఏమీ ప్రకటించలేదు. కాబట్టి ఇప్పటికీ ఆ దేశంపై సైనిక చర్యకు అవకాశాలు ఉన్నాయని, తమ అధ్యక్షుడు అన్ని ఐచ్ఛికాలనూ పరిశీలిస్తున్నారని శ్వేతసౌధం తెలిపింది.

30న జల వివాదాల కమిటీ తొలి భేటీ

ఈనాడు, అమరావతి: రెండు తెలుగు రాష్ట్రాల జల వివాదాలను పరిష్కరించేందుకు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన కమిటీ ఈ నెల 30న తొలిసారి సమావేశం కానుంది. ఈ మేరకు సభ్యులందరికీ కేంద్ర జల సంఘం సమాచారం అందజేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు దిల్లీలో జులైలో సమావేశమైనప్పుడు ఉభయ రాష్ట్రాల మధ్య నెలకొన్న జలవివాదాలు పరిష్కారానికి ఒక కమిటీని వేయాలని నిర్ణయించడంతో ఈ నెల మొదటి వారంలో కమిటీ ఏర్పాటైంది. కేంద్ర జలసంఘం ఛైర్మన్ నేతృత్వంలో ఉభయ రాష్ట్రాలకూ చెందిన అధికారులు, కృష్ణా, గోదావరి బోర్డుల ఛైర్మన్లు సహా మొత్తం 12 మందితో ఈ కమిటీ ఏర్పాటైంది. గోదావరి వరద జలాలను వినియోగించుకుంటూ, దిగువ రాష్ట్రంగా మిగులు జలాలపై ఉన్న హక్కును సద్వినియోగం చేసుకుంటూ ఆంధ్రప్రదేశ్ పోలవరం, నల్లమలసాగర్ అనుసంధాన ప్రాజెక్టు చేపట్టేందుకు అడుగులు వేస్తున్న తరుణంలో వివాదాలు తలెత్తాయి. తెలంగాణ కూడా ఎలాంటి డీపీఆర్‌లూ సమర్పించకపోవడంతోపాటు, ఎపెక్స్ కౌన్సిల్ అనుమతి లేకుండా అనేక ప్రాజెక్టులు చేపట్టడం, కొత్త ప్రాజెక్టులకు డీపీఆర్‌లు సిద్ధం చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో తొలి భేటీకి రంగం సిద్ధమయింది. దిల్లీలోని సేవాభవన్ వేదికగా ఈ సమావేశం జరగనుంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో నీటి నిర్వహణకు సంబంధించిన ముఖ్యాంశాలు సమావేశంలో చర్చిస్తారు.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ

e-Tender Notification

PSO(C)II/33/WATER BOTTLES/2025-26 Dt:17.01.2026

టి.జి.యస్.ఆర్.టి.సి ఈ క్రింది టెండర్ నోటిఫికేషన్ ద్వారా 1) ఐఎస్ స్పెసిఫికేషన్ సం.14543:2024 ప్రమాణాల ప్రకారం 500 మి.లీ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ బాటిళ్ళ సరఫరా - ఇవి టీజీఎస్ఆర్టీసీ జోనల్ స్టోర్స్, హైదరాబాద్ మరియు కరీంనగర్‌కు సరఫరా చేయవలెను.

POC1/13/RC TYRES/2025-26 Dt:17.01.2026

టి.జి.యస్.ఆర్.టి.సి ఈ క్రింది టెండర్ నోటిఫికేషన్ ద్వారా 2) టెండర్ షరతుల ప్రకారం 10.00 R20 సైజు ప్రాసెస్ ఆర్‌సీ టైర్లను కోల్డ్ ప్రాసెస్ విధానంలో సరఫరా చేయుట - ఇవి టీజీఎస్ఆర్టీసీ జోనల్ స్టోర్స్, కరీంనగర్‌కు సరఫరా చేయవలెను. ఆసక్తిగల తయారీదారుల నుండి ఆన్‌లైన్ విధానంలో టెండర్లు కోరుచున్నది. మరిన్ని వివరాల కొరకు మా వెబ్‌సైట్ **https://tender.telangana.gov.in or www.tgsrtc.telangana.gov.in** చూడగలరు.

సం/- చీఫ్ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్

DIPR R.O.No.13799-PP/CL/ADVT/1/2025-26, Dt: 16.01.2026

ఏడాదిలో భూ సమస్యల్లేని రాష్ట్రం

(మొదటి పేజీ తరువాయి)

పెంచుకున్నప్పుడే సమసమాజం సాధ్యమవుతుంది. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీని నిర్మించేందుకు.. ప్రభుత్వం, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం (పీ-4) విధానం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నాం. పేదరికం నుంచి బయటపడి ఉన్నత స్థాయికి వెళ్లిన వారు తమ ఊళ్లను, పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలి. ఇప్పటికే 10 లక్షల కుటుంబాలను పీ-4 ద్వారా దత్తత తీసుకున్నారు. మేనేజ్‌మెంట్ స్కిల్స్ నేర్పించి, వారి ఆదాయం పెంచేలా తీర్చిదిద్దాలి.



నారావారిపల్లెలోని నివాసంలో మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో బొజ్జల సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, అమరనాథరెడ్డి, దగ్గుమళ్ల ప్రసాద్, గాలి భానుప్రకాశ్, పణ్యంరెడ్డి

పాల దిగుబడి పెంపు..

వ్యవసాయ అనుబంధ రంగమైన పాడి పరిశ్రమలో టెక్నాలజీ వాడకం వల్ల అద్భుత ఫలితాలు వస్తున్నాయి. కృత్రిమ గర్భధారణ ప్రక్రియలో సరికొత్త ప్రయోగాలు చేశాం. దీనివల్ల పశువుల సంఖ్య వృద్ధి చెందడమే కాకుండా పాల దిగుబడి గణనీయంగా పెరిగింది. గతంలో సగటున 5.7 లీటర్లు ఉన్న దిగుబడి, ఇప్పుడు 8.8 లీటర్లకు పెరిగింది. అంటే ఉత్పాదకత 33 శాతానికి పైగా పెరిగింది. వ్యవసాయంలోనే కాదు, పాడి పరిశ్రమలోనూ డ్రోన్లను వాడుతున్నాం. ఇది పనిని సులభతరం చేయడమే కాకుండా కచ్చితమైన ఫలితాలను ఇస్తోంది.

భూగర్భ జలాల్లో 'ప్లస్ 3' లక్ష్యం

వర్షాకాలం ముగిసే సమయానికి రాష్ట్రంలోని భూగర్భ జలమట్టం భూమికి 3 మీటర్ల లోపలే ఉండాలన్నది లక్ష్యం. భూగర్భ జలాలు గరిష్ఠంగా మైనస్ 8 మీటర్ల కంటే తక్కువకు వెళ్లకుండా అధికారులు చూడాలి. కృష్ణా జలాలను రాయలసీమకు తరలించి, హంద్రీనీవా ద్వారా చిత్తూరు జిల్లాలోని చెరువులను నింపుతాం. హంద్రీనీవా, గండికోట, కండలేరు వంటి ప్రాజెక్టుల ద్వారా నీటిని తరలించి, చిత్తూరు జిల్లాలోని జలాశయాలను నింపుతాం.

ముఖ్యాంశాలు ఇవి..

✦ సౌర విద్యుత్ ఉత్పత్తి, బ్యాటరీ స్టోరేజీ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నాం.

✦ రసాయనాల్లేని సాగును ప్రోత్సహిస్తున్నాం. పంటలకు జియో ట్యాగింగ్, సర్టిఫికేషన్ ఇస్తాం.

✦ రూ. పది వేల కోట్లతో రోడ్లను నిర్మిస్తున్నాం.

మన సంస్కృతే మన గుర్తింపు

✦ పండగ అంటే కేవలం ఆటపాటలే కాదు. మనతో పుట్టిన వాళ్లు, ఊర్లో ఉన్న బంధుమిత్రులు ఎలా ఉన్నారో చూసి, తోచిన సాయం చేయడం.

✦ మనం ఎక్కడి నుంచి వచ్చామో ఆ మూలాలను ఎప్పుడూ మరవకూడదు. అందుకే 17 ఏళ్ల క్రితం నా భార్య భువనేశ్వరి తీసుకున్న నిర్ణయం మేరకు ఏటా సంక్రాంతికి మా కుటుంబం అంతా సొంతూరికి వచ్చి పండగ చేసుకుంటున్నాం" అని సీఎం వివరించారు.



నారావారిపల్లెలో గ్రామదేవత నాగాలమ్మకు పూజలు చేస్తున్న సీఎం చంద్రబాబు దంపతులు. చిత్రంలో నారా, నందమూరి కుటుంబ సభ్యులు

వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తిరుపతి

'తిరుపతిని ప్రముఖ వెడ్డింగ్ డెస్టినేషన్ హబ్‌గా మారుస్తాం. వేంకటేశ్వరస్వామి సన్నిధిలో పెళ్లి చేసుకోవడానికి మించిన భాగ్యం ఉండదు. తిరుపతి సిటీ ఆఫ్ టెంపుల్స్, విజయవాడ సిటీ ఆఫ్ కెనాల్స్, విశాఖ సిటీ ఆఫ్ బీచెస్.. ఈ మూడు నగరాలను మెగాసిటీలుగా అభివృద్ధి చేస్తాం' అని సీఎం అన్నారు.

సొంతూరి రుణం తీర్చుకుంటా..

'నేను పుట్టినగడ్డ రుణం తీర్చుకునేందుకు స్వర్ణ నారావారిపల్లె లక్ష్యంతో పనిచేస్తున్నాం. గ్రామాల్లో చెత్తను సేకరించడం ఇప్పటికే 100% పూర్తి చేశాం. తడి చెత్త నుంచి నాణ్యమైన ఎరువు తయారు చేస్తాం. పొడి చెత్తలో 50 శాతాన్ని పునర్వినియోగం చేస్తాం. తద్వారా సంపదను తిరిగి సృష్టిస్తాం. మిగిలిన చెత్తను పర్యావరణానికి హాని కలగకుండా పవర్ జనరేషన్ కోసం ఉపయోగిస్తాం. డ్రైనేజీ నుంచి వచ్చే లిక్విడ్ వేస్ట్‌ను కూడా శాస్త్రీయంగా శుద్ధి చేస్తాం. ఇంటింటికీ కుళాయి ద్వారా నీరు అందిస్తాం. సిమెంట్ రోడ్లు, హైవే కనెక్టివిటీతో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం' అని సీఎం పేర్కొన్నారు.

జనాభా తగ్గుదలపై ఆందోళన..

జనాభా తగ్గుదలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మానవ వనరుల కొరత ఏర్పడకుండా ఉండేందుకు 'పాపులేషన్ మేనేజ్‌మెంట్'పై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని వెల్లడించారు. 'యువ జంటలు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి? సంతానం విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారు? అనే అంశాలపై మేం అధ్యయనం చేస్తున్నాం. యువతను ప్రోత్సహించేలా త్వరలో కీలక నిర్ణయాలు తీసుకుంటాం. తిరుపతికి వచ్చే భక్తులు హోటళ్లకే పరిమితం కాకుండా, గ్రామీణ వాతావరణాన్ని ఆస్వాదించేలా 'హోమ్ స్టే' విధానాన్ని తీసుకువస్తున్నాం. స్థానికులు తమ ఇళ్లలో పర్యాటకులకు వసతి కల్పించేలా ప్రోత్సహిస్తాం' అని ఆయన తెలిపారు.

ఏఐ డాక్టర్లు.. హెల్త్ స్కోర్

"రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా చేపట్టిన 'సంజీవని' ప్రాజెక్టు రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేస్తుంది. బిల్‌గేట్స్ ఫౌండేషన్ సహకారంతో అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నాం. వ్యాధి రాకముందే నిర్ధారించడం, రియల్ టైమ్ మానిటరింగ్, తక్కువ ఖర్చులో వైద్యం అనే మూడు సూత్రాల లక్ష్యంతో దీన్ని రూపొందించాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో పనిచేసే డాక్టర్లు, న్యూట్రిషన్ సలహాలు, చికిత్స అన్నీ ఒకే వేదికపైకి వస్తాయి. సిబిల్ స్కోర్ తరహాలో ప్రతి పౌరుడికీ వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి 'హెల్త్ స్కోర్' కేటాయిస్తాం. ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకునే వెసులుబాటు కల్పిస్తాం. అనారోగ్య ముప్పు ఉన్నవారికి ప్రతి మూడు నెలలకు ఒకసారి, సాధారణ ప్రజలకు ఏడాదికి ఒకసారి సమగ్ర పరీక్షలు చేస్తాం. వ్యాధి ముదరకముందే గుర్తించి చికిత్స అందించడమే దీని ఉద్దేశం. ఇది కుప్పంలో ఇప్పటికే విజయవంతమైంది. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో అమలు చేస్తున్నాం. 2026 నాటికి రాష్ట్రవ్యాప్తంగా దీన్ని విస్తరించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను సాకారం చేస్తాం" అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

పాడేరు గిరుల్లో కాఫీ సిరులు

(మొదటి పేజీ తరువాయి)

అనుసంధానించనున్నారు. కేంద్రం ఇప్పటికే రూ. కోటి మంజూరు చేసింది. ఈ ఏడాది ఇప్పటికే 30 వేల ఎకరాల్లో షేడ్ ప్లాంటేషన్‌ను చేపట్టారు.

ఏటా 15 వేల ఎకరాల్లో పంట పునరుద్ధరణ..

పాడేరు ఏజెన్సీ పరిధిలో రానున్న ఐదేళ్లలో 75 వేల ఎకరాల్లో కాఫీ పంటను పునరుద్ధరించాల్సిన అవసరముందని అధికారులు గుర్తించారు. ఉత్పత్తి తగ్గి ఆదాయం పడిపోయిన రైతుల పొలాల్లో పునరుద్ధరణ చర్యలు చేపడతారు. ఏటా 15 వేల ఎకరాల్లో పునరుద్ధరణ చేపట్టేలా అధికారులకు ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది.

ఒక్కో రైతుకు 5 ఎకరాల వరకు పరిమితి

కాఫీ పంటను సాగు చేసేందుకు మొగ్గు చూపిన రైతులకు ఎకరాకు 1000 మొక్కల్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. ఒక్కో రైతు ఎకరం నుంచి గరిష్ఠంగా 5 ఎకరాలు సాగు చేసేందుకు సహకారం అందించనుంది. మొక్కలు నాటిన ఏడేళ్లకు కాఫీ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఎకరాకు రూ. 25 వేల వరకు ఆదాయం ఉండనుంది. 40-50 ఏళ్ల పాటు స్థిరంగా ఉత్పత్తి ఉండనుంది.

✦ కాఫీలో అంతర పంటలు కూడా సాగు చేయొచ్చు. మిరియాల సాగును ప్రోత్సహించేందుకు ఎకరాకు 100-200 మొక్కల్ని ప్రభుత్వం ఉచితంగా ఇస్తుంది. ఏడేళ్లకు దీని ఉత్పత్తి ప్రారంభమవుతుంది. తర్వాత ఎకరాకు రూ. 30 వేల వరకు ఆదాయం వస్తుంది.

ఏడాది	కాఫీ సాగు విస్తరణ లక్ష్యం
2026-27	10,000
2027-28	10,000
2028-29	20,000
2029-30	30,000
2030-31	30,000

✦ కాఫీ సాగుకు సరిపడా నీడ లేని రైతుల పొలాల్లో ముందుగా సిల్వర్ ఓక్, మామిడి, నేరేడు, పనస మొక్కల్ని నాటుతారు. వీటిని ఎకరాకు 1000 మొక్కల చొప్పున ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. ఇవి మూడేళ్లలో ఐదు నుంచి ఆరు అడుగుల ఎత్తు పెరుగుతాయి. తర్వాత వాటి నీడలో కాఫీ మొక్కల్ని పెంచుతారు. ఏపుగా పెరిగిన సిల్వర్ ఓక్ ఆసరాగా మిరియాలను అంతర పంటగా సాగు చేయవచ్చు.

రెండు కాఫీ ఎకో పల్పింగ్ యూనిట్లు..

కాఫీ రైతులకు అండగా నిలిచేందుకు రూ.7 కోట్ల వ్యయంతో జీకే వీధి, జి.మాడుగులలో రెండు ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్లను అందుబాటులోకి తీసుకొస్తారు. రైతులకు అల్యూమినియం నిచ్చెనలు, బేబీ పల్పర్స్, టార్పాలిన్లు ఇస్తారు. ఇదే కాకుండా గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో మాకవరపాలెంలో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు.

రూ.18వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు

(మొదటి పేజీ తరువాయి)

స్టోరేజి, పోర్టు సేవల ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సంస్థ ప్రతిపాదనల్లో పేర్కొంది. జర్మనీకి చెందిన యూనిపర్‌కు ఈ గ్రీన్ అమ్మోనియాను ఎగుమతి చేస్తారు. మలేసియాకు చెందిన పెట్రోనాస్, సింగపూర్‌లోని జీఐసీ, యూఏఈకి చెందిన ఏడీఏఐ వంటి సంస్థల సహకారంతో ప్రాజెక్టును ఏర్పాటుచేస్తున్నారు.

అతి పెద్ద గ్రీన్ అమ్మోనియా కాంప్లెక్స్

కాకినాడలో ఏర్పాటుచేసే గ్రీన్ అమ్మోనియా కాంప్లెక్స్ ద్వారా ఏటా 1.5 మిలియన్ టన్నుల (ఎంఎంటీపీఏ) గ్రీన్ అమ్మోనియా, 1,950 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్‌ను సంస్థ ఉత్పత్తి చేయనుంది. ఇది దేశంలోనే అతి పెద్ద గ్రీన్ అమ్మోనియా కాంప్లెక్స్ అవుతుందని ప్రభుత్వం పేర్కొంటోంది. 2028 నాటికి 0.5 ఎంఎంటీపీఏ, 2030 నాటికి మరో 1.0 ఎంఎంటీపీఏ గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకునేలా సంస్థ ప్రతిపాదనలు రూపొందించింది. 495 ఎకరాల్లో ప్లాంట్‌ను సంస్థ ఏర్పాటుచేస్తోంది.

హరిత ఇంధన రంగంలో సౌదీలా.. ఆంధ్రప్రదేశ్: మంత్రి లోకేశ్



'భవిష్యత్తులో హరిత ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ సౌదీ అరేబియాలాగే తయారవుతుంది. కాకినాడ నుంచి జర్మనీ, సింగపూర్, జపాన్ దేశాలకు హరిత ఇంధనాన్ని ఎగుమతి చేయనుంది' అని మంత్రి లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఏఎం గ్రీన్ సంస్థ భారీ పెట్టుబడి పెడుతోందంటూ బ్రోచర్‌ను ట్యాగ్ చేశారు.



రంకెలేసిన పశువులు దుమ్మురేగిన వీధులు

తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం పుల్లయ్యగారిపల్లిలో పశువుల పండగను తిలకించేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఏటా రంగంపేటలో ఈ పండగ నిర్వహిస్తుండగా.. అనివార్య కారణాల వల్ల వేదికను పుల్లయ్యగారిపల్లికి మార్చారు. కొమ్ములకు పలకలతో పశువులు పరుగులీయగా.. ఆ పలకలను చేజిక్కించుకునేందుకు యువత పోటీపడింది. ఈ క్రమంలో ముగ్గురు యువకులు, ఒక మహిళ గాయపడ్డారు. - న్యూస్‌టుడే, చంద్రగిరి గ్రామీణ



ఎద్దులపై పట్టు.. అదే జల్లికట్టు!

తమిళనాడులోని మదురై జిల్లా పాలమేడులో జల్లికట్టు పోటీలు శుక్రవారం సందడిగా ప్రారంభమయ్యాయి. ఎద్దులను లొంగదీసేందుకు క్రీడాకారులు ఉత్సాహంగా ప్రయత్నించారు. పోటీలను తిలకించేందుకు పెద్దఎత్తున ప్రజలు, పలువురు సినీ నటులు తరలివచ్చారు.

- చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే

యూనిట్ విద్యుత్‌కు ₹1.19 తగ్గింపు!

(మొదటి పేజీ తరువాయి)

పెంచుకుంటూ, అనవసర ఖర్చులు తగ్గించుకుంటోంది. ప్రస్తుతం విద్యుత్ సంస్థల నష్టాలు 10.2 శాతంగా ఉన్నాయి. ఒక్క శాతం నష్టాలు తగ్గినా, కొనుగోళ్లలో రూ.1,000 కోట్లు ఆదా అవుతుందని అంచనా. పంపిణీ నష్టాలను అధిగమించడం ద్వారా 2026-27లో యూనిట్‌కు కనీసం 30 పైసలు తగ్గించాలన్నది ఇంధన శాఖ లక్ష్యం. ఇదే తరహాలో ఏటా యూనిట్‌పై 20 పైసలు తగ్గించేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నారు.

అందుబాటులోకి వస్తున్న థర్మల్ కేంద్రాలు

జెన్‌కో థర్మల్ కేంద్రాలను పూర్తి సామర్థ్యం మేర నడపాలని అధికారులు యోచిస్తున్నారు. ప్రస్తుతం రోజువారీ డిమాండ్‌లో జెన్‌కో నుంచి 45-48% మాత్రమే విద్యుత్ వస్తోంది. అదే కనీసం 5,800 గ్రాస్ కెలోరిఫిక్ వాల్యూ ఉన్న నాణ్యమైన బొగ్గును వాడితే థర్మల్ కేంద్రాల ద్వారా 80% విద్యుత్ ఉత్పత్తి వస్తుంది. ఇక్కడ అదనంగా వస్తే, ఆ మేరకు బహిరంగ మార్కెట్‌లో కొనుగోళ్లు తగ్గించుకోవచ్చు. మొత్తంగా జెన్‌కో థర్మల్ కేంద్రాల్లో ఉత్పాదక సామర్థ్యం 85 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

✦ విజయవాడ వీటీపీఎస్‌లో 800, కృష్ణపట్నంలో 800 మెగావాట్ల పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేశారు. దీనివల్ల 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ అందుబాటులోకి వచ్చింది.

✦ 625 మెగావాట్ల విద్యుత్ తీసుకునేలా సెంబ్‌కార్ప్‌తో డిస్కంలు ఒప్పందం చేసుకున్నాయి. గతేడాది మార్చి నుంచే ఇది అమలవుతోంది.

✦ హిందుజా థర్మల్ కేంద్రంలో 540 మెగావాట్ల రెండో యూనిట్ అందుబాటులోకి వచ్చింది. ఇక్కడి రెండు యూనిట్ల నుంచి 1,080 మెగావాట్ల థర్మల్ విద్యుత్ వస్తోంది.

✦ పీక్ డిమాండ్ వేళ ఇతర రాష్ట్రాల నుంచి స్వాపింగ్ విధానంలో 700 మెగావాట్ల విద్యుత్‌ను డిస్కంలు తీసుకుంటున్నాయి. తద్వారా అధిక ధరకు కొనుగోళ్లను నియంత్రించడం సాధ్యమైంది.

పీక్ డిమాండ్‌లో ఆదుకునేందుకు..

ఒక్కోసారి పీక్ డిమాండ్ వేళల్లో అవసరాన్ని బట్టి డిస్కంలు యూనిట్ విద్యుత్‌ను రూ.15కు కొంటున్నాయి. ఆ సమయంలో సొంత ప్లాంట్లలో విద్యుత్ అందుబాటులో ఉంటే, కొనుగోలు వ్యయం బాగా తగ్గించవచ్చు.

✦ వచ్చే ఏడాదిలోగా.. రెండు విడతల్లో 3 వేల మెగావాట్ అవర్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నాయి. వీటికి ఇంధన శాఖ ఇప్పటికే టెండర్లు పిలిచింది. ఇవి సాకారమైతే ఉదయం, సాయంత్రం పీక్ డిమాండ్ వేళల్లో విద్యుత్ లభ్యత పెరుగుతుంది.

✦ ఎగువ సీలేరులో ప్రతిపాదించిన పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టు మూణ్నాలుగేళ్లలో అందుబాటులోకి రానుంది. దీనిద్వారా పీక్ డిమాండ్ వేళ 1,350 మెగావాట్ల విద్యుత్ డిస్కంలకు అందనుంది. పగటి వేళ సుమారు 1,500 మెగావాట్ల సౌర విద్యుత్ మిగులు ఉంటోంది. దీన్ని బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టుకు వినియోగించనున్నారు.

మిగులు విద్యుత్ వాడుకునేలా ప్రణాళిక

–కె.విజయానంద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ ప్రాజెక్టుల ద్వారా మరో 4 వేల మెగావాట్ల విద్యుత్ రెండు మూడేళ్లలో అందుబాటులోకి వస్తుందని అంచనా. అప్పటికల్లా పీఎస్‌పీ, బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తాయి. మిగులు విద్యుత్‌ను స్టోరేజ్ ప్రాజెక్టులకు వినియోగించడం ద్వారా.. పీక్ డిమాండ్ వేళల్లో తక్కువ ధరకే విద్యుత్ అందుబాటులో ఉంటుంది.

కటాఫ్ కంటే ఎక్కువ మార్కులు సాధిస్తే ఓపెన్ కేటగిరీగా పరిగణించాలి

సుప్రీంకోర్టు స్పష్టీకరణ



దిల్లీ: రిజర్వుడు కేటగిరీ అభ్యర్థులు జనరల్ కేటగిరీ కటాఫ్ కన్నా ఎక్కువ మార్కులు సాధించినప్పుడు వారిని ఓపెన్ కేటగిరీ కిందే సర్దుబాటు చేయాలని సుప్రీంకోర్టు శుక్రవారం స్పష్టంచేసింది. ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించి రిజర్వేషన్లకు అర్హమైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన అభ్యర్థులు జనరల్ కేటగిరీ కటాఫ్ మార్కుల కన్నా ఎక్కువ మార్కులు సాధించినప్పుడు వారిని ఓపెన్ లేదా రిజర్వేషన్ లేని కేటగిరీకి చెందినవారిగా పరిగణించాలన్న ప్రముఖ న్యాయసూత్రాన్ని ఈ సందర్భంగా జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మల ధర్మాసనం ప్రస్తావించింది. జనరల్ కేటగిరీకి చెందిన వారికన్నా ఎక్కువ మార్కులు పొందిన రిజర్వుడు వర్గానికి చెందిన అభ్యర్థిని కాదని ఓపెన్ కేటగిరీలో రిజర్వేషన్ లేని అభ్యర్థికి ఉద్యోగం ఇవ్వండంటూ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకి 2020లో కేరళ హైకోర్టు జారీ చేసిన ఆదేశాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. "రిజర్వేషన్‌లేని ఓపెన్ కేటగిరీ అన్నది రిజర్వేషన్ వర్తించని వర్గాల కోసం ఏర్పాటు చేసిన కోటా కాదు. అది ప్రతిభ మాత్రమే ప్రాతిపదికగా ఉన్న అభ్యర్థుల సమూహం" అని జస్టిస్ శర్మ అన్నారు. ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల్ని రిజర్వు కేటగిరీ నుంచి అన్ రిజర్వు కేటగిరీకి బదిలీ చేయడం రాజ్యాంగంలోని 14వ అధికరణం (చట్టం ముందు అందరూ సమానమే), 16వ అధికరణం (ప్రభుత్వ ఉద్యోగావకాశాల్లో అందరికీ సమానత్వం) కింద అనివార్యమని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. వయోపరిమితి, ఫీజు రాయితీ వంటి ఎలాంటి మినహాయింపులు పొందాల్సిన అవసరం లేకుండా రిజర్వు కేటగిరీ అభ్యర్థి జనరల్ కేటగిరీ అభ్యర్థుల కన్నా మెరుగైన ప్రతిభ ప్రదర్శించినప్పుడు అతణ్ని ఓపెన్ కేటగిరీ అభ్యర్థిగా పరిగణించాలని స్పష్టం చేశారు.

వసుంధర

vasundhara@eenadu.in



గగనతలంలో విహరించాలన్నది ఆమె కల. వేల అడుగుల ఎత్తులో, వేగంగా దూసుకొచ్చే గాలి, పొంచి ఉన్న ప్రమాదాలు అన్నింటినీ అధిగమించి... స్కై డైవర్‌గా రాణిస్తున్నారు దివ్య సురేపల్లి. స్కై డైవింగ్‌లో లైసెన్సునూ పొందారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ ఘనతను సాధించిన తొలి మహిళ కూడా. ఆమె వసుంధరతో తన ప్రయాణాన్ని పంచుకున్నారిలా...

ఆకాశాన్ని జయించిన 'ఆమె' ధైర్యం!



దివ్య

మాది తెనాలి. ఐఐటీ రూర్కీలో బ్యాచిలర్స్, జర్మనీలో ఎంఎస్ పూర్తి చేశా. ప్రస్తుతం దిల్లీలో పర్యావరణ ఇంజినీరుగా పనిచేస్తున్నా. అమ్మ మేరీ సుజాత పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వశాఖలో పని చేశారు. నాకు చిన్నప్పటి నుంచి సాహసాలంటే ఇష్టం. సాహసక్రీడలు ప్రయత్నించడమే కాదు, బైక్ రైడింగ్, సర్ఫింగ్‌లనీ నేర్చుకున్నా. జర్మనీలో ఉన్నప్పుడు, ఓసారి హ్యూస్టన్ వెళ్లినప్పుడు స్కై డైవింగ్ చేయాలనుకున్నా. కానీ వాతావరణ ప్రతికూలతల వల్ల కుదరలేదు. అవకాశం కోసం వెతుకుతున్నప్పుడు... స్కై డైవర్ శ్వేతా పర్మార్ గురించి తెలిసింది. భారత్‌లో లైసెన్స్ పొందిన 4వ స్కై డైవర్ ఈమె. ఏటా ఆసక్తి ఉన్న వాళ్లని రష్యా తీసుకువెళ్తారని తెలిసింది. అక్కడ్నుంచి మొదలైంది స్కై డైవర్‌గా నా ప్రయాణం.

ప్రతి స్థాయికీ ఒక టాస్క్...

స్కై డైవింగ్ శిక్షణలో రెండు దశలు ఉంటాయి. లైసెన్స్ పొందాలంటే ఇవి పాస్ అవ్వాలి. మొదటిదాంట్లో 9 ఏఎఫ్‌ఎఫ్ (యాక్సిలరేటెడ్ ఫ్రీ ఫాల్), 5 సోలో జంప్స్ చేయాలి. సముద్రమట్టానికి పైన ఎగురుతూ... చూడగలరా? పారాచూట్ తెరవగలరా? హ్యాండిల్ చేయగలరా? మిడ్ ఎయిర్‌లో స్థిరంగా ఉండగల్గుతున్నారా? వంటివి చూస్తారు. ఇది రష్యాలో చేసి క్వాలిఫై అయ్యాను. దూకడమే కాదు, ప్రతి జంప్‌నకూ ఒక టాస్క్ పెడతారు. ఇదంతా శిక్షకుల పర్యవేక్షణలో జరుగుతుంది. తర్వాతి దశను థాయ్‌లాండ్‌లో నిర్వహిస్తారు. శిక్షకులు లేకుండా డైవర్ ఒక్కరే దీన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది.

క్షణాల్లో తప్పించుకున్నా...

మొదటి దశలో శిక్షకులు ఉన్నప్పుడు ధైర్యంగానే టాస్క్‌లు చేశా. తర్వాత ఒక్కదాన్నే 14వేల అడుగుల ఎత్తు నుంచి దూకాలంటే భయమేసింది. ఆ సమయంలో ఏం జరిగినా అంతా మీ బాధ్యతే అని ముందే చెప్పేస్తారు. దాంతో కాస్త భయం వేసినా... వెనకడుగు వేయకూడదని పూర్తిచేశా. ఈ క్రమంలో ఎదురైన పరీక్షలూ చాలానే! మాస్కోలో మిడ్ ఎయిర్‌లో స్టేబుల్‌గా ఉండాల్సిన సమయంలో స్పిన్ అయ్యాను. రెండో దశ దాటడం అంత సులువు కాదని అర్థమైంది. రెప్పపాటులో ఏమైనా జరగొచ్చని తెలిసిందీ అప్పుడే. ఇంకోసారి గాలుల దిశ ఒక్కసారిగా మారిపోయింది. ఎదురుగా ఉన్న రూఫ్‌పై పడి కాళ్లు, చేతులు విరగ్గొట్టుకోవాలా? పక్కనే పాములు, మొసళ్లతో ఉన్న చెరువులో దూకాలా? రెండే ఆప్షన్లు. అప్పుడు పారాచూట్‌ని దారిమళ్లించి చెట్ల కొమ్మల మీదుగా మెల్లగా ల్యాండ్ అయ్యాను. ఇంకోసారి విద్యుత్ స్తంభాలపై పడాల్సింది. దాన్నుంచీ తప్పించుకున్నా. అలా 15 సోలో జంప్స్ చేశా. ఎన్ని ప్రమాదాలు ఎదురవనీ... గగనతలంలో విహరిస్తూ, విన్యాసాలు చేస్తూ, నెమ్మదిగా కిందకి దిగుతోంటే కలిగే అనుభూతి మాటల్లో వర్ణించలేనిది. స్కై డైవింగ్ చేస్తున్నంత సేపూ స్వేచ్ఛగా, సంతోషంగా విహరిస్తున్నా అనిపిస్తుంది. కాబట్టే, నాకిలాంటి విన్యాసాల్ని ఇంకా ఇంకా చేయాలని కోరిక.

– యడ్లపాటి బసవ సురేంద్ర, విశాఖపట్నం

మీకు తెలుసా!



మనలో కొంతమందికి నమలడం, ముక్కు కారడం, కీబోర్డు టైపింగ్, పెన్ టాపింగ్... వంటి చిన్న శబ్దాలు కూడా కోపం, చిరాకు, ఆందోళనల్ని కలిగిస్తుంటాయి. దీన్నే 'మిసోఫోనియా' లేదా సెలెక్టివ్ సౌండ్ సెన్సిటివిటీ సిండ్రోమ్ అంటున్నారు శాస్త్రవేత్తలు. దీనికి కారణం మన మెదడులోని యాక్టివేషన్, ఎమోషనల్ పాటరన్ జోన్లు చిన్న శబ్దాలను కూడా త్వరగా గ్రహించి, వెంటనే స్పందించటం వల్ల ఇలా జరుగుతుందట. ఇది కౌమారదశ ప్రారంభంలో ఉన్నవారిలోనూ, స్త్రీలలోనూ ఎక్కువగా కనిపిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

కురులకేం కావాలి?



జుట్టు గడ్డిలా మారినా, ఊడుతోందన్నా... బోలెడు సలహాలు వచ్చేస్తాయి కదూ! ఒకరు ప్రొటీన్ అందట్లేదు అంటారు. మరొకరు లేదు లేదు తేమ సరిపోవట్లేదు అందుకే ఇలా అని చెబుతారు. ఇంతకీ కురులకేం కావాలి?

మన వెంట్రుకలు కెరటిన్ అనే ప్రొటీన్‌తోనే తయారవుతాయి. కాలుష్యం, వేసే రంగులు, స్టైలింగ్ అంతెందుకు, మనం దాన్ని గట్టిగా లాగడం వంటివి ఏం చేసినా ప్రభావం పడేది ఆ ప్రొటీన్ మీదే! కురులు ఊరికే తెగిపోతున్నా, మందం తగ్గినా ప్రొటీన్ తగ్గిందనే అర్థం.

కురులు మృదువుగా, మెత్తగా ఆరోగ్యంగా కనిపించాలంటే వాటికి తేమ తప్పనిసరి. పొడి వాతావరణం, తరచూ తలంటడం, రసాయనాలున్న షాంపూలు వాడటం... వంటివి సహజ నూనెల్ని తొలగించి జుట్టుని గడ్డిలా బరకగా మారుస్తాయి. అప్పుడు వాటి నిర్వహణా కష్టమే. మృదువుగా ఉంటే చిక్కులుండవు. దాంతో కుదుళ్లపై దుష్ప్రభావాలు ఉండవు. కొద్దిగా లాగినా ఊడి వస్తోంటే తేమ తగ్గిందనే!

ఆరోగ్యకరమైన జుట్టుకు ప్రొటీన్, తేమ రెండూ కావాలి. కాబట్టి, రెండూ దొరికేలా చూసుకోవాలి. అలాగే, పై పూతలకే పరిమితం కావొద్దు. కురుల నిర్వహణ దీర్ఘకాలం సాగే ప్రక్రియ. కాబట్టి, జాగ్రత్తగా కొనసాగించాలి. ఆహారం ద్వారానూ తగినంత ప్రొటీన్ అందేలా చూసుకోండి. మీ కురుల తీరుకు తగ్గ షాంపూ, కండిషనర్లు వాడండి.



అర్ధ చక్రాసన...

మ్యాట్‌పైన నిటారుగా నిల్చోండి, పాదాలను కలిపి ఉంచండి. చేతులు శరీరానికి ఇరుపక్కలా స్థిరంగా ఉంచి... శరీర బరువును రెండు పాదాలపై సమానంగా ఉండేలా సమతుల్యం చేసుకోండి. రెండు చేతులతో నడుముకు ఊతం ఇచ్చేలా పట్టుకోండి. ఇప్పుడు గాలి తీసుకొంటూ మెల్లగా వెనక్కి వంగి కటిని ముందుకు పెట్టండి. మోకాళ్ళను వంచకుండా ఛాతీని పైపైపుగా విస్తరిస్తూ తలను వెనక్కి వంచండి. సాధ్యమైనంత వరకు కళ్లను తెరచి ఉంచండి. ఈ స్థితిలో 5-10 సార్లు శ్వాస తీసుకోండి. ఆపైన నెమ్మదిగా గాలి వదులుతూ యథాస్థానానికి రండి. కాళ్లను వెడల్పు చేసి విశ్రాంతి పొందండి. పాదాలు దగ్గరగా పెట్టి చేయడం ఇబ్బందిగా ఉన్నా, తీవ్ర నడుము నొప్పి వచ్చినా వాటి మధ్య ఒక అడుగు దూరం పెట్టి సాధన చేయండి.

ఉపయోగాలు: ఉదర కండరాలను దృఢంగా, బిగుతుగా ఉంచుతుంది. పొట్టలోని భాగాలకు మంచి మసాజ్ జరుగుతుంది. కాళ్లు, పిక్కలు, నడుము కండరాలు దృఢంగా ఉంటాయి.

జాగ్రత్తలు: నడుము సర్జరీలు అయినవాళ్లు, తల తిరుగుడు సమస్య ఉన్నవాళ్లు చేయరాదు.

ఆహారం: పీచు పదార్థాలు, ప్రోబయాటిక్స్ లభ్యమయ్యే ఆహారాలు తీసుకోవాలి. ప్రొటీన్ లభ్యమయ్యే గుడ్లు, నట్స్ వంటివి తినాలి. ఉప్పు తగ్గించాలి. చక్కెరకు దూరంగా ఉండాలి.

- శిరీష, యోగ గురు

మన మేజర్‌కి... యూఎన్ అవార్డు!



స్వాతి

సాంకేతికత, ఆర్థిక అంశాల్లో దూసుకెళ్తున్న దేశాలే కాదు... దయనీయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నవీ చాలానే! అలాంటి వాటిల్లో దక్షిణ సూడాన్ ఒకటి. పేదరికం, వివక్ష, గృహహింస, లైంగిక వేధింపులు... వంటి ఎన్నింటికో మారుపేరు. అలాంటిచోట శాంతికోసం కృషి చేస్తున్నారు మేజర్ స్వాతి శాంతకుమార్. ఆ సేవలకు గుర్తింపుగా తాజాగా ప్రతిష్ఠాత్మక యూఎన్ సెక్రటరీ జనరల్స్ అవార్డునీ అందుకున్నారామె.

మేజర్ స్వాతిది బెంగళూరు. ముగ్గురు తోబుట్టువుల్లో ఆమె పెద్దది. చిన్నతనం నుంచి రక్షణ రంగంలోకి రావాలి, దేశ సేవ చేయాలని కలలు కన్నారు. అమ్మానాన్నలూ ప్రోత్సహించడంతో ఇంజినీరింగ్ పూర్తయ్యాక భారత సైన్యంలోకి అడుగుపెట్టారు స్వాతి. ఇండియన్ ఆర్మీలోని ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీర్స్ దళంలో సేవలందిస్తున్నారామె. యుద్ధం, తీవ్రవాదం, రాజకీయ పోరాటాలు, మహిళలపై హింస వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతిని నెలకొల్పేందుకు ఐక్యరాజ్య సమితి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుంది. ఇందుకోసం వివిధ దేశాలకు చెందిన సైనికులు, పోలీసు అధికారుల్ని శాంతి దూతలుగా సమస్య ఉన్న ప్రాంతాలకు పంపుతుంది. అలా ఐక్యరాజ్యసమితి శాంతిదూతగా ఎంపికయ్యారు మేజర్ స్వాతి. దక్షిణ సూడాన్‌లో 15 నెలలుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

తూర్పు ఆఫ్రికాలోని పేద దేశాల్లో దక్షిణ సూడాన్ ఒకటి. లింగవివక్ష, అమ్మాయిలు చదువుకు దూరమవ్వడం, బాల్యవివాహాలు, అత్యాచారాలు వంటివి ఎక్కువగా జరుగుతుంటాయక్కడ. అలాంటిచోట లింగ సమానత్వం, శాంతి నెలకొల్పే దిశగా కృషి చేస్తున్నారు స్వాతి. ఇందుకోసం 'ఈక్వల్ పార్ట్‌నర్స్, లాస్టింగ్ పీస్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి... తన బృందంతో అక్కడి ప్రాంతాల్లో గస్తీ, ఎయిర్ పెట్రోలింగ్ వంటివి నిర్వహిస్తున్నారు. ఈ చర్యల ద్వారా ఎంతోమంది మహిళలకి రక్షణను అందించడమే కాదు... లింగ సమానత్వం దిశగా అడుగులు పడేలానూ చూశారు స్వాతి. కాబట్టే, ఐక్యరాజ్యసమితి మెప్పును పొందడంతోపాటు 'యూఎన్ సెక్రటరీ జనరల్స్' అవార్డుకీ ఎంపికయ్యారామె. 'ఇక్కడి మహిళలు స్వతహాగానే శక్తిమంతులు. తమ ప్రాంతాల్ని పాలించగలిగే సమర్థత వారిలో ఉంది. కానీ పురుషాధిక్యత వాళ్లకి అడ్డుపడుతోంది. ఆ అణచివేతను తరమడమే నా లక్ష్యం' అంటున్నారు మేజర్ స్వాతి.

పుట్టింటికే మనసు పరుగు తీస్తుంది!



పండుగ సంబరం ముగిసింది. పల్లె వాకిళ్లన్నీ ఇంటి ఆడపిల్లను సాగనంపే హడావుడిలో ఉన్నాయి. ఇప్పటివరకూ ఆనందంతో వెలిగిపోయిన అమ్మాయి ముఖం మాత్రం కాస్త చిన్నబోయింది. అవును మరి... ఎన్నిసార్లు వచ్చి వెళ్లినా పుట్టింటి మీద మమకారం తీరదు కదా... అందుకే 'పుట్టింటికి రా చెల్లీ' అని అన్న పిలిచినా పిలవకున్నా అమ్మాయి మనసు పుట్టింటికే పరుగుతీస్తుంది. అందులోనూ పెద్ద పండుగ... సెలవులివ్వడం ఆలస్యం... కుటుంబసమేతంగా ప్రయాణం కట్టేయదూ.

అల్లుడుగారూ పిల్లలతో వచ్చిన కూతురుని చూడగానే ఆ నాన్న ముఖం మతాబులా వెలిగిపోతుంది. 'ఎంతయినా ఇంట్లో అమ్మాయి తిరుగుతుంటే ఆ కళే వేరు... నట్టింట్లో మహాలక్ష్మి తిరుగుతున్నట్లే ఉంది..' తన ఇంటి ఇల్లాలూ ఓ అమ్మాయేనన్న సంగతి మరిచి మరీ భార్యతో ఆ సంతోషాన్ని పంచుకుంటాడా వెర్రి తండ్రి.

తల్లి మాత్రం తక్కువా... అత్తమ్మా అంటూ వెనకే తిరుగుతూ కోడలు పిల్ల పనులన్నీ చక్కబెడుతున్నా కూతురిని చూడగానే మనసు పాలకుండలా పొంగిపోతుంది. ఏమైనా ఆడపిల్లకి పుట్టింట్లో ఉండే ఆ స్వేచ్ఛ, దర్జానే వేరు... ఎంతైనా ఆ ఇంటి రాజకుమారి కదా. అందుకే ఎప్పుడెప్పుడు పుట్టింట్లో వాలిపోదామా అనే చూస్తుంటుందా కూతురి మనసు. తల్లేమో ఒళ్లు హూనమైపోతున్నా అలసటని ఏమాత్రం కనిపించకుండా కూతురికీ మనవలకీ ఇష్టమైనవన్నీ కమ్మగా వండి పెడుతుంది. దాంతో నాలుగైదు రోజులకే పిసరంత ఒళ్లు చేస్తారంతా.

చిన్ననాటి స్నేహితులు, చుట్టాలతో పండుగ సంబరాలతో రోజులన్నీ క్షణాల్లా గడిచిపోతాయి. ఇక తిరిగెళ్లేరోజు చూడాలి. పొలంలో పండినవీ, పెరట్లో కాసినవీ... అంటూ కరివేపాకు నుంచి గుమ్మడికాయల వరకూ తెంచుకొచ్చి ప్యాక్ చేసేస్తాడా నాన్న. చిన్నపిల్లకి గడ్డపెరుగిష్టం, పెద్దపిల్లకి జున్నుపాలిష్టం, అల్లుడుగారు జంతికలు తినరు కదా, అందుకే ఈ కారప్పూస, వెళ్లగానే ఆఫీసుకెళ్లే హడావుడిలో ఏం చేసుకుంటావంటూ పెరుగావడలూ... అమ్మ సర్దే లిస్టు చివరి క్షణం వరకూ పెరుగుతూనే ఉంటుంది. బ్యాగులూ సూట్‌కేసులకి తోడు మరో ఐదారు బిగ్‌షాపర్లయినా నిండిపోతాయి. ఇంతా చేసి కారో బస్సో ఎక్కేసరికి రాగం విప్పుతారు పిల్లకాయలు... ఏదో సముద్రాలు దాటెళుతున్నట్లే... ఏళ్ల తరబడి రానట్లే... మూణెల్లలో వేసవి సెలవులొస్తాయని తెలిసినా... వెక్కివెక్కి ఏడుపులు, ధారలు కట్టిన కన్నీళ్లు... ఆమె కంటా కన్నీటి చెమ్మ. మొత్తానికి భారమైన హృదయాలతో వీడ్కోలు ప్రహసనం పూర్తవుతుంది.

మళ్లీ అమ్మాయెప్పుడొస్తుందానీ అమ్మానాన్నలూ వాళ్లనెప్పుడు చూడాలో అనుకుంటూ అమ్మాయిలూ పనిలో పడతారు. ఈమధ్యలో అరచేతిలో బ్రహ్మాండం ఉండనే ఉంది. రోజూ వీడియో ముచ్చట్లు ఉంటాయి. అయినా పుట్టింటికెళ్లిన ఫీలే వేరు. ఫోన్‌లో ఎన్ని మాట్లాడినా అమ్మ ఒడిలో తలపెట్టుకుని కబుర్లు చెబితే కలిగే ఆనందమే ప్రత్యేకం. నాన్న చెప్పే చిన్ననాటి ముచ్చట్లు వింటూ ఏపనీ లేకుండానే ఊహల్లో తేలిపోవచ్చు. అన్నింటికన్నా పాత ఆల్బమ్‌లు తిరగేస్తూ అమ్మ చెప్పే కబుర్లు ఎన్నిసార్లు విన్నా ఆ ఇంటి యువరాణికి బోరనిపించదు. అందుకే గుండెలనిండా ఆ జ్ఞాపకాల్ని నింపుకొని తిరిగొచ్చేశాం అని ఫీలవ్వకుండా వచ్చే పండుగకోసం ఎదురుచూస్తుంటుంది. పండుగొచ్చినా వేడుకొచ్చినా... ఆడబిడ్డ మనసు పుట్టింటికే పరుగుతీస్తుంది... ఎన్ని సంక్రాంతులొచ్చి వెళ్లినా... ఎప్పటికీ మారని సంప్రదాయమిది!

నా అనుభవం

ప్రతి సవాల్‌నీ తీసుకున్నా...

నా కెరియర్ ప్రారంభించినప్పటితో పోలిస్తే మహిళలకు ఇప్పుడు అవకాశాలు ఎక్కువే ఉన్నాయి. మా నాన్నలా బ్రూ మాస్టర్ కావాలని అనుకున్నా. ఆస్ట్రేలియాలో చదివి భారతదేశంలో మొదటి మహిళా బ్రూ మాస్టర్‌గా మారా. కానీ, ఇక్కడ ఇండస్ట్రీ పూర్తిగా పురుషుల ఆధిపత్యంలో ఉండటంతో ఎక్కడా ఉద్యోగం రాలేదు. ఈ తిరస్కారమే నన్ను ఆంత్రప్రెన్యూర్‌షిప్ వైపు నడిపించింది. రుణం అడిగితే బ్యాంకులు నేను మహిళను అవడం వల్ల గ్యారెంటర్ కావాలన్నారు. ఆడపిల్ల నడిపే కొత్త సంస్థలో జాబ్ సెక్యూరిటీ ఉండదని ఉద్యోగులూ రాలేదు. ప్రతి ఛాలెంజ్‌నీ అవకాశంగా మార్చుకున్నా. నా సామర్థ్యాన్ని నిరూపించుకున్నా. మొదటి సంవత్సరంలోనే అమెరికా, యూరప్‌లకు ఎంజైమ్‌లు ఎగుమతి చేయగలిగా. అదీ భారత్ నుంచి మొదటి కంపెనీగా..! వైఫల్యాలకు భయపడి వెనకడుగు వేస్తే ఏమీ చేయలేం. ఆ ధైర్యమే నన్ను ఈ స్థాయికి చేర్చింది.



– కిరణ్ మజుందార్ షా,
ఫౌండర్, బయోకాన్ బయోలాజిక్స్ లిమిటెడ్

బంగారం - వెండి



16న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,43,400	1,31,850	3,06,000
విజయవాడ	1,41,435	1,31,450	2,87,000
ప్రొద్దుటూరు	1,43,300	1,31,840	2,81,000
రాజమహేంద్రవరం	1,43,400	1,31,450	3,06,000
విశాఖపట్నం	1,43,400	1,31,450	2,91,000
తమిళనాడు	-----	1,32,300	3,06,000

చినిగితే... ప్యాచ్ ఉందిగా!

ఎంతో ముచ్చటపడి కొనుక్కున్న డ్రెస్ పాడవ్వైనా, చినిగినా టైలర్ దగ్గరికి పరుగెత్తాల్సిందే! సమయముంటే సరే... లేకపోతే? అంతేనా, అది సరిగా కుదరకపోయినా, అతుకు అమరకపోయినా ఇంకో ఇబ్బంది. కొన్నిసార్లు పక్కన పడేయాల్సిందే. ఈ ఇబ్బందులన్నీ ఎందుకు? ప్యాచ్ వేయండి చాలు.

రంగులున్నాయ్!



కుర్చీలు, వాహనాలు... మన దుస్తులకు శత్రువులు ఒకటా రెండా. చిటికెలో రంధ్రం పడేలా చేస్తాయి. చిన్నవైతే దాచేయొచ్చు. కానీ పెద్దగా కనిపిస్తోంటే వేసుకోవడమూ కష్టమే. 'ఐరన్ ఆన్ ప్యాచ్'లు తెచ్చి ఉంచుకోండి. ఇవి అన్ని రకాల రంగుల్లో దొరుకుతాయి. తగిన రంగుది ఎంచుకుని చినిగిన ప్రదేశంలో ఉంచి, ఐరన్ చేయడమే. చక్కగా కలిసిపోతుంది. భిన్న రంగుది వేస్తే కాంట్రాస్ట్‌గానూ తోస్తుంది. కొన్ని కుట్టుకునే రకాలూ ఉన్నాయి. వాటిని తెచ్చుకున్నా సరే.



మడత పెట్టేయొచ్చు!

ప్యాంటో టాపో పొడవైంది. అదే వేసుకుని తీరాలి. అలాగని మడిచినా పిన్నీసులు పెట్టినా కుదరదు. కనిపించడమే కాదు... పదే పదే ఊడుతూ చిరాకు పెట్టిస్తాయి. అలాంటప్పుడు ఈ 'ఫ్యాబ్రిక్ ఫ్యూజింగ్ టేప్' ఉంటే సరి. చక్కగా వస్త్రం మీద పెట్టి మడిచేయండి. ఆపై దానిమీద ఇస్త్రీ పెట్టెతో ఐరన్ చేస్తే సరి. చక్కగా అతుక్కుంటుంది. చిన్న చినుగుళ్లని వదిలేయలేము, అలాగని కుట్టనూ లేము. అలాంటప్పుడూ ఇది పనికొస్తుంది.





అందంగా దాచేయొచ్చు

కుట్టండి లేదా ఐరన్ చేయండి... డ్రెస్‌లో ఏదో లోటు. అందంగా కనిపించట్లేదు అనిపిస్తోంది అంటారా? అయితే ఈ 'ఫ్లోరల్ ప్యాచెస్' ప్రయత్నించొచ్చు. సమస్య ఉన్న ప్రాంతంలో కుట్టొచ్చు లేదా వస్త్రం మీద ఉంచి, వెనకవైపుగా ఐరన్ అయినా చేయొచ్చు. లోపాన్ని అందంగా దాచేయొచ్చన్న మాట. సాదా దుస్తుల అందాన్ని పెంచాలన్నా వీటి సాయం తీసుకోవచ్చు. బాగున్నాయి కదూ! ఆన్‌లైన్‌లో దొరుకుతున్నాయి. కావాలంటే ప్రయత్నించండి.

జీవితాన్ని మలుపు తిప్పిన ఆట..!



మాయ

ఓనమాలు దిద్దాల్సిన వయసులో రాకెట్ పట్టుకుంది. పిల్లలంతా హోమ్ వర్క్‌లతో కుస్తీలు పడుతోంటే... మాయా రాజేశ్వరన్ రేవతి మాత్రం గ్రౌండ్‌లో సాధన మొదలుపెట్టింది. అదే ఆమెను అంతర్జాతీయ స్థాయికి చేరుకునేలా చేసింది.

తమిళనాడులోని కోయంబత్తూరు మాయది. మధ్యతరగతి కుటుంబం. నాన్న రాజేశ్వరన్, అమ్మ రేవతి. చిన్నప్పట్నుంచీ ఆటలంటే ఇష్టం మాయకు. ఆ మక్కువే ఆమెను టెన్నిస్ వైపు నడిపింది. ఎనిమిదేళ్లప్పుడే రాకెట్ పట్టుకుని ఆడటం మొదలుపెట్టింది. ఆమె ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు పదేళ్లకే ప్రొఫెషనల్ శిక్షణలో చేర్చారు. దాంతో తన వయసు పిల్లలంతా పుస్తకాలతో కుస్తీలు పడుతుంటే... మాయ మాత్రం టెన్నిస్‌లో రాణించడమే లక్ష్యంగా అడుగులు వేసింది. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పతకాలు గెలిచింది. పవర్‌తో కూడిన స్ట్రోక్స్, వేగవంతమైన ఫుట్‌వర్క్, ప్రతి పాయింట్‌నీ సాధించాలనే పట్టుదలే ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టింది. పైగా ఎంత ఒత్తిడున్నా ఏకాగ్రతను కోల్పోకుండా ఆడటంలో దిట్ట మాయ. పన్నెండేళ్లకే ఆటలో ఈమె చూపిస్తున్న పరిపక్వతకు ఫిదా అయింది స్పెయిన్‌లోని రఫెల్ నాదల్ అకాడమీ. తదుపరి శిక్షణకు ఆహ్వానం పంపింది. దాంతో పదమూడేళ్లకే శిక్షణ కోసం ఖండాలు దాటిందీమె.

అన్నీ పాఠాలే...

అది మొదలు ఎన్నో ఓపెన్స్‌లో తన సత్తా చాటింది. 'ఆటలో గెలుపోటములు సహజం. గెలిచినప్పుడు సంబరాల్లో మునిగిపోను, ఓడినప్పుడు దుఃఖంలో కూరుకుపోను. అంతర్జాతీయ స్థాయిలో ఆడటమే లక్ష్యంగా కొనసాగుతున్నా. ఈక్రమంలో వచ్చే విజయాపజయాలు నాకు పాఠాలు మాత్రమే' అంటోందీ 16ఏళ్ల అమ్మాయి. ఈ ఎనిమిదేళ్లలో ఈమె సాధించిన విజయాలెన్నో. పదమూడేళ్లకే అంతర్జాతీయ టెన్నిస్ ఫెడరేషన్ (ఐటీఎఫ్)లో టాప్60లో చోటు దక్కించుకున్న అతిపిన్న వయస్కురాలు మాయ. ఇటీవల విమెన్ టెన్నిస్ అసోసియేషన్ (డబ్ల్యూటీఏ)లోనూ తన స్థానాన్ని పదిలం చేసుకుంది. సానియా మీర్జా, రఫెల్ నాదల్ తనకు ఆదర్శమంటూ దూసుకుపోతున్న మాయ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని కోరుకుందామా!

మా విజయం మాట్లాడుతోంది.. ఎంతో బిగ్గరగా

జమ్మూకశ్మీర్ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు రెండు రోజుల క్రితం ప్రకటించిన 12వ తరగతి వార్షిక ఫలితాల్లో ఈసారి ఏడుగురు 'ప్రత్యేక' విద్యార్థులు అత్యధిక మార్కులతో మౌనచరిత్ర లిఖించారు. ఈ ఏడుగురు వినలేరు, మాట్లాడలేరు. శ్రీనగర్‌లోని అబేదానంద హోం హయ్యర్ సెకండరీ స్కూలులో చదువుతున్న ఈ ఏడుగురిలో తంజీలా 454 (500 మార్కులకు), ఆబిద్ 453, సీరత్ 450, మొహమ్మద్ ఉమైబ్ 434, తౌహీదా 415, బుర్హాన్ 418, ముస్కాన్ 419 మార్కులు సాధించారు. అబేదానంద హోం 83 ఏళ్ల చరిత్రలో దివ్యాంగ విద్యార్థులు మంచి మార్కులతో వంద శాతం విజయం సాధించటం ఇది రెండోసారి మాత్రమే అని ప్రిన్సిపల్ ముదస్సర్ అహ్మద్ సోఫి సంతోషం వ్యక్తం చేశారు. ఇటువంటి విద్యార్థులకు బోధించేందుకు ఈ స్కూలులో ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే, 12వ తరగతి తర్వాత వీరు చదువు కొనసాగించేందుకు రాష్ట్రంలో సదుపాయాలు లేవు.



ఈటీవీ భారత్

కదిలే కారులోకి దూకిన నీల్గాయ్..

- తల్లి ఒడిలోని చిన్నారి మృతి

గునా: మధ్యప్రదేశ్‌లోని గునా జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఓ కుటుంబం కారులో వెళ్తుండగా.. అడవి జంతువు నీల్గాయ్ ఉన్నట్టుండి కారులోకి దూసుకురావడంతో ముందు సీట్లో తల్లి ఒడిలో కూర్చున్న నాలుగేళ్ల చిన్నారి మృతి చెందింది. బుధవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గునా ప్రాంతానికి చెందిన సోను జాట్ అనే వ్యక్తి సంక్రాంతి పండగను జరుపుకోవడానికి తన భార్య, నాలుగేళ్ల కుమార్తె తాన్యతో కలిసి బుధవారం వారి స్వగ్రామానికి బయల్దేరాడు. బైపాస్‌లోని దోఖంబా ప్రాంతంలో వారు కారులో వెళ్తుండగా.. రెండు నీల్గాయ్‌లు అకస్మాత్తుగా రోడ్డు పైకి వచ్చాయి. సోను అప్రమత్తమయ్యేలోపు వాటిలో ఒకటి కారు అద్దం పగలగొట్టుకుని లోపలికి దూసుకువచ్చింది. దీంతో ముందు సీటులో తల్లి ఒడిలో కూర్చున్న నాలుగేళ్ల తాన్య తలకు నీల్గాయ్ కాళ్లు బలంగా తాకడంతో ఆ చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. కారులో చిక్కుకున్న నీల్గాయ్‌ని బయటకు తీసి, చికిత్స అందిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు.



నితిన్ నబీన్ పట్టాభిషేకానికి ముహూర్తం ఖరారు

ఈనాడు, దిల్లీ: భాజపా అధ్యక్షుడిగా బిహార్ నేత నితిన్ నబీన్ పట్టాభిషేకానికి ముహూర్తం ఖరారైంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను భాజపా సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంపీ కె.లక్ష్మణ్ శుక్రవారం విడుదల చేశారు. దీని ప్రకారం.. 19వ తేదీన నామినేషన్, 20న అధ్యక్ష ఎన్నిక ప్రకటన జరుగనున్నాయి. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డా పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో నితిన్ నబీన్‌ను ఎంపికచేసే కసరత్తులో భాగంగా భాజపా నాయకత్వం ఆయన్ను డిసెంబరు 14న కార్యనిర్వాహక అధ్యక్ష స్థానానికి ఎంపికచేసింది. తదుపరి అధ్యక్షుడు ఆయనే అని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు స్పష్టమైన సంకేతం ఇచ్చిన అనంతరం ఇప్పుడు ఆ క్రతువును అధికారికంగా పూర్తిచేసేందుకు ముహూర్తం ఖరారుచేసింది. దీంతో పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ముగింపుదశకు వచ్చినట్లేనని రిటర్నింగ్ అధికారి అయిన ఎంపీ కె.లక్ష్మణ్ ఈనాడు-ఈటీవీతో పేర్కొన్నారు. 'పార్టీలో ఇప్పటికే 14 కోట్ల మంది సభ్యులు, 12 లక్షలమంది క్రియాశీలక సభ్యుల నమోదు పూర్తయింది. 30 రాష్ట్రాల్లో అధ్యక్ష ఎన్నిక, బూత్, మండల, జిల్లా కమిటీల ఎన్నిక పూర్తి చేసుకొని ఇప్పుడు జాతీయ అధ్యక్షుడి ఎన్నిక షెడ్యూల్‌ను ప్రకటించాం. 19వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్యలో నామినేషన్ల ప్రక్రియ, 4-5గంటల మధ్యలో పరిశీలన, 5-6 గంటల మధ్య ఉపసంహరణ కార్యక్రమాలు ఉంటాయి. బరిలో ఎంతమంది నిలిచారన్నది అదేరోజు 6.30 గంటలకు వెల్లడిస్తాం. అధ్యక్షపదవికి నామినేషన్ వేసే అభ్యర్థిని కనీసం 5 రాష్ట్రాల నుంచి రాష్ట్ర, జాతీయ కౌన్సిల్ సభ్యులు 20 మంది చొప్పున ప్రతిపాదించాల్సి ఉంటుంది. 20వ తేదీన అధ్యక్ష ఎన్నికను జాతీయకౌన్సిల్ సమక్షంలో ప్రకటిస్తాం" అని కె.లక్ష్మణ్ అన్నారు. ఆ తర్వాత జాతీయ కౌన్సిల్ జరుగుతుందని, అందులో అధ్యక్ష ఎన్నికకు ఆమోదముద్ర వేస్తారని వెల్లడించారు.



పార్లమెంటరీ కమిటీ దర్యాప్తుపై


జస్టిస్ వర్మ అభ్యంతరాల తిరస్కరణ

- తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు

దిల్లీ: అధికారిక నివాసంలో కరెన్సీ నోట్ల కట్టలకు సంబంధించి తనపై అభిశంసన తీర్మానాన్ని అనుమతించి దర్యాప్తునకు పార్లమెంటరీ కమిటీని నియమించడాన్ని సవాల్ చేసిన జస్టిస్ యశ్వంత్ వర్మ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. లోక్‌సభ సభాపతి నిర్ణయంపై జస్టిస్ వర్మ అభ్యంతరాలను ద్విసభ్య ధర్మాసనం తోసిపుచ్చింది. వాదనల అనంతరం ఈ నెల 8న రిజర్వు చేసిన తీర్పును జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్.సి.శర్మ ధర్మాసనం శుక్రవారం వెలువరించింది. జస్టిస్ వర్మకు వ్యతిరేకంగా వచ్చిన అభిశంసన తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ స్వీకరించడం, దర్యాప్తునకు పార్లమెంటరీ కమిటీని నియమించడం సరైనదేనని స్పష్టం చేసింది. రాజ్యసభలో ఇలాంటి తీర్మానం తిరస్కరణకు గురైనందున లోక్‌సభ స్పీకర్ చర్యలు చెల్లవన్న జస్టిస్ వర్మ వాదనలనూ ధర్మాసనం తిరస్కరించింది. ఈ తీర్పుతో జస్టిస్ యశ్వంత్ వర్మపై పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు కొనసాగేందుకు మార్గం సుగమమైంది.

ఒక్క వాయిదా పడినా వచ్చేస్తున్నారు!

ప్రాథమిక హక్కుల ఉల్లంఘనల నుంచి ఉపశమనం కల్పించే భారత రాజ్యాంగంలోని అధికరణం 32 దుర్వినియోగమవుతోందని సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైకోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉండగానే నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నారని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ఆక్షేపించింది. కొన్ని సందర్భాల్లో హైకోర్టులో కేసు తొలి వాయిదాపడగానే సర్వోన్నత న్యాయస్థానానికి వస్తున్నారని, ఇలాంటి చర్యలు కోర్టు ప్రక్రియకు విరుద్ధమని పేర్కొంది. బాంబే హైకోర్టులో పిటిషన్ విచారణలో ఉండగానే ఒక వ్యక్తి నేరుగా సుప్రీంకోర్టులో అధికరణం 32 కింద పిటిషన్ దాఖలు చేయడాన్ని ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. చట్టాన్ని దుర్వినియోగ పరిచిన చర్యగా పేర్కొంటూ వెంటనే కొట్టివేసింది. దిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఇలాంటి పిటిషన్లు ఎక్కువగా వస్తున్నాయని అసహనం వ్యక్తం చేసింది. అధికరణం 32ను అత్యవసర పరిస్థితుల్లో, నిజంగా ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు మాత్రమే వినియోగించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. హైకోర్టుల్లో సరైన పరిష్కారం లభించని సందర్భాల్లోనే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని సూచించింది.



రూ.140 కోట్ల అల్-ఫలా ఆస్తులు జప్తు

- ఛైర్మన్‌పై ఈడీ ఛార్జ్‌షీట్

దిల్లీ: గత సంవత్సరం నవంబరు 10న దేశరాజధాని దిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుళ్ల నేపథ్యంలో వార్తలకెక్కిన అల్-ఫలా విశ్వవిద్యాలయం ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) శుక్రవారం జప్తు చేసింది. అల్‌ఫలా గ్రూపు ఛైర్మన్ జవాద్ అహ్మద్ సిద్దిఖీతోపాటు అతని ట్రస్టుపైన సిబ్బందిపైన ఛార్జ్‌షీటు దాఖలు చేసింది. ఫరీదాబాద్‌లోని ధౌజ్ ప్రాంతంలో ఉన్న విశ్వవిద్యాలయానికి చెందిన 54 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూమిని, అందులోని నిర్మాణాలను, వివిధ పాఠశాలలు, వసతిగృహాల భవనాలను మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద జప్తు చేసినట్లు ఈడీ పేర్కొంది. ఈ ఆస్తుల అంచనా విలువ రూ.140 కోట్లుగా నిర్ధారించారు. దర్యాప్తులో భాగంగా నవంబరులో సిద్దిఖీని ఈడీ అరెస్టు చేసింది. నేరపూరితంగా పోగుపడిన ఆస్తులు అమ్ముకోడానికి వీల్లేకుండా వాటిని పీఎంఎల్ఏ కింద జప్తు చేస్తామని అధికారులు తెలిపారు. తమ విద్యాసంస్థకు అక్రెడిటేషన్, గుర్తింపు ఉన్నాయన్న తప్పుడు హామీ ఆధారంగా నిందితుడు సిద్దిఖీ నేతృత్వంలో విశ్వవిద్యాలయం, దాన్ని నియంత్రిస్తున్న ట్రస్టు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి రూ 415.10 కోట్లు లాగారని ఈడీ కోర్టుకు నవంబరులో తెలియజేసింది.

మమ్మల్ని సమర్థించకపోతే సుంకాలు విధిస్తా

గ్రీన్‌లాండ్‌పై ప్రపంచ దేశాలకు ట్రంప్ హెచ్చరిక

కోపెన్‌హాగెన్: గ్రీన్‌లాండ్ విషయంలో తమను సమర్థించని దేశాలను శిక్షించేందుకు వాటిపై అధిక సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం హెచ్చరించారు. డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌ల ప్రతినిధులు అమెరికా పార్లమెంటు ప్రతినిధి బృందంతో కోపెన్‌హాగెన్‌లో చర్చలు నిర్వహిస్తున్న సమయంలో ట్రంప్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. డెన్మార్క్ రాజ్యంలో భాగంగా పాక్షిక స్వయంప్రతిపత్తి కలిగివున్న గ్రీన్‌లాండ్ తమపరం కావడం తప్ప మరేదీ తమకు సమ్మతం కాదని ఆయన ఇప్పుడు ఘంటాపథంగా చెబుతున్నారు. "గ్రీన్‌లాండ్ విషయంలో మాతో అంగీకరించని దేశాలపై నేను సుంకాలు విధిస్తాను. దేశ భద్రత కోసం మాకు ఆ దీవి కావాలి'' అని ట్రంప్ తాజాగా ప్రకటించారు.



ఏకాగ్రతను విలువైన ఆస్తిలా కాపాడుకోండి

జెన్-జీ తరంలో చాలా మంది ఏ పని మీదా గంట సేపు కూడా ధ్యాస నిలపలేకపోతున్నారు. ఫోన్ చూడకుండా ఓ పనిని ఏకధాటిగా చేయడం వారికి అసాధ్యంగా అనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏకాగ్రతను ఓ విలువైన ఆస్తిలా కాపాడుకొనేవారే ఇతరుల కన్నా వేగంగా లక్ష్యాలు పూర్తి చేస్తూ విజయపథంలో దూసుకుపోతారు.

– సౌమ్యా మలానీ, ఇన్వెస్టర్

నోబెల్ శాంతి బహుమతిని ట్రంప్‌నకు ఇచ్చేసిన మచాడో

- అది చెల్లదన్న కమిటీ

న్యూయార్క్/వాషింగ్టన్: వెనెజువెలా విపక్ష నేత మారియా కోరీనా మచాడో తనకు లభించిన నోబెల్ శాంతి బహుమతిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు గురువారం అందజేశారు. వెనెజువెలా ప్రజల స్వేచ్ఛకోసం కృషి చేస్తున్న ట్రంప్‌నకు ఇది గుర్తింపు అని ఆమె పేర్కొన్నారు. తానెన్నో యుద్ధాలను ఆపానని, నోబెల్ శాంతి బహుమతికి తన కంటే అర్హులెవరూ లేరంటూ గతంలో చాలాసార్లు అమెరికా అధ్యక్షుడు పేర్కొన్న సంగతి తెలిసిందే. మచాడో నుంచి అవార్డును స్వీకరించిన అనంతరం ట్రంప్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. పరస్పర గౌరవానికి ఇది సూచిక అని పేర్కొన్నారు. "మచాడోను కలుసుకోవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. నేను చేసిన పనికి గుర్తింపుగా తనకు లభించిన నోబెల్ శాంతి బహుమతిని ఆమె నాకు సమర్పించారు. ధన్యవాదాలు మారియా" అని సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పోస్టు చేశారు. దీనిపై నోబెల్ కమిటీ వివరణ ఇచ్చింది. ఒకసారి నోబెల్ ప్రకటించిన తర్వాత.. దానిని రద్దు, బదిలీ చేయడం లేదా ఇతరులతో పంచుకోవడం కుదరదని స్పష్టం చేసింది.



తన నోబెల్ పురస్కారాన్ని ట్రంప్‌నకు అందిస్తున్న వెనెజువెలా ప్రతిపక్షనేత మచాడో

ముంబయిలో ఠాక్రే కోటకు బీటలు

- మహారాష్ట్ర స్థానిక ఎన్నికల్లో మహాయుతి కూటమి హవా

ముంబయి: దేశ ఆర్థిక రాజధాని ముంబయి మహానగరంపై మూడు దశాబ్దాలుగా అవిభాజ్య శివసేన కొనసాగించిన ఆధిపత్యానికి గండిపడింది. ఠాక్రే కుటుంబానికి కంచుకోటగా ఉన్న బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ)లో భాజపా ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఆ పార్టీ నేతృత్వంలో మహాయుతి కూటమి అధికారాన్ని దక్కించుకోనుంది.. మహారాష్ట్రలోని 29 మున్సిపల్ కార్పొరేషన్లకు ఈ నెల 15న పోలింగ్ నిర్వహించగా శుక్రవారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. 25 నగరాల్లో మహాయుతి కూటమి అగ్రభాగాన దూసుకెళ్తోంది. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపా నేతృత్వంలోని కూటమి ఘన విజయం సాధించడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

■ 227 స్థానాలున్న బృహన్‌ముంబయి (బీఎంసీ)లో అధికారాన్ని కైవసం చేసుకోవడానికి అవసరమైన 114 సీట్ల కన్నా అధికంగానే భాజపా, శివసేన (శిందే)తో కూడిన కూటమి సొంతం చేసుకోనుంది. భాజపా 89 స్థానాల్లో విజయం సాధించింది. శిందే నేతృత్వంలోని శివసేన 27 చోట్ల గెలుపొందింది. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) 64 స్థానాలను కైవసం చేసుకుంది. రెండు దశాబ్దాల పాటు విడివిడిగా ఉన్న ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే (మహారాష్ట్ర నవ నిర్మాణ సేన) ఈ ఎన్నికలకు ముందే జట్టుకట్టినా మహాయుతి విజయాన్ని అడ్డుకోలేకపోయారు.

■ శరద్ పవార్‌కు చెందిన ఎన్సీపీ(ఎస్పీ), అజిత్ పవార్ చెందిన ఎన్సీపీ(ఏపీ) పుణె, పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని పోటీ చేసినా ఆ రెండు చోట్లా భాజపా భారీ ఆధిక్యం సాధించింది.

■ రాష్ట్రవ్యాప్తంగా 114 సీట్లలో విజయం సాధించినట్లు అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎం తెలిపింది. ఛత్రపతి సంభాజీనగర్‌లో అత్యధికంగా 33 సీట్లు, మాలెగావ్-21, అమరావతి-15, ముంబయి-6, ఠాణెలో 5 స్థానాల్లో గెలుచుకుంది.

■ లాతూర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. మొత్తం 70 స్థానాలకు గాను 40కి పైగా సీట్లను హస్తం పార్టీ గెలుపొందింది. భాజపా 22 స్థానాలకే పరిమితమైంది.

కెనడా, చైనా మధ్య సరికొత్త బంధం

- మార్క్ కార్నీ వరుస భేటీలు, డ్రాగన్‌తో కీలక ఒప్పందాలు

బీజింగ్: కెనడా, చైనాల ద్వైపాక్షిక సంబంధాల్లో నూతన అధ్యాయం ప్రారంభమైంది. నాటో కూటమిలో భాగంగా అమెరికాకు దగ్గరగా ఉన్న కెనడా.. ఇప్పుడు చైనాతో సంబంధాలు మెరుగుపరుచుకుంటోంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో, కెనడా ప్రధాని మార్క్ కార్నీ గత ఏడాది అక్టోబరులో దక్షిణ కొరియాలో భేటీలు నిర్వహించిన తర్వాత- ఇప్పుడు కార్నీ స్వయంగా చైనాలో రెండురోజులుగా పర్యటిస్తున్నారు. ద్వైపాక్షిక చర్చలు కొనసాగిస్తున్నారు, వివిధ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. తమ దేశ ఆహార ఉత్పత్తులపై తక్కువ సుంకాలకు ప్రతిగా, చైనా ఎలక్ట్రికల్ కార్లపై విధించిన 100 శాతం సుంకాలను తగ్గించేందుకు అంగీకరించినట్లు కార్నీ శుక్రవారం ప్రకటించారు. ఈ ఒప్పందంతో ప్రారంభంలో 49 వేలుగా ఉన్న వాహనాల సంఖ్య వచ్చే ఐదేళ్లలో 70 వేలకు చేరుకుంటుందన్నారు. కెనడా ప్రధాన ఎగుమతి కనోలా విత్తనాలపై 84 శాతంగా ఉన్న సుంకాలను చైనా 15 శాతానికి తగ్గించిందని ఆయన తెలిపారు. ఏళ్ల శత్రుత్వం పక్కన పెట్టి సంబంధాలను మెరుగుపరుచుకుంటామని ఇరు దేశాధినేతలైన జిన్‌పింగ్, కార్నీలు ప్రతిజ్ఞ చేశారు. ఎనిమిదేళ్లలో చైనాను సందర్శించిన మొట్టమొదటి కెనడా ప్రధానిగా కార్నీ నిలిచారు.



చైనా రాజధాని బీజింగ్‌లో అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో కెనడా ప్రధాని మార్క్ కార్నీ

'మండలి' సంస్కరణకు చొరవ చూపండి

- బలమైన దేశాలకు గుటెరస్ పిలుపు
- 1945 నాటి వేదికలు నేటికి నప్పవని వ్యాఖ్య



ఐక్యరాజ్యసమితి: భద్రతా మండలిని సంస్కరించడానికి బలమైన ప్రపంచ దేశాలు చొరవ చూపాలని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ పిలుపునిచ్చారు. "ఈరోజు ప్రత్యేక అధికారాలకు అంటిపెట్టుకొని ఉండాలని కోరుకునే దేశాలు రేపు పశ్చాత్తాప పడక తప్పదు' ' అని ఆయన హెచ్చరించారు. 'నేటి పరిస్థితులకు అనుగుణంగా వ్యవస్థల్ని సంస్కరించాలి. 1945 నాటి సమస్యా పరిష్కార వేదికలు 2026 నాటి సమస్యలకు సమాధానం చూపలేవు'' అని ఆయన గురువారం ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ పేర్కొన్నారు. సమకాలిక వాస్తవికతలకు అనుగుణంగా ప్రపంచ వ్యవస్థల సంస్కరణ జరగాలని ఆయన నొక్కి చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాల ప్రపంచ స్థూల దేశీయోత్పత్తి వాటా తగ్గిపోతుండటంతో వాటి ఆర్థిక వ్యవస్థలు రోజు రోజుకూ కుంగిపోతున్నాయని, వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థలు అంతకంతకూ బలోపేతం అవుతున్నాయని ఆయన అన్నారు. దక్షిణార్ధగోళంలోని దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్యం, ఉత్తరార్ధగోళంలోని దేశాల మధ్య సాగుతున్న వాణిజ్యాన్ని మించిపోతోందన్నారు.

కొన్ని దేశాలు అంతర్జాతీయ న్యాయసూత్రాల్లో తమకు నచ్చిన, అనుకూలమైన వాటిని పాటిస్తూ మిగిలిన వాటిని ఉల్లంఘిస్తున్నాయని, ఇది ప్రమాదకరమైన పరిస్థితికి దారి తీస్తుందని గుటెరస్ హెచ్చరించారు. గుటెరస్ పదవీకాలం 2026 సంవత్సరంలో ముగుస్తున్న దరిమిలా.. ఈ సంవత్సరంలోని ప్రతిదినం ఫలవంతం అయ్యేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో వివాదాలు, తమను ఎవరూ ఏమీ చేయలేరన్న భావన, అసమానత్వం, ఎప్పుడేం జరుగుతుందో తెలియని అనిశ్చిత పరిస్థితి ప్రబలిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సంవత్సరం డిసెంబరు 31తో గుటెరస్ పదవీ కాలం ముగియనుంది.

'హెచ్ఐవీ'తో తల్లి మృతి.. ఆస్పత్రికి తీసుకొచ్చిన చిన్నారి

ఎటా: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఎటా జిల్లాలో హెచ్ఐవీ ఇన్ఫెక్షనుతో తల్లి మృతిచెందగా.. ఎనిమిదేళ్ల చిన్నారి ఆమె మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చాడు. తన వెంట ఎవరూ లేరని, తాను ఒంటరినని ఆ బాలుడు వైద్యసిబ్బందికి తెలిపాడు. వైద్యుల సమాచారంతో పోలీసులు రంగప్రవేశం చేసి వివరాలు ఆరా తీశారు. పుట్టింటిలో ఉంటూ హెచ్ఐవీ ఇన్ఫెక్షనుకు చికిత్స పొందుతున్న ఆ మహిళ గురువారం మృతిచెందినట్లు సర్కిలు అధికారి (సీవో) రితేశ్ ఠాకుర్ తెలిపారు. ఎనిమిది నెలల కిందట ఆమె భర్త సైతం ఇదే కారణంగా మృతిచెందాడని వెల్లడించారు. కుటుంబసభ్యులు, గ్రామస్థుల సమక్షంలో మహిళ అంత్యక్రియలను పోలీసులు పూర్తి చేశారు. వీరిది నిరుపేద కుటుంబమని, బాలుడు అమ్మమ్మ తరపు బంధువుల సంరక్షణలో ఉండే అవకాశముందని సీవో పేర్కొన్నారు.

ట్రంప్ ఒత్తిడికి దిగొస్తున్న వెనెజువెలా

కారకస్: వెనెజువెలాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడి పనిచేస్తున్నట్లే కనిపిస్తోంది. చమురు రంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టే దిశగా ఆ దేశం అడుగులు వేస్తోంది. ఆ దేశాధ్యక్షుడు మదురోను ఈ నెల ఆరంభంలో అమెరికా దళాలు నిర్బంధంలోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో తాత్కాలిక దేశాధ్యక్ష పగ్గాలు చేపట్టిన డెల్సీ రోడ్రిగ్జ్ గురువారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కొన్ని కీలక ప్రకటనలు చేశారు. చమురు రంగంలో పాక్షిక ప్రైవేటు పెట్టుబడులు ఆహ్వానించే విధంగా కొత్త విధానం తీసుకొస్తామని తెలిపారు. ఈ విధానాన్ని చట్టసభ సభ్యులు ఆమోదించాలని ఆమె అభ్యర్థించారు. చమురు కొనుగోళ్ల నుంచి వచ్చే ఆదాయంతో రెండు ఫండ్‌లను నిర్వహిస్తామని చెప్పారు. ఈ నిధులను సామాజిక అవసరాల కోసం, మౌలిక సదుపాయాల కల్పన కోసం వెచ్చిస్తామని తెలిపారు. అంతేకాదు.. మదురో పాలనలో నిర్బంధానికి గురైన రాజకీయ ఖైదీలను విడుదల చేస్తామని కూడా చెప్పారు.

కార్మిక సంఘం మాజీ నేత చంద్రశేఖర్ కన్నుమూత

కోల్‌కతా: కార్మిక సంఘం మాజీ నేత, సీపీఐ(ఎం) సీనియర్ సభ్యులు చంద్రశేఖర్ బసు(103) శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. అఖిల భారత బీమా ఉద్యోగుల సమాఖ్య(ఏఐఐఈఏ) మాజీ అధ్యక్షుడైన ఆయన తమ ఉద్యోగుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. సీపీఎం(ఎం)లో చంద్రశేఖర్ అత్యంత సీనియర్ సభ్యుడని పార్టీ వర్గాలు తెలిపాయి. లెఫ్ట్ ఫ్రంట్ ఛైర్మన్ బిమన్ బోస్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సలీం, ఏఐఐఈఏ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రలు చంద్రశేఖర్ మృతికి సంతాపం తెలియజేశారు. 1944లో హిందూస్థాన్ ఇన్సూరెన్స్ కంపెనీలో చేరిన ఆయన అదే ఏడాది ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

దక్షిణకొరియా మాజీ అధ్యక్షుడు యూన్‌కు ఐదేళ్ల జైలుశిక్ష

సియోల్: దక్షిణకొరియా మాజీ అధ్యక్షుడు, ఎమర్జెన్సీ మార్షల్ లా ప్రకటించిన యూన్ సుక్ యోల్‌కు కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ఆయనను పదవి నుంచి తొలగించిన మార్షల్ లా సహా ఎనిమిది నేర విచారణల్లో మొదటి తీర్పు శుక్రవారం వెలువడింది. 2024 డిసెంబరులో స్వల్పకాలం పాటు మార్షల్ లా విధించడంతో యూన్‌కు వ్యతిరేకంగా ప్రజలు భారీ నిరసనలు చేపట్టారు. దీంతో ఆయన అభిశంసనకు గురవడంతో పాటు అరెస్టయిన విషయం తెలిసిందే. ఈ కేసులో యూన్‌కు సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది.

స్టార్టప్ రంగంలో

ప్రపంచానికి నాయకత్వం వహించాలి

- ఇదే మన లక్ష్యం కావాలి
- యువతకు ప్రధాని పిలుపు

దిల్లీ: భారత దేశంలో స్టార్టప్ సంస్థలు తయారీ, డీప్ టెక్నాలజీ రంగాలపై దృష్టి పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ భారత మండపంలో 'స్టార్టప్ ఇండియా' పదో వార్షికోత్సవంలో మాట్లాడారు. ఈ సందర్భంగా దేశ ఆర్థిక భవిష్యత్తుకు స్టార్టప్‌లు కీలకమని పేర్కొన్నారు. ఈ రంగంలో ప్రపంచానికి భారత్ నాయకత్వం వహించాలని.. ఇదే యువత లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. "పదేళ్ల క్రితం దేశంలో 500 అంకుర సంస్థలు ఉంటే, ప్రస్తుతం 2 లక్షల పైనే ఉన్నాయి. 2014లో నాలుగు యూనికార్న్‌లు మాత్రమే ఉంటే ఇప్పుడు వాటి సంఖ్య 125కు చేరుకుంది. ఈ విజయగాథను ప్రపంచం ఆశ్చర్యంతో చూస్తోంది. ఇందులో మహిళల పాత్ర కూడా ఉంది. 45 శాతం స్టార్టప్‌లలో స్త్రీల భాగస్వామ్యం ఉంది. ప్రస్తుత యువత అందరూ నడిచిన సౌకర్యవంతమైన దారుల్లో ప్రయాణించటానికి ఇష్టపడటం లేదు. కొత్త దారులను సృష్టించుకుంటోంది. అందుకోసం సాహసాలు చేస్తోంది. ఈ విషయంలో ప్రభుత్వం కూడా మీ వెంట ఉంటుంది. మీ సామర్థ్యాలపై మాకు నమ్మకం ఉంది. మీ ధైర్యం, విశ్వాసమే.. దేశ భవిష్యత్తుకు కీలకం. వచ్చే పదేళ్లలో స్టార్టప్ ట్రెండ్స్‌లలో, సాంకేతికతలో ప్రపంచానికి మన దేశం నాయకత్వం వహించాలి. ఇదే మన లక్ష్యం కావాలి. కొత్త ఆలోచనలపై దృష్టి పెట్టాలి. ఉదాహరణ కృత్రిమ మేధ (ఏఐ). ఈ ఏఐ విప్లవంలో మనం ఎంత ముందుంటే అంత లాభం. స్వదేశీ ప్రతిభతో భారత సర్వర్లలో ఏఐ రూపకల్పన జరిగేలా కృషి చేస్తున్నాం. సెమీ కండక్టర్లు, డేటా సెంటర్లు, గ్రీన్ హైడ్రోజన్, ఇతర రంగాల్లోనూ ఇలాంటి కృషే జరుగుతోంది'' అని మోదీ పేర్కొన్నారు.



దిల్లీలో స్టార్టప్ ఇండియా ప్రదర్శనలో మోదీ

వేర్పాటువాదం ప్రోత్సాహానికి

స్వీయ నిర్ణయ హక్కును వినియోగించకూడదు

- ఐరాస వేదికగా పాక్‌కు భారత్ హితవు

ఐరాస: విభజన అజెండా కోసం ఐక్యరాజ్యసమితి(ఐరాస) వేదికలను పాకిస్థాన్ దుర్వినియోగం చేస్తోందని భారత్ మండిపడింది. స్వీయ నిర్ణయ హక్కును వాడుకొని.. మతపరమైన వైవిధ్యం కలిగిన ప్రజాస్వామ్య దేశాల్లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించేలా మాట్లాడకుండా పాక్‌ను నిరోధించాలని ఐరాసను భారత్ కోరింది. ఐరాసలోని భారత శాశ్వత మిషన్ కౌన్సిలర్ ఎల్డోస్ మ్యాథ్యూ పున్నూస్ ఈ మేరకు గురువారం వ్యాఖ్యానించారు. 2025లో ఐరాస కార్యకలాపాలపై సెక్రటరీ జనరల్ విడుదలచేసిన సమితి సర్వప్రతినిధి సభలో చర్చ జరిగింది. 'ప్రపంచ దేశాలన్నీ సంకుచిత ఆలోచనా దృక్పథం నుంచి బయటికొచ్చి మాట్లాడుతుంటే, పాక్ మాత్రమే విభజన అజెండాతో విషం కక్కుతోంది. భారత్‌లో ఒక భాగమైన కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ గురించి మాట్లాడేందుకు ఐరాసను పాక్ వేదికగా చేసుకోవడం సరికాదు. పాక్‌ను నిలువరించాల్సిన అవసరం ఉంది. శాంతి, భద్రత, వికాసం - మానవ హక్కులపై ఐరాస గళం విప్పాలి. జమ్మూకశ్మీర్ విషయంలో అనవసరమైన సూచనలు చేయాల్సిన అవసరం పాక్‌కు లేదు. నిరాధారమైన ఆరోపణలు, అబద్ధాలను ప్రచారం చేయకుండా పాక్ వాస్తవాలను గ్రహిస్తే మంచిది'' అని ఎల్డోస్ స్పష్టంచేశారు. పాక్ ప్రతినిధి ఆసిమ్ ఇఫ్తిఖార్ అహ్మద్ ఐరాస వేదికగా జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

కేరళలోని కొచ్చిన్‌లో అయ్యప్పన్‌కావు దేవాలయం నిర్వహించే ఊరేగింపు కోసం తీసుకొచ్చిన ఏనుగులు



ట్రంప్ ఛైర్మన్‌గా గాజా శాంతి మండలి

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఛైర్మన్‌గా గాజా శాంతి మండలి ఏర్పాటైంది. కాల్పుల విరమణ ఒప్పందంలోని రెండో దశ ప్రారంభమైందని పశ్చిమాసియా అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్ ప్రకటించిన కొద్ది సేపటికే శాంతి మండలిపై ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్‌'లో పోస్టు పెట్టారు. తన నేతృత్వంలో మండలి ఏర్పాటైనట్లు ప్రకటించారు. ఇందులో గాజా కాల్పుల విరమణ ఒప్పందంలో మధ్యవర్తులుగా వ్యవహరించిన ఈజిప్టు, తుర్కియే, ఖతార్ దేశాల ప్రతినిధులు ఉంటారు. వీరితో పాటు.. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ నేతలను కూడా మండలిలోకి ఆహ్వానించారు. శాంతి మండలి కార్యనిర్వాహక కమిటీకి డైరెక్టర్ జనరల్‌గా ఐక్యరాజ్యసమితి మాజీ ప్రత్యేక సమన్వయకర్త, బల్గేరియా మాజీ దౌత్యవేత్త మ్లాదెనోవ్ వ్యవహరిస్తారు. ఈ బోర్డులో స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్, బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా సభ్యులుగా ఉంటారు. మరోవైపు గాజా రోజువారీ పాలనను పర్యవేక్షించేందుకు 15 మంది సభ్యులతో బుధవారం గాజా జాతీయ పాలక సంఘం బుధవారం ఏర్పాటైంది.

ఫార్మసిస్టులకు కనీస అర్హత డిఫార్మాయే: సుప్రీం

దిల్లీ: ఫార్మసిస్ట్ ఉద్యోగానికి కనీస విద్యార్హత 'డిప్లొమా ఇన్ ఫార్మసీ'గా నిర్ణయిస్తూ 2014లో రూపొందిన బిహార్ ఫార్మసిస్ట్ కేడర్ నిబంధనలు రాజ్యాంగబద్ధమైనవేనని సుప్రీంకోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. అభ్యర్థికి ఉండాల్సిన అర్హతల్ని నిర్ణయించే అధికారం ఉద్యోగం ఇచ్చేవారిదేనని పేర్కొంది. డిప్లొమా ఇన్ ఫార్మసీ లేని కారణంగా తమను ఫార్మసిస్టు ఉద్యోగం నుంచి మినహాయించడాన్ని సవాలు చేస్తూ బీఫార్మసీ, ఎంఫార్మసీ అర్హత కలిగిన అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మల ధర్మాసనం తిరస్కరించింది.

ఉమీద్‌పై వ్యాజ్యం తిరస్కరణ

దిల్లీ: వక్ఫ్ ఆస్తుల వివరాలను అప్‌లోడ్ చేయడానికి కేంద్రం ఏర్పాటుచేసిన ఉమీద్ పోర్టల్‌లో సాంకేతిక, నిర్మాణ సంబంధ లోపాలు ఎత్తి చూపుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. పిటిషనర్ లేవనెత్తిన అంశాలు ప్రధానంగా పరిపాలనా పరమైనవని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడుకున్న ధర్మాసనం పేర్కొంది. ఈ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులను కలవాలని పిటిషనర్, వక్ఫ్ ఆస్తి సంరక్షకుడు(ముతవల్లీ) హష్మత్ అలీని సుప్రీంకోర్టు ఆదేశించింది.

ఆచారాలు, సంస్కృతుల్లోనే జాతి మనుగడ

- రాష్ట్రంలో ప్రతి పల్లెకూ పండుగ కళ
- ఉద్యోగులకు 60 నెలల పెండింగ్ డీఏలు ఇచ్చాం
- తెదేపా నేతలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

ఈనాడు, అమరావతి: ఆచారాలు, వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలను మర్చిపోతే మన జాతికి ఉనికి ఉండదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వాటిని కాపాడుకునేందుకే సంక్రాంతి సందర్భంగా అన్ని జిల్లాల్లోనూ మనవైన ఆటపాటలు, ఉత్సవాలను ప్రభుత్వం తరఫున ప్రోత్సహిస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్రంలోని పల్లెలన్నీ కళకళలాడుతున్నాయని, ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకు అంతటా పండుగ వాతావరణం కన్పిస్తోందని తెలిపారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 'కేరళను తలపించేలా ఆత్రేయపురంలో పడవల పోటీలు నిర్వహించారు. జగ్గన్నతోట ప్రభలతీర్థం సందర్భంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఉత్తరాంధ్ర, ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల్లో పెద్దఎత్తున వేడుకలు జరుగుతున్నాయి. వైఎస్సార్ కడప జిల్లాలో గండికోట ఉత్సవాలు, తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో ఫ్లెమింగో ఫెస్టివల్స్‌కు సందర్శకులు బాగా వస్తున్నారు. ప్రతి పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం' అని వివరించారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు సీఎం తెలిపారు. 'గ్రీన్ ఎనర్జీ పాలసీ ద్వారా ప్రతి ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్‌లు అమర్చుతున్నాం. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నాం. ఉద్యోగులకు రూ.1,100 కోట్లతో డీఏ, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాం. సీపీఎస్ ఉద్యోగులకు 60 నెలల పెండింగ్ బకాయిలు చెల్లించాం. 2019కి ముందు చేసిన నీరు-చెట్టు బిల్లులు క్లియర్ చేశాం' అని చంద్రబాబు గుర్తుచేశారు.

ఏడాదిలో రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం

రాష్ట్రంలో అన్నిరకాల రెవెన్యూ సమస్యలను ఏడాదిలోగా పరిష్కరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తామన్నారు. పార్టీ పరంగా లోక్‌సభ నియోజకవర్గ స్థాయి వరకూ పదవులు భర్తీ చేశామని, త్వరలోనే రాష్ట్ర కమిటీ నియమిస్తామని చెప్పారు. ఎన్డీయే ప్రభుత్వం కొనసాగితేనే రాష్ట్రం బాగుంటుందని, సంక్షేమ, అభివృద్ధి పథకాలను మూడు పార్టీల శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పాటు స్పీడ్ ఆఫ్ గవర్నెన్స్ డెలివరింగ్ విధానం వైపు వెళ్తున్నాం. మెగా డీఎస్సీ, పోలీస్ నియామకాలు, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, స్త్రీశక్తి, ఎన్టీఆర్ భరోసా పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ వంటి పథకాలు వేగంగా అమలు చేశాం. విద్యుత్తు ఛార్జీల భారం తగ్గించామ'ని చంద్రబాబు వివరించారు. దేశానికి వస్తున్న విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం మన రాష్ట్రానికే వచ్చాయని సీఎం పేర్కొన్నారు. విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయని, కేంద్రం 30 శాతం మేర పీపీపీ ప్రాజెక్టులు రాష్ట్రానికే కేటాయించిందని చెప్పారు.

ప్రభలతీర్థం సందర్భంగా శుభాకాంక్షలు

476 ఏళ్లుగా ఎంతో ప్రశస్తమైన జగ్గన్నతోట ప్రభల తీర్థానికి రాష్ట్ర పండుగ హోదా కల్పించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. దాదాపు ఐదు లక్షల మంది హాజరయ్యే ఈ పండుగకు ప్రభుత్వపరంగా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. 'జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈ ప్రభల తీర్థం సమయంలో లోక కల్యాణార్థమై ఏకదశ రుద్రులు ఇక్కడ సమావేశమవుతారని భక్తుల విశ్వాసం. అందరికీ మంచి జరగాలని ప్రార్థిస్తున్నాను' అని పేర్కొన్నారు.

తిరుపతిలో 'ఏపీ ఫస్ట్' పరిశోధన కేంద్రం

- తిరుపతి ఐఐటీ.. ఐఐఎస్ఈఆర్ భాగస్వామ్యంతో ఏర్పాటు
- ఏరో స్పేస్, ఐటీ సలహాదారులతో సీఎం సమావేశం



ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో సమావేశమైన సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: తిరుపతి కేంద్రంగా అతి పెద్ద 'ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ' (ఏపీ ఫస్ట్) పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. తిరుపతిలోని ఐఐటీ..ఐఐఎస్ఈఆర్ వంటి ప్రముఖ జాతీయ విద్యా సంస్థల భాగస్వామ్యంతో దీన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. యువత భవిష్యత్తు తీర్చిదిద్దేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని.. వారికి అన్ని విధాలా సహకరించాలని అధికారులకు సూచించారు. ఏరో స్పేస్, డిఫెన్స్, ఐటీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో క్యాంపు కార్యాలయంలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. వివిధ రంగాల్లో కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఏఐ-సైబర్ సెక్యూరిటీ, సెమీ కండక్టర్ డివైసెస్, సెన్సర్లు, క్వాంటమ్ టెక్నాలజీ, హెల్త్‌కేర్, బయో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాలు భవిష్యత్తులో కీలకం కానున్నాయి. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పాలసీలు రూపొందిస్తోంది. ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టే కంపెనీలను ప్రోత్సహిస్తోంది. దేశంలోనే తొలిసారి గ్రీన్ ఎనర్జీ రంగంలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ కాకినాడలో ఏర్పాటు చేయబోతున్నాం. ఈ తరహాలో కొత్త ఆవిష్కరణలు.. వివిధ స్టార్టప్ కంపెనీలకు రాష్ట్రం వేదికగా నిలవాలి. భవిష్యత్తులో డిమాండ్ ఉన్న రంగాలు, స్టార్టప్‌లను ప్రోత్సహించాలి. ఏపీ ఫస్ట్‌ను సమర్థంగా నిర్వహించేందుకు కేంద్రంతోనూ సంప్రదింపులు జరపాలి' అని సీఎం పేర్కొన్నారు.

ఎనిమిది వేల మందికి దుస్తుల పంపిణీ

పండుగరోజు జీఎంఆర్ వితరణ



దుస్తులతో ఉన్న ప్యాకెట్లు అందజేస్తున్న జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు

రాజాం, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు స్వస్థలం విజయనగరం జిల్లా రాజాంలో గురువారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. సుమారు 8 వేల మందికి రూ.64 లక్షల విలువైన వస్త్రాలను ఆయన అందించారు. జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జీఎంఆర్‌వీఎఫ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురుషులకు ధోవతులు, టవల్, పంచె, మహిళలకు చీర, రగ్గులు, టవల్‌తో కూడిన ప్యాకెట్లు అందజేశారు.

22 మంది బాలల దత్తత: రాజాం ప్రాంతంలోని 22 మంది బాలలను జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ద్వారా జీఎంఆర్ సమక్షంలో గురువారం దత్తత తీసుకున్నారు. గతేడాది డిసెంబరులో 18 మందిని తీసుకున్నారు. ఈ 40 మంది విద్యార్థులకు జూన్ నుంచి సాయం అందిస్తారు. వీరితో కలిపి 176 మంది బాలలకు జీఎంఆర్‌వీఎఫ్ ద్వారా చేయూత అందిస్తున్నారు. ఎల్‌కేజీ నుంచి వారికి ఉద్యోగం వచ్చే వరకు మొత్తం ఖర్చు ఫౌండేషన్ భరిస్తుంది. దత్తత బాలలకు బ్యాగులు, ఇతర విద్యాసామగ్రిని జీఎంఆర్ సతీమణి వరలక్ష్మి, మనవళ్లు ధృవ, రిద్ధిమాన్ అందించారు.



దత్తత బాలుడికి బ్యాగు అందిస్తున్న జీఎంఆర్ కుటుంబ సభ్యులు

కౌన్సెలింగ్‌లో జాప్యంతో విద్యార్థుల్లో ఆందోళన

బీపీటీ, బ్యాచిలర్ డిగ్రీ కోర్సులకు తప్పని నిరీక్షణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో బీపీటీ (ఫిజియోథెరపీ), అలైడ్ హెల్త్‌కేర్స్ (బ్యాచిలర్ డిగ్రీ) కోర్సుల కౌన్సెలింగ్‌లో జాప్యం.. వేల మంది విద్యార్థులను కలవరపెడుతోంది. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం పరిధిలో ఈ ప్రక్రియ జరగాల్సి ఉన్నా ఇంకా వెబ్ ఆప్షన్ల విడుదల కాలేదు. దీంతో అభ్యర్థుల నిరీక్షణ తప్పడం లేదు. విద్యాసంవత్సరం ప్రారంభమై ఇప్పటికే నెలలు గడిచినా కౌన్సెలింగ్ ప్రక్రియ కొలిక్కి రాకపోవడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బాధిత విద్యార్థులు మంత్రి నారా లోకేశ్‌కు లేఖ రాశారు. కౌన్సెలింగ్ వెంటనే ప్రారంభించి, వెబ్ ఆప్షన్లు విడుదల చేసేలా జోక్యం చేసుకోవాలని కోరారు. ఏటా జులై, ఆగస్టులో జరగాల్సిన కౌన్సెలింగ్ 2020 నుంచి ఏటా డిసెంబరులో జరుగుతోంది. ఈసారి మరింత జాప్యం జరిగింది. అన్ని కోర్సుల కౌన్సెలింగ్ వరుసగా జరపడంతో ప్రక్రియలో ఆలస్యం అయ్యిందని అధికారులు చెబుతున్నారు. కీలక శాఖల మధ్య సమన్వయ లోపమే జాప్యానికి కారణమనే వాదన వినిపిస్తోంది.

దేశానికే దిక్సూచి.. 'స్వర్ణ' చంద్రగిరి

- గ్రామీణాభివృద్ధికి 'స్వర్ణ నారావారిపల్లె' నమూనా
- మండలం అంతటికీ ఇదే తరహాలో సుస్థిరాభివృద్ధి
- అధికారులకు సీఎం దిశానిర్దేశం



స్వర్ణ చంద్రగిరి ప్రాజెక్టుపై కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నాని, జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఈనాడు డిజిటల్, తిరుపతి: తిరుపతి జిల్లాలోని చంద్రగిరి మండలాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపేలా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే సత్ఫలితాలనిచ్చిన స్వర్ణ కుప్పం, స్వర్ణ నారావారిపల్లె స్ఫూర్తితో.. ఇప్పుడు 'స్వర్ణ చంద్రగిరి' పేరుతో అభివృద్ధి ప్రణాళికను ప్రకటించారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా, సుస్థిరాభివృద్ధి సాధించేలా ఈ ప్రణాళికను అమలు చేయాలని ఆయన గురువారం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

నారావారిపల్లె.. ప్రగతికి ఆనవాలు

◆ గతేడాది సంక్రాంతి పండగ నాడు కందులవారిపల్లె, చిన్న రామాపురం, ఎ.రంగంపేట గ్రామాలను ఎంపిక చేసి 'స్వర్ణ నారావారిపల్లె' కార్యక్రమానికి సీఎం అంకురార్పణ చేశారు. కేవలం ఏడాది కాలంలోనే ఈ ప్రాజెక్టు అద్భుత ఫలితాలను సాధించింది.

◆ ఈ గ్రామాల్లోని ప్రతి ఇంటిపై వంద శాతం సౌర ఫలకాలను అమర్చారు. తద్వారా ఇంధన స్వయం సమృద్ధిని సాధించి, ప్రతి ఇంటికీ ఉచితంగా విద్యుత్ వెలుగులు అందిస్తున్నారు. దేశంలోనే వంద శాతం సోలారైజేషన్ సాధించిన గ్రామంగా నారావారిపల్లె రికార్డు సృష్టించింది.

◆ శాస్త్రీయ పద్ధతుల్లో పాడిపరిశ్రమను నిర్వహించడం, ప్రకృతి సేద్యం విస్తరణ వంటి చర్యలతో ప్రజల తలసరి ఆదాయం ఏకంగా 20 శాతం పెరిగింది.

సంక్షేమం- నైపుణ్యం జోడెద్దులుగా..

ఆదాయం పెంచడమే కాకుండా, జీవన ప్రమాణాల పెంపుపై ప్రభుత్వం దృష్టి సారించింది. మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పనతో ఏడాదిలోనే గ్రామాల రూపురేఖలు మారిపోయాయి.

ఏడాదిలోగా లక్ష్య సాధన

స్వర్ణ నారావారిపల్లె విజయవంతం కావడంతో, ఆ స్ఫూర్తిని చంద్రగిరి మండలం అంతటా విస్తరించాలని సీఎం నిర్ణయించారు. కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షలో సీఎం మాట్లాడుతూ.. ఏడాదిలోపు అభివృద్ధి లక్ష్యాలను సాధించి చంద్రగిరిని దేశానికే దిక్సూచిగా నిలపాలని ఆదేశించారు. స్వల్ప కాలంలోనే ఆశించిన ఫలితాలను రాబట్టిన జిల్లా యంత్రాంగాన్ని, ప్రజాప్రతినిధులను అభినందించారు.

రచయిత్రి సాయిజ్యోతి యువతరానికి స్ఫూర్తి

అంధురాలు రాసిన నవలను ఆవిష్కరించిన మంత్రి లోకేశ్



సాయిజ్యోతితో కలిసి నవలను ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేశ్

తాడేపల్లి, న్యూస్‌టుడే: మంగళగిరికి చెందిన రచయిత్రి చింతక్రింది సాయిజ్యోతి రచించిన 'చేయి వీడని చెలిమి' నవలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆవిష్కరించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేశ్‌ను సాయిజ్యోతి కుటుంబ సభ్యులు శుక్రవారం కలిశారు. అంధురాలైన సాయిజ్యోతి మొబైల్ వాయిస్ ఇన్‌పుట్ సాంకేతిక పరిజ్ఞానం సాయంతో రచనలు చేస్తున్నారు. 'చైత్రశ్రీ' కలం పేరుతో 'కళాంజలి' అనే కవితా సంపుటితో పాటు 'మంచుతాకిన ప్రేమ', 'ఎవరు అతను' అనే నవలలు, సామాజిక స్పృహ కలిగించే కథలు రాశారు. నూతక్కి ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సాయిజ్యోతి.. వైకల్యాన్ని జయించి తన ప్రతిభతో యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని, భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని లోకేశ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, తితిదే పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, రచయిత్రి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మార్చి 16న రాజధానిలో పొట్టి శ్రీరాములు విగ్రహ ఆవిష్కరణ

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రజా రాజధాని అమరావతిలో 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాముల విగ్రహ నిర్మాణ పనులు నిర్విరామంగా జరుగుతున్నాయని అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డూండీ రాకేష్ తెలిపారు. శుక్రవారం ఆయన రాజధాని గ్రామం తుళ్లూరు సమీపంలో జరుగుతున్న నిర్మాణ పనులను ట్రస్ట్ సభ్యులతో కలసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మార్చి 16న అమరజీవి 125వ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇక్కడ భారీ పిల్లర్లు నిర్మించి దానిపై స్లాబ్ పనులు పూర్తి చేశారు.

వైద్య విద్య పీజీ కోర్సుల్లో అదనపు సీట్లకు ఎన్ఎంసీ ఆమోదం

ఈనాడు, అమరావతి: వైద్య కళాశాలల్లో 2025-26 విద్యాసంవత్సరంలో పీజీ కోర్సులకు సంబంధించి ఫస్ట్ అప్పీల్ కమిటీ మంజూరు చేసిన సీట్లు చెల్లుబాటు అయ్యేవిగా పరిగణించాలని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) నిర్ణయించింది. మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు (ఎంఏఆర్‌బీ) ఈ నెల 13న జారీచేసిన పబ్లిక్ నోటీసు ఆధారంగా ఎన్ఎంసీ తాజాగా ఉత్తర్వులను జారీచేసింది. ఫస్ట్ అప్పీల్ కమిటీ ద్వారా మంజూరైన సీట్ల జాబితా పీజీ కౌన్సెలింగ్ ప్రక్రియలో చెల్లుబాటయ్యే అధికారిక పత్రంగా ఉపయోగించవచ్చని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా రాగోలులోని గ్రేట్ ఈస్టర్న్ మెడికల్ స్కూల్ అండ్ హాస్పిటల్‌లో ఎంఎస్ ఆప్తమాలజీలో ఒక సీటు, ఎండీ ఎమర్జెన్సీ మెడిసిన్‌లో మూడు సీట్లు అదనంగా మంజూరైనట్లు తెలిపింది.

వేలుపులు ప్రభవించి.. వెలుగులు పంచి

అంగరంగ వైభవంగా జగ్గన్నతోట ప్రభలోత్సవం



డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జగ్గన్నతోటలో కొలువైన ప్రభలు

అంబాజీపేట, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం జగ్గన్నతోట ప్రభల ఉత్సవం శుక్రవారం కనులపండువగా జరిగింది. 476 ఏళ్ల చరిత్ర గల ఈ ఉత్సవాన్ని ప్రభుత్వం ఈ దఫా రాష్ట్ర పండుగగా గుర్తించడంతో నిర్వాహకులు, అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. కనుమ రోజున ఏకాదశ రుద్రులు ఒకచోట కొలువుదీరడం ఇక్కడి ప్రత్యేకత. రంగురంగుల నూలుతో నయనానందకరంగా ప్రభలను తీర్చిదిద్దారు. శిఖరాన త్రిశూలం, మధ్య భాగంలో మకర తోరణంతో ఉన్న మహారుద్రుడి ఉత్సవ ప్రతిమను తీర్చిదిద్ది, ఓ బల్లపై అధిష్ఠించి, 'అశ్శరభ.. శరభ' అంటూ శరణఘోష చేస్తూ టన్నుల కొద్దీ బరువున్న ప్రభలను 11 గ్రామాల నుంచి భక్తులు జగ్గన్నతోటకు తీసుకువచ్చారు. గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు గ్రామాలకు చెందిన పార్వతీ వీరేశ్వరస్వామి, చెన్నమల్లేశ్వర స్వామి ప్రభలను స్థానిక ఎగువ కౌశిక నదిని దాటించిన సన్నివేశం అద్భుతాన్ని ఆవిష్కరించింది. నిండు ప్రవాహంలో దిగినప్పుడు 150-200 మంది యువకులు దిక్కులు పిక్కటిల్లేలా శివనామస్మరణ చేస్తూ ఒక్కో ప్రభను ఒద్దికగా ఒడ్డుకు చేర్చారు. అలాగే వ్యాఘ్రేశ్వరం నుంచి వ్యాఘ్రేశ్వరస్వామి, కె.పెదపూడి-మేనకేశ్వరస్వామి, ఇరుసుమండ-ఆనంద రామేశ్వర స్వామి, వక్కలంక-కాశీ విశ్వేశ్వరస్వామి, నేదునూరు-చెన్నమల్లేశ్వరస్వామి, ముక్కామల-రాఘవేశ్వరస్వామి, మొసలపల్లి-మధుమానంత భోగేశ్వరస్వామి, పాలగుమ్మి-చెన్నమల్లేశ్వరస్వామి, పుల్లేటికుర్రు-అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి రూపాలతో ప్రభలను జగ్గన్నతోట తీర్థానికి తీసుకువచ్చారు. రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్, ఎంపీలు సానా సతీష్‌బాబు, గంటి హరీష్ మాథుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి హాజరయ్యారు.



గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం ప్రభలను కౌశిక నది దాటిస్తున్న యువకులు

★ గంగలకుర్రు అగ్రహారం ప్రభ ఎగువ కౌశిక నదిని దాటే దృశ్యాన్ని చూసేందుకు కౌశిక వంతెనపైకి భక్తులు భారీగా వచ్చారు. ఒకేసారి లక్షల మంది రావడంతో నియంత్రించలేక పోలీసులు ఆపసోపాలు పడ్డారు. ఈసారి దాదాపు ఆరు లక్షలకు పైగా భక్తులు వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. ★ కోనసీమ జిల్లావ్యాప్తంగా శుక్రవారం ప్రభల ఉత్సవాలు కనువిందు చేశాయి. అంబాజీపేట మండలంలోని వాకలగరువు, తొండవరం, అమలాపురం గ్రామీణ మండలం సాకుర్రుగున్నేపల్లి ప్రభలు రాష్ట్రంలోనే ఎత్తైనవిగా గుర్తింపు పొందాయి.





జగ్గన్నతోటలో ప్రభ వద్ద మంత్రి కందుల దుర్గేష్ ★ కౌశిక నది తీరం వద్ద ఉత్సవాన్ని తిలకిస్తున్న రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, కళల ఛైర్మన్ తేజస్వి పొడపాటి, ఎంపీ హరీష్‌మాథుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మానవ శరీర నిర్మాణంపై 2 నుంచి రాష్ట్రస్థాయి మెడికల్ ఎగ్జిబిషన్

ఈనాడు, అమరావతి: అమ్మ గర్భంలో పిండం ఎలా జీవం పోసుకుంటుంది.. తొమ్మిది నెలల పాటు ఏ విధంగా ఎదుగుతుంది.. ప్రసవం తర్వాత మానవ దేహంలో వచ్చే మార్పులు.. గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు, మెదడు ఎలా పనిచేస్తుంటాయి.. ఇలా అనేక అంశాలు ఆసక్తికరమే. ఈ క్రమంలోనే వీటిపై అందరికీ అవగాహన కల్పించేందుకు గుంటూరు వైద్య కళాశాల 34 ఏళ్ల తర్వాత రాష్ట్రస్థాయి మెడికల్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తోంది. ఫిబ్రవరి 2న ఇది ప్రారంభం కానుంది. 35 విభాగాలకు చెందిన 350 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శనలో ఉంచనున్నారు. ప్రతి విభాగం నుంచీ 200కు పైగా అవయవాలు, పరికరాల చొప్పున సుమారు 5 వేలకు పైగా నమూనాలు అందుబాటులో ఉంటాయి.

అందుబాటులోకి పశ్చిమ బైపాస్

- గుంటూరు జిల్లా కాజ నుంచి కృష్ణాజిల్లా చినఆవుటపల్లి వరకు ప్రారంభం



కొబ్బరికాయ కొట్టి రాకపోకలను ప్రారంభిస్తున్న జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ప్రాంతీయ అధికారి ఆర్కే సింగ్, ప్రాజెక్టు డైరెక్టర్ పార్వతీశం తదితరులు



పశ్చిమ బైపాస్‌లో వెళ్తున్న వాహనాలు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: సంక్రాంతి రోజు కూటమి ప్రభుత్వం ప్రజలకు కానుక ఇచ్చింది. నవ్యాంధ్ర రాజధాని అమరావతి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించిన విజయవాడ పశ్చిమ బైపాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మొత్తం ఆరు వరుసల్లో 47 కి.మీ. మేర నిర్మించే ఈ బైపాస్ గుండా గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజ నుంచి కృష్ణాజిల్లా గన్నవరం సమీపంలోని చినఆవుటపల్లి వరకు రాకపోకలను జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ప్రాంతీయ అధికారి ఆర్కే సింగ్, ప్రాజెక్టు డైరెక్టర్ పార్వతీశం గురువారం ప్రారంభించారు. చినఆవుటపల్లి నుంచి కాజ వరకు రహదారిని ఈ ఏడాది మార్చిలోగా అందుబాటులోకి తెస్తామని అధికారులు వెల్లడించారు. ఈ రహదారి అందుబాటులోకి రావడంతో గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు విజయవాడ నగరంలోకి వెళ్లకుండా రాజధాని అమరావతి మీదుగా రాకపోకలు సాగించవచ్చు. ఈ రోడ్డు వల్ల విజయవాడ నగరంలో ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం లభించనుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన వెస్ట్ బైపాస్ రోడ్డు ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిన్నా, పెద్దా సందడి.. నాలుగు తరాల సంక్రాంతి



ఆధునిక సమాజంలో కనుమరుగవుతున్న ఉమ్మడి కుటుంబాల్లోని ప్రేమానురాగాలను సంక్రాంతి పండుగ మళ్లీ తీసుకొచ్చింది. వ్యాపారాలు, ఉద్యోగాల రీత్యా వేర్వేరు నగరాల్లో స్థిరపడిన నాలుగు తరాలకు చెందిన 103 మంది కలిసి ఒకే చోట సంతోషంగా సంబరాలు చేసుకున్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణం ఏనుగుల బజారు సెంటరు దీనికి వేదికైంది. మండవ సీతారామాంజనేయులు, పూర్ణచంద్రరావు, మధుసూదన్‌రావు, వెంకటరెడ్డి మొదటి తరానికి చెందిన అన్నదమ్ములు. వీరి కుమారులు, కుమార్తెలు, మనవళ్లు, ముని మనవళ్లు ఇలా నాలుగు తరాలకు చెందిన కుటుంబ సభ్యులు అంతా సంక్రాంతి సంబరాల్లో పాల్గొని సందడి చేశారు. వీరందరూ చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ఒంగోలు తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఎక్కడ ఉన్నా ఏటా సంక్రాంతి సందర్భంగా మూడు రోజులపాటు సొంతూరు నరసరావుపేటకు వస్తారు. మన సంస్కృతి, సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించాలనే లక్ష్యంతో అందరం కలిసి పండుగ చేసుకుంటున్నామని వారు చెబుతున్నారు.

– ఈనాడు, నరసరావుపేట

పుష్కరకాలంగా బిడ్డకు పొంగల్ సారె

సైకిల్‌పై తీసుకెళ్లి ఇస్తున్న తండ్రి



తమిళనాడులోని పుదుకోట్టై జిల్లా తిరువరంగుళం సమీపం కొత్తకోట్టై గ్రామానికి చెందిన 82 ఏళ్ల చెల్లదురై ఆయన కుమార్తెకు ఏళ్లుగా పండుగ సారె తీసుకెళ్లి ఇస్తున్నారు. ఆయన కుమార్తె సుందరమ్మాల్‌కు 24ఏళ్ల కిందట నంబట్టికి చెందిన వ్యక్తితో వివాహమైంది. ఆమెకు 12 ఏళ్ల పాటు సంతానం కలగలేదు. ఆ తర్వాత కవల పిల్లలు జన్మించారు. మనవళ్లు పుట్టినప్పటి నుంచి సంప్రదాయం మరవకుండా ఏటా పొంగల్ రోజున సారె తీసుకెళ్తున్నారు. క్యాలెండర్, టెంకాయ, పండ్లు, పసుపు, కుంకుమ, పంచె, బియ్యం, కూరగాయలు సైకిల్‌పై వెనుక కట్టుకొని.. చెరకు గడలను తలపై పెట్టుకొని సైకిల్ తొక్కుకుంటూ 17 కి.మీ. దూరంలోని నంబట్టికి వరకు వెళ్లి అందించారు. ఆయన్ను అభినందిస్తూ కొత్తకోట్టై వ్యాపారవేత్తలు బ్యానర్ ఏర్పాటు చేశారు.

– న్యూస్‌టుడే, చెన్నై(ఆర్కేనగర్)

(c) eenadu

ఆర్సీబీ హ్యాట్రిక్

- గుజరాత్‌పై గెలుపు
- విజృంభించిన శ్రేయాంక, లారెన్
- మెరిసిన రాధ, రిచా



శ్రేయాంక 5/23

నవీ ముంబయి

డబ్ల్యూపీఎల్‌-4లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గెలుపు హ్యాట్రిక్ కొట్టింది. శుక్రవారం గుజరాత్ జెయింట్స్‌ను 32 పరుగుల తేడాతో ఓడించి సీజన్లో వరుసగా మూడో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. మొదట బెంగళూరు 7 వికెట్లకు 182 పరుగులు చేసింది. రాధ యాదవ్ (66; 47 బంతుల్లో 6×4, 3×6) టాప్ స్కోరర్. రిచా ఘోష్ (44; 28 బంతుల్లో 4×4, 2×6), నదైన్ డిక్లెర్క్ (26; 12 బంతుల్లో 2×4, 2×6) కీలక ఇన్నింగ్స్ ఆడారు. శ్రేయాంక పాటిల్ (5/23), లారెన్ బెల్ (3/29) విజృంభించడంతో ఛేదనలో గుజరాత్ 18.5 ఓవర్లలో 150 పరుగులకే ఆలౌటైంది. భార్తి ఫుల్మాలి (39; 20 బంతుల్లో 3×4, 3×6) టాప్ స్కోరర్. 4 మ్యాచ్‌లు ఆడిన గుజరాత్‌కు ఇది వరుసగా రెండో ఓటమి.

శ్రేయాంక, లారెన్ ధాటికి..: ఛేదనలో గుజరాత్ బాగానే మొదలుపెట్టింది. 3.4 ఓవర్లకు 34/0తో శుభారంభాన్ని చేసింది. ఆ తర్వాత ఆ జట్టు ఇన్నింగ్స్ కుదుపులకు లోనైంది. సోఫి డివైన్ (8)ను ఔట్ చేసిన అరుంధతి.. ఆర్సీబీకి బ్రేక్ ఇచ్చింది. కుదురుకున్న బెత్ మూనీ (27; 14 బంతుల్లో 4×4, 1×6), కనిక (16) స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు చేరడంతో గుజరాత్‌పై ఒత్తిడి పెరిగింది. దీనికి తోడు కెప్టెన్ ఆష్లీ గార్డ్‌నర్ (3), జార్జియా వేర్‌హామ్ (13) వెనుదిరగడంతో గుజరాత్ 10.4 ఓవర్లకు 70/5తో ఓటమి దిశగా పయనించింది. సాధించాల్సిన రన్‌రేట్ పెరిగిన స్థితిలో భార్తి ఫుల్మాలి ఎదురుదాడి చేసింది. అరుంధతి బౌలింగ్‌లో ఓ సిక్స్ అందుకున్న ఆమె.. లిన్సీ స్మిత్ బౌలింగ్‌లో రెండు బంతులను స్టాండ్స్‌లోకి కొట్టింది. సమీకరణం 5 ఓవర్లలో 61 పరుగులుగా మారింది. భార్తి జోరు చూస్తే ఆర్సీబీకి ఈ సీజన్లో తొలి ఓటమి తప్పదేమో అనిపించింది. కానీ 16వ ఓవర్లో కాష్వీ (18)ని ఔట్ చేసిన శ్రేయాంక.. గుజరాత్‌ను దెబ్బ కొట్టింది. ఆ తర్వాత జట్టు భారం మీద ఉన్న భార్తిని లారెన్ బెల్ ఓ స్లో బంతితో బోల్తా కొట్టించడంతో గుజరాత్ ఓటమి ఖాయమైపోయింది. తనుజ (21)తో పాటు రేణుక (2)ను ఔట్ చేసిన శ్రేయాంక.. గుజరాత్ ఇన్నింగ్స్‌కు తెరదించడంతో పాటు.. ఐదు వికెట్లు తన ఖాతాలో వేసింది.

నిలిచిన రాధ, రిచా: 5.3 ఓవర్లకు 43 పరుగులకే 4 వికెట్లు ఆరంభంలో బెంగళూరు ఇన్నింగ్స్ సాగిన తీరు ఇది. పవర్ ప్లేలో నాలుగు కీలక వికెట్లు చేజార్చుకున్న ఆర్సీబీ ఆరంభంలోనే ఇబ్బందుల్లో చిక్కుకుంది. ఆ దశలో 26/0తో మెరుగ్గానే ఆరంభించింది ఆ జట్టు.. ఆ తర్వాత తడబడింది. గత మ్యాచ్‌లో రాణించిన గ్రేస్ హారిస్ (17) తొలి వికెట్ రూపంలో ఔట్ కాగా.. తర్వాత హేమలత (4) ఆమెను అనుసరించింది. ఈ రెండు వికెట్లు కాష్వీ గౌతమ్ (2/42) ఖాతాలో చేరాయి. పతనం అక్కడితో ఆగలేదు. కెప్టెన్ స్మృతి మంధాన (4)తో పాటు గౌతమి నాయక్ (9) వికెట్లు పడిపోయాయి. ఈ స్థితిలో బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వచ్చిన రాధ యాదవ్ అదరగొట్టింది. రిచా ఘోష్‌తో కలిసి ఇన్నింగ్స్ నిలబెట్టింది. ఈ జంట ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగి పరుగులు రాబట్టింది. వేర్‌హామ్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్‌తో రాధ మొదలుపెడితే.. తర్వాత రిచా అందుకుంది. 13 ఓవర్లకు 108/4తో ఆర్సీబీ మెరుగైన స్థితిలో నిలిచింది. ఈ క్రమంలోనే రాధ 36 బంతుల్లో అర్ధసెంచరీ సాధించింది. అర్ధసెంచరీ ముంగిట రిచా వెనుదిరగడంతో ఇన్నింగ్స్ వేగం తగ్గింది. 18 ఓవర్లకు బెంగళూరు స్కోరు 5 వికెట్లకు 156 పరుగులే. ఈ స్థితిలో కాష్వీ వేసిన 19వ ఓవర్లో నదైన్ డిక్లెర్క్ చెలరేగింది. ఆమె 2 ఫోర్లు, 2 సిక్స్‌లు బాదడంతో బెంగళూరు ఊహించని స్కోరు చేసింది. ఆఖరి ఓవర్లో రాధ, డిక్లెర్క్ వికెట్లు కోల్పోయి ఆర్సీబీ 4 పరుగులే చేసింది. సోఫి డివైన్ మూడు వికెట్లు పడగొట్టింది.



రాధ యాదవ్ 66

బెంగళూరు ఇన్నింగ్స్: గ్రేస్ హారిస్ ఎల్బీ (బి) కాష్వీ గౌతమ్ 17; స్మృతి (సి) రాజేశ్వరి (బి) రేణుక 5; హేమలత (సి) శివాని (బి) కాష్వీ గౌతమ్ 4; గౌతమి ఎల్బీ (బి) డివైన్ 9; రాధ యాదవ్ (సి) వేర్‌హామ్ (బి) డివైన్ 66; రిచా (సి) గార్డ్‌నర్ (బి) వేర్‌హామ్ 44; డిక్లెర్క్ (సి) రాజేశ్వరి (బి) డివైన్ 26; అరుంధతి నాటౌట్ 2; శ్రేయాంక నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) **182; వికెట్ల పతనం:** 1-26, 2-33, 3-39, 4-43, 5-148, 6-179, 7-180; **బౌలింగ్:** రేణుక 4-0-41-1; కాష్వీ గౌతమ్ 4-0-42-2; ఆష్లీ గార్డ్‌నర్ 4-0-32-0; సోఫి డివైన్ 4-0-31-3; జార్జియా వేర్‌హామ్ 4-0-35-1

గుజరాత్ ఇన్నింగ్స్: బెత్ మూనీ ఎల్బీ (బి) శ్రేయాంక 27; సోఫి డివైన్ (సి) అండ్ (బి) అరుంధతి 8; కనిక ఎల్బీ (బి) శ్రేయాంక 16; ఆష్లీ గార్డ్‌నర్ (సి) రిచా (బి) బెల్ 3; జార్జియా వేర్‌హామ్ (సి) రాధ (బి) డిక్లెర్క్ 13; భార్తీ (సి) హారిస్ (బి) బెల్ 39; కాష్వీ గౌతమ్ (సి) హారిస్ (బి) బెల్ 18; తనూజ కన్వర్ (సి) మంధాన (బి) శ్రేయాంక 21; శివాని సింగ్ (సి) అరుంధతి (బి) బెల్ 0; రాజేశ్వరి గైక్వాడ్ నాటౌట్ 0; రేణుక సింగ్ (సి) అరుంధతి (బి) శ్రేయాంక 2; ఎక్స్‌ట్రాలు 3 **మొత్తం:** (18.5 ఓవర్లలో ఆలౌట్) **150; వికెట్ల పతనం:** 1-34, 2-38, 3-46, 4-63, 5-70, 6-126, 7-139, 8-39, 9-148; **బౌలింగ్:** లారెన్ బెల్ 4-0-29-3, లిన్సీ స్మిత్ 2-0-27-0, అరుంధతి రెడ్డి 4-0-31-1, శ్రేయాంక పాటిల్ 3.5-0-23-5, నదైన్ డిక్లెర్క్ 3-0-30-1, రాధ యాదవ్ 2-0-9-0

ఛాంపియన్

డబ్ల్యూపీఎల్‌లో ఈనాడు

ముంబయి × యూపీ
వేదిక: ముంబయి, మ॥ 3.00

దిల్లీ × బెంగళూరు
వేదిక: ముంబయి, రా॥ 7.30

హర్లీన్ మెరుపులతో యూపీ బోణీ

నవీ ముంబయి: మహిళల ప్రీమియర్ లీగ్‌లో యూపీ వారియర్స్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. దిల్లీతో మ్యాచ్‌లో చక్కగా బ్యాటింగ్ చేస్తున్న సమయంలో టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయం కారణంగా రిటైర్డ్ ఔట్‌గా వెనుదిరగాల్సి వచ్చిన హర్లీన్ డియోల్.. గురువారం ముంబయితో మ్యాచ్‌లో అద్భుతంగా ఆడింది. 39 బంతుల్లో 64 పరుగులు చేసి టోర్నీలో జట్టుకు తొలి విజయాన్నందించింది. ఆమెకు తోడు ట్రయాన్ (11 బంతుల్లో 27) మెరవడంతో యూపీ వారియర్స్ 162 పరుగుల లక్ష్యాన్ని 18.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. యూపీ ఓపెనర్లు మెగ్ లానింగ్ (26 బంతుల్లో 25), కిరణ్ నవ్‌గిరె (12 బంతుల్లో 10) మరోసారి విఫలమయ్యారు. అంతకుముందు నాట్ సీవర్ బ్రంట్ (43 బంతుల్లో 65) అర్ధసెంచరీతో ముంబయి 20 ఓవర్లలో 5 వికెట్లకు 161 పరుగులు సాధించింది. తొలి 10 ఓవర్లలో ఆ జట్టు 54 పరుగులు మాత్రమే చేసింది. నాట్ సీవర్‌కు తోడు నికోలా కేరీ (32) చివర్లో బ్యాట్ ఝళిపించడంతో ఆఖరి పది ఓవర్లలో ఆ జట్టు 107 పరుగులు రాబట్టింది.

భారత్ జోరుకు బంగ్లా నిలిచేనా!

అండర్-19 వన్డే ప్రపంచకప్

మధ్యాహ్నం 1 నుంచి

బులవాయో: అండర్-19 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు మరో సమరానికి సిద్ధమైంది. శనివారం జరిగే గ్రూప్-బి పోరులో బంగ్లాదేశ్‌తో ఆయుష్ మాత్రే బృందం తలపడనుంది. జోరు మీదున్న అయిదుసార్లు ఛాంపియన్ భారత్‌ను నిలవరించడం బంగ్లాకు తేలికేం కాదు. తొలి మ్యాచ్‌లో అమెరికాపై విజృంభించిన పేసర్ హెనిల్ పటేల్ మరోసారి సత్తా చాటితే బంగ్లాకు కష్టమే. మొదటి మ్యాచ్‌లో విఫలమైన సంచలన బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ బంగ్లాపై ఎలా ఆడతాడో చూడాలి. అతడికి తోడు ఆయుష్ మాత్రే, ఆరోన్ జార్జి, అభిజ్ఞాన్ కుందు రాణిస్తే టీమ్‌ఇండియాకు తిరుగుండదు. హెనిల్ పటేల్, అంబ్రిష్, కిలాన్ పటేల్, మహ్మద్ ఇనాన్ లాంటి ప్రతిభావంతులతో భారత బౌలింగ్ లైనప్ బలంగా ఉంది. మరోవైపు బంగ్లాదేశ్ బ్యాటింగ్‌లో కెప్టెన్ అజీజుల్ హకీమ్, వైస్ కెప్టెన్ జావద్ అబ్రార్‌పైనే ఆధారపడుతుంది. ఈ జంట గత టోర్నీలో 1000కి పైగా పరుగులు చేసింది. కలామ్ సిద్ధిఖీ కూడా ప్రమాదకర బ్యాటరే. పేస్‌కు అనుకూలమైన జింబాబ్వే పిచ్‌లపై ఇక్బాల్ హుస్సేన్, అల్ ఫహాద్‌లు భారత బ్యాటర్లకు సమస్యలు సృష్టించే అవకాశం లేకపోలేదు. గత అండర్-19 ప్రపంచకప్ నుంచి ఇక్బాల్ 45.. ఫహాద్ 43 వికెట్లు తీసి జోరు మీదున్నారు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ సమీన్ బషీర్ కూడా ప్రతిభావంతుడే. భారత బ్యాటర్లు వీరిని అడ్డుకోవాల్సి ఉంది.

విజృంభించిన హెనిల్

భారత్ బోణీ



హెనిల్ పటేల్

బులవాయో: పేసర్ హెనిల్ పటేల్ (5/16) విజృంభించడంతో వన్డే ప్రపంచకప్‌లో భారత్ బోణీ కొట్టింది. గురువారం జరిగిన గ్రూప్-బి తొలి మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో అమెరికాను చిత్తు చేసింది. ఈ వర్ష ప్రభావిత మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన అమెరికా.. హెనిల్ పటేల్ ధాటికి 35.2 ఓవర్లలో 107 పరుగులకే కుప్పకూలింది. రెండో ఓవర్లోనే వికెట్ చేజార్చుకున్న అమెరికా.. తర్వాత 39/5తో కష్టాల్లో పడింది. ఆ తర్వాత 69/5తో కాస్త కోలుకున్నా.. మళ్లీ తడబడింది. నితీష్ సుదిని (36) నిలిచి స్కోరును 100 దాటించాడు. అతడు ఆఖరి వికెట్ రూపంలో ఔటయ్యాడు. అదింత్ (18), సాహిల్ (16), అర్జున్ (16) రెండంకెల స్కోరు చేశారు. దీపేశ్, అంబ్రిష్, ఖిలాన్, సూర్యవంశీ తలో వికెట్ తీశారు. వర్షం కారణంగా లక్ష్యాన్ని 37 ఓవర్లలో 96కు కుదించగా.. భారత్ 17.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. అభిజ్ఞాన్ కుందు (42 నాటౌట్) రాణించాడు. స్వల్ప ఛేదనలో భారత్ కూడా 25/3తో తడబడింది. సూర్యవంశీ (2), వేదాంత్ త్రివేది (2), ఆయుష్ మాత్రే (19) నిలవలేకపోయారు. ఈ స్థితితో అభిజ్ఞాన్, విహాన్ (18) జట్టును విజయం దిశగా తీసుకెళ్లారు. విహాన్ వెనుదిరిగినా.. కనిష్క్ (10 నాటౌట్)తో కలిసి అభిజ్ఞాన్ పని పూర్తి చేశాడు. అమెరికా బౌలర్లలో రిత్విక్ అప్పిడి (2/24) ఆకట్టుకున్నాడు.



లక్ష్యసేన్

లక్ష్యసేన్ ఓటమి

దిల్లీ: ఇండియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది. స్టార్ షట్లర్ లక్ష్యసేన్‌కు క్వార్టర్‌ఫైనల్లో చుక్కెదురైంది. శుక్రవారం పురుషుల సింగిల్స్ పోరులో లక్ష్యసేన్ 21-17, 13-21, 18-21తో లిన్ చున్ (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం చవిచూశాడు. ప్రిక్వార్టర్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 14-21, 21-17, 17-21తో క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో, హెచ్.ఎస్.ప్రణయ్ 21-18, 19-21, 14-21తో లో కీన్ యు (సింగపూర్) చేతిలో ఓటమి పాలయ్యారు. టైటిల్ ఫేవరెట్ సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జోడీ కూడా టోర్నీ నుంచి నిష్క్రమించింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్- చిరాగ్ జోడీ 27-25, 21-23, 19-21తో హిరోకి మిదొరికవా- కొహె యమషిత (జపాన్) జంట చేతిలో పోరాడి ఓడింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ జోడీ 22-20, 22-24, 21-23తో లీ యుజింగ్- లూ షుమిన్ (చైనా) జంట చేతిలో పరాజయం చవిచూసింది.

ఇక్కడెలా నిర్వహిస్తారు?: బ్లిక్‌ఫెల్ట్

ఇండియా ఓపెన్‌కు ఆతిథ్యమిస్తున్న ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలోని పరిస్థితుల పట్ల మియా బ్లిక్‌ఫెల్ట్ (డెన్మార్క్) మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. స్టేడియంలోని పరిస్థితులు ఆమోదయోగ్యం కావని.. అత్యంత దారుణంగా ఉన్నాయని విమర్శించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఏడాది ఆగస్టులో ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించింది. ''భారత్‌లో గడిచిన కొన్ని రోజులు ఊహించిన దానికంటే కఠినంగా ఉన్నాయి. అత్యంత దారుణమైన పరిస్థితులు ఎదుర్కోడానికి మానసికంగా సిద్ధపడే వచ్చాను. కానీ ఇక్కడి వాతావరణం ఏమాత్రం బాగాలేదు. కోర్టు లోపల, బయట క్రీడాకారుల ఏకాగ్రత కష్టంగా మారుతోంది. అందరూ తీవ్ర ఒత్తిడి, అసహనానికి లోనవుతున్నారు'' అని సామాజిక మాధ్యమం వేదికగా బ్లిక్‌ఫెల్ట్ వ్యాఖ్యానించింది. ఇండోర్ స్టేడియం గ్యాలరీలో కోతులు కనిపించడం.. పక్షుల రెట్టల వల్ల ఆటకు అంతరాయం కలగడంతో నిర్వహణపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై స్పందించిన బీడబ్ల్యూఎఫ్.. పాత వేదిక కంటే ఇందిరాగాంధీ స్టేడియం మెరుగైనదని పేర్కొంది. చలి వాతావరణం వల్ల కొన్ని సవాళ్లు ఎదురయ్యాయని తెలిపింది. ఆగస్టు వరకు లోపాలను సరిదిద్ది, మెరుగైన వసతులతో అంతర్జాతీయ స్థాయిలో టోర్నీ నిర్వహిస్తామని.. క్రీడాకారుల భద్రతే తమ ప్రాధాన్యమని వివరించింది.

టీ20 జట్టులో శ్రేయస్, బిష్ణోయ్



శ్రేయస్ అయ్యర్

దిల్లీ: రెండేళ్ల విరామం తర్వాత స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ టీమ్‌ఇండియా టీ20 జట్టులో చోటు సంపాదించాడు. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌లకు సెలక్టర్లు అతడిని ఎంపిక చేశారు. శస్త్రచికిత్స కారణంగా దూరమైన తిలక్ వర్మ స్థానాన్ని శ్రేయస్ అయ్యర్‌తో భర్తీ చేశారు. శ్రేయస్ చివరగా 2023 డిసెంబరులో టీ20 మ్యాచ్ (ఆస్ట్రేలియా) ఆడాడు. మరోవైపు న్యూజిలాండ్‌తో తొలి వన్డే సందర్భంగా గాయపడిన ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్.. 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కూ దూరమయ్యాడు. అతడి స్థానంలో లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ జట్టులోకి వచ్చాడు. బిష్ణోయ్ ఇప్పటిదాకా 42 టీ20ల్లో 61 వికెట్లు తీశాడు. అతడు 2025 ఫిబ్రవరిలో భారత్ తరఫున చివరిసారిగా పొట్టి ఫార్మాట్‌లో ఆడాడు. తిలక్‌వర్మ చివరి రెండు మ్యాచ్‌లకు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. సుందర్ గాయం నుంచి కోలుకునేందుకు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు వెళ్లనున్నాడు. కివీస్‌తో టీ20 సిరీస్ 21న ఆరంభంకానుంది.



బౌలింగ్ మారకపోతే..

ఇండోర్: న్యూజిలాండ్‌తో స్వదేశంలో గత సిరీస్ (టెస్టు)లో ఘోరంగా విఫలమైంది టీమ్‌ఇండియా. మూడు టెస్టుల సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైంది. ఆ సిరీస్‌కు ప్రతీకారంగా ఈసారి వన్డే, టీ20 సిరీస్‌లను గెలుచుకోవాలని పట్టుదలగా ఉంది. కానీ.. భారత బౌలింగ్ భయపెడుతోంది. తొలి రెండు వన్డేల్లో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేయడంలో మన బౌలర్లు విఫలమయ్యారు. ప్రధానంగా స్పిన్నర్లు. మధ్య ఓవర్లలో స్వేచ్ఛగా పరుగులు సాధిస్తోన్న కివీస్ బ్యాటర్లు తమ జట్టుపై ఎలాంటి ఒత్తిడి లేకుండా జాగ్రత్త పడుతున్నారు. ప్రధాన స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ బౌలింగ్‌లో వారి బ్యాటింగ్ వ్యూహాత్మకంగా సాగుతోంది. డరిల్ మిచెల్ ముందుకు వస్తూ బంతి స్పిన్ కాకముందే దాడికి దిగుతున్నాడు. అతడి బంతులను డరిల్‌తో పాటు ఇతర బ్యాటర్లు అలవోకగా స్వీప్ చేస్తూ పరుగులు రాబట్టారు. కుల్‌దీప్ మాత్రమే కాదు.. మిగతా స్పిన్నర్లు ఎలాంటి ప్రభావం చూపలేకపోయారు. రెండు వన్డేల్లో కలిపి భారత స్పిన్నర్లు తీసింది రెండే వికెట్లు. ఆ రెండు కుల్‌దీప్ ఖాతాలో చేరాయి. బ్యాటర్లను కట్టడి చేస్తున్నప్పటికీ రవీంద్ర జడేజా వికెట్లు పడగొట్టడంలో రెండు మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడు. తొలి మ్యాచ్‌లో వాషింగ్టన్ సుందర్ గాయం కారణంగా కోటా పూర్తిచేయలేదు. రెండో మ్యాచ్‌లో అతడి స్థానంలో ఆడిన నితీశ్ కుమార్ రెడ్డి కేవలం రెండు ఓవర్లే బౌలింగ్ చేశాడు. ఇక్కడ పరిస్థితులపై పెద్దగా అనుభవం లేని కివీస్ స్పిన్నర్లే మెరుగైన ప్రదర్శన చేశారు. సిరీస్‌లో నిర్ణయాత్మక వన్డేకు వేదికైన ఇండోర్ బ్యాటింగ్‌కు అనుకూలం. బౌలర్లు క్రమశిక్షణ తప్పితే బంతి బౌండరీలో దర్శనమివ్వడం ఖాయం. ఇక్కడ వికెట్లకు నేరుగా బంతులేస్తూ.. లెంగ్త్‌లో వైవిధ్యంతో బ్యాటర్లను కట్టడి చేయాలి. మరి ఈ మ్యాచ్‌కు భారత్ ఎలాంటి వ్యూహంతో బరిలో దిగుతుందన్నది ఆసక్తికరం. నితీశ్ కుమార్ స్థానంలో ఆఫ్‌స్పిన్ వేయగల ఆయుష్ బదోనిని తుది జట్టులోకి తెచ్చే అవకాశాలు లేకపోలేదు. పిచ్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలో లెఫ్ట్ ఆర్మ్ సీమర్ అర్ష్‌దీప్ సింగ్‌ను ఆడించొచ్చు. ఏదేమైనా ఈ మ్యాచ్‌లో బౌలింగే భారత్ విజయంలో కీలకపాత్ర పోషించబోతోంది.

కోహ్లి 1547 రోజులు..



కోహ్లి

దుబాయ్: స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి వన్డే ర్యాంకింగ్స్‌లో విషయంలో జరిగిన పొరపాటును అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సవరించింది. నాలుగేళ్ల తర్వాత అతడు వన్డే బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకున్న సంగతి తెలిసిందే. ఆ వివరాలతో కూడిన వార్తలో.. నంబర్ వన్ బ్యాటర్‌గా కోహ్లి 825 రోజులు పూర్తిచేసుకున్నాడని తొలుత పేర్కొంది. కానీ అతడు 1547 రోజులు ఆ స్థానంలో ఉన్నాడని గణాంక నిపుణులు తెలపడంతో సామాజిక మాధ్యమంలో ఐసీసీపై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పును గుర్తించిన ఐసీసీ వెంటనే ఆ పోస్టును తొలగించి.. సవరించిన తర్వాత మళ్లీ పోస్ట్ చేసింది. అత్యధిక రోజులు నంబర్‌వన్‌గా కొనసాగిన ఆటగాళ్ల జాబితాలో కోహ్లి మూడో స్థానంలో ఉన్నాడు. దిగ్గజ క్రికెటర్లు వివియన్ రిచర్డ్స్ (2,306), బ్రయాన్ లారా (2,079) అతడి కంటే ముందున్నారు.

ఆర్యన్.. భారత 92వ గ్రాండ్‌మాస్టర్



ఆర్యన్

దిల్లీ: చెస్‌లో భారత్ నుంచి మరో గ్రాండ్‌మాస్టర్ వచ్చాడు. దిల్లీకి చెందిన 21 ఏళ్ల ఆర్యన్ వర్ష్నే గ్రాండ్‌మాస్టర్ హోదా సొంతం చేసుకున్న భారత 92వ ఆటగాడిగా నిలిచాడు. అర్మేనియాలో అండ్రానిక్ మార్గరియాన్ టైటిల్‌ను గెలుచుకోవడం ద్వారా అతడు ఈ ఘనత సాధించాడు. టోర్నీలో 8వ రౌండ్లో అంబర్ట్ సుమియన్‌తో గేమ్‌ను డ్రా చేసుకోవడంతో గ్రాండ్‌మాస్టర్‌కు అవసరమైన మూడో నార్మ్‌ను అతడు సొంతం చేసుకున్నాడు.

ఫైనల్లో విదర్భ, సౌరాష్ట్ర


విజయ్ హజారే ట్రోఫీ



విశ్వరాజ్ జడేజా 165*

బెంగళూరు: విజయ్ హజారే దేశవాళీ వన్డే టోర్నీలో విదర్భ వరుసగా రెండోసారి ఫైనల్లో అడుగుపెట్టింది. ఆదివారం జరిగే ఫైనల్లో విదర్భతో సౌరాష్ట్ర తలపడనుంది. శుక్రవారం సౌరాష్ట్ర 9 వికెట్ల తేడాతో పంజాబ్‌ను చిత్తు చేసి తుది పోరుకు అర్హత పొందింది. మొదట పంజాబ్ నిర్ణీత 50 ఓవర్లలో 291 పరుగులకు ఆలౌటైంది. అన్మోల్‌ప్రీత్ సింగ్ (100) సెంచరీకి తోడు కెప్టెన్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (87) రాణించాడు. చేతన్ సకారియా నాలుగు వికెట్లు పడగొట్టాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విశ్వరాజ్ జడేజా (165 నాటౌట్; 127 బంతుల్లో 18×4, 3×6) అజేయ శతకంతో చెలరేగడంతో.. సౌరాష్ట్ర 39.3 ఓవర్లలో ఒకే వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ హార్విక్ దేశాయ్ (64), ప్రేరక్ మన్కడ్ (52 నాటౌట్) రాణించారు. గురువారం జరిగిన తొలి సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ కర్ణాటకను 6 వికెట్ల తేడాతో విదర్భ ఓడించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అమన్ మోఖడే (138) చెలరేగడంతో విదర్భ 281 పరుగుల లక్ష్యాన్ని 46.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అంతకుముందు కర్ణాటక 49.4 ఓవర్లలో 280 పరుగులకు ఆలౌటైంది. కరుణ్ నాయర్ (76), క్రిష్ణన్ శ్రీజిత్ (54) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. దర్శన్ నల్కండే (5/48) విజృంభించాడు.

కెరీర్ గ్లాండ్‌స్లామ్‌పై ఆ ఇద్దరి కన్ను



అల్కరాస్

మెల్‌బోర్న్: కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్), ఇగా స్వైటెక్ (పోలెండ్).. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్లో ఓ లక్ష్యంతో బరిలో దిగుతున్నారు. ఆదివారం ఆరంభమయ్యే ఈ టోర్నీలో విజేతగా నిలిచి కెరీర్ గ్రాండ్‌స్లామ్‌ను పూర్తి చేయాలని ఈ ఇద్దరు స్టార్లు పట్టుదలతో ఉన్నారు. ఇప్పటిదాకా ఆరు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన అల్కరాస్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్ మాత్రమే దక్కలేదు. 2024, 2025లతో అతడు క్వార్టర్‌ఫైనల్స్‌లోనే ఓడాడు. ఈసారి అతడు ఎలా ఆడతాడనేది ఆసక్తికరం. గత రెండేళ్లుగా ఆస్ట్రేలియన్ ఓపెన్లో విజేతగా ఉన్న యానిక్ సినర్ నుంచి అతడికి గట్టిపోటీ తప్పదు. గతేడాది సినర్-అల్కరాస్ మధ్య పోరాటాలు అభిమానులను ఎంతో అలరించాయి. 2025లో చెరో రెండు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గారు వీళ్లు. ఈ సీజన్ తొలి టోర్నీలోనూ మరోసారి ఈ స్టార్ల మధ్య హోరాహోరీ పోటీని చూడొచ్చు. మరోవైపు ఆరు టైటిళ్లు సాధించిన ఇగా స్వైటెక్‌దీ ఇదే కథ. ఆస్ట్రేలియన్ ఓపెన్లో ఆమె 2022, 2025లో సెమీఫైనల్ దాకా వచ్చింది. ఈసారి గెలిస్తే కెరీర్ గ్రాండ్‌స్లామ్‌ను సొంతం చేసుకుంటుంది.



స్వైటెక్

బెంగళూరు స్టేడియంలో ఏఐ నిఘా

కేఎస్‌సీఏకు ఆర్సీబీ ప్రతిపాదన

బెంగళూరు: చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించాలని పట్టుదలగా ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఫ్రాంఛైజీ కీలక ప్రతిపాదన చేసింది. స్టేడియంలో ప్రేక్షకుల నియంత్రణ, కట్టుదిట్టమైన భద్రత కోసం 300 నుంచి 350 అత్యాధునిక ఏఐ (కృత్రిమ మేధ) ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ కెమెరాల కోసం సుమారు రూ.4.50 కోట్ల ఖర్చును తామే భరిస్తామంటూ కర్ణాటక స్టేట్ క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ)కు తెలియజేసింది. ''అధునాతన సాంకేతికతతో స్టేడియం లోపలికి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు ప్రేక్షకుల సమర్థ నిర్వహణ కేఎస్‌సీఏ, పోలీసు యంత్రాంగానికి సులువవుతుంది. అభిమానుల భద్రతను గణనీయంగా పెంచడానికి అవకాశం లభిస్తుంది'' అని ఆర్సీబీ పేర్కొంది. నిరుడు ఐపీఎల్ ఛాంపియన్ ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 11 మంది అభిమానులు చనిపోయినప్పటి నుంచి బెంగళూరు స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణ పూర్తిగా నిలిచిపోయింది. రానున్న ఐపీఎల్ మ్యాచ్‌ల ఆతిథ్యంపై కూడా సందిగ్ధం నెలకొనడంతో ఆర్సీబీ ఏఐ కెమెరాల ప్రతిపాదనతో ముందుకొచ్చింది.

బంగ్లాకు ఐసీసీ అధికారులు

దుబాయ్: భారత్‌లో జరిగే టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లలో బంగ్లాదేశ్ పాల్గొనడంపై నెలకొన్న సందిగ్ధానికి తెరదించేందుకు ఐసీసీ మరో అడుగేసింది. భద్రత కారణాలతో తమ మ్యాచ్‌ల వేదికలను మార్చాలన్న డిమాండ్ నేపథ్యంలో బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ)తో చర్చించేందుకు ఇద్దరు సభ్యుల ఐసీసీ బృందం శనివారం ఢాకా చేరుకోనుంది. ఇప్పటికే ఖరారైన షెడ్యూల్‌లో మార్పులు చేయడం సాధ్యంకాదని స్పష్టం చేసినప్పటికీ.. బంగ్లా ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న ఐసీసీ ఈ నిర్ణయం తీసుకుంది. కోల్‌కతా, ముంబయి వేదికలలో జరగాల్సిన తమ మ్యాచ్‌లను దక్షిణాది నగరాలకు లేదా శ్రీలంకకు మార్చాలని బీసీబీ పట్టుబడుతోంది. ముఖ్యంగా ఫిబ్రవరి 17న ముంబయిలో నేపాల్‌తో జరిగే గ్రూపు-సి మ్యాచ్ విషయంలో స్థానిక రాజకీయ నాయకుల వ్యాఖ్యలు.. ఐపీఎల్ నుంచి పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తప్పించడం వంటి అంశాలను తమ ఆటగాళ్ల భద్రతకు ముప్పుగా బీసీబీ ప్రస్తావిస్తోంది. అయితే షెడ్యూల్‌లో మార్పులు అసాధ్యమని ఐసీసీ ఈపాటికే స్పష్టం చేసింది. కేవలం ఊహాజనిత కారణాలతో చివరి నిమిషంలో వేదికలు మారిస్తే.. భవిష్యత్తులో ఇతర దేశాలు కూడా ఇలాంటి డిమాండ్లు చేసే ప్రమాదముందని ఐసీసీ భావిస్తోంది. ఐసీసీ భద్రత అంచనా ప్రకారం ముప్పు స్థాయి తక్కువ నుంచి సాధారణంగానే ఉందని.. ఆటగాళ్లకు పూర్తి రక్షణ కల్పిస్తామని హామీ ఇవ్వనుంది. ఈ చర్చల్లో బంగ్లా ప్రభుత్వ అధికారులు కూడా పాల్గొనే అవకాశముంది. మరోవైపు బంగ్లా ప్రీమియర్ లీగ్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలతో 9 మంది ఆటగాళ్లను బీసీబీ సస్పెండ్ చేసింది. దీనిపై సమగ్ర విచారణ జరిపేందుకు ఐసీసీ అవినీతి నిరోధక విభాగం అధిపతి ఆండ్రూ ఎఫ్గ్రేవ్ ఢాకాలో పర్యటించనున్నాడు. క్రికెటర్ల సంక్షేమ సంఘం ఈ ఫిక్సింగ్ అంశాన్ని లేవనెత్తడంతో ఐసీసీ సీరియస్‌గా తీసుకుంది.

(c) eenadu

లేన్ తప్పితే... లైఫ్ తప్పినట్లే!!

భారీ వాహనాలు.. లైట్ మోటార్.. ద్విచక్ర ప్రయాణం.. అంటూ ప్రయాణాలు సాగించే సాధనానికి జాతీయ రహదారులపై ఎన్ని లేన్లున్నా అవగాహనతో పాటు క్రమశిక్షణ లేకపోతే రోడ్డు ప్రమాదాలు తప్పవని హెచ్చరిస్తున్నారు నిపుణులు...

వేగవంతమైన ప్రయాణం కోసం నిర్మించిన జాతీయ రహదారులు... డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం వల్ల భారీ ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. వాహనదారులకు లేన్ క్రమశిక్షణ లేకపోవడమే దీనికి కారణంగా గుర్తించారు. 'క్రమశిక్షణ పాటించకపోవడమనేది కేవలం ట్రాఫిక్ ఉల్లంఘన కాదు.. కొందరి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే నేరం' అని హెచ్చరిస్తున్నారు రహదారి భద్రతా నిపుణులు.



ఈ తప్పిదాలు చేయొద్దు...

- డివైడర్‌ని ఆనుకుని ఉండే కుడి లేన్‌ను ఓవర్ టేకింగ్‌కు కాకుండా సాధారణ ప్రయాణానికి వాడటం.
- ఎడమ లేన్‌లో వేగంగా వెళ్లి ఓవర్ టేకింగ్ చేయడం.
- అకస్మాత్తుగా లేన్‌లు మారడం.
- భారీ వాహనాలు మధ్య లేన్లలో నిలిచిపోవడం. ఇది గమనించక వెనుక నుంచి వాహనాలు ఢీకొట్టడం.

ఏ లేన్ దేనికి..

4 వరుసల హైవే (ఒక దిశలో రెండు లేన్లు)



- ఎడమ వరుస: నెమ్మదిగా వెళ్లే బస్సులు, ట్రక్కులు, తక్కువ వేగంగా వెళ్లే కార్లు.
- కుడి వరుస: డివైడర్‌ను ఆనుకుని కుడి వైపు ఉండే దీనిని ఓవర్ టేక్ చేయడానికి ఉపయోగించాలి. అదే వేగంతో వెళ్తే ఆ లేన్ కొనసాగించవచ్చు. మీ వెనకున్న వాహనం ఓవర్‌టేక్‌కు ప్రయత్నిస్తుంటే మీరు ఎడమకు మారాలి.

6 వరుసల రహదారి (ఒక దిశలో మూడు లేన్లు)



- ఎడమ వరుస: భారీ వాహనాలు, బస్సులు, నెమ్మదిగా వెళ్లే వాహనాలు
- మధ్య వరుస (మిడిల్ లేన్): సాధారణ వేగంతో ప్రయాణించే కార్లు, ఇతర తేలికపాటి వాహనాలు
- కుడి వరుస: ఇది ఫాస్ట్ లేన్, వేగంగా వెళ్లే వాహనాలు, ఓవర్ టేకింగ్‌కు ఉపయోగించాలి.

8 వరుసల ఎక్స్‌ప్రెస్ హైవే (ఒక దిశలో నాలుగు లేన్లు)



- చివరి ఎడమ వరుస: భారీ సరుకు రవాణా వాహనాలు.
- మధ్యలో రెండు వరుసలు: ప్రయాణికుల వాహనాలు, కార్లు.
- చివరి కుడివరుస: అత్యంత వేగంగా వెళ్లే వాహనాల కోసం.

గీతలు కావు భద్రతా సూచికలు...

జాతీయ రహదారులపై కనిపించే తెలుపు, పసుపు గీతలు వాహనదారుల భద్రతకు సూచికలు. మరి అవి ఏం చెప్తున్నాయో తెలుసుకుందాం...

నిరంతర తెలుపు గీత: రోడ్డు మధ్యలో లేదా లేన్ పక్కన కనిపించే ఈ గీత లేన్ మార్చకూడదని సూచిస్తుంది. ముఖ్యంగా మలుపులు, వంతెనల వద్ద ఉంటుంది.

బ్రోకెన్ వైట్‌లైన్ (తెగిన తెలుపు గీత): ఇది ఉన్న చోట లేన్ మార్చుకోవచ్చు. ట్రాఫిక్ తక్కువగా ఉన్నప్పుడు ముందున్న వాహనాన్ని దాటేందుకు ప్రయత్నించవచ్చు.

నిరంతర పసుపు గీత: రోడ్డు మధ్యలో ఉండే ఈ గీత ఓవర్‌టేక్ చేయకూడదనడానికి హెచ్చరిక. ఎదురుగా ఎక్కువ వాహనాలు వచ్చే అవకాశం ఉండే ప్రాంతాల్లో ఇది ఉంటుంది.

బ్రోకెన్ ఎల్లో లైన్ (తెగిన పసుపు గీత): ఇది ఉంటే ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తూ ఓవర్ టేక్ చేయవచ్చు.

డబుల్ ఎల్లో లైన్స్: ఇవి ఉంటే ఎట్టి పరిస్థితుల్లోనూ లేన్ మార్చకూడదు. ఓవర్ టేక్ చేయకూడదు. అత్యంత ప్రమాదకర ప్రాంతాలను ఇది సూచిస్తుంది.

- ఈనాడు, విశాఖపట్నం

9 ఏళ్ల బాలుడు.. సైకిలుపై 9 వేల కి.మీ.



పిల్లలు బొమ్మలతో ఆడుకునే తొమ్మిదేళ్ల వయసులో బిహార్‌లోని బుద్ధగయాకు చెందిన యశ్‌రాజ్ సైకిలుపై దేశాన్ని చుట్టేస్తున్నాడు. సాధించాలనే తపన, విశ్వాసం ఉంటే వయసు పెద్ద విషయమే కాదని ఈ బాలుడు నిరూపిస్తున్నాడు. తన ప్రయాణంలో దేశవ్యాప్తంగా ఉన్న ఆధ్యాత్మిక క్షేత్రాల దర్శనం చేసుకొంటూ ఇప్పటికే దాదాపు 9,000 కి.మీ. తిరిగాడు. శ్రీరామ మందిర ఆరాధించే యశ్‌రాజ్ ఏడేళ్ల వయసులోనే గయా నుంచి అయోధ్యకు (450 కి.మీ.) రామాలయ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సైకిలుపై వెళ్లాడు. ఇప్పుడు 12 జ్యోతిర్లింగాల దర్శన లక్ష్యంగా గురువారం గయాలోని విష్ణుపాద ఆలయం నుంచి మరో సుదీర్ఘ ప్రయాణం ప్రారంభించాడు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా సాగించే తన యాత్రలో సనాతన ధర్మం, పర్యావరణ పరిరక్షణ, మత్తు పదార్థాల నుంచి విముక్తి లక్ష్యంగా తాను ప్రచారం సాగిస్తానని యశ్‌రాజ్ తెలిపాడు. పెద్దయ్యాక సైన్యంలో చేరడం తన కలగా పేర్కొన్నాడు. బుద్ధ గయాలో హోటలు నడుపుతున్న ఈ బాలుడి తండ్రి ప్రకాశ్‌కుమార్ గుప్తా కుమారుడి రక్షణార్థం తాను మరో సైకిలుతో ఈ యాత్రల్లో అనుసరిస్తున్నారు.

- ఈటీవీ భారత్


నల్ల రెక్కల స్టిల్ట్


స్పాట్ బిల్డ్ బాతు


కాటన్ పిగ్మీ గూస్

వలస విహంగాలతో.. కనువిందుగా కవ్వాల్

తెలంగాణలోని కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రానికి విదేశీ అతిథులొచ్చాయి. శీతకాల ఖానోదయ వేళ పిల్ల తెమ్మెరలతో చెలిమి చేస్తూ.. తటాకాల్లో సయ్యాటలాడుతూ.. ప్రకృతి, పక్షి ప్రేమికులను పులకింపజేస్తున్నాయి. 10వేల కిలోమీటర్లపైగా అలుపెరగక ప్రయాణించి మరీ.. ఇక్కడకు చేరుకున్నాయి. హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ (హిటికాస్), అటవీశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న జలచర పక్షుల గణనలో భాగంగా.. నల్లరెక్కల స్టిల్ట్, స్పాట్ బిల్డ్ బాతు, లిటిల్ గ్రేబ్, రెడ్ క్రెస్టెడ్ పోచర్డ్, కాటన్ పిగ్మీ గూస్, నార్తర్న్ పింటైల్, కామన్ రెడ్ శాంక్, కామన్ టీల్, టెమ్మింక్ స్టింట్ వంటి 70కి పైగా అరుదైన వలస పక్షి జాతులను గుర్తించారు. ఐయూసీఎన్ అంతరించిపోయే దశలో ఉన్న అత్యంత అరుదైన బ్లాక్ బెల్లీడ్ టెర్న్ పక్షి దర్శనమిచ్చింది. పెరెగ్రైన్ ఫాల్కన్ అనే పక్షిని కిష్టాపూర్ సమీపంలోని ఓ టవర్ మీద గుర్తించారు. ఇది వేట సమయంలో ప్రపంచంలోనే అత్యధికంగా గంటకు 320 కి.మీ.ల వేగంతో వెళ్తుందని నిపుణులు తెలిపారు. ఈ గణన ఈనెల 18తో ముగియనుంది. పులుల సంరక్షణ కేంద్రం పరిధిలోని ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం బీర్సాయి పేట, నిర్మల్ జిల్లా ఉడుంపూర్ అటవీ క్షేత్రపరిధిలోని గంగం చెరువు, కల్లకుంట, దోస్తనగర్, మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కిష్టాపూర్ చెరువుల్లో సర్వే చేపట్టారు. 'కవ్వాల్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలోని తడి బయళ్లు(చెరువులు, కుంటలు, చిత్తడి నేలలు) జీవవైవిధ్యానికి కేంద్రం, ఈ పక్షులకు నివాసయోగ్యం. మార్చి నెలాఖరులో ఈ పక్షులు యూరప్ ప్రాంతాలకు తిరుగు పయనమవుతాయి. - న్యూస్‌టుడే, జన్నారం

హలో.. ఇటు చూడవేం!



కనుమ పండగ సందర్భంగా తీర ప్రాంతంలో సందడి నెలకొంది. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పెంటకోట లైట్‌హౌస్ సమీపంలో కొంతమంది గద్ద ఆకారంలో ఉన్న గాలిపటాలను ఎగురవేశారు. వీటిని కొన్ని గద్దలు వెంటాడాయి. నిజమైన గద్దలుగా భావించి గాలిపటాలను పొడుస్తూ వాటిచుట్టూ తిరిగాయి. ఈ దృశ్యాలను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

- న్యూస్‌టుడే, పాయకరావుపేట

పిల్లలకు కథలు చదివి వినిపించండి



పిల్లలకు తరచూ కథల పుస్తకాలు చదివి వినిపించండి. దీనివల్ల వారికి చిన్న వయసులోనే పుస్తక పఠనంపై ఇష్టం ఏర్పడటమే కాదు, భాషా పరిజ్ఞానం, వినికిడి శక్తి, జ్ఞాపకశక్తి, విశ్లేషణ సామర్థ్యం పెరుగుతాయి. ఆయా పాత్రల్లో తమను తాము ఊహించుకుంటూ కాల్పనిక జగత్తులో విహరించడం ద్వారా వారిలో సృజనాత్మకత వెల్లివిరుస్తుంది. ఆ కథల్లోని నీతిని తెలుసుకోవడం ద్వారా వారు విలువలతో కూడిన జీవితాన్ని కొనసాగిస్తారు. - జెఫ్, పేరెంటింగ్ కోచ్


హ్యాట్రిక్ ఎమ్మెల్యేకు పాఠాలు.. కుమార్తెలే గురువులు



ఉదయ్‌పుర్ గ్రామీణ ఎమ్మెల్యే ఫూల్‌సింగ్ మీణా (69) 'జనార్దన్‌రాయ్ నగర్ రాజస్థాన్ విద్యాపీఠ్' (యూనివర్సిటీ)లో ప్రస్తుతం ఎంఏ ఫైనలియర్ పరీక్షలు రాస్తున్నారు. పదిహేనేళ్ల వయసులో స్కూల్ డ్రాపవుట్‌గా చదువుకు స్వస్తి చెప్పిన ఫూల్‌సింగ్ ఉన్నతవిద్య అభ్యసించిన తన అయిదుగురు కుమార్తెలు, భార్య శాంతిదేవి ప్రోత్సాహంతో మళ్లీ పుస్తకాలు చేతబట్టి ఒక్కో పరీక్ష ఉత్తీర్ణులవుతూ వచ్చారు. భాజపా టికెటుతో వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఫూల్‌సింగ్ కారు ప్రయాణాల్లో ఆడియో పాఠాలు వింటూ, తీరిక వేళల్లో పాఠాలు వల్లె వేస్తారు. అసెంబ్లీలో ట్రైబల్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ ఉన్న ఈయనకు చక్కటి డ్రెస్‌కోడ్, దేహదారుఢ్యం కొనసాగిస్తారన్న పేరుంది. తన నియోజకవర్గంలోని 10, 12 తరగతుల విద్యార్థినుల్లో అత్యధిక మార్కులు సాధించినవారిని ఏటా విమానంలో జైపుర్ పర్యటనకు తీసుకువెళుతుంటారు. ప్రధాని మోదీ అమలుచేస్తున్న 'బేటీ బచావో.. బేటీ పఢావో' కార్యక్రమం తనకు ఆదర్శంగా ఫూల్‌సింగ్ చెబుతారు.

- ఈటీవీ భారత్

కొండపై శివుడు.. గుండెల్లో కొలువైనాడు



నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని ఎత్తంగట్టుపై కొలువుదీరిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 14 నుంచి శుక్రవారం వరకు మూడురోజుల పాటు వైభవంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు భక్తులు పోటెత్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి దాదాపుగా లక్ష మందికి పైగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కొబ్బరికాయ, వెండి కోరమీసాలు, జెండాల మొక్కులు తీర్చుకున్నారు. గట్టుపైకి దారి లేకపోవడంతో భక్తులు బండరాళ్లపై పాకుతూ ఆలయానికి చేరుకున్నారు. గట్టుకు మరో వైపున ఉన్న ముఖద్వారం వద్ద గ్రామస్థులు పెద్ద ఎత్తున జాతర నిర్వహించారు. చుట్టూ మంచు తెరలు, పచ్చని పొలాలు, సాగునీటి కాల్వలు ఆహ్లాదాన్ని పంచగా భక్తులు పరవశించారు. ఎత్తం గట్టును పర్యాటక ప్రాంతంగా ప్రకటించాలని, ఆలయ అభివృద్ధితోపాటు గట్టుకు వెళ్లేందుకు దారి, మెట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కోడేరు

ప్రియురాలి మోజులో భార్యనే కడతేర్చాడు

- తండ్రి ఘాతుకాన్ని బయటపెట్టిన కుమారుడు
- ఫోన్లో రికార్డయిన సంభాషణలతో 9 నెలల తర్వాత గుట్టురట్టు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం- న్యూస్‌టుడే, పెనమలూరు: ప్రియురాలితో కలిసి ఓ వ్యక్తి తన భార్యను అత్యంత దారుణంగా మట్టుపెట్టిన ఉదంతం తొమ్మిది నెలల తర్వాత ఫోన్ సంభాషణల రికార్డింగ్ ద్వారా బయట పడింది. పెనమలూరు పోలీసులు కథనం ప్రకారం.. పోరంకికి చెందిన ముక్కామల ప్రసాద్ చౌదరి, రేణుకాదేవి (46) భార్యభర్తలు. వారి కుమారుడు నగేష్ లండన్‌లో చదువుకుంటున్నాడు. కుమార్తె తేజశ్రీ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఝాన్సీ అనే బ్యూటీషియన్ తరచూ రేణుకాదేవి ఇంటికి వచ్చేది. ఆమెతో ప్రసాద్ చౌదరికి పరిచయం ఏర్పడింది. అది కాస్తా అక్రమ సంబంధానికి దారితీసింది. ఈ విషయాన్ని గుర్తించిన రేణుకాదేవి తరచూ భర్తతో గొడవపడేది. దీంతో ఆమె అడ్డు తొలగించుకోవాలని ప్రసాద్, ఝాన్సీ భావించారు. గతేడాది మే 18న రాత్రి రేణుకాదేవి ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందినట్లు ప్రసాద్‌చౌదరి అందరినీ నమ్మించాడు.

మత్తు మాత్రలు ఇచ్చి దిండుతో నొక్కి..

తల్లి మృతి చెందడంతో కుమారుడు నగేష్ లండన్ నుంచి వచ్చాడు. తండ్రి ప్రవర్తనలో మార్పు గమనించి, అతడు నిద్రిస్తున్న సమయంలో ఫోన్ తీసుకొని పరిశీలించాడు. తన తల్లిని ఎలా చంపాలన్న విషయంపై తండ్రి ప్రసాద్ చౌదరి, అతడి ప్రియురాలు ఝాన్సీల సంభాషణలు ఫోన్లో రికార్డ్ అయినట్లు గుర్తించాడు. పండ్ల రసంలో మత్తు మాత్రలు కలిపి ఇచ్చి, తర్వాత దిండుతో ముఖాన్ని నొక్కి ఊపిరాడకుండా చేసి చంపాలని ప్రణాళిక వేసుకున్నట్లు తేలింది. దీంతో ఈ నెల 7న పోలీసులకు ఫిర్యాదు చేసి నిందితుల ఫోన్ సంభాషణల ఆధారాలను అందజేశాడు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు. దీంతో వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నందీశ్వరుడి విగ్రహం ధ్వంసం



తర్లుపాడు, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా తర్లుపాడు మండలం జగన్నాథపురం వీరభద్రస్వామి ఆలయంలోని పురాతన నందీశ్వరుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఓబాయిపల్లె, మంగళకుంట, జగన్నాథపురం గ్రామాల మధ్య ఈ ఆలయం ఉంటుంది. గుప్త నిధుల కోసమే విగ్రహాన్ని ధ్వంసం చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై స్థానికులు ఇచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బ్రహ్మనాయుడు తెలిపారు.

సముద్ర స్నానానికి వెళ్లి నలుగురి గల్లంతు

- ఇద్దరి మృతదేహాలు లభ్యం.. మరో ఇద్దరి కోసం గాలింపు
- మృతులిద్దరూ అన్నాచెల్లెళ్లు, మిగిలినవారు బంధువులు, స్నేహితులు


మరణించిన అమ్ములు, బాలకృష్ణ


బయటపడిన చిన్నబ్బయ్య, వెంకటేష్

ఈనాడు-నెల్లూరు, న్యూస్‌టుడే-అల్లూరు: వారంతా బంధువులు. తల్లిదండ్రుల నిరాదరణకు గురయ్యారు. ఆశ్రమ పాఠశాలలో చదువుతున్నవారు కొందరైతే.. మరికొందరు అక్కడి నుంచి మరోచోట చదువుకునేందుకు వెళ్లారు. పండగ సెలవులు కావడంతో ఇంటికి వెళ్లిన వారంతా కనుమరోజు ఒకచోట కలిశారు. సరదాగా గడిపేందుకు సముద్రతీరానికి వెళ్లారు. భారీ అలల ధాటికి ఆరుగురు నీటమునిగారు. వారిలో ఇద్దరిని మత్స్యకారులు కాపాడారు. ఇద్దరి మృతదేహాలు బయటకు కొట్టుకురాగా.. గల్లంతైన మరో ఇద్దరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఈగ అమ్ములు(14), ఈగ బాలకృష్ణ అలియాస్ చిన్నా(15), చిన్నబ్బయ్య, అల్లూరు మండలంలోని బీఎంఆర్ కాలనీలో ఉంటున్న కొమరగిరి అభిషేక్, చేజర్ల మండలానికి చెందిన గంధళ్ల సుధీర్, తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన వెంకటేష్ సమీప బంధువులు, స్నేహితులు. వీరిలో అమ్ములు, బాలకృష్ణ, చిన్నబ్బయ్యలు తోబుట్టువులు. అల్లూరు సమీపంలోని ఎర్రపుగుంట వద్ద బంధువుల ఇంటికొచ్చారు. శుక్రవారం కనుమ సందర్భంగా వారితోపాటు మిగిలిన ముగ్గురు కలసి ఒంటిగంట సమయంలో ఇస్కపల్లి సమీపంలోని సముద్రం వద్దకు చేరుకున్నారు. స్నానాలు చేసేందుకు నీటిలో దిగగా.. ఒక్కసారిగా భారీగా అలలు లోపలికి లాక్కెళ్లాయి. అమ్ములు, బాలకృష్ణ, అభిషేక్, గంధళ్ల సుధీర్ గల్లంతయ్యారు. మత్స్యకారులు అప్రమత్తమై సముద్రంలోకి కొట్టుకుపోతున్న చిన్నబ్బయ్య, వెంకటేష్‌లను రక్షించారు. మరింత గాలించగా అమ్ములు, బాలకృష్ణ అలియాస్ చిన్నా మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన అభిషేక్, సుధీర్‌ల ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

ఎస్సై నడుపుతున్న కారు ఢీకొని ఒకరు దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు
- నిద్రమత్తే ప్రమాదానికి కారణం


దండా వీరయ్య

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం పోతవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం ఎస్సై చౌడయ్య గురువారం తెల్లవారుజాము 3 గంటల వరకు తన స్టేషన్ పరిధిలో ఎడ్లపందేల బరుల వద్ద విధి నిర్వహణలో ఉన్నారు. గురువారం సంక్రాంతి రోజు గుంటూరులో ఉన్న కుటుంబ సభ్యులతో గడిపేందుకు తన కారులో కోటప్పకొండ, చిలకలూరిపేట మీదుగా గుంటూరు బయల్దేరారు. పోతవరం సమీపంలో ఆయన నిద్రమత్తులోకి జారుకున్నారు. ఆ సమయంలో చిలకలూరిపేట వైపు వేర్వేరుగా ద్విచక్రవాహనాలపై వెళ్తున్న ప్రకాశం జిల్లా ఉప్పుమాగులూరుకు చెందిన దండా వీరయ్య, చిలకలూరిపేట మండలం మద్దిరాలకు చెందిన షేక్ మస్తాన్‌వలీని ఎస్సై నడుపుతున్న కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్ర గాయాలతో వీరయ్య (68) అక్కడికక్కడే మృతి చెందారు. మస్తాన్ వలీని చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గ్రామీణ ఎస్సై అనిల్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వీరయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై చౌడయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి మృతి కేసులో ఇద్దరు టీచర్లకు ఐదేళ్ల జైలు

- కాపీ కొడుతున్నాడని చితకబాదడంతో ప్రాణాలు విడిచిన చిన్నారి

కావలి, న్యూస్‌టుడే: విచక్షణారహితంగా కొట్టడంతో విద్యార్థి మరణించిన కేసులో నిందితులైన ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకు న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. శుక్రవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి తీర్పు వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..కావలి వైకుంఠపురంలోని చేవూరివారి తోటలో శ్రీవిద్యానికేతన్‌లో మంద వెంకటసాయికృష్ణ (12) అనే విద్యార్థి 2014లో ఐదో తరగతి చదువుతున్నాడు. పరీక్షల్లో కాపీ కొడుతున్నాడంటూ ఉపాధ్యాయిని కె.కౌసల్య ఆ బాలుడ్ని చితకబాది ఆ తరవాత ప్రధానోపాధ్యాయుడు మంద అయ్యన్నకు అప్పగించింది. ఆయన కూడా కొట్టడంతో అంతర్గతంగా గాయాలై విద్యార్థి మృతి చెందారు. బాలుడి తండ్రి చిన్నయ్య పోలీసులను ఆశ్రయించడంతో అప్పటి రెండో పట్టణ పోలీసుస్టేషన్ ఎస్సై సయ్యద్ ఉస్మాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సుదీర్ఘ వాదనల అనంతరం నిందితులిద్దరికీ ఐదేళ్ల జైలు శిక్ష రూ.50 వేల చొప్పున జరిమానా విధించారు.

చిత్తూరు సమాచారశాఖ వాట్సప్ గ్రూప్‌లో అశ్లీల చిత్రాలు

- డీడీ సెల్‌ఫోన్ నుంచి పోస్ట్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా సమాచారశాఖ నిర్వహిస్తున్న వాట్సప్ గ్రూప్‌తో పాటు మరికొన్ని వాట్సప్ గ్రూపుల్లో అశ్లీల చిత్రాలు షేర్ కావడం గురువారం కలకలం సృష్టించింది. జిల్లా సమాచారశాఖ డీడీ వేలాయుధం సెల్‌ఫోన్ నుంచి నగ్న ఫొటోలు అప్‌లోడ్ కావడం వివాదానికి కారణమైంది. 'డీడీ సమాచార శాఖ', 'సమాచారశాఖ కుప్పం' గ్రూప్‌లతో పాటు మరికొన్ని వాటిల్లోనూ అశ్లీల చిత్రాలు ప్రత్యక్షమయ్యాయి. చిత్రాలు పోస్ట్ అయిన వెంటనే అప్రమత్తమైన అడ్మిన్లు వాటిని డిలీట్ చేశారు. తన సెల్‌ఫోన్ హ్యాకింగ్‌కు గురై, అశ్లీల చిత్రాలు వాట్సప్ గ్రూపుల్లో పోస్ట్ అయ్యాయని డీడీ వేలాయుధం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాటేసిన పాముతో ఆసుపత్రికి వెళ్లిన బాధితుడు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మౌలా. చిత్రంలో పాము

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: కాటేసిన పామును చంపి నేరుగా ఆసుపత్రికి తీసుకెళ్లిన ఘటన అన్నమయ్య జిల్లాలో చోటుచేసుకొంది. మదనపల్లె మండలం యనమలవారిపల్లెలోని ఓ ఇంట్లోకి గురువారం రాత్రి పాము వచ్చింది. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో పక్కింటిలో ఉన్న మౌలా అనే వ్యక్తి దాన్ని చంపేందుకు వెళ్లగా ఆయన చేతిపై కాటేసింది. కాసేపటి తర్వాత పామును వెంబడించి చంపిన మౌలా దాన్ని ఓ సంచిలో వేసుకొని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. నర్సింగ్ సిబ్బంది ఆ పామును పరిశీలించి విషరహిత సర్పంగా తేల్చారు. మౌలాకు తగిన చికిత్స అందించి ఇంటికి పంపించారు.

ఆర్టీసీకి డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్ అవార్డు

దిల్లీలో అందుకున్న సంస్థ ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రధాన బస్‌స్టేషన్లలో బస్సుల రాకపోకల సమాచారాన్ని ముందస్తుగా ప్రకటించే 'ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్' ఏర్పాటు ద్వారా 'గవర్నెన్స్ నౌ-6వ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్ అవార్డు-2025'కు ఆర్టీసీ ఎంపికైంది. దిల్లీలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య ఇంజినీర్(ఐటీ) వై.శ్రీనివాసరావు సంస్థ తరఫున అవార్డు అందుకున్నారు. అవార్డు సాధించడంలో కృషిచేసిన అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బందిని ఎండీ ద్వారకా తిరుమలరావు అభినందించారు. భవిష్యత్తులోనూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేసి.. సంస్థను అభివృద్ధి బాటలో నడిపించాలని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది.



ఆకట్టుకున్న బొమ్మల కొలువు

కృష్ణా జిల్లా పామర్రు మండలం పెరిశేపల్లి వృద్ధాశ్రమంలో కృష్ణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో బొమ్మల కొలువు ఆకట్టుకుంది. విష్ణు కెమికల్స్ అధినేత చెరుకూరి కృష్ణమూర్తి, మంజుల దంపతుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా గ్రామస్థులు హాజరయ్యారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

-న్యూస్‌టుడే, పామర్రు గ్రామీణం

అన్నవరం వ్రత విభాగంలో అక్రమాలు

- జీతాల పేరిట రూ.58.39 లక్షలు పక్కదారి

అన్నవరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలోని వ్రత విభాగంలో అక్రమాలు బయటపడ్డాయి. పురోహితుల పారితోషికం (వేతనం) రూ.58.39 లక్షల సొమ్ము దారి మళ్లించినట్లు తేలింది. దేవస్థానంలో పనిచేసే సిబ్బందికి ప్రతినెలా వేతనాల జాబితా సిద్ధం చేసి, బ్యాంకుకు పంపించే బాధ్యతను అధికారులు ఓ పురోహితుడికి అప్పగించారు. 2024 మే నుంచి 2025 అక్టోబరు వరకు వేతనాల పేరిట రూ.28.54 లక్షల మొత్తాన్ని ఆ పురోహితుడు కాజేసినట్లు ఇటీవల బయటపడింది. అతనితో ఆలయ అధికారులు, పురోహితుల సంఘ ప్రతినిధులు చర్చించి, డిసెంబరు 26న ఆ మొత్తాన్ని 'వ్రత పురోహితుల సంక్షేమ నిధి'కి తిరిగి జమ చేయించారు. ఆ మరునాడే ఆ పురోహితుడు గుండెపోటుతో చనిపోయాడు. ఈ తరహా అక్రమాలు ఇంకెన్ని జరిగాయో తేల్చాలని ఈవో ఆదేశించడంతో అధికారులు 2015 నుంచీ రికార్డులు పరిశీలించారు. 2024 జనవరి నుంచి 2025 నవంబరు వరకు మరో రూ.29.85 లక్షలు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. ఏసీబీ అధికారులు ఇటీవల అన్నవరం వచ్చి, సంబంధిత రికార్డులు సేకరించారు.

లేని ఉద్యోగుల పేరిట జీతాలు

నిధులు కాజేసిన పురోహితుడు అనధికారికంగా కంప్యూటర్ ఆపరేటర్‌గానూ పనిచేశాడు. ప్రతినెలా 'పురోహితుల స్థిర వేతనం' జాబితాలో తన కుటుంబసభ్యులు, సమీప బంధువు, కొందరు పురోహితులు, ఓ ప్రైవేటు సంస్థ ఖాతాలను జోడించి 19 మందితో జాబితాను తన వ్యక్తిగత మెయిల్ ద్వారా బ్యాంకుకు పంపించేవాడు. దేవస్థానం నుంచి వచ్చే హార్డ్‌కాపీని సరిపోల్చుకోకుండా బ్యాంకు అధికారులు ఆ మెయిల్‌లో పేర్కొన్న ఖాతాల్లో సొమ్ము జమచేశారు. నకిలీ జాబితా, చలానాలు, కవరింగ్ లెటర్లతో నెలవారీ స్థిర వేతనం, ఈపీఎఫ్, ప్రొఫెషనల్ ట్యాక్స్, మ్యారేజీ అడ్వాన్స్ రికవరీ మొత్తాన్ని ఆ వ్యక్తి దుర్వినియోగం చేశాడు. అతను బతికి ఉన్నప్పుడే రూ.28.54 లక్షలు రాబట్టారు. మరో రూ.29.84 లక్షల రికవరీకి.. ఇలా పారితోషికం నగదు ఖాతాల్లో జమైన వారందరికీ తాఖీదులు ఇస్తున్నారు. ఇప్పటికే 8 మంది ఉద్యోగులకు నోటీసులిచ్చారు. బ్యాంకుకూ నోటీసులు ఇవ్వనున్నారు. వారి వివరణ అనంతరం చర్యలు తీసుకుంటామని ఈవో త్రినాథరావు తెలిపారు.

(c) eenadu

తిరుమలలో శ్రీవారి పార్వేట ఉత్సవం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి కనుమ రోజు శుక్రవారం పార్వేట ఉత్సవం నిర్వహించారు. దీంతోపాటు గోదా పరిణయోత్సవం కనులపండువగా జరిగింది. తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయంలోని ఆండాళ్ శ్రీగోదాదేవి నుంచి శ్రీవారికి ప్రత్యేక మాలలు కానుకగా అందాయి. ఈ మాలలను మూలమూర్తికి అలంకరించారు. స్వామివారికి ప్రాతఃకాలారాధన పూర్తయిన తర్వాత శ్రీమలయప్ప స్వామి, శ్రీకృష్ణస్వామి తిరుచ్చిలపై పార్వేట మండపానికి చేరుకున్నారు. ఇక్కడ అర్చకులు స్వామివారికి పుణ్యాహము, ఆరాధన, నివేదన చేసి హారతులు సమర్పించారు. ఉభయదారులైన తాళ్లపాక వారికి, మఠం వారికి మర్యాదలు చేశారు. శ్రీకృష్ణస్వామిని సన్నిధి యాదవ పూజ చేసిన చోటుకు వేంచేపు చేసి హారతులు సమర్పించారు. అనంతరం శ్రీమలయప్పస్వామి వేటకు బయలుదేరారు. కొంత దూరం వెళ్లాక స్వామి తరఫున అర్చకులు ఈటెను విసిరి వెనక్కి వచ్చారు. ఇలా మూడు పర్యాయాలు నిర్వహించారు. ఇంతటితో పార్వేట ఉత్సవం ముగిసింది. కార్యక్రమంలో తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.




శ్రీవారి ఆలయం నుంచి తిరుచ్చిలపై బయలుదేరిన శ్రీమలయప్పస్వామి, శ్రీకృష్ణస్వామి ★ శ్రీమలయప్ప స్వామి తరఫున ఈటెను విసిరేందుకు పరుగెత్తుతున్న శ్రీవారి ఆలయ అర్చకుడు, తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తదితరులు

52 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్ జిల్లాలో సీఆర్పీఎఫ్ డీఐజీ దేవేంద్రసింగ్ నేగి, ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ ఎదుట గురువారం 52 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో డివిజన్ కమిటీ సభ్యుడితో సహా 21 మంది మహిళలు, 31 మంది పురుషులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. వీరిపై రూ.1.45 కోట్ల మేర రివార్డు ఉన్నట్లు పేర్కొన్నారు. తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు.

★ పేలుడు పదార్థాల డంప్ స్వాధీనం..: దంతెవాడ జిల్లా బర్సూర్ పోలీసుస్టేషన్ పరిధిలో మావోయిస్టులకు చెందిన పేలుడు పదార్థాల డంప్‌ను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ సెర్చ్ ఆపరేషన్‌లో సీఆర్పీఎఫ్, క్యాట్, బీడీఎస్ బలగాలు పాల్గొన్నాయి. 10 కిలోల బరువున్న 3 పైపు బాంబులు, 5 ప్రెషర్ కుక్కర్ బాంబులను స్వాధీనం చేసుకున్న బలగాలు వాటిని అక్కడే పేల్చేశాయి.

తల్లీకుమారుల అక్రమ దందా.. రూ.204 కోట్లు!

- విలాసవంతమైన జీవితం.. దుబాయ్ ముఠాతో సంబంధాలు
- అక్కడే బెట్టింగులు, క్రిప్టో కరెన్సీ వ్యవహారాలు
- పేదల ఖాతాల్లోకి కోట్ల కొద్దీ బెట్టింగ్ సొమ్ము
- అదంతా డ్రా చేసుకునేది తల్లీ కుమారులే



సూత్రధారులు మహ్మద్ ఉజైఫ్, షబానా అబ్దుల్ బారీ

ఈనాడు, బెంగళూరు: భర్త కరోనా సమయంలో మరణించటంతో షబానా అబ్దుల్ బారీ కుటుంబ పోషణకు అడ్డదారినే ఎంచుకుంది. తల్లి చూపిన మార్గంలో సులువుగా డబ్బు చేతికి అందుతోందని.. తాను చదువుతున్న బీకాం కోర్సును మధ్యలోనే వదిలిన 22 ఏళ్ల మహ్మద్ ఉజైఫ్ ఏడాది తిరక్కుండానే రూ.లక్షలు సంపాదించాడు. బెంగళూరు జేపీ నగరలో ఖరీదైన అపార్ట్‌మెంట్‌కు నెలకు రూ.60వేలు అద్దె చెల్లించేవాడు. అతను ధరించే బూట్ల ధర రూ.లక్ష కాగా, చేతి గడియారం విలువ రూ.15 లక్షల పైమాటే. తల్లీ కుమారుల అక్రమ వ్యాపారాన్ని బెంగళూరు పోలీసులు బయటపెట్టారు. నగర కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ నేతృత్వంలోని సైబర్ పోలీసుల బృందం దిల్లీ పోలీసుల సాయంతో ఈ తల్లీకుమారులతో పాటు దుబాయ్‌లోని సైబర్ ముఠా వ్యవహారాన్ని ఛేదించింది. వారు వెల్లడించిన వివరాలిలా..

మహ్మద్ ఉజైఫ్, షబానా అబ్దుల్ బారీ తమ దందాకు బెంగళూరుతో పాటు దేశంలోని పలు నగరాల్లోని ఆస్పత్రుల్లో చికిత్సల కోసం వచ్చే పేద రోగులను ఎంచుకున్నారు. వారికి రూ.2-5 వేల వరకు కమీషన్ ఆశ చూపి వారి పేరిట బ్యాంకు ఖాతాలు తెరుస్తారు. వాటికి అనుబంధంగా రెండేసి సిమ్‌కార్డులు తీసుకుంటారు. అప్పటినుంచి బెట్టింగ్ వ్యవహారం మొదలుపెడతారు. 2013లో ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ కేసులో ముంబయి పోలీసులు అరెస్టు చేసిన ప్రేమ్ తనేజా నేతృత్వంలో ఈ పేదల పేరిట బెట్టింగ్‌లు వేస్తూ, క్రిప్టోకరెన్సీ లావాదేవీలు చేస్తారు. ఒక సీజన్‌లో బెట్టింగ్ మొత్తం పూర్తయిన తర్వాత షబానా అబ్దుల్ బారీ దుబాయ్ వెళ్లి భారతీయ ఖాతాల్లోకి ఆ మొత్తాన్ని బదిలీ చేయిస్తారు. ఇక్కడ ఆమె కుమారుడు ఉజైఫ్ ఆ డబ్బును డ్రా చేస్తాడు. అందులో తమ వాటా పోను మిగిలిన మొత్తాన్ని ఇతరులకు కమీషన్‌గా అందిస్తారు. ఇలా రెండేళ్లలో రూ.204 కోట్ల విలువైన అక్రమ లావాదేవీలు చేసినట్లు పోలీసులు తేల్చారు. ఈ నెల 14న ఈ నేరాలతో సంబంధం ఉన్న 11 మందిని అదుపులో తీసుకోగా ఈ నేరాలకు నేతృత్వం వహించే తల్లీ కుమారులను శుక్రవారం అరెస్టు చేశారు. వీరి నుంచి 9 వేల బ్యాంకు ఖాతా పుస్తకాలు, రూ.25 లక్షల నగదు, 242 డెబిట్ కార్డులు, 58 మొబైల్ ఫోన్లు, 531 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు.

మావోయిస్టు నారాయణరావు మేనల్లుడి అరెస్టు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఏవోబీ కమిటీ సభ్యుడు, మావోయిస్టు నారాయణరావు మేనల్లుడిని పోలీసులు అరెస్టు చేశారు. విధినిర్వహణలో భాగంగా వజ్రపుకొత్తూరు పోలీసులు గురువారం జీపులో వెళ్తుండగా.. ఓ వ్యక్తి పారిపోతుండటాన్ని గమనించారు. వెంటనే అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, సమాధానాలు అనుమానాస్పదంగా చెప్పాడు. మరింత లోతుగా విచారిస్తే ఆయన వజ్రపుకొత్తూరు మండలం రాజాం గ్రామానికి చెందిన గోకర్ల ఆనందరావు అలియాస్ ఆనంద అని, మావోయిస్టుల సానుభూతిపరుడని తేలింది. ఈయన మావోయిస్టు నారాయణరావు మేనల్లుడు. ఏవోబీ జెడ్‌బీసీ ప్రాంతాల్లో విధ్వంసాలకు పాల్పడటం, నక్సలైట్ల కార్యకలాపాల్లో తలదూర్చడం, దళ సభ్యులను చేర్చడంతో పాటు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయటం, గుత్తేదారులు, వర్తకులను బెదిరించి డబ్బులు వసూళ్లు చేయడం వంటి చర్యలతో సంబంధమున్నట్లు గుర్తించి కేసులు నమోదుచేశారు. శుక్రవారం టెక్కలి కోర్టుకు తీసుకెళ్లగా న్యాయమూర్తి జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.

తెదేపా కార్యకర్త దారుణ హత్య

- కత్తులతో దాడి చేసి హతమార్చిన వైకాపా శ్రేణులు
- మరో ఇద్దరికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో ఘోరం

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, తుని, కోటనందూరు, అన్నవరం: కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడిలో శుక్రవారం రాత్రి వైకాపా శ్రేణులు కత్తులతో దాడి చేసిన ఘటనలో తెదేపా కార్యకర్త లాలం బంగారయ్య (38) మృతిచెందగా, మరో ఇద్దరు కార్యకర్తలు గాయపడ్డారు. అల్లిపూడిలో శుక్రవారం రాత్రి వైకాపాకు చెందిన ఓ యువకుడిని ఉద్దేశించి స్థానిక తెదేపా నాయకుడు ఏదో విషయమై వ్యాఖ్యలు చేశాడు. అతను ఆ విషయాన్ని వైకాపా ప్రధాన నాయకుడికి చెప్పగా వారంతా సమావేశమై దాడికి ప్రణాళిక వేసుకున్నట్లు తెలుస్తోంది. తెదేపా శ్రేణులు తమ పార్టీకి చెందిన అంకంరెడ్డి బుల్లిబాబు జన్మదిన వేడుకలకు వెళ్లి తిరిగి వస్తుండగా, దారిలో మాటు వేసిన వైకాపా శ్రేణులు వారితో గొడవకు దిగారు. ఇది కొట్లాటకు దారితీసింది. ఓ వైకాపా కార్యకర్త కత్తితో దాడికి పాల్పడడంతో పలువురు గాయపడ్డారు. వారిని తుని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బంగారయ్య మృతి చెందాడు. అతడు ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడిగా పని చేస్తున్నాడు. చింతకాయల శ్రీరామ్మూర్తి, రుత్తల దుర్గాప్రసాద్ గాయపడగా వారిలో శ్రీరామ్మూర్తి పరిస్థితి విషమంగా ఉంది. వైకాపా నాయకుడు చింతకాయల చినబాబు, అతని అనుచరులు మాటువేసి ఈ గొడవకు దిగినట్లు బాధితులు చెబుతున్నారు. ఈ వివాదంలో వైకాపాకు చెందిన పెదపాత్రుని సతీష్, చిటికెల నారాయణమూర్తి కూడా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు గ్రామంలో 20 మందితో పికెట్ ఏర్పాటుచేశారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తుని గ్రామీణ సీఐ జి.చెన్నకేశవరావు తెలిపారు.

గట్-మైక్రోబయమ్ చికిత్సల్లో ముందడుగు!

- ఏఐజీలో సెంటర్ ఫర్ మైక్రోబయమ్ రీసెర్చ్ కేంద్రం ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: పేగుల్లో ఉండే మంచి బ్యాక్టీరియా (గట్-మైక్రోబయమ్) చికిత్సలో ముందడుగు పడింది. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ(ఏఐజీ)లో ఆసియాలోనే ఆధునిక సెంటర్ ఫర్ మైక్రోబయమ్ రీసెర్చ్ ఇండియా కేంద్రం అందుబాటులోకి వచ్చింది. ప్రఖ్యాత గట్ జర్నల్ ఎడిటర్, గట్ వ్యాధుల నిపుణులు ఎమాద్ ఎల్-ఒమర్, ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి కలిసి తాజాగా దీనిని ప్రారంభించారు. "దీర్ఘకాలిక జీర్ణకోశ వ్యాధులతోపాటు గట్ మైక్రోబయమ్ ఆధారిత పరిశోధనలు, ఆధునిక చికిత్సలు అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుంది. ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్(ఐబీడీ), ఫ్యాటీ లివర్, ఊబకాయం, మెటబాలిక్ వ్యాధులు, పాంక్రియాటైటిస్, పెరుగుతున్న ఇతర జీర్ణకోశ వ్యాధులపై ఈ కేంద్రం లోతుగా అధ్యయనం చేస్తుంది.



మైక్రోబయమ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ ఎమాద్ ఎల్ ఒమర్, ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి

దీర్ఘకాలిక జీర్ణకోశ వ్యాధులకు కేవలం లక్షణాల ఆధారంగా దశాబ్దాలుగా చికిత్సలు అందిస్తున్నాం. గట్ మైక్రోబయమ్ అధ్యయనం ద్వారా వ్యాధిని అర్థం చేసుకుని, పెరుగుదలను అంచనా వేసి... కచ్చితమైన చికిత్సలను అందించడానికి ఒక గొప్ప అవకాశం లభిస్తుంది. గట్ మైక్రోబయమ్ పరిశోధనలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రొఫెసర్ ఎమాద్ ఎల్-ఒమర్ ఈ కేంద్రానికి ప్రత్యేక సాంకేతిక సలహాదారుగా వ్యవహరిస్తారు" అని డాక్టర్ నాగేశ్వరరెడ్డి ఈ సందర్భంగా వివరించారు.

ఇది ఒక అదృశ్య అవయవం: ప్రొఫెసర్ ఎమాద్ ఎల్ ఒమర్

అనంతరం దివంగత డాక్టర్ భాస్కర్‌రెడ్డి స్మారకార్థం ఏర్పాటు చేసినసదస్సులో ప్రొఫెసర్ ఎమాద్ ఎల్-ఒమర్ మాట్లాడుతూ... "పేగుల్లో ఉండే మంచి బ్యాక్టీరియా ఒక అదృశ్య అవయవంలా పనిచేస్తుంది. జీర్ణక్రియ, రోగ నిరోధక శక్తితోపాటు మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఏఐజీలో స్థాపించిన ఈ కేంద్రం దశాబ్దాలుగా వేధిస్తున్న అనేక ప్రశ్నలకు సమాధానాలను అందిస్తుంది. పేగుల్లోని మైక్రోబయమ్‌లు చిన్నచిన్న కర్మాగారాలుగా పనిచేసి మానవ ఆరోగ్యాన్ని రక్షించడంలో కీలక భూమిక పోషిస్తున్నాయి. ఈ వ్యవస్థ ఒక కాలేయంతో సమానం. పేగులో ఏమి జరిగినా దాని ప్రభావం అన్ని అవయవాలపై పడుతుంది. సరైన ఆహారపు అలవాట్లతో గట్ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి" అని సూచించారు.





iPhone 17*

MRP	₹82,900*
Selling Price	₹81,242*
Cashback Up to	₹2,000*
Exchange Value & Bonus Up to	₹31,500*
Sale Price	₹47,742*

Redmi Note 15 5G*

MRP	₹26,999*
Selling Price	₹22,999*
Cashback Up to	₹3,000*
Sale Price	₹19,999*
EMI starting	₹3,333*

MacBook Air M4*

MRP	₹99,900*
Selling Price	₹88,911*
Cashback Up to	₹10,000*
Exchange Value & Bonus Up to	₹23,000*
Sale Price	₹55,911*

LG Frost Free Refrigerator 343L*$

MRP	₹50,599*
Selling Price	₹41,990*
Cashback Up to	₹2,200*
Exchange Value Up to	₹2,000*
Sale Price	₹37,790*

Smart TV 1 m 40 cm (55)*

MRP	₹47,900*
Selling Price	₹30,351*
Sale Price	₹29,851*
EMI starting	₹3,731*

Voltas Inverter AC*

MRP	₹52,390*
Selling Price	₹27,981*
Exchange Value Up to	₹3,000*
Sale Price	₹24,981*

*Sale Price inclusive of exchange/cashback or both

Scan to locate us

నేడే విచ్చేయండి: క్రోమా స్టోర్స్ | croma.com | TATA NEU

కన్స్యూమర్ ఫైనాన్స్‌పై* ₹26,000 వరకు క్యాష్‌బ్యాక్ | ఎంపికైన కార్డులపై* ₹26,000 వరకు తక్షణమే తగ్గింపు

వీటితో యాపిల్ ప్రోడక్ట్స్‌పై 10% వరకు సేవింగ్స్*

18+ Stores across Andhra Pradesh

*Offer valid only at stores | Two offers cannot be clubbed | Offer valid till stocks lasts | Offer valid on select brands/categories/days/locations/products | The final offer shall be subject to cashback offers or discounts provided by participating banks or consumer finance or Croma or Exchange Value of your old product or all of the above, as applicable | In addition, select products may be eligible for exchange bonus as well | Processing fee shall be applicable as levied by participating banks and consumer finance | EMIs are payable monthly and may vary by product, tenure, and customer eligibility | MRP is inclusive of all taxes | Prices mentioned are for one unit of product | Up to ₹26,000 Instant Cashback is based on ticket value | Select offers with $ valid till 18th Jan | Rest product offers valid from 16th to 26th Jan 2026 | For further details, visit store | T&C apply

EENADU Vol: 52, Issue: 157 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

(c) eenadu

ఈతరం

youthpage@eenadu.in

హైదరాబాద్ - అమలాపురం



మాది అమలాపురం. నాన్న వృత్తిరీత్యా హైదరాబాద్‌లో ఉండేవాళ్లం. అక్కడి నుంచి కోనసీమకు ప్రయాణం అంటే చిన్నప్పుడు భలే సరదాగా ఉండేది. ఇది ఓ పదేళ్ల కిందటి మాట. అంటే నాకు 15 ఏళ్ల ఉంటాయి. మేము ఎక్కువగా బస్‌లోనే వెళ్లేవాళ్లం. చక్కగా ఎంజీబీఎస్ చేరుకుని.. సాయంత్రం ఆరు గంటల బస్సుకి టికెట్ తీసుకుని లోపల కూర్చుంటే.. డ్రైవర్, కండక్టర్ ఎంతో ఆప్యాయంగా పలకరించేవారు. ఇక మన మెమొరబుల్ జర్నీ మొదలు.

బస్ స్టార్ట్ అయిన రెండు నిమిషాలకి కండక్టర్ వచ్చి.. 3 సినిమాలు ఉన్న డీవీడీ క్యాసెట్ పెట్టడంతో అసలు జర్నీ అప్పుడే మొదలైనట్టు అనిపించేది. బస్సు 80 కిలోమీటర్ల స్పీడులో వెళ్తుంటే.. కిటికీ నుంచి వచ్చే చల్లగాలి గిలిగింతలు పెట్టేది. మొదటి సినిమా పూర్తయ్యేలోపు సూర్యాపేట చేరుకునే వాళ్లం. అక్కడ అరగంట టిఫిన్ కోసం ఆపేవారు. నేను ఎప్పుడూ వేడివేడిగా ఇడ్లీసాంబార్ తినేవాణ్ని. హైవే పక్కన ఆగి తినడం.. ఏంటో భలే గొప్పగా, గమ్మత్తుగా తోచేది.

రెండో సినిమా పూర్తి కాకముందే అందరూ నిద్రలోకి జారుకోవడంతో కండక్టర్ వచ్చి టీవీ ఆపేసేవారు. అర్ధరాత్రి అయ్యేలోపు బస్సు విజయవాడ దుర్గమ్మ వద్దకు చేరుకునేది. మెలకువ వచ్చి.. మనసులోనే దణ్ణం పెట్టుకుంటే ఎంత ఆనందం! ఆ తర్వాత ఏలూరు, తాడేపల్లిగూడెం వస్తుండేసరికి.. ఒక్కొక్కరే బస్సు దిగిపోవడం మొదలుపెట్టేవారు. అక్కడి నుంచి మా గోదారిలోకి ప్రయాణం సాగేది. రావులపాలెం రాగానే మళ్లీ బస్సు పది నిమిషాలు టీ కోసం ఆపడం, అక్కడే ఎర్రని కనకాంబరాలు, బొండు మల్లెలు అమ్మ కొనుక్కోవడం.. భలే చూడముచ్చటగా ఉండేది.

ఇక 4 గంటలకి రావులపాలెం నుంచి బస్సు అమలాపురం వైపు మళ్లేది. ఎక్కడచూసినా కొబ్బరి చెట్లు, వరిపొలాలు, అరటి తోటలు! మెల్లగా సూర్యుడు ఉదయించడం, ఆ కిరణాల వేడికి మంచు రోడ్డు మీద పడితే.. ఆ చెమ్మకు మట్టి వాసన తగిలి.. స్వర్గమా ఇది అనిపించేది. సరిగ్గా గంట తర్వాత అమలాపురం చేరేవాళ్లం. ఈ ప్రయాణం మొత్తం ఎంతో ఉల్లాసంగా సాగేది. ఇప్పటికీ అమలాపురం అంతే ఉత్సాహంగా వెళ్తుంటా.

– రంకిరెడ్డి రాజు, అమలాపురం

ఆకాశంలో.. బైకింగ్



మనకు ఎన్ని సాహసకృత్యాలున్నా.. కొత్త కొత్తవి కావాలి. ఈమధ్య కాలంలో అలా అలరిస్తున్నదే పారామోటరింగ్. మూడు చక్రాలు, వెనక తిరిగే వీల్‌తో పారాగ్లైడింగ్‌కు మరోరూపంగా దీన్ని చెప్పొచ్చు. ఓ రకంగా ఆకాశంలో బైక్ నడపడం లాంటిది.

ఇందులో మనం నేల నుంచి టేకాఫ్ అవ్వడమే కాదు, గాలిలో హ్యాండిల్ కూడా తిప్పొచ్చు. దీనిలో ప్రొపెల్లర్‌తో కూడిన చిన్నపాటి మోటారు సీటు వెనకభాగంలో ఉంటుంది. ఇది బ్యాక్‌ప్యాక్ ఇంజిన్‌తో ఎగిరే యంత్రం. ఎలా వెళ్లాలి అనేది ముందుగా అనుకున్న ప్రణాళిక ప్రకారమే సాగుతుంది. ప్రస్తుతం వీటిని అడ్వెంచర్ యాక్టివిటీ, ఫొటోగ్రఫీ కోసం యువత ఎక్కువగా చేస్తున్నారు. ఈ థ్రిల్లింగ్ రైడ్‌లో మది దోచే ల్యాండ్‌స్కేప్ వ్యూలు సొంతమవుతాయి. ఎత్తయిన ప్రదేశాలు, కొండ ప్రాంతాల్లో ఈ ఎక్స్‌పీరియన్స్ ఇంకా బాగుంటుంది. మరి మీరూ ట్రై చేస్తారా!

మెకానిక్ కొడుకు.. @ ఇస్రో

ఇస్రోలో శాస్త్రవేత్త అంటే కేవలం ఉద్యోగం కాదు.. దేశానికి సేవలందించే గొప్ప అవకాశం. అది అందుకోవాలని ఎంతోమంది కలలు కంటుంటారు. కానీ కొందరే ఎంపికవుతుంటారు. ఎందుకంటే దీనికోసం చాలా కఠినమైన పరీక్షలు రాయాలి. సీనియర్ శాస్త్రవేత్తలు కొలువుదీరే బోర్డ్ ఇంటర్వ్యూని ఎదుర్కోవాలి. అప్పుడే కలల కొలువు దరిచేరుతుంది. అలాంటి పరీక్షలన్నీ దాటి విజేతగా నిలిచాడు చొక్కయ్యగారి సాయిచరణ్. సాధారణ మెకానిక్ కొడుకు నుంచి శాస్త్రవేత్తగా మారిన ప్రయాణాన్ని మనతో పంచుకుంటున్నాడు.



'మాది రాజన్న సిరిసిల్ల జిల్లా గంబీరావుపేట. నాన్న ఆర్టీసీ బస్ డిపోలో మెకానిక్. అమ్మ గృహిణి. నాన్నది కఠినమైన పని, తక్కువ జీతం అయినా.. నా చదువు విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. పదోతరగతిలో 9.2 జీపీఏ సాధించాను. ఇంటర్ ఎంపీసీలో 969 మార్కులు వచ్చాయి. జేఈఈ, ఎంసెట్‌లో అర్హత సాధించాలంటే కోచింగ్ తప్పనిసరి. కానీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు, నాన్న ఆరోగ్యరీత్యా ఇంజినీరింగ్ వైపు వెళ్లలేదు. సైఫాబాద్ ఓయూ క్యాంపస్ కాలేజీలో బీఎస్సీ (గణితం, భౌతికశాస్త్రం, కంప్యూటర్ సైన్స్) పూర్తిచేసి 8.58 జీపీఏ పొందాను.

జియో-ఇన్ఫర్మాటిక్స్ ప్రయాణం


చిన్నప్పటి నుంచి గణితం, భౌతికశాస్త్రాలతోపాటు పర్యావరణ శాస్త్రంపై నాకు ఆసక్తి ఎక్కువ. జియో-ఇన్ఫర్మాటిక్స్ అనే విభాగం గురించి లోతుగా తెలుసుకునే క్రమంలో.. ఇది ఉపగ్రహ డేటాను ఉపయోగించి భూపరిశోధన, పర్యావరణ విశ్లేషణ చేస్తుందని తెలిసింది. ఇదే నా జీవిత దిశను మార్చింది. జియో-ఇన్ఫర్మాటిక్స్‌లో మాస్టర్స్ పూర్తి చేశాక.. వాతావరణ మార్పు, వ్యవసాయం, నీటి వనరులపై పరిశోధన చేయాలనే ఆసక్తి కలిగింది.

ప్రస్తుతం ఓ సంస్థలో రిమోట్ సెన్సింగ్ అనలిస్టుగా పనిచేస్తున్నాను. ఇక్కడ నాసా పూర్వ శాస్త్రవేత్త రామకృష్ణ నేమాని మార్గదర్శకత్వం నా శాస్త్రీయ ఆలోచనలకు మరింత పదును పెట్టింది. ఇస్రోలో చేరాలన్న కోరిక కలిగించింది. అక్కడైతే నా ఆసక్తికి తగినట్టు జియో ఇన్ఫర్మాటిక్స్‌లో పరిశోధనలు చేయవచ్చని భావించాను. ఏడాది క్రితం నోటిఫికేషన్ వచ్చినప్పుడు ప్రయత్నించినా ఎంపిక కాలేదు. అప్పటి నుంచి సిలబస్ ప్రకారం ప్రిపేర్ అవుతూనే ఉన్నాను. మధ్యలో ఇంట్లో రకరకాలైన ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా లక్ష్యాన్ని తలుచుకుంటూ ముందుకు సాగాను.

తాజాగా మరోసారి నోటిఫికేషన్ వచ్చింది. దానికి బాగా కష్టపడి పరీక్షలు రాశాను. ఇప్పుడు సైంటిస్ట్ అండ్ ఇంజినీర్ పోస్టుల ఎంపిక జాబితాలో నా పేరు ఉండటం చాలా సంతోషం కలిగిస్తోంది. భవిష్యత్తులో ఎర్త్‌సైన్సెస్‌లో పీహెచ్‌డీ చేయడంతోపాటు సుస్థిర వ్యవసాయం.. పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల ప్రణాళికలతో రైతులకు సేవచేయాలన్నదే నా లక్ష్యం!

– ఎన్.శ్రీనివాస్, సిరిసిల్ల


వారే ఎక్కువ



మీకు తెలుసా?

'ఎప్పుడూ రీల్స్ చూస్తూనే ఉంటావా..' అని అమ్మాయిలు ఊరికే అబ్బాయిలతో గొడవ పడుతూ ఉంటారు కానీ.. నిజానికి వారే ఎక్కువగా ఇంటర్నెట్ వినియోగిస్తున్నారని ఇటీవల ఓ నివేదికలో తేలింది. ముఖ్యంగా జెన్‌జీ అమ్మాయిల్లో ఇలా వాడుతున్న వారిలో దాదాపు 95శాతం ఏదో ఒక విషయంలో ఇతరులతో పోల్చుకుంటున్నారట. అలాగే ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) 2025 నివేదిక ప్రకారం ఇంటర్నెట్ వల్ల అబ్బాయిల కంటే అమ్మాయిలే 30శాతం ఎక్కువగా ఒత్తిడికి లోనవుతున్నారట. సోషల్‌మీడియాలో వివిధ పోస్టులు చూడటం, మనకు అలా లేదే అని ఆందోళన చెందడంతో వారిలో మానసికంగా అనేక సమస్యలు తలెత్తుతున్నాయని తేలింది. మరి అమ్మాయిలూ.. జాగ్రత్తపడతారా!

టిల్లూ ది రోబో



ప్రశ్న: నీ ఫేవరెట్ స్నాక్స్ ఏంటి టిల్లూ?

జవాబు : కంప్యూటర్ చిప్స్!

మీరు కూడా టిల్లూని మీకు నచ్చిన ప్రశ్న అడగండి. దానికి నచ్చిన జవాబు అది చెబుతుంది.

ఏది ముందు..?

ఆఫీసులో రోజూ చేయడానికి బోలెడు పనులుంటాయి. కానీ దేనికెంత ప్రాధాన్యమివ్వాలో తెలియక సతమతమవుతూ ఉంటాం. అదీ మనలా కెరియర్ కొత్తగా మొదలుపెట్టిన వాళ్లు. దీన్ని సులభతరం చేయడానికి ఓ టెక్నిక్ ఉంది. అదేంటంటే..



60% (హై వాల్యూ)

మన వర్క్ అవర్స్‌లో అరవై శాతాన్ని ఆరోజుకు అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశాల కోసం వెచ్చించాలి. కచ్చితంగా రోజు పూర్తయ్యేసరికి అయిపోవాల్సిన విషయాలపై పనిచేయాలి. అంటే ఈ రోజు ఫినిష్ చేయకపోతే ఇబ్బంది ఎదురయ్యేంత టాస్క్‌లన్న మాట. దీంతో అర్జెంట్ పనులు ముందు అయిపోతాయి, ఒత్తిడి తగ్గుతుంది.

30% (మిడ్ వాల్యూ)

మరో ముప్పైశాతం సమయాన్ని ఒక మోస్తరు అవసరమైన విషయాల కోసం కేటాయించాలి. అంటే ఇవి ముఖ్యమే కానీ, అర్జెంట్ కాదన్న మాట. కాస్త ఆలస్యమైనా చేసుకోవచ్చు, కానీ చేసేస్తే.. ప్లానింగ్‌కి ఇబ్బంది ఉండదు. ఉదాహరణకు రేపటి కోసం ప్రణాళిక రాసుకోవడం, ఇంపార్టెంట్ కాల్స్ తీసుకోవడం, మెయిల్స్ చెక్ చేయడం వంటివి.

10% (లో వాల్యూ)

ఇవి ఆరోజుకు పూర్తి చేసినా చేయకపోయినా పర్లేదు అనుకునేలాంటి పనులు. మనవద్ద మిగిలిన ఆఖరి పదిశాతం సమయాన్ని వీటికి కేటాయించాలి. లో వాల్యూ టాస్క్ అయినా సరే ఆరోజుకు పూర్తిచేసేయడమే మంచిది. ఎందుకంటే మళ్లీ రేపటికి పెండింగ్ పడకుండా ఉంటాయి.

అన్‌రొమాంటిక్

స్వాతి: బేబీ.. మనం అలా అలా కార్‌లో లాంగ్‌డ్రైవ్ వెళ్లి.. ఏదైనా మంచి మూవీ చూసి, సూపర్ చికెన్ బిర్యానీ తిని, ఓ అందమైన రిసార్ట్‌లో స్టే చేశామనుకో.. నీకేం అనిపిస్తుంది?

స్వాతిముత్యం : చాలా ఖర్చవుతుంది అనిపిస్తుంది!

కొంటె కొటేషన్



1. సోఫా కోసం చెయిర్ సాయం.. స్లిప్ అయితే విరగడం ఖాయం.
– హరిశంకర్
2. మగువ ఐడియా అదిరింది.. సోఫా ముందుకు కదిలింది.
– చంద్రశేఖర్, హైదరాబాద్
3. నడిచే కుర్చీ ఉండగా.. వేరే సాయం ఎందుకు దండగ.
– వై.అలేఖ్య, బెంగళూరు
4. మోయలేక సోఫా.. కుర్చీ వాడావా పాపా. – దేవరత్నం
5. ఓహో లలనా.. బాగుంది ఆలోచన.
– చిరంజీవి, శ్రీకాకుళం



ఈ ఫొటోకి సరదా వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

ప్రేమబాణం



పంచుకుందాం

ఓ ప్రియా
నీ చిలిపి నవ్వులు
నా గుండెల్లో పూచే
వలపు పువ్వులు
నీ సుందరమైన రూపం
నా మనసులో నిత్యం
వెలుగులు చిమ్మే
ప్రేమ దీపం
నీ నిలువెత్తు నీడ
మనిద్దరి ఏకాంత
ప్రపంచానికి
దారి చూపే జాడ
మనిద్దరి ప్రాణం
ఒకటిగా చేసింది
ప్రేమబాణం!

- బోనగిరి పాండురంగ

మెయిల్ పంపండి

ఈతరం పేజీలో వస్తున్న కథనాలు, శీర్షికలపై మీ విలువైన సలహాలు, సూచనలు మాకు పంపండి. మా మెయిల్ అడ్రస్ **youthpage@eenadu.in**

లక్ష్యం సాధించారు!

ఆ అబ్బాయిలకు పుట్టుకతోనే అవయవ లోపం. ఒకరికి కాలు, మరొకరికి కాలూచేయి పూర్తిగా పని చేయవు. అన్నింటికీ ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి. వారిని చూసి తల్లిదండ్రుల మనసు తల్లడిల్లిపోయేది.. అయినా భవిష్యత్తు గురించి భయపడలేదు. పిల్లలకు అండగా నిలిచారు. ఈనాడు 'లక్ష్య' సాయం తోడవ్వడంతో యువకులకు కొండంత అండ దొరికినట్లయింది. అంతే.. ఆకాశమే హద్దుగా ఎదిగారు. అంతర్జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పతకాలు సాధించారు. ఇటీవల దుబాయ్‌లో జరిగిన యూత్ ఆసియా పారా క్రీడల్లో మంత్రా లోకేష్ హైజంప్‌లో రజతం, బానొత్ అకీరానందన్ 200 మీటర్ల పరుగులో బంగారు పతకాన్ని సాధించి సత్తా చాటారు.

అదే మలుపు..



లోకేష్‌ది శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలోని రెంటికోట గ్రామం. ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. నాన్న కామన్న తాపీమేస్త్రి, అమ్మ జయలక్ష్మి కూలి పనులకు వెళ్తూ ఇంటిని నడిపిస్తున్నారు. లోకేష్‌కు పుట్టుకతోనే ఒక కాలు లేదు. దాంతో చుట్టూ ఉన్నవారి చిన్నచూపులు తప్పలేదు. కానీ వాటిని లెక్క చేయకుండా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాఠశాల దశలోనే క్రీడాపోటీల్లో పాల్గొనడం ప్రారంభించాడు. 2023లో జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ఆడుతున్న సమయంలో శిక్షకుడు తనలోని ప్రతిభను గుర్తించారు. పారా గేమ్స్‌లో పాల్గొనేలా ప్రోత్సహించారు. అప్పుడే 'లక్ష్య' సహకారం చేయూతనిచ్చింది. ఆరునెలల పాటు పారా క్రీడల గురించి తెలుసుకుని సాధన ప్రారంభించాడు. 2024 జనవరిలో గుజరాత్‌లో జరిగిన జూనియర్ నేషనల్ కాంపిటీషన్స్‌లో పాల్గొని హైజంప్‌లో రజతం సాధించాడు. అనంతరం ప్రాక్టీస్ హైదరాబాద్‌కు మారింది. అదే ఏడాది జూన్‌లో బెంగళూరులో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో హైజంప్‌లో రజతం, డిసెంబర్‌లో థాయ్‌లాండ్‌లో జరిగిన పారా గేమ్స్‌లో హైజంప్‌లో బంగారం, లాంగ్ జంప్‌లో రజతం, 2025లో సీనియర్స్ విభాగంలో దుబాయ్‌లో జరిగిన గ్రాండ్ ప్రిక్స్‌లో హైజంప్‌లో రజతం దక్కింది. మధ్యప్రదేశ్‌లో జరిగిన జూనియర్ జాతీయస్థాయి పోటీల్లోనూ, ఆపైన డిసెంబర్‌లో దుబాయ్‌లో జరిగిన యూత్ ఆసియా పారాక్రీడల్లోనూ రజతపతకాలు సాధించాడు. మరింతగా పోటీల్లో రాణించడమే తన లక్ష్యం అంటున్నాడు.

ఎంతో కుంగిపోయాను



వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని రాజీపేటలో ఉంటాడు **అకీరానందన్.** నాన్న మోహన్ హైదరాబాద్‌లో బస్సు కండక్టర్‌గా పనిచేస్తున్నారు. అకీరానందన్‌కు పుట్టుకతోనే కుడిచేయి, ఎడమకాలికి పోలియో వచ్చింది. ఎడమ కాలు ఉండాల్సిన బరువు కన్నా తక్కువగా ఉంటుంది. ఐదోతరగతి చదువుతున్న సమయంలో ఆటలంటే ఇష్టం ఏర్పడింది. 2019లో అసోంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. తర్వాత పాల్గొన్న మూడు జాతీయస్థాయి పోటీల్లోనూ పతకాలు సాధించకపోవడంతో నిరాశకు గురయ్యాడు. ఆటలు ఆపేద్దామని.. తనకు సరిపోవని భావించాడు. కానీ తల్లిదండ్రులు మళ్లీ ప్రయత్నించమని సలహా ఇచ్చారు. తర్వాత నెమ్మదిగా జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటూ పతకాలు గెలవడం మొదలుపెట్టాడు. ఈ సమయంలోనే 'లక్ష్య' అవకాశం వచ్చింది. దీంతో 2024లో బెంగళూరులో జరిగిన జాతీయస్థాయి పారా గేమ్స్‌లో 1500, 400 మీటర్ల రన్నింగ్ పోటీల్లో బంగారు పతకాలు పొందాడు. 2025 మొరాకోలో జరిగిన పారా గ్రాండ్ ప్రిక్స్ పోటీల్లో 400, 200 విభాగాల్లో బంగారు, కాంస్య పతకాలు గెలిచాడు. అనంతరం బెంగళూరులో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో 400 మీటర్ల రన్నింగ్‌లో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. గువహటిలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో 200, 400 మీటర్ల రన్నింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించాడు. తాజాగా దుబాయ్‌లో జరిగిన యూత్ ఆసియా పారా గేమ్స్‌లో 200 మీటర్లలో బంగారు పతకం పొందాడు. ఆత్మవిశ్వాసంతో అడుగువేస్తే ఎంతటి ఇబ్బందులు ఉన్నా అధిగమించవచ్చని తన గెలుపే రుజువు చేస్తోంది.

– చింతలపాటి రామాంజనేయులు, హైదరాబాద్

నవ్వు బ్రో

చరణ్ : ఎందుకురా అంత డల్‌గా ఉన్నావ్?
వినయ్ : నా టెస్ట్ రిజల్ట్స్ వచ్చాయిరా, నెగిటివ్.
చరణ్ : నెగిటివ్ వస్తే హ్యాపీనేగా! ఇంతకీ ఏం టెస్ట్ అది?
వినయ్ : ఐక్యూ టెస్ట్!!

ఆవుపేడతో.. ఇల్లు చల్లగా!

అతడు చదివింది ఆర్కిటెక్చర్, పనిచేసేది ఆవుపేడతో. అదేంటని ఆశ్చర్యపోతున్నారా..?

ఆవుపేడను ఇప్పటికే సంప్రదాయ జీవనశైలిలో అనేక విధాలుగా వాడుతున్నారు. కానీ ఆధునిక నిర్మాణశైలి ఉపయోగించి కట్టే భవనాలకూ దీన్ని వాడొచ్చని, తద్వారా నేచురల్ కూలింగ్ ఎఫెక్ట్ తీసుకురావచ్చని కనిపెట్టాడు విజయనగరం జిల్లా గరివిడికి చెందిన అల్లం వెంకట జశ్వంత్. ఈ పరిశోధన గురించి తన మాటల్లోనే..



'ఆవుపేడతో ఇల్లు అలకడం చిన్నప్పుడు మా ఊళ్లో చూశాను. అలా చేస్తే చల్లగా ఉంటుంది అనేవారు. అప్పటినుంచి ఇంకా తెలుసుకోవాలనే ఆసక్తి ఉండేది. ఇంటర్ తర్వాత ముంబయిలో ఆర్కిటెక్చర్ పూర్తిచేశాను. తర్వాత అహ్మదాబాద్‌లో పీజీలో చేరి, భవన నిర్మాణాల సుస్థిరతపై అధ్యయనం చేశాను. ఈ క్రమంలోనే ఆవుపేడపై పరిశోధన చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఖరగ్‌పూర్ ఐఐటీకి పేపర్ సమర్పించగా, అవకాశం లభించింది. ఐఐటీ ఆచార్యుల ఆధ్వర్యంలో నా శోధన కొనసాగించాను. ప్రస్తుతం అమరావతిలో సైట్ ఇంఛార్జిగా పనిచేస్తున్నా.

నా పరిశోధనలో ఒక కిలో ఆవుపేడలో 200 నుంచి 300 గ్రాముల వరకు సెల్యులోజ్ ఫైబర్ ఉన్నట్లు గుర్తించాను. ఈ శోధన ఫలితాలను భారత ప్రభుత్వానికి అందించాను. ఈ సెల్యులోజ్ ఫైబర్‌ను భవన నిర్మాణ రంగంలో ఎలా ఉపయోగించవచ్చు, దాని ప్రయోజనాలు ఏమిటి అనే విషయమై ప్రజెంటేషన్ సమర్పించాను. అన్నీ పరిశీలించిన అనంతరం నా పరిశోధన ఫలితాలకు శాస్త్రీయత ఉందని గుర్తించి పేటెంట్ హక్కు కల్పించారు.

పర్యావరణహితంగా..


ఇల్లయినా, కార్యాలయమైనా.. మరే కట్టడమైనా అందులో వేడిని తగ్గించి చల్లదనం కోసం ఏసీలు, కూలర్లు, ఫ్యానులు పెట్టించుకుంటుంటాం. దీంతో తాత్కాలిక చల్లదనం ఉన్నా.. ఇంధన వనరుల వ్యయం, పర్యావరణానికి నష్టం జరుగుతుంది. ఆవుపేడలో లభించే సెల్యులోజ్ ఫైబర్ పొడికి సహజ సిద్ధమైన చల్లదనం ఉంటుంది. ఉష్ణోగ్రతను అడ్డుకునే సామర్థ్యం ఉంటుంది. యూఎస్ఏలో చెక్కతో నిర్మించిన ఇళ్లలో.. చెక్కల మధ్య రంధ్రాలు పెట్టి ఈ పొడిని నింపుతారు. మన దగ్గర నిర్మాణాలకు ఉపయోగించే ఇటుకల వరసల మధ్య దీన్ని పూయడం ద్వారా ఆ భవనం లోపల చల్లగా ఉంటుంది. అలాగే దీన్ని దుస్తుల తయారీలోనూ ఉపయోగించవచ్చు.

ఇప్పటికే కొందరు పెట్టుబడిదారులు దీనికి సంబంధించిన పరిశ్రమ ఏర్పాటుకు నన్ను సంప్రదిస్తున్నారు. ముందు ఒక పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టి, బ్రాండ్ క్రియేట్ చేయాలనే ఆలోచన ఉంది. ఇందుకు పూర్తిస్థాయి సమయం వెచ్చించాలి. దీన్ని మేకిన్ ఇండియాలో ఒక మంచి బ్రాండ్ ప్రాజెక్టుగా నిలపాలన్నది నా లక్ష్యం.

– డి.రమణ, గరివిడి, విజయనగరం

ఐ లవ్ ఏఐ

మనుషులను ప్రేమించడం మనకు తెలిసిందే. కానీ కొత్తగా ఏఐని ప్రేమిస్తున్నారు ఇప్పటి కుర్రకారు. 'అదేంటీ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ప్రేమ ఎలా?' అని ఆశ్చర్యపోకండి. ఎదుటి మనిషిని నమ్మడం, ప్రేమించడం, కలిసి బతకడం కష్టమని భావించి.. తమ మనోభావాలను అర్థం చేసుకునే కంప్యూటర్లతో కాలం గడపడం మంచిదని అనుకుంటున్నారు కొందరు. అందుకే ఏఐతో డేటింగ్ చేస్తున్నారు.



ఏఐ డేటింగ్ కోసం యువత రెప్లికా, చాట్‌జీపీటీ వంటివి ఉపయోగిస్తున్నారు. కొందరైతే మరో అడుగు ముందుకేసి ఏఐ చాట్‌బాట్‌లతో నిశ్చితార్థం, వివాహం చేసుకుంటున్నారు. జపాన్‌లో ఓ వ్యక్తి చట్టబద్ధంగా హోలోగ్రాఫిక్ ఏఐ విగ్రహాన్ని పెళ్లి చేసుకున్నాడు. కానీ చాలా సందర్భాల్లో ఇలాంటి పెళ్లిళ్లకు చట్టబద్ధత ఉండదు. సామాజిక ఆమోదం కూడా తక్కువే. కానీ ఏఐ తమ మనసు అర్థం చేసుకుంటుందని భావించడం, చెప్పింది వినడం తప్ప దాంతో ఏ గొడవా ఉండదని అనుకోవడంతో ఇలా జరుగుతోందట.

- మనుషులతో కంటే ఏఐతో రిలేషన్‌షిప్‌లో ఉండటం సులువని భావిస్తున్నారట. కొంతమంది ఏఐ భాగస్వాములను నిజమైన వ్యక్తుల్లా చూస్తున్నారట. అతికొద్ది మంది శృంగారపరమైన విషయాలకూ దీనిపై ఆధారపడుతున్నారట.

ఎందుకిలా..

- ప్రస్తుతం ఉన్న బిజీ జీవితాల్లో ఎవరి పనులు వారికే సరిపోతున్నాయి. ఒకరితో ఒకరు మాట్లాడుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీనివల్ల ఒంటరితనమే మిగులుతుంది. ఇలాంటి సమయంలో మనుషుల కంటే ఏఐ బెటరని భావిస్తున్నారట.
- ఆఫీస్, ఇతర పనుల్లో ఏదైనా ఒత్తిడిగా అనిపించినప్పుడు వారు ఏఐ సలహాలు తీసుకుంటున్నారు. కష్టసుఖాలను దాంతో పంచుకుంటున్నారు. దీనివల్ల మానసిక భారం తగ్గినట్లు ఫీలవుతున్నారు.
- స్మార్ట్ ఫోన్‌తో విడదీయరాని బంధం కూడా దీనికో కారణం. అన్నింటికీ దాన్ని వాడినట్టే రిలేషన్‌షిప్ కోసం దాని మీదే ఆధారపడుతున్నారు.
- షాపింగ్, ఫుడ్, ట్రావెలింగ్ మొదలైన వారి రోజువారీ పనులకు ఏం చేయాలనే విషయాలను కృత్రిమ మేధస్సునే అడుగుతున్నారు.
- చదువులు, కెరియర్ కోసం ఇంటికి దూరంగా ఉండేవారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఆ మానసిక శూన్యాన్ని తగ్గించుకోవడానికి ఇదో మార్గంగా వారికి కనిపిస్తుంది.

నష్టాలే ఎక్కువ

- ఒంటరితనం నుంచి దూరం కావడానికి ఏఐ వాడుతూ ఉండొచ్చు. కానీ దీని వల్ల నష్టాలే ఎక్కువ. డిప్రెషన్, ఆందోళన, యాంగ్జయిటీ వంటివి పెరుగుతున్నాయి. చివరికి బయటి ప్రపంచంతో సంబంధం లేదనే భావనకు లోనవుతారు.
- కొన్నిసార్లు నిజమైన బంధాలు దూరమైపోయే పరిస్థితి తలెత్తవచ్చు.
- ఏఐ అన్నిసార్లూ సరైన సమాధానాలు ఇవ్వకపోవచ్చు. దీనివల్ల తప్పుడు నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉంది.
- మనుషుల మాదిరిగా దీనికి ఆలోచన, భావోద్వేగాలు ఉండవు. నెట్‌వర్క్ ఉన్నంత వరకే పనిచేస్తుంది. ఒకవేళ సరైన నెట్‌వర్క్ లేని పరిస్థితుల్లో మనం దాని మీద ఆధారపడే పరిస్థితి వస్తే అంతే సంగతులు.

(c) eenadu

ఈనాడు సినిమా



ప్రభాస్

స్పిరిట్ విడుదల ఖరారు

కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కలయికలో రూపొందుతున్న బహుభాషా చిత్రం 'స్పిరిట్'. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్, టీ సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రీ కథానాయిక. వివేక్ ఒబెరాయ్, కాంచన, ప్రకాశ్‌రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాని వచ్చే ఏడాది మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ విషయాన్ని దర్శకుడు సందీప్ శుక్రవారం సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించారు. శక్తిమంతమైన పోలీసు కథతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో ప్రభాస్ ఐపీఎస్ అధికారిగా రా రస్టిక్ లుక్‌లో అలరించనున్నారు. ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. దీనికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

ఈ ఆటలో అందరూ దోషులే



ధనుష్

"అది పంటైనా, కలుపైనా.. పాపమైనా, పుణ్యమైనా.. ఒక మనిషి తను నాటింది అతనే కోసుకోవాల"ని అంటున్నారు తమిళ హీరో ధనుష్. ఆయన ప్రధాన పాత్రలో 'డీ54' (వర్కింగ్ టైటిల్) అనే చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహిస్తున్నారు. మమితా బైజు కథానాయిక. తాజాగా ఈ సినిమాకు 'కర' అనే పేరును ఖరారు చేసినట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. "ఈ ఆటలో ప్రతి ఒక్కరూ దోషులే.. కాకపోతే కారణే వేర్వేరు" అనే వ్యాఖ్యను జోడించింది. 'నా పేరు కరసామి. అందరూ నన్ను కర అని పిలుస్తారు' అంటూ ధనుష్ పాత్రను పరిచయం చేసిన తీరు ఆకట్టుకుంటోంది. గ్రామీణ నేపథ్యంలో తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో జయరామ్, సూరజ్ వెంజరమూడు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ నిర్మిస్తుంది.

జపాన్‌లో పుష్ప 2 సందడి



జపాన్ అభిమానితో అల్లు అర్జున్, రష్మిక

'పుష్ప కున్రిన్' పేరుతో జపాన్‌లో 'పుష్ప 2: ది రూల్' సందడి మొదలైంది. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ తెరకెక్కించిన ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి గీక్ పిక్చర్స్, షోచికు సంస్థలు జపాన్ ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లాయి. రష్మిక కథానాయిక. ఇది శుక్రవారం అక్కడ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా అల్లు అర్జున్ అక్కడి ప్రేక్షకులతో కలిసి చేస్తున్న సందడి నెట్టింట వైరల్‌గా మారింది. ముఖ్యంగా ఈ సినిమాలో జపాన్ పోర్టు ఫైట్ నేపథ్యంలో బన్నీ చెప్పిన జపనీస్ డైలాగ్‌ను ఆయన అక్కడి ప్రేక్షకుల ముందు లైవ్‌లో చెప్పడం అందరి దృష్టినీ ఆకర్షించింది. మరి ఈ సినిమా జపాన్‌లో వసూళ్ల పరంగా ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో తెలియాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడక తప్పదు.

వచ్చే సంక్రాంతికి మళ్లీ వస్తా!



అనిల్ సుంకర, శ్రీను వైట్ల, శర్వానంద్, సంయుక్తా మేనన్, దిల్‌రాజు, రామ్ అబ్బరాజు

"నారీ నారీ నడుమ మురారి'తో చెప్పి మరీ హిట్టు కొట్టాన'ని కథానాయకుడు శర్వానంద్ అన్నారు. ఈ కథ విన్న తొలిరోజు నుంచే ఇది తనకెంతో నమ్మకాన్ని కలిగించిందని.. ఈ సినిమా ఎప్పుడు విడుదల చేసినా తప్పకుండా బ్లాక్‌బస్టర్ అవుతుందని ముందే ఊహించానని. . ఇప్పుడా నమ్మకం నిజమైనందుకు ఆనందంగా ఉందని తెలిపారు. శర్వా హీరోగా నటించిన ఈ సినిమాని రామ్ అబ్బరాజు తెరకెక్కించారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సంయుక్తా మేనన్, సాక్షి వైద్య కథానాయికలు. నరేశ్, సంపత్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. నిర్మాత దిల్‌రాజు, దర్శకుడు శ్రీను వైట్ల అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ.. "ఇది నాకు చాలా ఎమోషనల్ మూమెంట్. హిట్ కొడతానని చెప్పి మరీ కొట్టాను. సంక్రాంతికి రావాలన్న నా కల నెరవేర్చినందుకు నిర్మాత అనిల్‌కు ధన్యవాదాలు. నేను చాలా రోజులుగా హిట్ కోసం ఎదురు చూస్తున్నా. నాకు ఆ హిట్ ఇచ్చిన దర్శకుడు రామ్ అబ్బరాజుకు కృతజ్ఞతలు. తనలాంటి దర్శకులు ఇండస్ట్రీకి కావాలి. తాను నాకు కథ ఎంత బాగా చెప్పాడో.. అంతకంటే అద్భుతంగా తెరపైకి తీసుకొచ్చాడు. ఈ చిత్రానికి మరో హీరో నరేశ్. మా నాన్న పాత్ర పోషించారు. సినిమా చూసిన వాళ్లంతా 'చాలా రోజుల తర్వాత ఇంతలా నవ్వుకున్నామ'ని చెప్తుంటే ఆనందంగా అనిపించింది. నేనెప్పుడు సంక్రాంతికి వచ్చినా అన్ని సినిమాలు ఆడతాయి. అందుకే ఇకపై ప్రతి సంక్రాంతికి నాకోసం ఒక స్లాట్ పక్కన పెట్టండి (నవ్వుతూ). వచ్చే సంక్రాంతికి మళ్లీ వస్తా. శ్రీను వైట్ల దర్శకత్వంలో మైత్రీ మూవీస్ నిర్మించనున్న నా తదుపరి సినిమా పండక్కే వస్తుంది" అన్నారు. 'ఇది మంచి సినిమా. పండగ చివర్లో రావడం వల్ల ఎక్కువ థియేటర్లు ఇవ్వలేకపోయాం. కానీ, వచ్చే వారం నుంచి స్క్రీన్స్ పెరగబోతున్నాయి. ఇది చాలా పెద్ద హిట్ కొట్టబోతుంది" అన్నారు నిర్మాత దిల్‌రాజు. ఈ కార్యక్రమంలో రామ్ అబ్బరాజు, అనిల్ సుంకర, సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పండగ.. ప్రచారాలు నిండుగా

సంక్రాంతి వేళ చిత్రసీమలో ప్రచార కాంతులు కనిపించాయి. అందాల రంగవల్లుల్లా తళుకులీనిన కొత్త పోస్టర్లు.. వినువీధిలో రివ్వుమనే పతంగుల్లా అలరించిన టీజర్లు.. పసందైన పిండివంటల్లా నోరూరించిన కొత్త సినిమాల కబుర్లు.. ఇలా పండగ సంబరమంతా చిత్రసీమలోనే కనిపించింది. మరి ఈ పెద్ద పండక్కి ఏయే చిత్రాలు ఏ రీతిలో ప్రేక్షకులకు కనుల విందు అందించాయో చూద్దాం పదండి..

దేవిశ్రీ హీరోగా.. 'ఎల్లమ్మ'



ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఇప్పుడు హీరోగా ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'బలగం' సినిమాతో అందర్నీ మెప్పించిన దర్శకుడు వేణు యెల్దండితో 'ఎల్లమ్మ' అనే చిత్రం చేస్తున్నారు. ఈ ఇద్దరి కలయికలో రూపొందుతున్న ఈ సినిమాని దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ మేరకు సంక్రాంతి సందర్భంగా ఈ చిత్ర గ్లింప్స్‌ను విడుదల చేశారు. అందులో తుపాను నడుమ.. చెట్టుకు ఆనించి ఉన్న కొడవలి పక్కన.. ఒంటిపై చొక్కా లేకుండా, నడుముకు డోలు కట్టుకుని ఓ రాయిపై దేవిశ్రీ కూర్చున్న తీరు.. నెత్తురోడుతూ రా రస్టిక్ లుక్‌లో కనిపించిన విధానం ఆసక్తిరేకెత్తించింది. ఆయన ఇందులో పర్శి అనే పాత్రలో అలరించనున్నట్లు ఆ గ్లింప్స్‌తో స్పష్టత ఇచ్చారు. దీనికి దేవిశ్రీనే స్వయంగా సంగీతమందించనున్నారు. ఆధ్యాత్మిక అంశాలతో నిండిన ఈ యాక్షన్ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

'స్లమ్ డాగ్'..




తమిళ స్టార్ విజయ్ సేతుపతితో దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ పాన్ ఇండియా చిత్రం రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. పూరి కనెక్ట్స్ పతాకంపై ఛార్మి, జేబీ నారాయణ రావు నిర్మిస్తున్నారు. సంయుక్తా మేనన్, టబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి అందరూ అనుకున్నట్లుగానే 'స్లమ్ డాగ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 33 టెంపుల్ రోడ్.. అన్నది ఉపశీర్షిక. ఈమేరకు విజయ్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టైటిల్, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. విజయ్ అందులో టైటిల్‌కు తగ్గట్లుగానే బిచ్చగాడి తరహా వస్త్రధారణతో.. నల్లకళ్లజోడు పెట్టుకుని, చేతిలో కత్తితో కనిపించారు. తన వెనుక పెట్టెల నిండా డబ్బు కట్టలు కనిపించడం ఆసక్తిరేకెత్తించేలా ఉంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ త్వరలోనే థియేటర్లలోకి రానుంది.

వచ్చాడు చూడే బసవన్న..



నటుడు అర్జున్ తన కూతుర్ని కథానాయికగా తెరకు పరిచయం చేస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'సీతా పయనం'. నిరంజన్, సత్యరాజ్, ప్రకాశ్‌రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. హీరో ధ్రువ సర్జా ప్రత్యేక పాత్రలో నటించారు. ఈ సినిమా ఫిబ్రవరి 14న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సంక్రాంతి సందర్భంగా ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. 'చూడే బసవన్న వచ్చాడు చూడే.. వచ్చినోడు అర్జునుడు బాణం లాంటోడే" అంటూ ధ్రువ సర్జా పాత్ర నేపథ్యంలో సాగిన ఈ పాటను అనూప్ రూబెన్స్ స్వరపరిచారు. కాసర్ల శ్యామ్ సాహిత్యమందించారు. నకాశ్ అజీజ్, ఎల్ కీర్తన ఆలపించారు. లలితా శోభి, శ్రష్టి వర్మ కొరియోగ్రఫీ చేశారు.

'నాగబంధం'లో పార్వతిగా నభా!



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'నాగ బంధం'. కిశోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్నారు. నభా నటేశ్, ఐశ్వర్య మేనన్ కథానాయికలు. జగపతిబాబు, మురళీప్రకాశ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ముగింపు దశ చిత్రీకరణలో ఉన్న ఈ పాన్ ఇండియా సినిమా ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం నుంచి నభా ఫస్ట్‌లుక్‌ను బయటకు వదిలారు. తనిందులో పార్వతి అనే పాత్ర పోషిస్తున్నట్లు తెలియజేశారు. "ఇది భారతదేశంలోని ఓ పురాతన విష్ణు ఆలయం నేపథ్యంలో సాగే సినిమా. నాగబంధం సంప్రదాయంలోని పవిత్ర రహస్యాల్ని అన్వేషిస్తుంది. పురాణాలతో ముడిపడిన ఈ సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్ అందర్నీ అలరిస్తుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

సంప్రదాయం ఉన్న చోటే బలం ఉంటుంది



"నేల ఉన్న చోట బతుకు ఉంటుంది. సంప్రదాయం ఉన్న చోట బలం ఉంటుంది" అంటున్నారు కథానాయకుడు సాయి దుర్గా తేజ్. ఇప్పుడాయన నుంచి రానున్న కొత్త సినిమా 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్ కె.పి దర్శకత్వం వహిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషిస్తున్నారు. ముగింపు దశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా నుంచి సంక్రాంతి సందర్భంగా కొత్త లుక్‌ను విడుదల చేశారు. అందులో సాయితేజ్ పంచెకట్టులో చెప్పుల్లేకుండా తన గోవును పట్టుకుని నడిచొస్తూ కనిపించారు. ఇది స్వాతంత్ర్యం పూర్వం జరిగే కథతో బలమైన భావోద్వేగాలు నిండిన యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్నట్లు చిత్ర బృందం తెలిపింది.

విశాఖలో ఘనంగా సెలబ్రిటీ క్రికెట్ లీగ్

విశాఖ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం జరిగిన సెలబ్రిటీ క్రికెట్ లీగ్(సీసీఎల్) అభిమానుల్లో జోష్ నింపింది. తారలు మైదానంలో తిరుగుతూ అభిమానుల్లో ఉత్సాహం నింపారు. తెలుగు వారియర్స్ జట్టులో అక్కినేని అఖిల్, ఆది, సుధీర్‌బాబు, ఓంకార్, సామ్రాట్, సచిన్ జోషి, అశ్విన్‌బాబు, సంగీత దర్శకుడు తమన్, దర్శకులు ప్రశాంత్ వర్మ, అయ్యప్ప శర్మ, కర్ణాటక బుల్డోజర్ జట్టులో కిచ్చా సుదీప్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భోజ్‌పురి దబాంగ్ జట్టుతో తలపడిన తెలుగు వారియర్స్ జట్టు ఓటమి పాలైంది. భోజ్‌పురి జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. అనంతరం తెలుగు వారియర్స్ జట్టు 18 ఓవర్లలో 114 పరుగులకు ఆలౌటైంది. సుధీర్‌బాబు 26 పరుగులు చేయగా, అఖిల్ 12, అశ్విన్‌బాబు 11 బంతుల్లో 15 పరుగులు చేశారు.

■ అంతకుముందు జరిగిన మ్యాచ్‌లో 'పంజాబ్ దే షేర్' జట్టు పై కర్ణాటక బుల్డోజర్స్ జట్టు 31 పరుగులతో ఘన విజయం సాధించింది. మొదట కర్ణాటక బుల్డోజర్స్ జట్టు 19.2 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌటైంది. పంజాబ్ దే షేర్ జట్టు 18.3 ఓవర్లలో కేవలం 139 పరుగులు చేసి ఓటమి పాలైంది.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం (పీఎంపాలెం)



తెలుగు వారియర్స్ జట్టులోని సభ్యులు అశ్విన్ బాబు, తమన్, ప్రిన్స్

ఒకే ప్రేమ.. ఒకే అవకాశం



సాయిపల్లవి, జునైద్ ఖాన్

"సినిమాలలో ఎన్ని అద్భుతాలు జరుగుతాయో కదా! కానీ నిజ జీవితంలో అలాంటివి ఎందుకు జరగవు?" అని తన ప్రియుడితో ప్రేమకబుర్లు చెప్తోంది అందాల తార సాయిపల్లవి. మరి ఆ జంట కథేంటో తెలుసుకోవాలంటే 'ఏక్ దిన్' సినిమా చూడాల్సిందే. ఆమె, ఆమిర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ జంటగా నటిస్తున్న చిత్రమిది. దీనితోనే సాయిపల్లవి బాలీవుడ్‌లోకి అడుగుపెట్టడం విశేషం. సునీల్ పాండే దర్శకత్వం వహిస్తున్నారు. ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తుంది. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను పంచుకుంటూ.. 'ఒకే ప్రేమ.. ఒకే అవకాశం' అనే వ్యాఖ్యతో సామాజిక మాధ్యమాల వేదికగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో ప్రేమపక్షుల్లా కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు సాయిపల్లవి, జునైద్. ఈ రొమాంటిక్ డ్రామా మే 1న థియేటర్లలోకి రానున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. మరోవైపు ఈ సినిమా పోస్టర్ థాయ్ రొమాంటిక్ డ్రామా 'వన్ డే'ను పోలి ఉందంటూ పలువురు నెట్టింట్లో 'ఏక్ దిన్' చిత్రాన్ని విమర్శిస్తున్నారు.

ప్రేక్షకులు ఆగకుండా నవ్వుతున్నారు!



మీనాక్షి, నవీన్ పొలిశెట్టి, నాగవంశీ, మారి

"వినోదంతో పాటు మంచి భావోద్వేగాలు నిండిన సినిమా 'అనగనగా ఒక రాజు'. ప్రేక్షకులు దీంట్లోని వినోదాన్ని ఎంతలా ఆస్వాదిస్తున్నారో.. ఎమోషనల్ సీన్లకు అదే స్థాయిలో చప్పట్ల వర్షం కురిపిస్తున్నారు" అన్నారు హీరో నవీన్ పొలిశెట్టి. ఆయన.. మీనాక్షి చౌదరి జంటగా నటించిన ఈ సినిమాని మారి తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రం ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ "నాకు రాజ్‌కుమార్ హిరాణీ సినిమాలంటే చాలా ఇష్టం. తెలుగులో అలాంటి చిత్రం చేయాలనే ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేశాం. దీన్ని శ్రీరాములు లాంటి మాస్ థియేటర్లో చూశాను. ఇందులోని కామెడీని.. ఎమోషన్‌ను అందరూ ఆస్వాదిస్తున్నారు. ఫస్టాఫ్ తొలి సీన్ నుంచి ఇంటర్వెల్ వరకు ఆగకుండా నవ్వుతున్నారు. ద్వితీయార్ధంలోని పొలిటికల్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. మా కథ అన్ని వర్గాల ప్రేక్షకులకు చేరువైందని అర్థమైంది. ఈ సంక్రాంతికి పెద్ద సినిమాలు పోటీలో ఉన్నప్పటికీ మా చిత్రాన్ని బ్లాక్‌బస్టర్ చేసిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. నా వెనకున్న శక్తి ప్రేక్షకులే. నా చిత్రాల్ని మోసేది వాళ్లే. అందుకే వాళ్లని అలరించడానికి నా శక్తికి మించి కృషి చేస్తా" అన్నారు. "2020లో విడుదలైన 'అల వైకుంఠపురములో' సినిమా తర్వాత ఆ స్థాయిలో తృప్తినిచ్చిన సంక్రాంతి ఇది. త్రివిక్రమ్ ఈ చిత్రం తొలిసారి చూసినప్పుడే బాగుందని చెప్పారు. అది నాకెంతో ధైర్యాన్నిచ్చింది. రెండు పెద్ద సినిమాలు విడుదలైనప్పటికీ మా డిస్ట్రిబ్యూటర్లు మాకు తగినన్ని థియేటర్లు కేటాయించి అండగా నిలిచారు. అందుకే రెండు రోజుల్లోనే రూ.41కోట్ల గ్రాస్ రాబట్టగలిగాం" అన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ. ఈ కార్యక్రమంలో మారి, మీనాక్షి చౌదరి, మిక్కీ జే మేయర్, రావు రమేశ్, చిన్మయి తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పం.. సరిహద్దు దాటనివ్వం



'బార్డర్ 2'

"ఒక సైనికుడికి.. సరిహద్దు అంటే కేవలం పటంపై గీసిన గీత కాదు.. ఇది తన దేశ ప్రజలకు ఇచ్చిన మాట. అతను నిలబడి ఉన్న ఆ గీతను శత్రువును దాటినివ్వనని చేసిన ప్రమాణం" అంటూ యుద్ధ రంగంలోకి అడుగుపెట్టారు బాలీవుడ్ హీరో సన్నీ దేఓల్. ఇదంతా ఆయన నటించిన 'బార్డర్ 2' సినిమా కోసమే. అనురాగ్ సింగ్ దర్శకత్వం వహించారు. వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహాన్ శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 23న థియేటర్లలోకి రాబోతుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. సరిహద్దుల్లో మన సైనికులు చేసే సాహసాలు, వాళ్ల కోసం ఎదురు చూసే కుటుంబ సభ్యుల భావోద్వేగాలను చూపిస్తూ ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతోందీ ట్రైలర్. "ఈరోజు ఎట్టిపరిస్థితుల్లోనూ మనం ఇచ్చిన మాటను తప్పకూడదు', 'భారతీయుల్నే భయపెడుతున్నారా?" లాంటి శక్తిమంతమైన సంభాషణలు సినీప్రియుల్ని ఆకట్టుకుంటున్నాయి. భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, జేపీ దత్తా సంయుక్తంగా నిర్మించారు.

డీసీపీ రీటా వచ్చేది ఆరోజే!



బాలీవుడ్ కథానాయిక భూమి పెడ్నేకర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సిరీస్ 'దల్దాల్'. సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో అమృత్ రాజ్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సిరీస్ టీజర్‌ను పంచుకుంటూ.. విడుదల తేదీని ప్రకటించింది ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో. "నువ్వు దానితో ఎంత ఎక్కువగా పోరాడితే.. అది అంత లోతులోకి తీసుకెళ్తుంది" అనే వ్యాఖ్యను జోడించింది. ముంబయి నేపథ్యంలో సాగే ఈ సిరీస్‌లో కొత్తగా నియమితులైన డీసీపీ రీటా ఫెరీరా పాత్రలో కనిపించనుంది భూమి. ఆమె ఓ క్రూరమైన నేరస్థుడి ఆటను ఎలా రక్తి కట్టించిందనే దాని చుట్టూ ఈ సిరీస్ కథ తిరుగుతుంది. విక్రమ్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ సిరీస్ ఈ నెల 30న రాబోతుంది.

భూమి పెడ్నేకర్

(c) eenadu


జెన్ టెక్నాలజీస్‌కు రూ.404 కోట్ల ఆర్డర్లు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన రక్షణ రంగ సంస్థ జెన్ టెక్నాలజీస్, రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి రూ.404 కోట్ల విలువైన ఆర్డర్ దక్కించుకుంది. సరిహద్దులు, కీలక ప్రాంతాల్లో డ్రోన్ల ముప్పును తిప్పికొట్టే యాంటీ డ్రోన్ సిస్టమ్స్ సరఫరా కోసం రూ.332 కోట్ల ఆర్డర్; సిమ్యులేటర్లు, ఇతర శిక్షణ పరికరాల కోసం రూ.72 కోట్ల ఆర్డరు వచ్చింది. ఏడాది వ్యవధిలోగా వీటిని అందించాల్సి ఉంటుంది.

సెంట్రల్ బ్యాంక్ లాభంలో 32% వృద్ధి

దిల్లీ: ప్రభుత్వ రంగ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిసెంబరు త్రైమాసికంలో రూ.1,263 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే త్రైమాసిక లాభం రూ.959 కోట్లతో పోలిస్తే ఇది 32% ఎక్కువ. మొత్తం ఆదాయం రూ.9,739 కోట్ల నుంచి రూ.10,969 కోట్లకు వృద్ధి చెందింది. వడ్డీ ఆదాయం రూ.8,509 కోట్ల నుంచి రూ.9,033 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం మాత్రం రూ.3,540 కోట్ల నుంచి స్వల్పంగా తగ్గి, రూ.3,502 కోట్లకు; నికర వడ్డీ మార్జిన్ 3.45% నుంచి 2.96 శాతానికి పరిమితమైంది. స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 3.86% నుంచి 2.7 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.59% నుంచి 0.45 శాతానికి మెరుగయ్యాయి.

రిలయన్స్ లాభం రూ.18,645 కోట్లు



ఆదాయం రూ.2.69 లక్షల కోట్లు

అన్ని వ్యాపార విభాగాలు బలోపేతమై, సమర్థంగా రాణించాయి. జియో చందాదార్లు, ఆ విభాగ ఎబిటా గణనీయంగా పెరిగాయి. రిటెయిల్ వ్యాపారం కొత్త బ్రాండ్లు, ఉత్పత్తులను సమకూర్చుకుంది. ఈ వ్యాపార విభాగాన్ని విభజించే ప్రక్రియ ఈ త్రైమాసికంలో చేపడతాం. ఏఐ – కొత్త ఇంధన విభాగాలతో వాటాదార్లకు మరింత విలువ జతచేరుస్తాం.
– ముకేశ్ అంబానీ, సీఎండీ, రిలయన్స్ ఇండస్ట్రీస్

రిలయన్స్ ఇండస్ట్రీస్, డిసెంబరు త్రైమాసికంలో రూ.18,645 కోట్ల (షేరుకు రూ.13.78) నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.18,540 కోట్ల (షేరుకు రూ.13.70)తో పోలిస్తే, దాదాపు మార్పేమీ లేనట్లే. గ్యాస్ ఉత్పత్తి తగ్గడం, రిటెయిల్ వ్యాపారం బలహీనంగా సాగడం ఇందుకు కారణమని పేర్కొంది. జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణ ప్రయోజనం పెద్దగా కనపడలేదు. కార్యకలాపాల ఆదాయం రూ.2.43 లక్షల కోట్ల నుంచి రూ.2.69 లక్షల కోట్లకు పెరిగింది. పన్నుకు ముందు లాభం (ఎబిటా) 6.1% వృద్ధితో రూ.48,003 కోట్లుగా నమోదైంది. సంస్థ నికర రుణాలు మార్పేమీ లేకుండా రూ.1.17 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఈ త్రైమాసికంలో రూ.33,826 కోట్ల మూలధన వ్యయాలను సంస్థ చేసింది. ఓ2సీతో పాటు కొత్త ఇంధన వ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతున్నామని, జియో-రిటెయిల్ నెట్‌వర్క్-మౌలిక వసతుల్లోనూ ఇవి కొనసాగుతాయని వివరించింది.

✦ గ్రూప్‌నకు చెందిన చమురు రిఫైనరీలు, పెట్రో రసాయనాల కాంప్లెక్సులను నిర్వహించే చమురు-రసాయనాల (ఓ2సీ) వ్యాపారాదాయం 8.4% పెరిగింది. మార్జిన్ల వృద్ధి, రిటెయిల్ నెట్‌వర్క్‌ను మరింత విస్తృతం చేయడం ఇందుకు నేపథ్యం. అయితే కేజీ క్షేత్రాల నుంచి ఉత్పత్తి తగ్గినందున, చమురు-గ్యాస్ విభాగ ఎబిటా 13% తగ్గి, రూ.4857 కోట్లుగా నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో ఇక్కడ ఉత్పత్తి దాదాపు 10% తగ్గిందని, ధర కూడా తక్కువగానే ఉందని పేర్కొంది. కేజీ-డీ6 క్షేత్రంలో రోజుకు 261. మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్, 18,400 బ్యారెళ్ల ముడిచమురు ఉత్పత్తి అయ్యింది.

34% పెరిగిన డేటా వినియోగం

జియో ప్లాట్‌ఫామ్స్ ఆదాయం 13% పెరిగింది. కొత్త చందాదారులు జతచేరడం, ప్రతి వినియోగదారుపై వచ్చే సగటు ఆదాయం (ఆర్పు) పెరగడం ఇందుకు కారణం. సంస్థ ఏకీకృత నికరలాభం 11.3% వృద్ధితో రూ.7629 కోట్లకు, అనుబంధ/సంయుక్త సంస్థల ప్రభావం తీసేశాక.. నికరలాభం రూ.6857 కోట్లకు చేరింది. సంస్థ ఆదాయం రూ.33,074 కోట్ల నుంచి 12.7% పెరిగి రూ.37,262 కోట్లకు చేరింది. చందాదార్ల సంఖ్య సెప్టెంబరు త్రైమాసికంలో 50.64 కోట్లు కాగా, డిసెంబరుకు 51.53 కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో ఆర్పు రూ.211.4 నుంచి రూ.213.7కు పెరిగింది. ఒక చందాదారు వినియోగించిన డేటా నెలకు సగటున 40.7 జీబీకి చేరింది. 2024-25 ఇదే కాలంతో పోలిస్తే, డేటా వినియోగం 34% అధికమైంది.

జియో హాట్‌స్టార్ ఆదాయం రూ.8010 కోట్లు

జియో హాట్‌స్టార్ ఆదాయం రూ.8010 కోట్లని, ఎబిటా (ఇతరాదాయంతో కలిపి) రూ.1303 కోట్లని సంస్థ తెలిపింది. నెలకు సగటున 45 కోట్లమంది యాక్టివ్ చందాదార్లున్నారని వెల్లడించింది. సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే, వీరి సంఖ్య 13% అధికమైంది. సంస్థ నికర లాభం రూ.888 కోట్లుగా ఉంది.

రిటెయిల్ ఆదాయం రూ.97,605 కోట్లు

రిలయన్స్ రిటెయిల్ వ్యాపార నికరలాభం 2.7% పెరిగి రూ.3551 కోట్లుగా, స్థూల ఆదాయం 8.1% అధికమై రూ.97,605 కోట్లుగా నమోదైంది. కార్యకలాపాల ఆదాయం రూ.79,595 కోట్ల నుంచి 9.2% పెరిగి రూ.86,951 కోట్లకు చేరింది. కొత్తగా 431 కొత్త విక్రయశాలలను ప్రారంభించామని, క్విక్ కామర్స్ విభాగం ద్వారా రోజుకు 16 లక్షల ఆర్డర్లు లభించాయని వివరించింది. 50,000కు పైగా ఉత్పత్తులు తమ విక్రయశాలల్లో లభిస్తున్నట్లు సంస్థ తెలిపింది.



టైగర్ గ్లోబల్ మూలధన లాభాలపై పన్ను మదింపు

ఫ్లిప్‌కార్ట్-వాల్‌మార్ట్ ఒప్పందంపై ఐటీ పరిశీలన

దిల్లీ: ఇ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌లో వాటా విక్రయం వల్ల టైగర్ గ్లోబల్ ఆర్జించిన మూలధన లాభాలపై పన్ను మదింపు ప్రక్రియను ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం చేపట్టనుందని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) వర్గాలు తెలిపాయి. 2018లో ఫ్లిప్‌కార్ట్‌లో తనకున్న మొత్తం వాటాను వాల్‌మార్ట్‌కు రూ.14,500 కోట్లకు టైగర్ గ్లోబల్ విక్రయించింది. ఈ లావాదేవీలో టైగర్ గ్లోబల్ మారిషస్ సంస్థలు మూడింటికి గణనీయ స్థాయిలో మూలధన లాభాలు వచ్చాయి. 2017 ఏప్రిల్ 1 కంటే ముందే ఈ పెట్టుబడులు పెట్టినందున, భారత్- మారిషస్ మధ్య, అప్పుడున్న పన్ను ఒప్పంద నిబంధనల ప్రకారం భారత్‌లో తమ మూలధన లాభాలపై పన్ను వర్తించదని ఆ సమయంలో టైగర్ గ్లోబల్ వాదించింది. భారత్‌లో తాము ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదంటూ.. 2019-20 మదింపు సంవత్సరానికి ఐటీఆర్‌ను దాఖలు చేసిన టైగర్ గ్లోబల్, పూర్తి టీడీఎస్ మొత్తం రీఫండ్ కోసం క్లెయిమ్ చేసింది. ఈ లావాదేవీని పూర్తి స్థాయిలో పరిశీలించిన ఆదాయపు పన్ను విభాగం.. ఆ మూడు సంస్థలకు సంబంధించి పెట్టుబడులపై వాస్తవ నిర్ణయాధికారం మారిషస్ బయటే ఉందనే గుర్తించింది. తాజాగా 2026 జనవరి 15న రెవెన్యూ విభాగానికి అనుకూలంగా సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో.. టైగర్ గ్లోబల్ మూలధన లాభాలపై పన్ను మదింపు ప్రక్రియను ఐటీ విభాగం చేపట్టనుందని సీబీడీటీ వర్గాలు చెబుతున్నాయి.

విప్రో లాభంలో 7% క్షీణత



'మా వ్యాపార విభాగాలన్నీ అంచనాలకు తగ్గట్టుగానే రాణించాయి. కృత్రిమ మేధ (ఏఐ) ఒక వ్యూహాత్మక అవసరంగా మారడంతో, మా ఏఐ- ఆధారిత ప్లాట్‌ఫామ్స్, సొల్యూషన్లకు అధిక ఆదరణ లభిస్తోంది. పలు ఆర్డర్లను దక్కించుకోవడంలో విప్రో ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషించింది. అంతర్జాతీయంగా మా ఆవిష్కరణల నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నాం'
– శ్రీని పల్లియా, సీఈఓ, ఎండీ, విప్రో

● కొత్త కార్మిక చట్టాల అమలు ప్రభావం
● మధ్యంతర డివిడెండ్ రూ.6

ఐటీ సేవల సంస్థ విప్రో, అక్టోబరు- డిసెంబరు త్రైమాసికానికి రూ.3,119 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.3353.80 కోట్లతో పోలిస్తే ఇది 7% తక్కువ. కొత్త కార్మిక చట్టాల అమలు కోసం రూ.302.80 కోట్లను కేటాయించాల్సి రావడం ఇందుకు కారణం. పునర్నిర్మాణ ప్రక్రియ కోసం రూ.263 కోట్లు వెచ్చించడమూ కంపెనీ లాభంపై ప్రభావం పడింది. కార్యకలాపాల ఆదాయం రూ.22,318.80 కోట్ల నుంచి 5.5% పెరిగి రూ.23,555.80 కోట్లకు చేరింది.

✦ అక్టోబరు- డిసెంబరులో ఐటీ సేవల విభాగ ఆదాయం 2.63 బిలియన్ డాలర్లుగా నమోదైంది. నాలుగో త్రైమాసికం (జనవరి- మార్చి)లో ఈ ఆదాయం స్థిర కరెన్సీ రూపేణా 2.64- 2.69 బిలియన్ డాలర్ల శ్రేణిలో నమోదవ్వవచ్చని అంచనా వేసింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో మొత్తంగా 3.3 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు పొందింది.

6529 మంది సిబ్బంది జతచేరారు

✦ అక్టోబరు- డిసెంబరులో విప్రో మొత్తం సిబ్బంది సంఖ్య 6,529 పెరిగి 2,42,021కు చేరింది. 400 మంది ఫ్రెషర్ల (తాజా ఉత్తీర్ణుల)ను సంస్థ ఈ త్రైమాసికంలో చేర్చుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు కంపెనీలో చేరిన ఫ్రెషర్ల సంఖ్య 5000కు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 10,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోవాలని గతంలో నిర్ణయించినా.. 7500-8000కు ఇది పరిమితం అయ్యే పరిస్థితి ఉంది. వలసల రేటు 14.9% నుంచి 14.2 శాతానికి తగ్గింది.
✦ ఒక్కో షేరుపై రూ.6 మధ్యంతర డివిడెండును కంపెనీ ప్రకటించింది. రికార్డు తేదీగా జనవరి 27ను నిర్ణయించింది.

టెక్ మహీంద్రా లాభంలో 14% వృద్ధి

ఐటీ సేవల కంపెనీ టెక్ మహీంద్రా, డిసెంబరు త్రైమాసికంలో రూ.1,122 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.983.20 కోట్లతో పోలిస్తే, ఇది 14.11% ఎక్కువ. కార్యకలాపాల ఆదాయం రూ.13,286 కోట్ల నుంచి రూ.14,393 కోట్లకు పెరిగింది. జులై- సెప్టెంబరులో కంపెనీ నికర లాభం రూ.1,194 కోట్లు కాగా.. ఆదాయం రూ.13,994 కోట్లుగా ఉంది. కొత్త కార్మిక చట్టాల అమలు కోసం సమీక్షా త్రైమాసికంలో 30 మిలియన్ డాలర్లు (సుమారు రూ.270 కోట్లు) కేటాయించినట్లు టెక్ మహీంద్రా పేర్కొంది. నిర్వహణ మార్జిన్ 2.9% పెరిగి 13.1 శాతానికి చేరినట్లు సంస్థ వెల్లడించింది.
✦ సమీక్షిస్తున్న త్రైమాసికంలో 1.096 బిలియన్ డాలర్ల విలువైన కొత్త ఆర్డర్లు దక్కించుకున్నట్లు తెలిపింది.
✦ 2025 డిసెంబరు 31 నాటికి కంపెనీ మొత్తం సిబ్బంది సంఖ్య 1,49,616గా నమోదైంది. వలసల రేటు 12.3 శాతంగా ఉంది. 2025 డిసెంబరు 31 నాటికి సంస్థ వద్ద నగదు నిల్వలు రూ.7,666 కోట్లుగా ఉన్నాయి.

మరింత వేగంగా ఫిర్యాదుల పరిష్కారం

● అంబుడ్స్‌మన్ పథకానికి మార్పులు
● జులై 1 నుంచి అమల్లోకి: ఆర్‌బీఐ



ఈనాడు, హైదరాబాద్: బ్యాంకింగ్ సేవల్లో ఎదురయ్యే సమస్యలు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత సమర్థంగా, వేగంగా మార్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక చర్యలు తీసుకుంది. బ్యాంకులతో పాటు, ఇతర నియంత్రిత సంస్థల ఖాతాదారుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా 'రిజర్వ్ బ్యాంక్-సమగ్ర అంబుడ్స్‌మన్ పథకం -2026'ను తీసుకురానుంది. ఇందుకోసం 'రిజర్వ్ బ్యాంక్- అంబుడ్స్‌మన్ స్కీం 2025'కు కొన్ని సవరణలతో ముసాయిదాను ఇప్పటికే విడుదల చేసి, ప్రజల అభిప్రాయాలను కోరింది. ఇవి కూడా వచ్చాక, క్రోడీకరించి, నిబంధనలను ఖరారు చేస్తుంది. కొత్త పథకం 2026 జులై 1 నుంచి అమల్లోకి రానుంది. ఫిర్యాదిదారులకు తక్కువ ఖర్చుతో, వేగవంతమైన పరిష్కారాన్ని అందించడమే దీని ప్రధాన లక్ష్యమని ఆర్‌బీఐ పేర్కొంది. వివాదాలను పరిష్కరించే విధానం వేగంగా ఉంటుందని, ఇవి సాధారణ సాక్ష్యాధారాల నిబంధనలకు లోబడి ఉండవని స్పష్టం చేసింది. ఈ బాధ్యతలను నిర్వహించేందుకు ఆర్‌బీఐ తన అధికారుల నుంచి ఒకరు లేదా అంతకంటే ఎక్కువమందిని ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్, ఆర్‌బీఐ డిప్యూటీ అంబుడ్స్‌మన్‌లుగా నియమిస్తుంది. సాధారణంగా వీరి నియామక కాలపరిమితి ఒకేసారి మూడేళ్ల వరకు ఉంటుంది.

ఫిర్యాదుల స్వీకరణ, పరిశీలన కోసం ఆర్‌బీఐ ఒకటి లేదా పలు చోట్ల సీఆర్‌పీసీ (సెంట్రలైజ్డ్ రిసీట్ అండ్ ప్రాసెసింగ్ సెంటర్)లు ఏర్పాటు చేయనుంది. వినియోగదారులు తమ ఫిర్యాదులను ఆన్‌లైన్ ద్వారా సులభంగా సమర్పించే వీలుంటుంది.
✦ నూతన విధానంలో వివాదానికి సంబంధించిన మొత్తంపై గరిష్ఠ పరిమితి విధించలేదు. అంబుడ్స్‌మన్ లేదా డిప్యూటీ అంబుడ్స్‌మన్ ఆ వివాదాన్ని రాజీ కుదర్చడం లేదా తగిన తీర్పు (అవార్డు) ఇవ్వడం ద్వారా సమస్యను పరిష్కరిస్తారు. ఖాతాదారులకు కలిగిన నష్టానికి సంబంధించి, గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు పరిహారం చెల్లించాలని ఆదేశించే అధికారం అంబుడ్స్‌మన్‌కు ఉంటుంది. దీనికి అదనంగా మరో రూ.3 లక్షల వరకు పరిహారం అందించే వీలుందని ఆర్‌బీఐ వెల్లడించింది.

కోడి గుడ్డు

17న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయల్లో)

హైదరాబాద్	540
వరంగల్	542
విజయవాడ	550
తూ/ప గోదావరి	550
విశాఖపట్నం	550
చిత్తూరు	583

నౌకాదళ కమ్యూనికేషన్ల ఆధునికీకరణ

వయాశాట్‌తో బీఎస్ఎన్ఎల్ భాగస్వామ్యం

దిల్లీ: భారత నౌకాదళం తన శాటిలైట్ కమ్యూనికేషన్ల వ్యవస్థను ఆధునికీకరించేందుకు ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్, అంతర్జాతీయ శాటిలైట్ సంస్థ వయాశాట్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ నెలాఖరుకు ప్రారంభం కానున్న ఈ ప్రాజెక్టు ద్వారా నౌకాదళ నౌకలకు అత్యంత సురక్షితమైన, వేగవంతమైన కనెక్టివిటీ లభించనుంది. ప్రస్తుతమున్న తక్కువ ఫ్రీక్వెన్సీ ఎల్-బ్యాండ్‌తో పాటు, వయాశాట్ హై-ఫ్రీక్వెన్సీ కేఏ-బ్యాండ్ శాటిలైట్ వ్యవస్థను ఇందులో వినియోగించనున్నారు. దీనివల్ల సమాచార బదిలీ వేగం పెరగడంతో పాటు, విస్తృత నెట్‌వర్క్ కవరేజీ లభిస్తుందని బీఎస్ఎన్ఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రాబర్ట్ రవి తెలిపారు. ఇప్పటికే అవసరమైన పరికరాలు మనదేశానికి చేరుకున్నాయని వయాశాట్ ఇండియా ఎండీ గౌతమ్ శర్మ పేర్కొన్నారు.

మారుతీ సుజుకీ విక్టోరిస్ ఎగుమతులు ప్రారంభం

విదేశీ మార్కెట్లకు తమ మధ్య శ్రేణి ఎస్‌యూవీ మోడల్ విక్టోరిస్ ఎగుమతులను ప్రారంభించినట్లు మారుతీ సుజుకీ ఇండియా తెలిపింది. అంతర్జాతీయ మార్కెట్లకు ముంద్రా, పిపవావ్ పోర్టుల నుంచి 450 విక్టోరిస్ కార్లు పంపినట్లు వెల్లడించింది. లాటిన్ అమెరికా, పశ్చిమాసియా, ఆఫ్రికాల్లోని దాదాపు 100 దేశాల్లో ఈ కార్లను కంపెనీ విక్రయించనుంది.

అమెరికాకు సన్‌ఫార్మా చర్మ క్యాన్సర్ ఔషధం

అమెరికాలో చర్మ క్యాన్సర్ ఔషధం ఉన్లోసిట్‌ను సన్‌ఫార్మా విడుదల చేసింది. చర్మక్యాన్సర్ ప్రారంభదశలో అయితే చికిత్స ద్వారా తగ్గించొచ్చని, అయితే అమెరికాలో ఏటా 40,000 మంది వరకు ఈ క్యాన్సర్‌లో అడ్వాన్స్‌డ్ దశకు చేరుతూ ఇబ్బంది పడుతున్నారని సంస్థ తెలిపింది. ఏటా 15,000 మరణాలు ఈ వ్యాధితో సంభవిస్తున్నాయని వివరించింది.

స్వల్పంగా పెరిగిన ఫారెక్స్ నిల్వలు

మన విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు జనవరి 9తో ముగిసిన వారానికి 392 మి.డాలర్లు (దాదాపు రూ.3500 కోట్లు) పెరిగి 687.19 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.61.84 లక్షల కోట్ల)కు చేరాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. సమీక్షిస్తున్న వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 1.124 బి.డాలర్లు తగ్గి 550.866 బి.డాలర్లకు చేరాయి.

బాట్లింగ్ వ్యాపారం నుంచి కోక-కోలా బయటకు!

దిల్లీ: దేశీయంగా బాట్లింగ్ కార్యకలాపాల నుంచి పూర్తిగా వైదొలిగే యోచనలో కోక-కోలా ఉంది. ఇందుకు సమయాన్ని నిర్దేశించుకోలేదు కానీ.. తమ ప్రణాళిక అదే అని కోక-కోలా గ్లోబల్ ప్రెసిడెంట్, సీఎఫ్‌ఓ జాన్ ముర్ఫి తెలిపారు. 2023-24లో రాజస్థాన్, బిహార్, ఈశాన్య రాష్ట్రాలతో పాటు పశ్చిమ బెంగాల్‌లో కొంత మేర బాట్లింగ్ కార్యకలాపాలను తన బాట్లింగ్ భాగస్వామ్య సంస్థలకు కోక-కోలా విక్రయించింది. కోక-కోలాకు చెందిన బాట్లింగ్ సంస్థ హిందుస్థాన్ కోక-కోలా బేవరేజెస్‌కు (హెచ్‌సీసీబీ) 14 ప్రాంతాల్లో తయారీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో రెండు కొత్తవి.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
స్మార్ట్‌వర్క్స్	1.24	(16)	488.14	363.62
లీలాప్యాలెస్ హోటల్స్	147.88	56.40	457.43	370.46
ఇండోసోలార్	41.47	10.24	199.70	103.90
జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా	364.8	335.62	1409.38	1265.31
ఎల్అండ్‌టీ ఫైనాన్స్	739	626	4581	4105

ఇ-కామర్స్ సంస్థలపై జరిమానా

అనుమతిలేని వాకీ-టాకీలు విక్రయించినందుకే



దిల్లీ: వినియోగదారు భద్రతా చట్టం- 2019 నిబంధనలు, టెలికాం చట్టాలను ఉల్లంఘిస్తూ అనుమతి లేని వాకీ- టాకీలను తమ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా విక్రయించినందుకు పలు ఇ-కామర్స్ సంస్థలపై సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) చర్యలు చేపట్టింది. 13 సంస్థలకు నోటీసులు జారీ చేసింది. వీటిల్లో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, జియోమార్ట్, మీషో, మెటా ప్లాట్‌ఫామ్స్ (ఫేస్‌బుక్ మార్కెట్‌ప్లేస్), చిమియా, టాక్ ప్రో, మాస్క్‌మ్యాన్ టాయ్స్, ట్రేడ్ ఇండియా, అంట్రిక్స్ టెక్నాలజీస్, వర్ధాన్‌మార్ట్, ఇండియామార్ట్, కృష్ణ మార్ట్ ఉన్నాయి. వినియోగదారు హక్కుల ఉల్లంఘన, తప్పుదోవ పట్టించే ప్రకటనలు, అనైతిక వ్యాపార పద్ధతులను అనుసరించినందుకు 8 సంస్థలపై మొత్తంగా రూ.44 లక్షల జరిమానా విధించింది. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మీషో, మెటా ప్లాట్‌ఫామ్స్‌కు రూ.10 లక్షల చొప్పున.. చిమియా, జియోమార్ట్, టాక్ ప్రో, మాస్క్‌మ్యాన్ టాయ్స్‌కు రూ.1 లక్ష చొప్పున జరిమానా విధించినట్లు వినియోగదారు వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే తెలిపారు. మీషో, మెటా, చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో జరిమానా చెల్లించగా.. మిగతావి ఇంకా చెల్లించాల్సి ఉందని ఆమె చెప్పారు.

నిబంధనల ఉల్లంఘన ఇలా..: ప్రస్తుత నిబంధనల ప్రకారం.. 446- 446.20 మెగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌లో వాడే పర్సనల్ మొబైల్ రేడియోస్ (పీఎంఆర్)కు మాత్రమే లైసెన్స్ మినహాయింపు వర్తిస్తుంది. లో పవర్, వెరీ లో పవర్ షార్ట్ రేంజ్ రేడియో ఫ్రీక్వెన్సీ డివైజెస్- 2018లోని 5వ నిబంధన ప్రకారం.. ఈ తరహా పరికరాల విక్రయం, దిగుమతి, వినియోగానికి తయారీదార్లు, విక్రయదార్లు ముందుగా ఎక్విప్‌మెంట్ టైప్ అప్రూవల్‌ను (ఈటీఏ) తీసుకోవడం తప్పనిసరి. లైసెన్స్ మినహాయింపు వర్తించే ఫ్రీక్వెన్సీ బ్యాండ్ పరిధిలో లేని పీఎంఆర్‌లను పై సంస్థలు విక్రయించాయని, ఈటీఏ సర్టిఫికేషన్ తీసుకోలేదని సీసీపీఏ గుర్తించింది. ఫ్లిప్‌కార్ట్ 65,931, అమెజాన్ 467, జియోమార్ట్ 58 చొప్పున అనుమతిలేని పీఎంఆర్‌లను విక్రయించాయని సీసీపీఏ తెలిపింది. మీషో 2,209 పీఎంఆర్‌లను విక్రయించగా.. ఇందులో చాలా వరకు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవేనని పేర్కొంది. సీసీపీఏ ఆదేశాలతో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 710 ఉత్పత్తులను తన మార్కెట్‌ప్లేస్‌లో నుంచి ఫేస్‌బుక్ తొలగించింది.

96% క్షీణించిన టాటా టెక్నాలజీస్ లాభం

గ్లోబల్ ప్రోడక్ట్ ఇంజినీరింగ్, డిజిటల్ సేవల సంస్థ టాటా టెక్నాలజీస్ డిసెంబరు త్రైమాసికానికి రూ.6.64 కోట్ల ఏకీకృత నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.168.64 కోట్లతో పోలిస్తే ఇది 96% తక్కువ. కొత్త కార్మిక చట్టాల అమలు కోసం చెల్లింపులు చేయడం వల్లే లాభం ఇంతగా తగ్గిందని సంస్థ తెలిపింది. సిబ్బంది గ్రాట్యుటీ కింద రూ.114 కోట్లు, పరిహారం కింద రూ.25.87 కోట్లు చెల్లించామని, ఇది ఒకసారి వ్యయమేనని వివరించింది. కంపెనీ కార్యకలాపాల ఆదాయం రూ.1317.38 కోట్ల నుంచి రూ.1365.73 కోట్లకు పెరిగింది. వ్యయాలు కూడా రూ.1119.31 కోట్ల నుంచి రూ.1217.99 కోట్లకు చేరాయి.

ఈ త్రైమాసిక ఆదాయం 10% పెరుగుతుంది: స్తబ్దుగా ఉండే అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలోనూ మెరుగ్గా రాణించామని.. దీనితో పోలిస్తే ప్రస్తుత 4వ త్రైమాసికంలో ఆదాయం 10% పెరుగుతుందని సంస్థ సీఈఓ, ఎండీ వారెన్ హారిస్ తెలిపారు.

జర్మనీ సంస్థ స్వాధీనత: హైఎండ్ ఆటోమోటివ్ ఇంజినీరింగ్ సేవలు (అడాస్) అందించే ఈఎస్-టెక్‌గ్రూప్ ఆఫ్ జర్మనీ సంస్థలో 100% వాటాను తమ అనుబంధ సంస్థ టాటా టెక్నాలజీస్ పీటీఈ (సింగపూర్) ద్వారా స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

ఫెడరల్ బ్యాంక్ లాభం రూ.1,041 కోట్లు

ప్రైవేటు రంగ ఫెడరల్ బ్యాంక్ డిసెంబరు త్రైమాసికంలో రూ.1041 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే త్రైమాసిక లాభం రూ.955 కోట్ల కంటే ఇది 9% అధికం. వడ్డీయేతర ఆదాయం పెరగడమే ఇందుకు కారణమని బ్యాంక్ పేర్కొంది. నికర వడ్డీ ఆదాయం 9% పెరిగి రూ.2653 కోట్లకు, వడ్డీయేతర ఆదాయం 20% అధికమై రూ.1100 కోట్లకు చేరినట్లు వివరించింది. నికర వడ్డీ మార్జిన్ 0.07% వృద్ధితో 3.18 శాతానికి చేరినట్లు వెల్లడించింది. స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 1.95% నుంచి 1.72 శాతానికి మెరుగయ్యాయని.. కొత్తగా ఒత్తిడికి గురవుతున్న రుణ ఆస్తులు రూ.579 కోట్ల నుంచి రూ.435 కోట్లకు పరిమితమైనట్లు బ్యాంక్ సీఈఓ కె.వి.ఎస్.మణియన్ తెలిపారు. పన్ను లేకుండా, నిరర్థక ఆస్తులకు కేటాయింపులు రూ.292 కోట్ల నుంచి రూ.332 కోట్లకు పెరిగాయని వివరించారు.
✦ ఏజియస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఫెడరల్ బ్యాంక్ వాటా 26% నుంచి 30 శాతానికి పెరిగింది. ఇందుకోసం ఆ సంస్థలో 3.2 కోట్ల షేర్లను, ఒక్కోటి రూ.30.45 చొప్పున కొనుగోలు చేసినట్లు బ్యాంక్ తెలిపింది.

సూచీలకు లాభాలు.. తగ్గిన సంపద విలువ

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.4,346 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.3,935 కోట్లు

సెన్సెక్స్ ▲ 188 83570
నిఫ్టీ ▲ 29 25694

రెండు రోజుల వరుస నష్టాల నుంచి సూచీలు మళ్లీ పుంజుకున్నాయి. ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్ వంటి పెద్ద షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం కలిసొచ్చింది. అయితే రూపాయి విలువ బలహీనపడటం, ముడిచమురు ధరలు పెరగడం, విదేశీ మదుపర్ల అమ్మకాలతో మార్కెట్ల లాభాలు పరిమితమయ్యాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 44 పైసలు తగ్గి 90.78 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.05% లాభంతో 64.43 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.
✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.34,000 కోట్లు తగ్గి రూ.467.84 లక్షల కోట్ల (5.16 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.
✦ సెన్సెక్స్ ఉదయం 288 పాయింట్ల (క్రితం ముగింపు 83,382.71) లాభంతో 83,670.79 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అదే జోరు కొనసాగిస్తూ, ఇంట్రాడేలో 84,134.97 వద్ద గరిష్ఠానికి చేరింది. అక్కడ మదుపర్లు లాభాలు స్వీకరించడంతో కొంత వెనక్కి వచ్చిన సూచీ, చివరకు 187.64 పాయింట్ల లాభంతో 83,570.35 వద్ద ముగిసింది. నిఫ్టీ 28.75 పాయింట్లు పెరిగి 25,694.35 దగ్గర స్థిరపడింది.
✦ ఆకర్షణీయ త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేరు 5.65% దూసుకెళ్లి రూ.1,689.40 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.53,534.88 కోట్లు పెరిగి రూ.7.01 లక్షల కోట్లకు చేరింది.
✦ సెన్సెక్స్ 30 షేర్లలో 12 లాభపడ్డాయి. టెక్ మహీంద్రా 5.17%, హెచ్‌సీఎల్ టెక్ 1.82%, ఎస్‌బీఐ 1.36%, అల్ట్రాటెక్ 0.94% రాణించాయి. ఎటర్నల్ 3.89%, ఏషియన్ పెయింట్స్ 2.08%, బీఈఎల్ 1.85%, సన్‌ఫార్మా 1.84%, మారుతీ 1.78%, ఐటీసీ 1.64%, ఎన్‌టీపీసీ 0.83% నష్టపోయాయి.
✦ 4680 భారత్ సెల్ కలిగిన ఓలా శక్తి 6కివా/9.1 కిలోవాట్‌అవర్ బ్యాటరీ ప్యాక్‌కు బీఐఎస్ ధ్రువీకరణ, లైసెన్స్ పొందినట్లు ఓలా ఎలక్ట్రిక్ వెల్లడించింది.
✦ ఏఐతో పనిచేసే పన్నుల అనలిటిక్స్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేసేందుకు సీబీడీటీ నుంచి రూ.3000 కోట్ల ఆర్డరును ఎల్‌టీఐ మైండ్‌ట్రీ దక్కించుకుంది.
✦ ఏఐ సంస్థ ఆంత్రోపిక్ తమ భారత విభాగానికి ఎండీగా ఇరినా ఘోష్‌ను నియమించింది.
✦ 12 సంస్థలపై సెబీ నిషేధం: ఫ్రంట్ రన్నింగ్ కేసులో పాత్ర ఉందని తేలినందున, 12 సంస్థలను అయిదేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్లలో పాల్గొనకుండా సెబీ ఆంక్షలు విధించింది. వీటిపై మొత్తంగా రూ.90 లక్షల జరిమానా విధించడమే కాకుండా.. అక్రమ పద్ధతిలో ఆర్జించిన రూ.1.07 కోట్లను 12% వార్షికవడ్డీతో కలిపి 45 రోజుల్లో మదుపర్ల భద్రత, అవగాహన నిధికి జమ చేయాల్సిందిగా ఈ సంస్థలను ఆదేశించింది.



బడ్జెట్ రోజున (ఆదివారం) మార్కెట్లు పనిచేస్తాయ్

ఫిబ్రవరి 1న (ఆదివారం) కేంద్రబడ్జెట్ ప్రవేశ పెడుతున్నందున, ఆరోజు స్టాక్ మార్కెట్లు పనిచేస్తాయని అగ్రగామి ఎక్స్ఛేంజీలు ఎన్ఎస్ఈ, బీఎస్ఈ ప్రకటించాయి. ఆ రోజు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో 2026-27 బడ్జెట్‌ను ప్రవేశ పెడతారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 1న స్టాక్‌ఎక్స్ఛేంజీల్లో ట్రేడింగ్ సాధారణ పనివేళల ప్రకారమే నడుస్తుంది. ఉదయం 9 గంటలకు ప్రీ-ఓపెన్ మార్కెట్ ప్రారంభమవుతుంది. 9.15 గంటల నుంచి 3.30 గంటల వరకు సాధారణ మార్కెట్ పనిచేస్తుంది. ప్రత్యేక ట్రేడింగ్ దినంగా ఆరోజును ఎక్స్ఛేంజీలు ప్రకటించాయి.

ఐపీఓకు ఏఎస్‌జీ ఐ హాస్పిటల్

జనరల్ అట్లాంటిక్ పెట్టుబడులు కలిగిన ఏఎస్‌జీ ఐ హాస్పిటల్ ఐపీఓకు రానుంది. ఐపీఓ ద్వారా 500-600 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.3,900 కోట్లు) సమీకరించాలన్నది సంస్థ ప్రణాళిక. ఇందుకోసం యాక్సిస్ క్యాపిటల్, మోర్గాన్ స్టాన్లీ, నొమురా, మోతీలాల్ ఓస్వాల్, హెచ్ఎస్‌బీసీ వంటి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లను కంపెనీ నియమించింది.
✦ అమాగి మీడియా ల్యాబ్స్ ఐపీఓ ముగిసేసరికి 30.22 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 2,72,66,589 షేర్లను ఆఫర్ చేయగా, 82,40,12,260 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. ఎన్ఐఐ విభాగంలో 37.36 రెట్లు, క్యూఐబీ విభాగంలో 33.77 రెట్లు, రిటెయిల్ మదుపర్ల నుంచి 9.31 రెట్ల స్పందన దక్కింది.

సవరించిన ఎంఎఫ్ నిబంధనల నోటిఫై

పారదర్శకత పెంచేందుకు సవరించిన మ్యూచువల్ ఫండ్ నిబంధనలను సెబీ నోటిఫై చేసింది. బేస్ ఎక్స్‌పెన్స్ రేషియో (బీఈఆర్)ను తీసుకురావడం, జీఎస్‌టీ, ఎస్‌టీటీ వంటి చట్టబద్ధమైన ఛార్జీలను ఫండ్ మేనేజ్‌మెంట్ ఫీజులను వేరు చేయడం వంటివి ఇందులో ఉన్నాయి. ఇదే సమయంలో ఎక్స్‌పెన్స్ రేషియో పరిమితులను కూడా సెబీ తగ్గించింది. 2026 ఏప్రిల్ 1 నుంచి ఇవి అమల్లోకి రానున్నాయి.



దరఖాస్తు చేశారా?

☛ ఈడీసీఐఎల్ దిల్లీలో 15 గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ఖాళీలు
చివరి తేదీ: 2026, జనవరి 19

☛ యూఐఐసీ చెన్నైలో 153 గ్రాడ్యుయేట్ అప్రెంటీస్‌లు
చివరి తేదీ: 2026, జనవరి 20

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



★ దేశంలోనే మొదటి డిజిటల్ గిరిజన స్వాతంత్ర్య సమర యోధుల మ్యూజియాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఎక్కడ ప్రారంభించారు? (ఈ మ్యూజియానికి షహీద్ వీర్ నారాయణ్ సింగ్ మెమోరియల్ అండ్ ట్రైబల్ ఫ్రీడమ్ ఫైటర్స్ మ్యూజియం అని పేరు పెట్టారు.)

జ: నయా రాయ్‌పుర్, ఛత్తీస్‌గఢ్

★ ప్రపంచ రేడియోగ్రఫీ దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (1895లో ఇదే రోజున జర్మన్ భౌతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ విల్హెల్మ్ కాన్రాడ్ రాంట్‌జెన్ వుర్జ్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో ఎక్స్‌-కిరణాలను కనుక్కున్నారు.)

జ: నవంబరు 8

★ 2025, నవంబరు 7న న్యూదిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ నేషనల్ స్టేడియంలో ఏ క్రీడకు సంబంధించి శతాబ్ది ఉత్సవాలను కేంద్రం ఘనంగా నిర్వహించింది? (కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.)

జ: హాకీ

★ 2025, నవంబరులో కర్ణాటకలోని బెలగావిలో ఫారిన్ ట్రైనింగ్ నోడ్‌లో ఎక్సర్‌సైజ్ మిత్ర శక్తి 11వ ఎడిషన్ ఉమ్మడి సైనిక విన్యాసాలను ఏ దేశాల మధ్య నిర్వహించారు?

జ: భారత్, శ్రీలంక

మరింత సమాచారం

శోధించి సాధిస్తే మార్కులు!

▲ త్రిభుజాల గణన ▲

రీజనింగ్ ప్రశ్నల్లో ఒక జ్యామితీయ పటాన్ని ఇచ్చి అందులో ఇమిడి ఉన్న చిత్రాలను గణించమని అడుగుతారు. ఈ చిత్రాలు సాధారణంగా త్రిభుజాలు, చతురస్రాలు, దీర్ఘచతురస్రాలు లాంటి జ్యామితీయ పటాలతో ఉంటాయి. వీటిని సాధారణంగా లెక్కిస్తే కచ్చితమైన జవాబు తెలియకపోవచ్చు. కొన్ని సందర్భాల్లో చిత్రాలను లెక్కపెట్టడానికి ప్రత్యేకమైన పద్ధతులను అనుసరించాల్సి ఉంటుంది.




క్లిష్టమైన జ్యామితీయ ఆకృతిని ఇచ్చి, అందులో అంతర్లీనంగా ఉన్న మొత్తం త్రిభుజాల సంఖ్యను కనుక్కోమనడమే త్రిభుజాల గణన. పైకి కనిపించే అంశాల కంటే లోతుగా ఆలోచించి, దాగి ఉన్న విషయాలను శోధించి, సాధించే సామర్థ్యాన్ని అంచనా వేయడానికి నాన్-వెర్బల్ రీజనింగ్‌లో భాగంగా ఈ అధ్యాయం నుంచి ప్రశ్నలు అడుగుతారు. సరైన సమాధానాలను గుర్తించి మంచి మార్కులు సంపాదించుకోవాలంటే పెద్ద ఆకృతిని చిన్న భాగాలుగా విడగొట్టి లెక్కించడాన్ని పోటీ పరీక్షార్థులు నేర్చుకోవాలి. ముందు చిన్నవి, తర్వాత మధ్యస్థం, అనంతరం పెద్ద వాటిని గణించాలి. వాటిలో రకరకాల నమూనాలను సాధన చేయడం ద్వారా పట్టు పెంచుకోవచ్చు. లాజిక్ కూడా వేగంగా అర్థమవుతుంది.



జనరల్ స్టడీస్ - రీజనింగ్


మాదిరి ప్రశ్నలు

1. కింది పటంలో త్రిభుజాల సంఖ్యను గణించండి.



1) 34
2) 25
3) 32
4) 30


వివరణ:



మొత్తం త్రిభుజాల సంఖ్య = 6 + 6 + 10 + 10 = 32


జ: 3

2. కింది పటంలోని త్రిభుజాల సంఖ్య ఎంత?



1) 10
2) 15
3) 18
4) 25


వివరణ:



ఎడమవైపు పటాలను లెక్కించగా = 1 + 2 + 3 + 4 = 10
కుడివైపు పటాలను లెక్కించగా = 1 + 2 + 3 + 4 + 5 = 15
మొత్తం త్రిభుజాల సంఖ్య = 10 + 15 = 25


జ: 4

3. కింది పటంలో త్రిభుజాల సంఖ్యను కనుక్కోండి.



1) 13 2) 17 3) 16 4) 12


వివరణ:



ABC పటం నుంచి ఏర్పడే మొత్తం త్రిభుజాలు = 5
CDE పటం నుంచి ఏర్పడే మొత్తం త్రిభుజాలు = 5
BDF పటం నుంచి ఏర్పడే మొత్తం త్రిభుజాలు = 5
AFE,BDC త్రిభుజాలు = 2
మొత్తం = 17


జ: 2

4. కింది పటాల నుంచి ఏర్పడే మొత్తం త్రిభుజాలు ఎన్ని?



1) 30 2) 26 3) 28 4) 24

వివరణ:




త్రిభుజాల సంఖ్య = 6 × 2 = 12
త్రిభుజాల సంఖ్య = 8 × 2 = 16
మొత్తం త్రిభుజాల సంఖ్య = 12 + 16 = 28

జ: 3




5. కింది పటంలో ఏర్పడే త్రిభుజాల సంఖ్య ఎంత?



1) 31
2) 20
3) 30
4) 28


వివరణ:



ఎడమవైపు పటం నుంచి ఏర్పడే త్రిభుజాలు = 1 + 2 + 3 = 6
మధ్యలోని పటం నుంచి ఏర్పడే త్రిభుజాలు = 4 × 2 = 8
కుడివైపు పటం నుంచి ఏర్పడే త్రిభుజాలు = 1 + 2 + 3 + 4 = 10
సాధ్యమయ్యే మిగతా త్రిభుజాలు = 3 + 4 = 7
మొత్తం త్రిభుజాలు = 6 + 8 + 10 + 7 = 31


జ: 1

6. కింది పటంలోని త్రిభుజాల సంఖ్యను కనుక్కోండి.



1) 68 2) 65 3) 70 4) 64

వివరణ:



ఇలాంటి సందర్భంలో బ్లాకుల సంఖ్యను ఒకటి తగ్గించి ఒకట్ల స్థానంలో 8 రాయాలి.

∴ అంటే 68 త్రిభుజాలు ఉన్నాయి జ: 1



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

JUNIOR INTER Mathematics — Relations and Functions

1. If $\left(2x + 1, \frac{y}{2}\right) = (3, 3)$ Then the values of x, y are

1) 1, 6 2) 2, 2 3) 3, 3 4) 7, 3/2

A: 1

2. If A = {1, 2, 3}, B = {a, b} Then A x B = ...

1) {(1, a) (2, b) (3, a)} 2) {(a,1) (b, 2) (a, 3) (b, 3)}
3) {(1, a) (1, b) (2, a) (2, b) (3, a) (3, b)}
4) {(1, a) (1, b) (2, b) (3, b)}

1 Mark

A: 3

3. A relation can be represented as

1) Roster method 2) Set-Builder method
3) An arrow diagram 4) In above three forms

A: 4

4. If $f(x) = \frac{|x|}{x}$ Then f(0) =

1) 1 2) –1 3) Undefined 4) 0

A: 3

5. The domain of the function $\frac{1}{\sqrt{x^2 - 25}}$ is

1) $(-\infty, -5) \cup (5, \infty)$ 2) $(-\infty, -5] \cup [5, \infty)$
3) $(-\infty, -5] \cup (5, \infty)$ 4) $(-\infty, -5) \cup [5, \infty)$

A: 1

6. The domain of $\sqrt{|x| - x}$ is

1) R 2) $[0, \infty)$ 3) $(-\infty, 0]$ 4) z

A: 1

Final Exams-2026 IMPORTANT Q & A

1. If P = {a, b, c} and Q = {r}, form the sets P × Q and Q × P

Sol: P × Q = {(a, r) (b, r) (c, r)}
Q × P = {(r, a) (r, b) (r, c)}

2. If G = {7, 8} and H = {5, 4, 2}, find G × H and H × G


Sol: G × H = {(7, 5) (7, 4) (7, 2) (8, 5) (8, 4) (8, 2)}
H × G = {(5, 7)(5, 8)(4, 7)(4, 8) (2, 7)(2, 8)}

2 Marks

3. If A = {-1,1}, find A x A x A

Sol: A × A = {(–1, –1)(–1,1) (1, –1) (1,1)}
A × A × A = {(–1, –1, –1) (–1, –1, 1) (–1, 1, –1) (–1, 1, 1) (1, –1, –1) (1, –1, 1)(1, 1, –1) (1, 1, 1)}

For more IMP Q & A



Writer: Prasanna Kumar

మంచును భక్షించే చినూక్ పవనాలు!


భూమి ఉపరితలంపై గాలి బరువు వల్ల కలిగే ఒత్తిడే వాతావరణ పీడనం. అందులో ఏర్పడే వ్యత్యాసాలతోనే పవనాలు పుట్టుకొస్తాయి. గాలిని ప్రపంచం మొత్తం వ్యాపింపజేస్తాయి. ఆ విధంగా గాలి నిరంతరం అధిక పీడన ప్రాంతం నుంచి అల్ప పీడన ప్రదేశానికి ప్రసరిస్తూ ఉంటుంది. ఫలితంగా వర్షాలు, గాలులు, తుపాన్లు సంభవిస్తుంటాయి. భూమిపై వాతావరణ పరిస్థితులను అర్థం చేసుకోవాలంటే ఈ సహజ ప్రకృతి దృగ్విషయంపై పోటీపరీక్షార్థులు అవగాహన పెంచుకోవాలి. ఖండాలు, వాతావరణ మండలాల వారీగా వీచే వివిధ పవనాల స్వభావం, పరిణామాలు, పలు దేశాల్లో వాటికి ఉన్న పేర్లు, భూగోళంపై సమ వాతావరణ ప్రాంతాలను గుర్తించడానికి గీసే ఊహారేఖల గురించి తెలుసుకోవాలి.

జనరల్ స్టడీస్ - జాగ్రఫీ

• వాతావరణ పీడనం •

1. కింది వాటిలో వాతావరణ పీడనానికి సంబంధించిన వాక్యాలను సరిచూడండి.

ఎ) ఇటలీకి చెందిన ఖగోళ శాస్త్రవేత్త గెలీలియో గాలికి కూడా బరువు ఉందని నిరూపించాడు.
బి) మానోమీటర్ అనే పరికరంతో వాయువు పీడనాన్ని కొలుస్తారు.
సి) వాతావరణ పీడనాన్ని బారోమీటర్ అనే పరికరంతో కొలుస్తారు. దీన్ని ఎవాంజిలెస్టా టారిసెల్లి కనుక్కున్నాడు.
డి) భారమితిలో పాదరస మట్టం అకస్మాత్తుగా తగ్గడం తుపాను రాకను తెలుపుతుంది.



1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

2. కింది వాటిని జతపరచండి.

జాబితా–1	జాబితా–2
ఎ) ఐసోబార్స్	1) సమాన హిమం ఉన్న ప్రదేశాలను కలుపుతూ గీసిన రేఖలు
బి) ఐసోథర్మ్స్	2) సమాన వర్షపాత ప్రాంతాలను కలుపుతూ గీసిన రేఖలు
సి) ఐసోహైట్స్	3) సమాన పీడన ప్రాంతాలను కలుపుతూ గీసిన రేఖలు
డి) ఐసోనిఫ్	4) సమాన ఉష్ణోగ్రతలున్న ప్రదేశాలను కలుపుతూ గీసిన రేఖలు

1) ఎ-4, బి-3, సి-1, డి-2 2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-2, డి-3 4) ఎ-1, బి-2, సి-3, డి-4

3. భూమధ్యరేఖ అల్పపీడన మండలానికి సంబంధించిన వాక్యాలను సరిచూడండి.

ఎ) ఈ ప్రదేశంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో గాలి వేడెక్కి వ్యాకోచం చెంది ఊర్ధ్వ ముఖంగా కదలడం వల్ల అల్పపీడనం ఏర్పడుతుంది.
బి) ఇది భూమధ్యరేఖకు ఇరువైపులా 10° ఉత్తర, దక్షిణ అక్షాంశాల మధ్య విస్తరించి ఉంటుంది.
సి) ఇక్కడ ఈశాన్య వ్యాపార పవనాలు, ఆగ్నేయ వ్యాపార పవనాలు ఒకదాంతో మరొకటి కలుసుకుంటాయి.
డి) దీన్నే 'ప్రశాంత మండలం' అని లేదా 'అంతర ఆయనరేఖ అభిసరణ మండలం' అంటారు.

1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, సి, డి సరైనవి.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

4. కింది వాటిని జతపరచండి.

ప్రపంచ పవనాలు	దేశాలు
ఎ) ఫోన్	1) నైజీరియా
బి) యమో	2) న్యూజిలాండ్
సి) నార్వెస్టర్స్	3) ఫ్రాన్స్, ఇటలీ
డి) హర్మట్టన్	4) జపాన్

1) ఎ-1, బి-4, సి-3, డి-2 2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-1, బి-4, సి-2, డి-3

5. ఉప ఆయనరేఖ అధిక పీడన మండలానికి సంబంధించిన వాక్యాలను సరిచూడండి.

ఎ) ఇది ప్రధానంగా 25° నుంచి 35° ల ఉత్తర, దక్షిణ అక్షాంశాల మధ్య విస్తరించి ఉంటుంది.
బి) ఈ ప్రాంతంలో తక్కువ వర్షపాతం ఉంటుంది. అందుకే ఇక్కడి ప్రాంతాలు క్రమేణా ఎడారులుగా మారతాయి.
సి) భూమధ్యరేఖ మండలంలో వేడెక్కి పైకి లేచిన పవనాలు రెండు శాఖలుగా విడిపోయి, ఉప ఆయనరేఖ ప్రాంతంలో చల్లబడి సాంద్రత పెరిగి అధిక పీడనంగా మారతాయి.
డి) ఈ ప్రాంతాన్ని ఐరోపా వర్తకులు సాధారణంగా 'అశ్వ అక్షాంశాలు'గా పిలుస్తారు.

1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
4) ఎ, సి, డి సరైనవి; బి సరికాదు.

6. కింది వాటిని జతపరచండి.

శీతల పవనాలు	దేశాలు
ఎ) పాంపేరో	1) ఫ్రాన్స్
బి) పునా	2) మెక్సికో
సి) నోర్టె	3) పెరూ
డి) మిస్ట్రల్	4) అర్జెంటీనా

1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-1, బి-4, సి-2, డి-3
3) ఎ-3, బి-4, సి-1, డి-2 4) ఎ-4, బి-3, సి-2, డి-1

7. కింది వాటిలో ఉప ధ్రువ అల్పపీడన మండలానికి సంబంధించిన వాక్యాలను సరిచూడండి.

ఎ) ఇది సరాసరిగా 45° నుంచి 66° ఉత్తర, దక్షిణ అర్ధగోళాల్లో విస్తరించి ఉంటుంది.
బి) ఈ ప్రాంతంలో అల్పపీడనం ప్రధానంగా భూభ్రమణం వల్ల ఏర్పడే అపకేంద్ర బలం వల్ల ఏర్పడుతుంది.
సి) ఈ ప్రాంతంలో ధ్రువ తూర్పు పవనాలు, పశ్చిమ పవనాలు కలుసుకుంటాయి.
డి) ఈ ఉపధ్రువ అల్పపీడన ప్రాంతంలో పవనాల కలయికతో సమశీతోష్ణ మండల చక్రవాతాలు ఏర్పడతాయి.

1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

8. కింది వాటిని జతపరచండి.

పవనాలు	ప్రత్యేకత
ఎ) సైమూన్	1) దయ్యపు పవనాలు
బి) శాంత ఆన	2) విష పవనాలు
సి) సిరాకో	3) మంచును భక్షించే పవనాలు
డి) చినూక్	4) రక్త వర్షాన్నిచ్చే పవనాలు

1) ఎ-2, బి-1, సి-4, డి-3 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-2, డి-3 4) ఎ-1, బి-4, సి-3, డి-2

9. కింది వాటిలో పశ్చిమ పవనాలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.

ఎ) పశ్చిమ పవనాలను 'ప్రతివ్యాపార పవనాలు' అంటారు. కారణం వ్యాపార పవనాలకు వ్యతిరేక దిశలో వీయడం.
బి) ఇవి ప్రధానంగా ఉప ఆయనరేఖ అధిక పీడన ప్రాంతం నుంచి ఉపధ్రువ అల్పపీడన ప్రాంతం వైపునకు వీస్తాయి.



సి) పశ్చిమ పవనాలనే దక్షిణార్ధ గోళంలో 'గర్జించే నలభైలు' అంటారు.
డి) శీతాకాలంలో మధ్యధరా శీతోష్ణస్థితి ప్రాంతంలో వర్షపాతం సంభవించడానికి ప్రధాన కారణం పశ్చిమ పవనాలు.

1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
3) ఎ, బి, సి, డి సరైనవి.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

10. కింది వాటిలో సరైన జతలను గుర్తించండి.

ఎ) పశ్చిమ పవనాలు - వణికించే యాభైలు
బి) హర్మట్టన్ - గినియా డాక్టర్స్
సి) గిబ్లీ - లిబియా శీతల పవనాలు
డి) మిస్ట్రల్ - ఫ్రాన్స్‌లో వెచ్చని పవనాలు

1) ఎ, బి, సి 2) బి, సి 3) ఎ, డి 4) సి, డి

11. కింది వాటిలో స్థానిక పవనాలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.

ఎ) సాధారణంగా స్థానిక పవనాలు వాయు పీడనాల్లో సంభవించే మార్పులతో నిర్దిష్ట కాలానికే పరిమితమై వీస్తాయి.
బి) పగటి సమయంలో లోయ లోని గాలి వేడెక్కి లోయ నుంచి పర్వతం వైపునకు వీస్తుంది. వీటినే 'లోయ పవనాలు' అంటారు.
సి) రాత్రి సమయంలో పర్వతాలపై సాధారణంగా తక్కువ ఉష్ణోగ్రతలు ఉండటంతో గాలి బరువెక్కి పర్వత వాలు ద్వారా లోయలోకి దిగుతుంది. వీటినే 'పర్వత పవనాలు' అంటారు.
డి) పగటి సమయంలో పవనాలు సాధారణంగా జలభాగం నుంచి భూభాగం మీదకు వీస్తాయి. వీటిని 'జల పవనాలు' అంటారు.

1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

12. కింది వాటిని జతపరచండి.

వెచ్చని పవనాలు	దేశాలు
ఎ) బ్రిక్ ఫీల్డర్స్	1) దక్షిణాఫ్రికా
బి) కేప్ డాక్టర్స్	2) దక్షిణ ఆస్ట్రేలియా
సి) చినూక్	3) అర్జెంటీనా
డి) జోండా	4) ఉత్తర అమెరికా

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-2, బి-1, సి-4, డి-3
3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-1, బి-3, సి-2, డి-4

13. ధ్రువ అధిక పీడనం మండలం గురించి వాక్యాలను సరిచూడండి.

ఎ) ఇది సరాసరిగా 75° నుంచి 90° ఉత్తర, దక్షిణ అక్షాంశాల మధ్య విస్తరించి ఉంటుంది.
బి) ఈ ప్రాంతంలో అల్ప ఉష్ణోగ్రతల కారణంగా పీడనం సాధారణంగానే ఎక్కువగా ఉంటుంది.
సి) ఈ ప్రాంతాల్లో సాధారణంగా వర్షపాతం సంభవించదు. కారణం అధిక పీడనం.
డి) ఒకే వాతావరణ పీడనం ఉన్న ప్రాంతాలను కలుపుతూ గీసే ఊహారేఖలను 'సమభార రేఖలు' అంటారు.


1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, సి, డి సరైనవి.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

14. కింది వాటిని జతపరచండి.

శీతల పవనాలు	దేశాలు
ఎ) పుర్గా	1) అర్జెంటీనా
బి) బైస్	2) స్పెయిన్
సి) నార్టర్	3) ఫ్రాన్స్
డి) పాంపెరో	4) రష్యా

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-1, బి-4, సి-3, డి-2
3) ఎ-1, బి-3, సి-2, డి-4 4) ఎ-3, బి-4, సి-2, డి-1

15. కింది వాటిలో సిరోకో వెచ్చని పవనాలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.



సిరోకో పవనాలు

ఎ) సిరోకో పవనాలు సహారా ఎడారి నుంచి మధ్యధరా సముద్రాల మీదుగా యూరప్‌లోకి వీచే ధూళి గాలులు.
బి) దక్షిణ ఇటలీ ప్రాంతంలో ఎర్రటి ధూళి రేణువులతో కూడిన వర్షపాతాన్ని 'రెడ్ డస్ట్ స్టార్మ్' అంటారు.
సి) సిరోకో వెచ్చని పవనాలను స్పెయిన్‌లో లివేచ్ అని పిలుస్తారు.
డి) సిరోకో వెచ్చని పవనాలనే మొరాకోలో లెస్టె అని పిలుస్తారు.

1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి, సరైనవి.
3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
4) ఎ, సి సరైనవి; బి, డి సరికావు.




రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-1; 2-2; 3-3; 4-2; 5-1; 6-4; 7-2; 8-1; 9-3; 10-4; 11-1; 12-2; 13-3; 14-1; 15-2.

(c) eenadu


రిప్పన్

భారతదేశ రాజ్యాల మధ్య అనైక్యత, కొంత మంది రాజుల అసమర్థత, అంతర్గత కలహాలను అవకాశంగా తీసుకున్న ఇంగ్లిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ తమ రాజ్య విస్తరణ గావించింది. వ్యాపారం కోసం అడుగుపెట్టిన ఆంగ్లేయులు క్రమంగా బలపడి, రాజకీయ శక్తిగా ఎదిగారు. ప్లాసీ, బక్సార్ యుద్ధాలు వీరి సామ్రాజ్య విస్తరణకు తొలిమెట్టుగా చెప్పవచ్చు. 1858లో కంపెనీ పాలన అంతమైంది. ఆ తర్వాత బ్రిటిష్ రాణి/రాజు ప్రత్యక్ష పాలన కిందికి భారతదేశం వెళ్లింది. అధికార విస్తరణకు, పాలనా సౌలభ్యం కోసం బ్రిటిష్ వారు అనేక చట్టాలు ప్రవేశపెట్టారు. భూమిశిస్తు కోసం జమీందారీ, రైత్వారీ, మహల్వారీ విధానాలను అవలంబించారు. న్యాయపాలన కోసం వివిధ సంస్కరణలు చేపట్టారు.


విలియం బెంటింక్

దివ్య పరీక్షలు నిలిపివేత.. జ్యూరీ విధానం అమలు

బ్రిటిష్ వారి పరిపాలన విధానం

న్యాయపాలన

భారతదేశంలో ఆధునిక న్యాయవ్యవస్థను ప్రవేశపెట్టినవారు ఆంగ్లేయులు. వీరికి ముందు భారత్‌లో లోపభూయిష్టమైన న్యాయవ్యవస్థ ఉండేది. మత గ్రంథాల ఆధారంగా, మతాధిపతులే న్యాయమూర్తులుగా వ్యవహరిస్తూ తీర్పులిచ్చేవారు. చట్టం ముందు అందరూ సమానులే అనే నియమం ఆచరణకు నోచుకోలేదు. దివ్య పరీక్షల ద్వారా నేర నిర్ధారణ జరిగేది. శాశ్వత న్యాయస్థానాలు లేవు. ఈ లోపాలను సవరిస్తూ ఆంగ్లేయులు అధునాతన న్యాయవ్యవస్థను తీసుకువచ్చారు.

గవర్నర్ జనరల్‌లు - న్యాయ సంస్కరణలు

వారన్ హేస్టింగ్స్: ఇతడు దివ్య పరీక్షలు రద్దుచేసి వాటి స్థానంలో జ్యూరీ విధానం ప్రవేశపెట్టాడు.

- ప్రత్యేక సివిల్, క్రిమినల్ న్యాయస్థానాలను క్రమానుగత శ్రేణిలో ఏర్పాటు చేశాడు. సదర్ దివానీ అదాలత్ (అత్యున్నత సివిల్ న్యాయస్థానం), సదర్ నిజామత్ అదాలత్ (అత్యున్నత క్రిమినల్ న్యాయస్థానం)లను కలకత్తాలో ఏర్పాటు చేశాడు.

కారన్ వాలీస్: ఇతడు సంచార న్యాయస్థానాలను (Mobile Courts) ఏర్పాటు చేశాడు. న్యాయస్థానాలే గ్రామాలకు వెళ్లి సత్వర న్యాయం అందించడం దీని ఉద్దేశం.

- న్యాయస్థానాల్లో చెల్లించే రుసుములను రద్దు చేశాడు.
- Court of Records అనే సంప్రదాయాన్ని ప్రారంభించాడు. దీని ప్రకారం ఉన్నత న్యాయస్థానాల తీర్పులను ముద్రించి అందరికీ అందుబాటులో ఉంచాలి.

విలియం బెంటింక్: ఇతడు సంచార న్యాయస్థానాలను రద్దు చేశాడు.

- సదర్ దివానీ అదాలత్, సదర్ నిజామత్ అదాలత్‌లను అలహాబాద్‌లో కూడా ఏర్పాటు చేశాడు.
- పర్షియన్ భాషకు బదులుగా ప్రాంతీయ భాషలతో పాటు ఇంగ్లిష్‌ను న్యాయస్థానాల్లో ఉపయోగించే భాషలుగా గుర్తించాడు.
- 1833 చార్టర్ చట్టం ప్రకారం మొదటి లా కమిషన్‌ను 1834లో ఏర్పాటు చేశాడు. లార్డ్ మెకాలే దీని ఛైర్మన్‌గా నియమితుడయ్యాడు. ఇతడి నాయకత్వంలోని మొదటి లా కమిషన్ భారతదేశంలో తొలిసారిగా చట్టాలను క్రోడీకరించింది.
- సివిల్ ప్రొసీజర్ కోడ్ (1859), ఇండియన్ పీనల్ కోడ్ (1860), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (1861)లు మెకాలేనే అందించాడు.

లార్డ్ కానింగ్:

ఇతడు 1861లో భారత హైకోర్టుల చట్టాన్ని తీసుకువచ్చాడు. 1862లో కలకత్తా హైకోర్టు, బొంబాయి హైకోర్టు, మద్రాస్ హైకోర్టులను ఏర్పాటు చేశాడు. ఇవే భారతదేశంలోని తొలి హైకోర్టులు.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

ఇల్బర్ట్ బిల్ వివాదం (1883-84): భారతదేశంలో ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన ఆధునిక న్యాయవ్యవస్థలోనూ లోపాలు లేకపోలేదు. వీరి న్యాయవ్యవస్థలో భయంకరమైన జాతివివక్ష కన్పిస్తుంది. భారతీయ జడ్జిలకు తెల్లవారిని విచారించి, శిక్షించే అధికారం ఇవ్వలేదు. ఈ వివక్షను నిర్మూలించడానికి గవర్నర్ జనరల్ లార్డ్ రిప్పన్ ఇల్బర్ట్ బిల్‌ను రూపొందించాడు. భారతీయ జడ్జిలకు తెల్లవారిని విచారించే అధికారాలు కల్పిస్తూ, జాతివివక్షను అంతం చేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. అయితే తెల్లవారి నుంచే తీవ్ర వ్యతిరేకత రావడంతో ఈ బిల్లు చట్టం కాలేదు. దీనికి నిరసనగా రిప్పన్ రాజీనామా చేసి ఇంగ్లండ్‌కు తిరిగి వెళ్లిపోయాడు.

సివిల్ సర్వీసులు

ప్రారంభంలో ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యాపారులే పాలకులుగా వ్యవహరించేవారు. దీంతో అసమర్థత, అవినీతి రాజ్యమేలాయి. ఈ పరిస్థితుల్లో లార్డ్ కారన్ వాలీస్ 1786లో పరిపూర్ణమైన సివిల్ సర్వీస్ వ్యవస్థను ప్రవేశపెట్టాడు. అప్పటి నుంచి నేటి వరకు భారతదేశ పాలనలో సివిల్ సర్వెంట్స్ కీలకపాత్ర పోషిస్తున్నారు. కారన్ వాలీస్ రెండు రకాల సివిల్ సర్వీస్‌లను ప్రవేశపెట్టాడు. అవి:

కొవెనెటెడ్ సర్వీస్: ఒప్పందం ద్వారా విధుల్లో చేరేవారు. 1861లో ఇండియన్ సివిల్ సర్వీస్ (ICS) అని పేరు మార్చారు.

నాన్-కొవెనెటెడ్ సర్వీస్: ఎలాంటి ఒప్పందం లేకుండా విధుల్లో చేరేవారు.

- కారన్ వాలీస్ కాలం నుంచి సివిల్ సర్వీస్‌లో భారతీయులు రాకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రారంభంలో నామినేషన్ పద్ధతి ద్వారా సివిల్ సర్వీసుల ఎంపిక జరిగేది. 1853 చార్టర్ చట్టం ద్వారా ఈ సర్వీస్ ఎంపిక కోసం పోటీ పరీక్షలు ప్రవేశపెట్టారు. కానీ భారతీయులు ఉత్తీర్ణత సాధించకుండా ఆంగ్లేయులు అనేక అడ్డంకులు సృష్టించారు. అందులో ముఖ్యమైనవి:
- గ్రీకు, లాటిన్ పేపర్లను పరీక్షల్లో తప్పనిసరి చేయడం.
- పరీక్షలు రాసేందుకు గరిష్ఠ వయోపరిమితిని గణనీయంగా తగ్గించడం. 1859లో గరిష్ఠ వయోపరిమితి 23 ఏళ్లు ఉండగా, క్రమంగా దాన్ని తగ్గిస్తూ 1878లో 19 ఏళ్లకు కుదించారు.
- సివిల్ సర్వీస్ పరీక్షలను కేవలం ఇంగ్లండ్‌లో మాత్రమే నిర్వహించడం.

సివిల్ సర్వీస్ శిక్షణ:

సివిల్ సర్వీస్‌కు ఎంపికైన అభ్యర్థులకు ప్రారంభంలో కలకత్తాలోని ఫోర్ట్ విలియం కాలేజీలో శిక్షణ ఇచ్చేవారు. ఇక్కడ శిక్షణ సంతృప్తికరంగా లేకపోవడంతో అభ్యర్థులను శిక్షణ కోసం ఇంగ్లండ్ పంపించారు. 1806లో ఇంగ్లండ్‌లోని హెలిబరిలో ఈస్ట్ ఇండియా కాలేజీని స్థాపించారు. 1813 చార్టర్ చట్టం సివిల్ సర్వీస్ శిక్షణను తప్పనిసరిగా ఇంగ్లండ్‌లోనే చేపట్టాలని ఆదేశించింది.


రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

సివిల్ సర్వీసులు - నియమించిన కమిషన్లు

ఆంగ్లేయులు అనేక కమిషన్‌లను ఏర్పాటు చేసి, వాటి నివేదికల ఆధారంగానే సివిల్ సర్వీస్‌లో మార్పులు, చేర్పులు చేపట్టారు. అవి:

ఐచ్చిసన్ కమిషన్ - 1886: ఈ కమిషన్‌ను 1886లో లార్డ్ డఫ్రిన్ గవర్నర్ జనరల్‌గా ఉన్న కాలంలో నియమించారు.

- ఈ కమిషన్ ICS పరీక్షలు ఇంగ్లండ్‌లో మాత్రమే నిర్వహించి, మిగిలిన సివిల్ సర్వీసులకు ఇంగ్లండ్, భారతదేశంలో సంయుక్తంగా పరీక్షలు నిర్వహించాలని తెలిపింది. 1922 నుంచి సివిల్ సర్వీస్ పరీక్షలను ఇంగ్లండ్, భారతదేశంలో నిర్వహించడం ప్రారంభించారు.
- సివిల్ సర్వీస్ పరీక్షలు రాయడానికి గరిష్ఠ వయోపరిమితిని 23 ఏళ్లకు పెంచాలని సూచించగా, 1892లో పెంచారు.

విస్కౌంట్ లీ కమిషన్ - 1924: ఈ కమిషన్‌ను 1924లో లార్డ్ రీడింగ్ గవర్నర్ జనరల్‌గా ఉన్న సమయంలో నియమించారు.

- ఈ కమిషన్ సివిల్ సర్వీస్ పరీక్షలు నిర్వహించడానికి ఢిల్లీలో పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సూచించింది. దీంతో 1926లో ఢిల్లీలో ఏర్పాటు చేశారు. 1950లో దీన్ని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా మార్చారు.
- సివిల్ సర్వీస్ ప్రత్యక్ష నియామకాల్లో భారతీయులకు 50 శాతం కేటాయించాలని సిఫార్సు చేసింది.
- ICSలో చేరిన తొలి భారతీయుడు - సత్యేంద్రనాథ్ ఠాగూర్

893 Word of the Day

Refute

Telugu meaning: ఖండించు, తప్పని నిరూపించు

English meaning: Refute (రిఫ్యూట్) is a verb that means to prove a statement or claim to be false using evidence or logical argument.

Synonyms: Disprove, Contradict

Antonyms: Confirm, Support

Usage: **1.** The lawyer presented strong evidence to refute the allegations made against her client.

2. Scientific data was used to refute the misleading claims spread on social media.

కరెంట్ అఫైర్స్



నౌకాయాన రంగంలో భారత్ అరుదైన ఘనత సాధించింది. ఇటీవల గుజరాత్‌లోని పోర్‌బందర్ నుంచి బయల్దేరిన 'ఐఎన్ఎస్‌వీ కౌండిన్య' 2026, జనవరి 14న ఒమన్ రాజధాని మస్కట్‌కు విజయవంతంగా చేరుకుని, జల వందనం స్వీకరించింది.

☛ ఐఎన్ఎస్‌వీ కౌండిన్య ఎలాంటి ఇంజిన్ లేకుండా పూర్తిగా తెరచాపల సాయంతో ప్రయాణించి గమ్యాన్ని చేరుకుంది. ఇది దాదాపు 1,400 కిలోమీటర్ల ప్రయాణాన్ని 17 రోజుల్లో పూర్తి చేసింది.




భారత్ నుంచి చైనాకు 2024తో పోలిస్తే 2025లో 5.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.49,500 కోట్లు) ఎగుమతులు పెరిగాయని చైనాకు చెందిన కస్టమ్స్ విభాగం 2026, జనవరి 14న విడుదల చేసిన వార్షిక వాణిజ్య గణాంకాలు వెల్లడించాయి. ఇదే సమయంలో వాణిజ్య లోటు కూడా రికార్డు స్థాయిలో 116.12 బి.డాలర్ల (సుమారు రూ.10.45 లక్షల కోట్లు)కు చేరింది. ద్వైపాక్షిక వాణిజ్యం కూడా జీవన కాల గరిష్ఠమైన 155.62 బి.డాలర్ల (సుమారు రూ.14 లక్షల కోట్లు)కు చేరింది.

కామన్వెల్త్ దేశాల సభాధ్యక్షుల 28వ సదస్సును ప్రధాని నరేంద్ర మోదీ 2026, జనవరి 15న పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ప్రారంభించారు. 42 కామన్వెల్త్ దేశాలకు చెందిన 61 మంది సభాపతులు/ సభాధ్యక్షులు దీనికి హాజరయ్యారు. ఈ సదస్సుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షత వహించారు.

2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.2 శాతం వృద్ధి రేటు నమోదు చేయొచ్చని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. 2025 జూన్‌లో అంచనా వేసిన 6.3 శాతం వృద్ధిని 0.9 శాతం మేర పెంచింది. దేశీయ గిరాకీ బలంగా పుంజుకోవడం, ప్రభుత్వం తీసుకొచ్చిన పన్ను సంస్కరణలు వృద్ధి పెరిగేందుకు దోహదం చేస్తాయని పేర్కొంది.



మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.



జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

సమాచార సాంకేతిక పరిజ్ఞాన రంగం (ఐటీ సెక్టార్)

భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో తృతీయ రంగం లేదా సేవా రంగానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఇందులో సమాచార సాంకేతిక విజ్ఞాన (ఐటీ) రంగం ముఖ్యమైంది. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు కూడా అధికం. స్థూల జాతీయోత్పత్తిలో ఐటీ సెక్టార్ వాటా పెరుగుతోంది. భారతదేశంలో ఐటీ సెక్టార్ - వృద్ధి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రభుత్వం అందిస్తోన్న వివిధ సేవలు మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

భారతదేశంలో ఐటీ సెక్టార్

ఐటీ, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సర్వీసులు, ఇంజినీరింగ్ డిజైన్ హార్డ్‌వేర్, బీపీఓ మొదలైనవి ఐటీ సేవల కిందకు వస్తాయి. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్‌ను నెట్‌వర్క్ కమ్యూనికేషన్స్ ప్రొడక్ట్ (ఎన్‌సీపీ) 1984 ప్రకారం ఏర్పాటు చేశారు. భారత ప్రభుత్వం 2000లో ఐటీ చట్టాన్ని ఆమోదించింది. దీని వల్ల ఆన్‌లైన్ వాణిజ్యం, లావాదేవీలు సులభతరం అవుతున్నాయి.

ఐటీసీ, బీపీఓ, భారతదేశంలో సమాచార సాంకేతిక పరిశ్రమ వృద్ధి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రభుత్వం అందిస్తోన్న వివిధ సేవలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

లోక్‌పాల్ స్టడీ జోన్

ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న వ్యక్తులు వారి తరఫున చట్టసభల్లో ప్రవేశించి, పరిపాలన సాగిస్తారు. ఆ సభల్లో తీసుకున్న నిర్ణయాల అమలుకు కార్యనిర్వాహక శాఖ బాధ్యత వహిస్తుంది. తీసుకున్న నిర్ణయాలు సక్రమంగా అమలైనప్పుడే పౌరులకు సరైన పాలన అందుతుంది. అలాకాకుండా నాయకులు, అధికారులు అవినీతికి, అధికార దుర్వినియోగానికి పాల్పడితే అది ప్రజాస్వామ్య విలువలకే ముప్పుగా పరిణమిస్తుంది. అలాంటి వాటిని దీటుగా ఎదుర్కొనేందుకు ఏర్పాటు చేసిన అంబుడ్స్‌మన్ వ్యవస్థే లోక్‌పాల్. ఇది జాతీయ స్థాయిలో చట్టబద్ధమైన అవినీతి నిరోధక సంస్థగా పనిచేస్తుంది. పోటీపరీక్షల నేపథ్యంలో దీని గురించి ముఖ్య విషయాలు తెలుసుకుందాం..!

చారిత్రక నేపథ్యం - ఏర్పాటు

☛ ప్రభుత్వ అధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలు, అధికార దుర్వినియోగం, అక్రమాలపై విచారించే స్వతంత్ర న్యాయాధికార వ్యవస్థను 1809లో స్వీడన్‌లో 'అంబుడ్స్‌మన్' పేరుతో ఏర్పాటు చేశారు. దీని అర్థం ప్రజల న్యాయవాది.

☛ మనదేశంలో అత్యున్నత స్థాయి వ్యక్తుల అవినీతి చర్యలను విచారించేందుకు లోక్‌పాల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని 1959లో అప్పటి కేంద్ర ఆర్థికమంత్రి సి.డి.దేశ్‌ముఖ్ ప్రతిపాదించారు.

☛ లోక్ అంటే ప్రజలు, పాల్ అంటే సంరక్షకుడు అని అర్థం.

☛ డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో 2013లో లోక్‌పాల్ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందింది. దీనికి 2014 జనవరి 1న అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆమోదం తెలపడంతో 2014 జనవరి 16 నుంచి లోక్‌పాల్, లోకాయుక్త చట్టంగా అమల్లోకి వచ్చాయి. మన దేశంలో ఏటా జనవరి 16న 'లోక్‌పాల్ డే'గా నిర్వహిస్తారు.

లోక్‌పాల్ నిర్మాణం - సభ్యుల నియామకం, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబులు సహా పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

రిసెర్చ్ ఫెలో పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఇండోర్ ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రిసెర్చ్ ఫెలో, సీనియర్ రిసెర్చ్ ఫెలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన అభ్యర్థులు 2026 జనవరి 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఫ్యాకల్టీ పోస్టులు

కర్నూల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ (ట్రిపుల్ఐటీ డీఎం) తాత్కాలిక ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 10. దరఖాస్తు ఫీజు రూ.500. ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ 24 జనవరి 2026.

ఎంబీఏ ప్రోగ్రామ్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (యూఓహెచ్) 2026-2028 విద్యా సంవత్సరానికి ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. దరఖాస్తు ఫీజు రూ.600. అర్హులైన అభ్యర్థులు 2026, జనవరి 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (జనవరి 17) చివరి తేదీ

- ఎన్ఐఎల్‌లో సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులు. పీజీ, పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- ఐఐటీ దిల్లీలో జూనియర్ రిసెర్చ్ ఫెలో పోస్టులు. బీటెక్/ఎంటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు నెట్/గేట్‌లో అర్హత సాధించినవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams
Mathematics
Probability

1. A box contains 6 green, 4 yellow and 5 black balls. If three balls are drawn at random from the box, what is the probability that all three balls are yellow?

A) $\frac{1}{91}$ B) $\frac{2}{91}$ C) $\frac{3}{455}$ D) $\frac{4}{455}$

2. Two dice are thrown simultaneously. What is the probability of getting a sum of 9?

A) $\frac{1}{12}$ B) $\frac{1}{9}$ C) $\frac{1}{6}$ D) $\frac{5}{36}$

3. Two dice are thrown simultaneously. What is the probability of getting a sum of 10?

A) $\frac{1}{12}$ B) $\frac{1}{9}$ C) $\frac{1}{6}$ D) $\frac{1}{18}$

4. From each of the three boxes below, one ball is drawn at random:

- Box I contains 4 white and 2 black balls
- Box II contains 3 white and 3 black balls
- Box III contains 2 white and 4 black balls

What is the probability that exactly 2 white balls and 1 black ball are drawn?

A) $\frac{5}{18}$ B) $\frac{7}{18}$ C) $\frac{4}{9}$ D) $\frac{1}{3}$

5. A bag contains 5 blue balls and 7 green balls. If three balls are drawn at random, what is the probability that exactly two balls are blue and one ball is green?

A) $\frac{25}{132}$ B) $\frac{7}{22}$ C) $\frac{5}{44}$ D) $\frac{7}{66}$

6. A bag contains cards numbered from 21 to 80. If one card is drawn at random, what is the probability that the number on the card is a perfect square?

A) $\frac{1}{13}$ B) $\frac{1}{10}$ C) $\frac{1}{12}$ D) $\frac{1}{15}$

7. Tickets numbered 1 to 30 are mixed thoroughly, and one ticket is drawn at random. What is the probability that the number on the ticket is a multiple of 3 or 7?

A) $\frac{11}{30}$ B) $\frac{13}{30}$ C) $\frac{9}{30}$ D) $\frac{7}{30}$

8. A card is drawn at random from a standard deck of 52 playing cards. What is the probability that the card drawn is a red face card?

A) $\frac{1}{13}$ B) $\frac{3}{26}$ C) $\frac{1}{26}$ D) $\frac{3}{13}$

9. A bag contains 3 red, 4 green, and 3 yellow balls. If two balls are drawn at random, what is the probability that none of the balls drawn is yellow?

A) $\frac{3}{10}$ B) $\frac{2}{5}$ C) $\frac{7}{15}$ D) $\frac{8}{15}$

10. A bag contains cards numbered from 28 to 77. If one card is drawn at random, what is the probability that the number on the card is a multiple of 7?

A) $\frac{5}{50}$ B) $\frac{6}{50}$ C) $\frac{1}{7}$ D) $\frac{4}{25}$

11. A box contains 6 white, 4 red, and 5 blue balls. If three balls are drawn at random, what is the probability that all three balls are blue?

A) $\frac{2}{91}$ B) $\frac{2}{33}$ C) $\frac{5}{132}$ D) $\frac{1}{22}$

12. Bag X contains 3 white and 5 black balls. Bag Y contains 4 white and 6 black balls. One ball is drawn at random from each bag. What is the probability that both balls drawn are black?

A) $\frac{5}{16}$ B) $\frac{3}{10}$ C) $\frac{3}{20}$ D) $\frac{3}{8}$

13. A question is given to three students A, B and C. The probabilities that A, B and C solve the question correctly are $\frac{1}{3}$, $\frac{1}{4}$ and $\frac{1}{6}$, respectively. What is the probability that the question will be solved by at least one student?

A) $\frac{1}{2}$ B) $\frac{5}{8}$ C) $\frac{2}{3}$ D) $\frac{7}{12}$

14. Two dice are thrown simultaneously. What is the probability of getting a sum of 11?

A) $\frac{1}{18}$ B) $\frac{1}{12}$ C) $\frac{1}{9}$ D) $\frac{5}{36}$

15. Bag A contains 5 white and 3 black balls. Bag B contains 2 white and 6 black balls. If one ball is drawn from each bag, what is the probability that both balls drawn are black?

A) $\frac{3}{16}$ B) $\frac{5}{16}$ C) $\frac{9}{32}$ D) $\frac{15}{32}$

16. There are 12 points lying on a circle. By joining these points, how many distinct triangles can be formed?

A) 180 B) 200 C) 220 D) 240

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

(c) eenadu

ఎమ్మెల్యేపై అనర్హత.. సుప్రీంకోర్టు స్టే

దిల్లీ: భారతీయ జనతా పార్టీ టికెట్ మీద ఎన్నికై, తరవాత తృణమూల్ కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన సీనియర్ నేత ముకుల్‌రాయ్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే ఇచ్చింది. హైకోర్టు తీర్పును ముకుల్ రాయ్ కుమారుడు శుభ్రాన్షురాయ్ సుప్రీంలో సవాలు చేశారు. ఆయన తరఫు న్యాయవాది ప్రీతికా ద్వివేది కలకత్తా హైకోర్టు తన పరిధిని దాటి ముకుల్ రాయ్ పై అనర్హత వేటు వేసిందని వాదించారు. ప్రస్తుత పశ్చిమ బెంగాల్ విధానసభ పదవీకాలం మరి కొన్ని నెలల్లో ముగియబోతున్నది కనుక హైకోర్టు తీర్పుపై స్టే ఇస్తున్నామని సుప్రీంకోర్టు వివరించింది.


కేంద్ర విజిలెన్స్ కమిషనర్‌గా ప్రవీణ్ వశిష్ఠ

దిల్లీ: కేంద్ర నిఘా కమిషన్(సీవీసీ) విజిలెన్స్ కమిషనర్‌గా ఐపీఎస్ మాజీ అధికారి ప్రవీణ్ వశిష్ఠ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజిలెన్స్ కమిషనర్‌గా నెలక్రితమే ఆయన నియమితులయ్యారు. బిహార్ కేడర్‌లో పనిచేసిన ఆయన విజిలెన్స్ కమిషనర్‌కు ముందు కేంద్ర హోంశాఖలో ప్రత్యేక కార్యదర్శి(అంతర్గత రక్షణ)గా సేవలందించారు. ప్రవీణ్ 1991 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి.

దర్యాప్తులో మమత జోక్యం

- ఐప్యాక్‌పై దాడి కేసులో సుప్రీంకు ఈడీ

దిల్లీ: బొగ్గు కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా తృణమూల్ కాంగ్రెస్ రాజకీయ సలహా సంస్థ అయిన 'ఐప్యాక్' కార్యాలయంపై, దాని డైరెక్టర్ నివాసంపై తాము జరిపిన దాడులు, దర్యాప్తులో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా పశ్చిమబెంగాల్ ప్రభుత్వం జోక్యం చేసుకుంటున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించింది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు సమర్పించిన వ్యాజ్యంలో పేర్కొంది. కేంద్ర హోం శాఖను, కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగాలను కూడా కక్షిదారులుగా చేర్చాలని విజ్ఞప్తి చేసింది.



కుడికాలు లేకున్నా.. కంటి గురి లక్ష్యంపైనే

ఈటీవీ భారత్: డిసెంబరు నెలాఖరున బెంగళూరులో జరిగిన 5వ పారా క్లైంబింగ్ నేషనల్ కప్-2025 పోటీల్లో బిహార్‌కు చెందిన అర్జున్ పాండే కాంస్య పతకం గెలిచాడు. లోయర్ లింబ్ డిజేబులిటీ కేటగిరీలో ఆ రాష్ట్రానికి ఇదే తొలి పతకం. అంతేనా.. సాధారణ నేపథ్యం నుంచి వచ్చిన అర్జున్ కుడికాలు పూర్తిగా లేకున్నా లక్ష్యాన్ని ఛేదించి చరిత్ర సృష్టించాడు. 2012లో 8వ తరగతి చదువుతున్న వయసులో జరిగిన రైలు ప్రమాదం దివ్యాంగుడిగా మిగిల్చింది. పూజలు పునస్కారాలు చేయించే తండ్రి ఆదాయం అరకొర కాగా, అర్జున్‌కు చికిత్స కోసం తల్లి తన నగలన్నీ అమ్మేసింది. తీవ్ర నిరాశా నిస్పృహల మధ్య పదేళ్లు గడిచిపోయాయి. 2022లో డెలివరీ బాయ్‌గా పట్నాలో కొత్త జీవితం ప్రారంభించిన అర్జున్ కొంతమంది విద్యార్థుల సాధనతో స్ఫూర్తి పొంది బిహార్ క్లైంబింగ్ అసోసియేషనులో చేరాడు. అక్కడ ఉచిత వసతి, సదుపాయాలతో ట్రైనర్ సయ్యద్ అబ్బుర్ రెహమాన్ అందించిన శిక్షణలో ఆరితేరిన అర్జున్ ప్రపంచస్థాయి పారా లింపిక్స్‌లో దేశానికి పతకం తీసుకురావడమే లక్ష్యంగా కఠోర సాధన చేస్తున్నాడు.

భార్య మంటల్లో కాలిపోతుంటే.. వీడియో తీసిన భర్త


సూరత్: కళ్ల ముందే భార్య నిప్పంటించుకొని కాలిపోతున్నా.. కాపాడకుండా వీడియో తీశాడో భర్త. గుజరాత్‌లోని సూరత్‌లో ఈ దిగ్భ్రాంతికర ఘటన వెలుగులోకి వచ్చింది. బిహార్‌కు చెందిన ప్రతిమా దేవీ (31), రంజిత్ సాహా 2013లో ప్రేమవివాహం చేసుకున్నారు. మూడేళ్ల క్రితం సూరత్‌కు వచ్చి స్థిరపడ్డారు. వీరికి ముగ్గురు పిల్లలు. భర్తతో గొడవ జరగడంతో ప్రతిమ ఈ నెల 4న శరీరంపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకుంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 11న మృతిచెందింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ప్రతిమ మంటల్లో కాలిపోతుండగా కాపాడకుండా రంజిత్ తన ఫోన్‌లో రికార్డు చేసిన వీడియోను గుర్తించారు. గొడవ జరిగినప్పుడు భార్యను అతడు ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు పోలీసులు చెప్పారు. రంజిత్‌ను పోలీసులు అరెస్టు చేయగా.. భార్య మరణంలో తన ప్రమేయం ఏమీ లేదని నిరూపించుకునేందుకే ఆమె కాలిపోతున్నప్పుడు వీడియో తీశానని చెప్పాడు.

అమెరికాలో తైవాన్ భారీ పెట్టుబడులు

తైపే: అమెరికాలో తైవాన్ 25,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టనుంది. ఈ మేరకు ఆ దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఇది అత్యుత్తమ వాణిజ్య ఒప్పందమని తైవాన్ ప్రధానమంత్రి చో జంగ్ టాయ్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంతకుముందు తైవాన్‌పై 32 శాతం సుంకాలు విధించి తరవాత వాటిని 20 శాతానికి తగ్గించారు. తాజాగా వాటిని 15 శాతానికి తగ్గించారు. ఈ నేపథ్యంలోనే ఈ ఒప్పందం కుదిరింది.

ప్రజలకు జవాబుదారీగా ఉన్నంత కాలం వ్యవస్థలు బలంగా ఉంటాయి

- లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా





దిల్లీలో జరిగిన కామన్‌వెల్త్ దేశాల స్పీకర్లు, సభాపతుల సదస్సు ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఓంబిర్లా

ఈనాడు, దిల్లీ: ప్రజాస్వామ్య వ్యవస్థలు పారదర్శకంగా, ప్రజలకు జవాబుదారీగా ఉన్నంతకాలం బలంగా ఉంటాయని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా పేర్కొన్నారు. సంవిదాన్ సదన్ వేదికగా మూడురోజుల పాటు జరిగిన 28వ కామన్‌వెల్త్ దేశాల స్పీకర్లు, సభాపతుల సదస్సు ముగింపు సందర్భంగా శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''వ్యవస్థలు తాము తీసుకొనే నిర్ణయాలను ప్రజలకు బహిర్గతంచేయడం పారదర్శకత కిందికి వస్తుంది. సమ్మిళితత్వం ప్రతి గొంతుకూ భరోసా కల్పిస్తుంది. అణగారిన వర్గాల గొంతును విని, ప్రజాస్వామ్య ప్రక్రియలో వారి మాటకు గౌరవమిచ్చినప్పుడు వ్యవస్థలపై నమ్మకం పెరుగుతుంది. 56 ఏళ్ల క్రితం పురుడుపోసుకున్న కామన్‌వెల్త్ స్పీకర్లు, సభాపతుల సదస్సు ద్వారా ప్రజాస్వామ్య దేశాల చట్టసభలకు నేతృత్వం వహిస్తున్న సభాపతులు పార్లమెంటు సామర్థ్యాలు, స్పందించేగుణాన్ని మెరుగుపరుచుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై పరస్పరం చర్చించి ఒక నిర్ణయానికి రావడానికి వీలుపడుతోంది. ఇప్పుడు జరిగిన 28వ సదస్సు ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లింది. పార్లమెంటులో కృత్రిమ మేధ వినియోగం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సామాజిక మాధ్యమాల ప్రభావం, ఎన్నికలకు అతీతంగా చట్టసభల పనితీరులో ప్రజల భాగస్వామ్యం, పార్లమెంటు సభ్యులు, సిబ్బంది ఆరోగ్యం అన్న అంశాలపై ఈ సదస్సులో చర్చించడం మంచి పరిణామం. ప్రస్తుత సంక్లిష్టపరిస్థితుల్లో పోషించాల్సిన పాత్ర, నిర్వర్తించాల్సిన బాధ్యతల విషయంలో సభాపతులకు మరింత స్పష్టత వచ్చింది. ఈ సదస్సు సందర్భంగా నిర్వహించిన ద్వైపాక్షిక సమావేశాలు, అనధికారిక సంభాషణలు కామన్‌వెల్త్‌సభ్య దేశాల మధ్య మరింత బంధాన్ని, అవగాహనను పెంచాయి'' అని ఓం బిర్లా పేర్కొన్నారు.

వందేమాతరం ఇతివృత్తంగా గణతంత్ర కవాతు

- ముఖ్య అతిథులుగా ఐరోపా నేతలు

దిల్లీ: వందేమాతర గీతం 150 ఏళ్ల పరిపూర్తి ఈసారి గణతంత్ర దినోత్సవ కవాతుకు ప్రధాన ఇతివృత్తం కానుంది. వందేమాతర గీతం ప్రారంభ చరణాల భారీ చిత్రాలను కవాతు సందర్శకుల కోసం ఏర్పాటుచేసే ఆవరణలకు నేపథ్యంగా కర్తవ్య పథ్ ప్రాంతంలో ప్రదర్శించనున్నారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాలు ముఖ్య అతిథులుగా ఈ కవాతును తిలకించనున్నారు. పెరేడ్ ప్రధాన వేదిక వద్ద ఏర్పాటు చేయనున్న పుష్పాలంకరణలు వందేమాతరం గీత రచయిత బంకించంద్ర చటోపాధ్యాయకు నివాళులర్పించనున్నాయి. కవాతు సందర్శకుల కోసం ఏర్పాటు చేసే ప్రత్యేక ఆవరణలకు దేశంలోని వివిధ నదుల పేర్లు పెట్టనున్నామని రక్షణశాఖ సీనియర్ అధికారులు శుక్రవారం వెల్లడించారు. 150 ఏళ్ల వందేమాతరం అనే శీర్షిక కింద ఈసారి కవాతు నిర్వహించనున్నామని రక్షణ కార్యదర్శి ఆర్.కె.సింగ్ తెలిపారు. దేశంలోని 120 నగరాల్లో 235 చోట్ల సైన్యం, కేంద్ర సాయుధ పోలీసులు వందేమాతరం ఇతివృత్తంగా బ్యాండు ప్రదర్శన నిర్వహిస్తారని రక్షణ కార్యదర్శి పేర్కొన్నారు.

కొత్తగా ఏర్పాటైన 'భైరవ్ లైట్ కమాండో బెటాలియన్ తొలిసారిగా గణతంత్ర దినోత్సవ కవాతులో పాల్గొనబోతోంది. రఫేల్, సు-30, పి81, మిగ్-29, అపాచె, ఎల్‌సిహెచ్ హెలికాప్టర్లు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, మి 17 హెలికాప్టర్లతోపాటు రవాణా విమానాలైన సి 130, సి 295లను ఈ సందర్భంగా ప్రదర్శించనున్నారు.



జపాన్ విదేశీ వ్యవహారాల మంత్రి తొషిమిట్సు మొటెగికి భారత క్రికెట్ టీమ్ సభ్యులు సంతకం చేసిన క్రికెట్ బ్యాట్‌ను బహూకరిస్తున్న దేశ విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్

మా దేశ ప్రజల్ని ఒంటరిగా వదిలేయకండి

- అమెరికాకు ఇరాన్ అసమ్మతి నేతల విజ్ఞప్తి

ఐరాస: తమ దేశంలో ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు నిర్వహించేలా ప్రోత్సహించిన అమెరికా ప్రభుత్వం ఇప్పుడు వారిని ఒంటరిగా వదిలేయకూడదని ఇరాన్‌కు చెందిన అసమ్మతి నేతలు మసీహ్ అలీనెజాద్, అహ్మద్ బాతెబీ పేర్కొన్నారు. ఈ మేరకు ట్రంప్ యంత్రాంగానికి వారు విజ్ఞప్తి చేశారు. ఇరాన్ ప్రభుత్వం అనేక మానవహక్కుల ఉల్లంఘనలకు పాల్పడిందని, అందుకు దాన్నుంచి జవాబు కోరాలనీ వారిద్దరూ వాషింగ్టన్‌కు విన్నవించారు. ఇరాన్‌లో పరిస్థితులపై చర్చించేందుకు గురువారం భద్రతామండలి అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి అలీనెజాద్, బాతెబీలను ఆహ్వానించి వారితో ప్రారంభోపన్యాసాలు ఇప్పించారు. ఇరాన్ ప్రభుత్వం తనను అంతమొందించేందుకు కిరాయి హంతకుల్ని నియమించిందని అలీనెజాద్ పేర్కొనగా, ఇరాన్ జైలులో తాను అనుభవించిన అకృత్యాలను బాతెబీ వివరించారు. ''మిత్రులారా.. అధ్యక్షుడు ట్రంప్ చేతల మనిషి. ఐరాస సభల్లో మనం చూసినట్టుగా కేవలం మాటలతో కాలక్షేపం చేసే మనిషి కాదు'' అని ఐరాసలో అమెరికా రాయబారి మైక్ వాల్ట్జ్ సభను ఉద్దేశించి అన్నారు. ''ఇరాన్‌లో నరమేధాన్ని ఆపేందుకు అన్ని ప్రత్యామ్నాయాలనూ పరిశీలిస్తాం అని ట్రంప్ ఈపాటికే స్పష్టం చేశారు'' అని పేర్కొన్నారు. ఈ సమావేశానికి పూర్వం ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇరాన్‌లో అమెరికా అక్రమ జోక్యాన్ని ఖండించాల్సిందిగా గుటెరస్‌కు అరాఘ్చీ విజ్ఞప్తి చేశారు.

నిరసనకారులకు మరణశిక్ష విధించాల్సిందే

- ఇరాన్‌లో ఓ మతపెద్ద డిమాండ్

దుబాయ్: ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు చేపట్టి అరెస్టయినవారికి మరణశిక్ష విధించాలని.. శుక్రవారం ప్రార్థనలకు నేతృత్వం వహించే అహ్మద్ ఖతామీ అనే ఓ మతపెద్ద డిమాండ్ చేశారు. నిరసనకారులను ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ సేవకులుగా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైనికులుగా ఆయన అభివర్ణించారు. వారిపై సర్కారు ఉక్కుపాదం మోపాలని పిలుపునిచ్చారు. ఇరాన్ నిపుణుల అసెంబ్లీ, గార్డియన్ కౌన్సిల్‌లలో ఖతామీ సభ్యుడు. దేశవ్యాప్తంగా ఇటీవల చెలరేగిన ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో 350 మసీదులు, 126 ప్రార్థనా మందిరాలు, 20 ఇతర పవిత్ర స్థలాలు, 400 ఆసుపత్రులు, 106 అంబులెన్సులు, 71 అగ్నిమాపక దళం వాహనాలు, 50 అత్యవసర సేవల వాహనాలు ధ్వంసమయ్యాయని ఆయన తెలిపారు.



ఉపాధి హామీ పథకం పేరు మార్పును నిరసిస్తూ శుక్రవారం అమృత్‌సర్‌లో ఆందోళన చేస్తున్న రైతులు

మధుమేహుల సంఖ్యలో భారత్‌ది రెండోస్థానం

దిల్లీ: 2024లో భారత్‌లో 9 కోట్ల మంది వయోజనులు మధుమేహంతో జీవించారని ఓ అధ్యయనం తేల్చింది. తద్వారా ఈ రుగ్మత బాధితులు ఎక్కువగా ఉంటున్న దేశాల్లో రెండో స్థానంలో ఉందని పేర్కొంది. 14.8 కోట్ల మందితో చైనా మొదటిస్థానంలో, 3.9 కోట్ల మందితో అమెరికా మూడోస్థానంలో ఉన్నాయని వివరించింది. ఈ అధ్యయనం వివరాలు 'ద లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రైనాలజీ' పత్రికలో ప్రచురితమయ్యాయి. అధిక జనాభా కలిగిన చైనా, భారత్, అమెరికా, పాకిస్థాన్ వంటి దేశాలు మధుమేహుల వాటాను ఎక్కువగా కలిగి ఉన్నాయని పరిశోధకులు తెలిపారు. ఈ విషయంలో 2050 నాటికి పాకిస్థాన్.. అమెరికాను దాటేయవచ్చని చెప్పారు. 215 దేశాలకు సంబంధించి 2005 నుంచి 2024 మధ్య జరిగిన 246 అధ్యయనాలను విశ్లేషించి, 2050 నాటి పరిస్థితిపై అంచనాలు వేశారు.

- 2024లో ప్రపంచవ్యాప్తంగా 20 నుంచి 79 ఏళ్ల మధ్య ఉన్నవారిలో 58.9 కోట్ల మంది మధుమేహం బారినపడ్డారు. ఇది ప్రపంచ జనాభాలో 11 శాతం. 2050 నాటికి ఇది 85.3 కోట్లకు చేరవచ్చు.
- 2024లో ప్రతి 9 మంది వయోజనుల్లో ఒకరు.. మధుమేహంతో జీవించారు.
- ప్రపంచవ్యాప్తంగా మధుమేహుల్లో 80 శాతం మంది పేద, మధ్యాదాయ దేశాల్లోనే ఉంటున్నారు. 2050 నాటికి ఈ దేశాల వాటా 95 శాతానికి పెరగొచ్చు.
- జనాభా పెరుగుదల, జనాభాలో పెరుగుతున్న వృద్ధుల సంఖ్య, పట్టణీకరణ వంటివి ఈ సమస్యకు దర్పణం పడుతున్నాయి.
- 75 నుంచి 79 ఏళ్ల మధ్య వయస్కుల్లో 25 శాతం మందిలో ఈ సమస్య ఉంది. మహిళలతో పోలిస్తే పురుషుల్లోనే మధుమేహులు ఎక్కువ. అలాగే గ్రామాలతో పోలిస్తే పట్టణాల్లోనే వీరి సంఖ్య అధికం.

నగదు అక్రమ చలామణిలో మెహుల్ ఛోక్సీ కుమారుడి క్రియాశీలక పాత్ర

- ఈడీ వెల్లడి

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.వేల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన వ్యాపారవేత్త, ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీ కేసుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు తాజాగా కీలక విషయం వెల్లడించారు. మనీలాండరింగ్ కేసులో మెహుల్ కుమారుడు రోహన్ ఛోక్సీకి కూడా సంబంధం ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు దిల్లీలోని అప్పిలేట్ ట్రైబ్యునల్‌కు వివరాలు వెల్లడించారు. మెహుల్ డైరెక్టర్‌గా ఉన్న లస్టర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలో రోహన్‌కు 99.99 శాతం వాటా ఉందని.. ఈ కంపెనీ నిధులను వారు విదేశాలకు మళ్లించడానికి ఉపయోగించుకున్నారని దర్యాప్తులో తేలినట్లు ఈడీ అధికారులు పేర్కొన్నారు. నగదు అక్రమ చలామణిలో రోహన్ క్రియాశీలకంగా పాల్గొన్నట్లు తగిన ఆధారాలు ఉన్నాయన్నారు. దీంతో అతడి ఆస్తులను జప్తు చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. రోహన్‌తో పాటు ఇతర కుటుంబసభ్యులనూ విచారించడానికి ఈడీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

మమతపై రూ.100 కోట్ల పరువునష్టం దావా

- సువేందు అధికారి ప్రకటన

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై రాష్ట్ర శాసనసభలో ప్రతిపక్షనేత సువేందు అధికారి రూ.100 కోట్ల పరువునష్టం దావావేశారు. తనకు బొగ్గు కుంభకోణంతో సంబంధం ఉందంటూ మమత చేసిన ఆరోపణకు స్పందనగా ఆయన ఈ చర్య తీసుకున్నారు. అలిపోర్ కోర్టులోని సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి కోర్టులో తాను ఈ వ్యాజ్యం దాఖలు చేసినట్టు ఆయన తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. ''మమతా బెనర్జీ గారూ, నేను నా విలువలకు కట్టుబడి ఉంటాను. మీరు ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తుంటారు. బొగ్గు కుంభకోణంతో నాకు సంబంధం ఉందంటూ మీరు నాపై ఊహాజనిత ఆరోపణలు చేశారు. దానిపై నేనిచ్చిన పరువునష్టం నోటీసుపై మీరు మౌనం వహించారు. ఈ మౌనం మిమ్మల్ని గట్టెక్కించలేదు'' అని సువేందు తన పోస్టులో వ్యాఖ్యానించారు. ''మీ మోసపూరిత చర్యకు ప్రతిగా మిమ్మల్ని కోర్టుకు ఈడుస్తానని మాట ఇచ్చాను. ఈరోజు ఆ మాట నిలబెట్టుకుంటూ మీపై కోర్టులో దావా వేశాను'' అని ఆయన తన పోస్టులో వెల్లడించారు.

నైట్రోజన్ ఉద్గారాలను మూడో వంతు తగ్గించాలి

దిల్లీ: 2030 నాటికి సంబంధించి ఐరాస నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి ఎజెండా లక్ష్యాలను అందుకోవాలంటే ప్రపంచవ్యాప్తంగా నైట్రోజన్ ఉద్గారాలను మూడో వంతు మేర తగ్గించాల్సి ఉంటుందని ఓ అధ్యయనం సూచించింది. చైనాలోని జెజియాంగ్ వర్సిటీ, ఆస్ట్రియాలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అప్లైడ్ సిస్టమ్స్ ఎనాలసిస్ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు.

ఆహార భద్రత, పర్యావరణ సుస్థిరతకు నైట్రోజన్ చాలా కీలకం. అయితే అధిక స్థాయిలో ఉత్పత్తి కావడం, సమర్థంగా వినియోగించకపోవడం వంటి కారణాల వల్ల నైట్రోజన్ కాలుష్యానికి కారణమవుతోంది. ఫలితంగా పర్యావరణ క్షీణత, ప్రజారోగ్య ముప్పులు, వాతావరణ మార్పులు తీవ్రం కావడం జరుగుతోంది. అందువల్ల నైట్రోజన్.. అటు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు ఉపకరణంగానూ, ఇటు ప్రతిబంధకంగానూ ఉంది. ఈ నేపథ్యంలో దీని నిర్వహణ కీలకంగా మారింది. ''సమతౌల్య లక్ష్యాలను అందుకోవాలంటే ప్రపంచవ్యాప్తంగా నైట్రోజన్ ఉద్గారాలను 2030 నాటికి మూడోవంతు మేర తగ్గించాలి. దీనివల్ల ఆర్థిక, పర్యావరణపరంగా 291 బిలియన్ డాలర్ల మేర ప్రయోజనం కలగొచ్చు'' అని అధ్యయనం వివరించింది.





'మెనింజియోమా' కణితి.. ప్రొఫెసర్ ఎస్.ఎస్.దండపాణి

రెండేళ్ల చిన్నారి మెదడులో కణితి.. ముక్కులోంచి వెలికితీత

ఈటీవీ భారత్: రెండేళ్ల చిన్నారి మెదడులో ఏర్పడిన 7 సెంటీమీటర్ల 'మెనింజియోమా' అనే అరుదైన కణితిని చండీగఢ్ వైద్యుల బృందం తొమ్మిది గంటల హైరిస్క్ శస్త్రచికిత్సతో విజయవంతంగా తొలగించింది. ఈ కణితి మెదడు చుట్టూ ఉండే పొరల నుంచి మొదలై క్రమంగా పెరిగి మెదడుపై ఒత్తిడి పెంచుతుంది. తీవ్రమైన తలనొప్పి, చూపు సమస్యలు, మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తాయి. రెండు వేలకు పైగా ఎండోస్కోపిక్ న్యూరోసర్జరీల అనుభవమున్న ప్రొఫెసర్ ఎస్.ఎస్.దండపాణి నేతృత్వంలో 'పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' (పీజీఐఎంఈఆర్) వైద్యుల బృందం ఈ శస్త్రచికిత్స చేసింది. ఓపెన్ బ్రెయిన్ సర్జరీ చేయకుండా ముక్కులోంచి ఎండోస్కోపిక్ పద్ధతిలో ఈ ట్యూమర్‌ను బయటకు తీయడం విశేషం. కణితి చిన్నారి మెదడులోని దిగువభాగంలో ఉండటంతో కంటి ఆర్బిట్, ముఖ ఎముకల వరకు విస్తరించింది. దీంతో మెదడుకు చేరుకోవడం చాలా క్లిష్టంగా మారింది. ఎముకలో అతి చిన్న, సురక్షిత మార్గాన్ని రూపొందించి ఆ దారి ద్వారా ట్యూమర్‌ను తొలగించారు. ఈ ఆపరేషను సమయంలో అధిక రక్తస్రావం, శరీర ఉష్ణోగ్రత అకస్మాత్తుగా పడిపోవడం వంటి ప్రమాదాలు ఎక్కువ. వైద్యబృందం అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆపరేషన్‌ను పూర్తి చేసింది. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ట్రక్కు ప్రమాదంలో బాలుడి మృతి..

- పట్టించుకోకుండా చేపలు ఎత్తుకెళ్లిన జనం

పట్నా: బిహార్‌లోని సీతామర్హి జిల్లాలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఓ పక్కన టక్కు ఢీకొని 13 ఏళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోతే.. మరో పక్క ఆ వాహనం నుంచి కింద పడిన చేపల కోసం స్థానికులు ఎగబడ్డారు. రోడ్డుపై రక్తపు మడుగులో పడున్న బాలుడి మృతదేహాన్ని పట్టించుకోకుండా. . చేపలను సంచుల్లో నింపుకొని ఎత్తుకెళ్లారు. పుప్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఝూజిహాట్ గ్రామం సమీపంలో ఈ దారుణ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న రితేష్ కుమార్ ఉదయం సైకిల్‌పై కోచింగ్ క్లాస్‌కు వెళ్తుండగా, వేగంగా వచ్చిన ట్రక్కు అతడిని ఢీకొట్టింది. దీంతో బాలుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనా స్థలానికి చేరుకున్న బాలుడి కుటుంబసభ్యులు మృతదేహం పక్కన గుండెలవిసేలా రోదిస్తుంటే.. మరోపక్క ట్రక్కు నుంచి పడిన చేపలను తీసుకువెళ్లడానికి రోడ్డుపై ప్రజలు ఎగబడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. ప్రజలను అక్కడి నుంచి చెదరగొట్టారు. అనంతరం బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారడంతో స్థానికుల తీరుపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మకర సంక్రాంతి సందర్భంగా గురువారం దిల్లీలోని తన నివాసంలో ఆవు దూడలకు గడ్డి తినిపిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

విపత్తు సహాయ చర్యల కోసం 14 ఆర్ఏఎఫ్ దళాలు సన్నద్ధం

దిల్లీ: అల్లర్లను అణచివేసే ప్రత్యేక దళం.. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్)లో 14 బృందాలను విపత్తు సహాయ చర్యల కోసం ప్రత్యేకించినట్లు అధికారులు తెలిపారు. కేంద్ర హోంశాఖ, జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎంఏ) ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈ 14 బృందాల్లో 340 మంది సిబ్బంది ఉంటారు. వీరిని ఆర్ఏఎఫ్‌కు చెందిన ఏడు బెటాలియన్ల నుంచి సమీకరించారు. ఎలాంటి విపత్తుల్లోనైనా సహాయ చర్యలు చేపట్టేందుకు వీరు సిద్ధంగా ఉంటారు. ఈ దళాలు ఎన్‌డీఎంఏ, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) నుంచి శిక్షణ పొందాయి. రసాయన, జీవ, రేడియోధార్మిక, అణు దాడులను ఎదుర్కొనే సాధన సంపత్తి కూడా వీరి వద్ద ఉంటుంది.

'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' చిత్ర నిర్మాణంలో మా ప్రమేయం లేదు: విదేశీ వ్యవహారాల శాఖ

దిల్లీ: భారత దేశంలో చిత్ర నిర్మాణ వ్యవహారాలను సంబంధిత విభాగాలే పరిశీలిస్తాయని, తమ శాఖ ప్రమేయం ఉండదని భారత విదేశీ వ్యవహారాల శాఖ (ఎంఈఏ) పేర్కొంది. భారత-చైనా సైనిక దళాల ఘర్షణ (2020)ఇతివృత్తంతో తీసిన 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జయసవాల్ ఈ విషయం తెలిపారు. చైనా మీడియా సంస్థల్లో ఈ సినిమాపై విమర్శలు రాగా కళాత్మకమైన భావ వ్యక్తీకరణతో ఉండే సినిమాలపై భారత దేశం నియంత్రణ విధించదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు డిసెంబరు 30న స్పందించాయి.

గోవాలో ఇద్దరు రష్యన్ మహిళల హత్య

- హంతకుడు స్వజాతీయుడే

పణజి: ఇద్దరు రష్యన్ మహిళలను వారి దేశానికే చెందిన మరో వ్యక్తి హత్యచేసిన సంఘటన ఉత్తర గోవా ప్రాంతంలో జరిగింది. అలెక్సీ లియోనొవ్ అనే రష్యన్ జాతీయుడు తన స్నేహితురాలైన ఎలీనా వనీవా (37) అనే మహిళను మోర్జిం గ్రామంలో ఈనెల 14న గొంతుకోసి హత్య చేశాడని మాండ్రెమ్ పోలీసు స్టేషన్‌కు చెందిన అధికారి ఒకరు శుక్రవారం తెలిపారు. ఈ సంఘటన వనీవా గదిలో రాత్రి 11 గంటల ప్రాంతంలో జరిగిందని ఆమెకు గది అద్దెకు ఇచ్చిన వ్యక్తి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుడు మరుసటిరోజు అక్కడికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆరాంబోల్ గ్రామానికి వెళ్లి తన మరో స్నేహితురాలైన ఎలీనా కాస్థనోవా (37)ను గొంతుకు తాడు బిగించి హతమార్చాడని పోలీసులు తెలిపారు. రెండు మృతదేహాలనూ శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హత్యలపై విచారణ కొనసాగుతోంది.

242 బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వెబ్‌సైట్లపై కేంద్రం కొరడా

దిల్లీ: అక్రమ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వేదికలుగా నిలుస్తున్న 242 వెబ్‌సైట్లపై కేంద్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. వాటి లింకులను శుక్రవారం బ్లాక్ చేసింది. వీటితో కలిపితే ఇప్పటివరకూ మొత్తం 7,800కుపైగా అక్రమ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వెబ్‌సైట్లను తొలగించినట్లయిందని అధికార వర్గాలు వెల్లడించాయి. రియల్ మనీ గేమింగ్ యాప్‌లపై కేంద్రం నిరుడు ఆగస్టులో నిషేధం విధించిన సంగతి గమనార్హం.

(c) eenadu

సైనికులకు దేశం రుణపడి ఉంది : సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: సైన్యం చూపుతున్న ధైర్యం, త్యాగం, కర్తవ్య నిష్ఠ, అచంచల నిబద్ధతకు దేశం ఎప్పటికీ వారికి రుణపడి ఉంటుందని చంద్రబాబు కొనియాడారు. 'ఆర్మీ డే' సందర్భంగా గురువారం సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు 'ఎక్స్'లో శుభాకాంక్షలు తెలిపారు. సంక్షోభ సమయంలో సైన్యం అందిస్తున్న సేవలు అమోఘమని కీర్తించారు.

అంకుర పరిశ్రమలకు ఏపీ అనుకూలం

ఈనాడు, అమరావతి: అంకుర పరిశ్రమలు (స్టార్టప్) ఏర్పాటు చేయడానికి, వాటి ఎదుగుదలకు, విస్తరణకు రాష్ట్రం అనుకూలమని సీఎం చంద్రబాబు తెలిపారు. వీటిని ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జాతీయ స్టార్టప్ దినోత్సవం సందర్భంగా స్టార్టప్ వ్యవస్థాపకులు, ఉద్యోగులు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, భవిష్యత్తు స్థాపకులకు 'ఎక్స్' వేదికగా శుక్రవారం ఆయన శుభాకాంక్షలు తెలిపారు. 'మీ ధైర్యం, దృఢ సంకల్పం కొత్త అవకాశాలు సృష్టిస్తూ. . ఉపాధి కల్పిస్తూ దేశవృద్ధిని బలోపేతం చేస్తుంది. మేం మీతో ఉన్నాం" అని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

ఇది కేరళ కాదు.. ఆత్రేయపురం

పడవ పోటీలనుద్దేశించి లోకేశ్ వ్యాఖ్య

ఈనాడు, అమరావతి: ఆత్రేయపురంలో నిర్వహించిన పడవ పోటీలను ఉద్దేశించి 'ఇది కేరళ కాదు.. ఆంధ్రప్రదేశ్‌లోని ఆత్రేయపురం' అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ, పడవ పోటీల వీడియోల్ని లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'ఏపీలో పండుగ వీక్స్' అని పేర్కొన్నారు.

ఏఐ కెమెరాలతో ఆహారంలో పోషక విలువల గణన

ట్రిపుల్ఐటీ హైదరాబాద్ పరిశోధకుల అధ్యయనం

ఈనాడు, హైదరాబాద్: మనం రోజూ ఆహారంగా తీసుకుంటున్న అన్నం, పప్పు, చారు, సాంబార్ లేదా బిర్యానీలో ఉన్న పోషక విలువల లెక్కలపై సెంటర్ ఫర్ విజువల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రొఫెసర్ సీవీ జవహర్ నేతృత్వంలో ట్రిపుల్ఐటీ హైదరాబాద్ పరిశోధకులు అధ్యయనం చేపట్టారు. కృత్రిమ మేధతో కూడిన కెమెరాల సాయంతో జొన్న రొట్టె, చపాతీ, అన్నం, పులిహోర, పప్పు, రసం, సాంబార్‌లలో ఎన్ని పోషకాలున్నాయో తెలుసుకున్నారు. 'ఇండియన్ థాలీ'పై ప్రొఫెసర్ జవహర్ మార్గదర్శకత్వంలో యష్ ఆరోరా, ఆదిత్య అరుణ్‌లు జాతీయ కంప్యూటర్ విజన్ సదస్సులో ఇటీవల పరిశోధన పత్రాన్ని సమర్పించారు. చికెన్, మటన్ బిర్యానీల్లోని పోషకాలను ఏఐ సాంకేతికత ఉన్న కెమెరాలు స్కాన్ చేసేప్పుడు సులభంగా పోషకాల లెక్కలను తీశాయి. బిర్యానీల్లో పోషకాలను లెక్కించేటప్పుడు కృత్రిమ మేధ కెమెరాల సాఫ్ట్‌వేర్‌కు వండే పద్ధతులు, పోషకాల వివరాలను పరిశోధకులు నమోదు చేశారు. అన్నం, పప్పు, సాంబార్‌లను స్కాన్ చేసేటప్పుడు కెమెరాలు తొలుత ఇబ్బంది పడ్డాయి. అన్నం, పప్పు గ్రాముల్లోనూ, చారు, సాంబార్ మిల్లీలీటర్లలో ఉండడం ఇందుకు కారణం. ఆ తర్వాత ఆమేరకు పరిశోధకులు మార్పులు చేసి... పోషక విలువలను గుర్తించారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మనం తింటున్న ఆహారంలో ఎలాంటి పోషకాలున్నాయో తెలుసుకోవాలన్న లక్ష్యంతో పరిశోధన ప్రారంభించినట్లు ప్రొఫెసర్ సీవీ జవహర్ తెలిపారు. మనం రోజూ ఒకేవిధమైన ఆహారం తీసుకోమని, దీన్ని పరిగణనలోకి తీసుకుని పోషకాలను విశ్లేషిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే ఏడాదికి యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

సాల్మన్ హత్య ఘటనపై ఏం సమాధానం చెబుతారు

'ఎక్స్'లో సీఎంను ప్రశ్నించిన జగన్

ఈనాడు, అమరావతి: 'పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామానికి చెందిన వైకాపా కార్యకర్త మందా సాల్మన్ హత్య ఘటనపై ఏం సమాధానం చెబుతారు' అని ముఖ్యమంత్రి చంద్రబాబును మాజీ సీఎం జగన్ శుక్రవారం 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. 'వైకాపాను కట్టడి చేయడానికి మీరు.. మీ పార్టీ వారితో, కొంత మంది పోలీసులతో చేయిస్తున్న రాజకీయ హింసాత్మక దాడుల పరంపరలో భాగమే ఈ ఘటన' అని ఆరోపణలు చేశారు. 'అనారోగ్యంతో ఉన్న తన భార్యను చూడటానికి సాల్మన్ సొంత గ్రామానికి వెళ్తే రాడ్లతో కొట్టి హత్య చేస్తారా? ఇలాంటి దారుణాలు చేయడానికా మీరు అధికారంలోకొచ్చింది?' అని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలకు మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనంతరం సాల్మన్ సోదరుడితో జగన్ ఫోన్‌లో మాట్లాడారు. 'సాల్మన్‌ను తెదేపా నాయకులు అన్యాయంగా పొట్టనపెట్టుకున్నారు. వైకాపా అధికారంలోకి రాగానే దోషులను శిక్షించేలా చర్యలు తీసుకుందాం' అని చెప్పారు.

నలుగురు విద్యార్థుల గల్లంతుపై జగన్ విచారం

ఈనాడు, అమరావతి: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఇసుకపల్లి బీచ్‌లో కనుమ పండగ రోజు సరదాగా గడిపేందుకు వెళ్లిన నలుగురు విద్యార్థులు గల్లంతవడం విచారకరమని మాజీ ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. గల్లంతైనవారిలో ఇద్దరి మృతదేహాలు లభ్యం కాగా, మరో ఇద్దరి ఆచూకీ తెలియాల్సి ఉంది. మృతుల కుటుంబాలకు జగన్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



అనారోగ్యానికి కారణం దురదృష్టం కాదు

గుండె జబ్బులు వస్తే, దాన్ని దురదృష్టం కింద జమకట్టొద్దు. మధుమేహానికి జన్యువులు కారణమని భావించొద్దు. అధిక రక్తపోటుకు దారితీసేది ఒత్తిడి మాత్రమేనని పొరపడొద్దు. ఏళ్ల తరబడి మీరు కొనసాగించిన అనారోగ్యకర జీవనశైలే ఈ ముప్పులకు కారణమని తెలుసుకోండి. అయితే ఈ పరిస్థితి నుంచి నెమ్మదిగా బయటపడటానికి ఓ మార్గం ఉంది. అదేంటంటే.. అనారోగ్యకర అలవాట్లను వదిలేసి, క్రమబద్ధమైన జీవితాన్ని అలవర్చుకోవడమే.

– శైలేష్ సింగ్, కార్డియాలజిస్ట్

వ్యవసాయ కనెక్షన్లకు ప్రత్యేక డిస్కం

- ఏపీఆర్ఏపీఎల్ పేరిట ఏర్పాటు
- సెకి విద్యుత్‌పై ఐఎస్‌టీఎస్ మినహాయింపునకు ప్రత్యామ్నాయం!
- అదనపు భారం పడకుండా అధికారుల ప్రణాళికలు

ఈనాడు, అమరావతి: సెకి (సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) నుంచి తీసుకోవాల్సిన 7 వేల మెగావాట్ల విద్యుత్‌కు అంతర్రాష్ట్ర విద్యుత్ సరఫరా ఛార్జీల (ఐఎస్‌టీఎస్) మినహాయింపు కోసం ఇంధన శాఖ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఒప్పందం అమలుకు ఐఎస్‌టీఎస్ ఛార్జీల మినహాయింపు ప్రతిబంధకంగా మారిన నేపథ్యంలో.. సెకి సూచనలతో రాష్ట్ర గ్రామీణ వ్యవసాయ విద్యుత్ లిమిటెడ్ (ఏపీఆర్ఏపీఎల్) పేరిట కొత్త డిస్కంను ఏర్పాటు చేస్తోంది. ఈ ఏడాదిలోనే విద్యుత్ తీసుకునేలా సెకితో జరిపిన సంప్రదింపులు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. ఒప్పందం అమలులో ఉండే 25 ఏళ్లలో ఐఎస్‌టీఎస్ ఛార్జీల రూపేణా రూ.1.10 లక్షల కోట్ల అదనపు భారం పడుతుందని ఇంధన శాఖ లెక్కలు తేల్చింది. ఈ దృష్ట్యా ఒప్పందంపై ముందుకెళ్లడం సాధ్యం కాలేదు. సెకి నుంచి తీసుకునే యూనిట్ విద్యుత్‌కు రూ.2.49 చొప్పున (సెకి ట్రేడ్ మార్జిన్‌తో కలిపి) డిస్కంలు చెల్లించాలి. గత ఏడాదిగా ఉన్న ఒప్పందం ప్రకారం విద్యుత్ సరఫరా చేస్తామంటూ సెకి పదేపదే ఇంధన శాఖకు లేఖలు రాస్తోంది.

వ్యవసాయానికి పగటి వేళ సౌర విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సెకి నుంచి తీసుకునే విద్యుత్‌ను వినియోగించనుంది. ఆ విద్యుత్‌ను 'పునరుత్పాదక విద్యుత్.. జనరల్ నెట్‌వర్క్ యాక్సెస్' (ఆర్ఈ జీఎన్ఏ) కింద కేంద్రం పరిగణిస్తుంది. ఆ విద్యుత్‌కు డిస్కంల మాదిరే ఐఎస్‌టీఎస్ ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇందుకోసం ఏపీఆర్ఏపీఎల్ పేరుతో ప్రత్యేక డిస్కం ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. త్వరలోనే ఇప్పుడున్న మూడు డిస్కంల పరిధిలోని సుమారు 26 లక్షల వ్యవసాయ కనెక్షన్లను ఈ ప్రత్యేక డిస్కంకు ఇంధన శాఖ బదిలీ చేయనుంది. వాటికి రోజుకు సుమారు 4,500 మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుంది. దీంతోపాటు వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చేందుకు చేసే ఖర్చులు, మౌలిక సదుపాయాల కోసం తీసుకున్న రుణాలను కొత్తగా ఏర్పాటుచేసే డిస్కంకు బదిలీ ప్రక్రియను అధికారులు చేపట్టారు.

కొత్త డిస్కం ఎందుకంటే..

వ్యవసాయ విద్యుత్‌కు ప్రత్యేక డిస్కం లేకుంటే.. సెకి నుంచి తీసుకునే విద్యుత్‌కు ఐఎస్‌టీఎస్ ఛార్జీలు చెల్లించాల్సి వస్తుంది. ఆ మొత్తం యూనిట్‌కు సుమారు రూ.1.90 వరకు ఉంటుందని అంచనా. ఒప్పందం ప్రకారం యూనిట్‌కు చెల్లించాల్సిన రూ.2.49కి తోడు ఐఎస్‌టీఎస్ ఛార్జీలు కలిపితే.. యూనిట్ విద్యుత్‌కు రూ.4.39 చొప్పున డిస్కంలు చెల్లించాల్సి వస్తుంది. బహిరంగ మార్కెట్‌లో సౌర విద్యుత్ యూనిట్ రూ.2.50కే దొరుకుతుంది. దీనివల్ల డిస్కంలపై అదనపు భారం పడుతుంది. ఆ మేరకు ట్రూఅప్ రూపంలో ప్రజలు భారాన్ని మోయకతప్పదు. దీన్ని పరిహరించడానికే ఐఎస్‌టీఎస్ మినహాయింపుపై స్పష్టత ఇవ్వాలని సెకి సంస్థకు ఇంధన శాఖ పలుమార్లు లేఖలు రాసింది.

ఆర్ఈ జీఎన్ఏ అనుమతించినా.. ఇంకా భారమే?

సెకి విద్యుత్‌కు ఆర్ఈ జీఎన్ఏ వర్తింపజేసినా.. యూనిట్‌పై ఇంకా 19 పైసలు అదనపు భారం పడొచ్చని అంచనా. ఒప్పందం ప్రకారం సెకి ఏటా సుమారు 23 వేల మిలియన్ యూనిట్ల మేర సరఫరా చేయనుంది. ఈ ప్రకారం ఆర్ఈ జీఎన్ఏ కింద సరఫరా ఛార్జీల మినహాయింపు వర్తించినా.. ఏటా రూ.437 కోట్ల అదనపు భారం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. అంటే, ఒప్పందం అమల్లో ఉండే 25 ఏళ్లలో రూ.10,925 కోట్ల అదనపు భారాన్ని విద్యుత్ సంస్థలు పరోక్షంగా భరించాలి. ఈ దృష్ట్యా ఒప్పందం ప్రకారం యూనిట్‌కు రూ.2.49 చొప్పున మాత్రమే చెల్లిస్తామని. . అంతకుమించి పడే భారాన్ని సెకి భరించాలంటూ అధికారులు లేఖ రాసినట్లు తెలిసింది.

వైదొలిగినా.. భారమే!

సెకి ఒప్పందం నుంచి వైదొలగాలని భావిస్తే.. ఒక్క యూనిట్ విద్యుత్ తీసుకోకున్నా రూ.3 వేల కోట్లు సంస్థకు చెల్లించాల్సి వస్తుంది. ఒప్పందంలోని నిబంధన ప్రకారం సంస్థ 6 నెలల్లో సరఫరా చేసే విద్యుత్‌పై యూనిట్‌కు రూ.2.49 చొప్పున లెక్కగట్టి మరీ డిస్కంలు చెల్లించాల్సి వస్తుంది. అందుకే.. ఐఎస్‌టీఎస్ భారం పడకుండా అధికారులు సెకితో సంప్రదింపులు జరుపుతున్నారు. సెకితో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 2024 సెప్టెంబరులో మొదటి విడత 3 వేల మెగావాట్లు, 2025 సెప్టెంబరులో రెండో విడత 3 వేల మెగావాట్లు, 2026 సెప్టెంబరులో మిగిలిన వెయ్యి మెగావాట్లు తీసుకునేలా గత వైకాపా ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. సెకి కుదుర్చుకున్న విద్యుత్ విక్రయ ఒప్పందం (పీఎస్ఏ) 25 ఏళ్ల పాటు అమలులో ఉంటుంది. ప్లాంట్ల నిర్మాణం ఆలస్యం కావడంతో ఒప్పందం అమలులో జాప్యం జరిగింది. ప్రస్తుతం సుమారు 2,500 మెగావాట్ల విద్యుత్ ఇచ్చేందుకు సెకి ప్రతిపాదిస్తున్నట్లు తెలిసింది.

పరమానందభరితం.. రామయ్య విశ్వరూప దర్శనం



భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కొనసాగిన విశ్వరూప సేవ భక్తులను పరమానందభరితులను చేసింది. వైకుంఠ ఏకాదశికి పదిహేను రోజుల తర్వాత వచ్చిన బహుళ ద్వాదశి సందర్భంగా దేవస్థానంలో ఈ క్రతువు నిర్వహించారు. రామయ్యతోపాటు అనుబంధ కోవెలల్లో మూర్తులు నిత్య కల్యాణ మండపం వద్దకు వేంచేసి పూజలు అందుకున్నారు. వేద మంత్రోచ్చారణ మధ్య స్వర్ణ పుష్పాలతో నామార్చన చేశారు. ముక్కోటి ఏకాదశి తరహాలో దేవతలంతా ఒకేచోట కనిపించడంతో ఈ వేడుకను కనులారా వీక్షించేందుకు భక్తులు తరలివచ్చారు.

75 రోజుల ఎఫ్ఎల్ఎన్ ప్రణాళికపై మార్గదర్శకాల జారీ

ఈనాడు, అమరావతి: ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) 75 రోజుల కార్యాచరణ ప్రణాళికలో 22 కీలక పనితీరు సూచికల సాధన తప్పనిసరి చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ ఎన్‌పీయూఎన్-భారత్ మిషన్ నిర్దేశించిన లక్ష్యాల సాధన కోసం ఈ కార్యాచరణ విడుదల చేసినట్లు తెలిపింది. ''పాఠ్య ప్రణాళికలు ఆట, కార్యాచరణ ఆధారిత అభ్యాసంగా తీర్చిదిద్దాలి. వీటి అమలుకు టీఎల్ఎం, వర్క్‌బుక్‌లు వినియోగించాలి. గ్రంథాలయ పుస్తక పఠనకు ప్రాధాన్యం ఇవ్వాలి. అన్ని పాఠశాలలు 45 రోజులు విద్యా ప్రవేశ్ పాఠశాల సంసిద్ధత మాడ్యూల్‌ను కచ్చితంగా అమలు చేయాలి. 1, 2 తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులకు 60 రోజుల ఎఫ్ఎల్ఎన్ సర్టిఫికేట్ కోర్సు బోధన, అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల ఈసీసీఈ కోర్సు పూర్తి చేయించాలి'' అని మార్గదర్శకాల్లో విద్యాశాఖ పేర్కొంది.

- 75 రోజుల కార్యాచరణ అమలులో భాగంగా విద్యార్థులకు సంబంధిత వర్క్ బుక్‌లు సరఫరా చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ కోరారు. దీనికి సంబంధించిన టీఎల్ఎం కిట్ ప్రత్యేకంగా సరఫరా చేయాలని శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

సిలబస్‌లో నాణ్యత.. పిల్లల్లో నైపుణ్యం

- 1-8 తరగతుల పాఠ్య పుస్తకాల్లో సమగ్ర మార్పులు
- 2026-27 విద్యా సంవత్సరం నుంచే అమలు
- ఎన్సీఈఆర్టీకి సమానంగా రూపొందిస్తున్న ఎస్సీఈఆర్టీ

ఈనాడు, అమరావతి: జాతీయ విద్యా విధానం, రాష్ట్ర ప్రాధాన్యాలకు అనుగుణంగా 1-8 తరగతుల సిలబస్ మార్పునకు రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) చర్యలు చేపట్టింది. వచ్చే విద్యా సంవత్సరంలో పాఠ్యపుస్తకాలను సమగ్రంగా సవరిస్తోంది. నైపుణ్యాధారిత, అనుభవాత్మక అభ్యాసానికి పెద్దపీట వేస్తోంది. జాతీయ విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎన్సీఈఆర్టీ) భావనలకు సమానంగా ఉండేలా వీటిని మార్పు చేస్తోంది. పునరావృతం, అవసరం లేని, కాలం చెల్లిన, సాంస్కృతికంగా అనర్హమైన అంశాలను తొలగిస్తున్నారు. నిర్దేశిత పేజీ పరిమితులను పాటిస్తూ ముఖ్యంగా 6-8 తరగతుల్లో విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా సిలబస్ రూపొందిస్తున్నారు. తరగతులకు సంసిద్ధత పాఠాలను మిళితం చేస్తున్నారు. పాత తరగతి నుంచి కొత్త తరగతికి పిల్లలు అలవాటు పడేందుకు 1, 2 తరగతులకు 36 రోజులు, 3-8 తరగతులకు 13 రోజుల పాటు సంసిద్ధత బోధనకు అవకాశం ఇవ్వనున్నారు. పిల్లలు బట్టీ విధానానికి స్వస్తి పలకడంతో పాటు సొంతగా ఆలోచించేలా కొత్త సిలబస్ ఉండనుంది. ఎన్సీఈఆర్టీ సిలబస్‌కు అనుగుణంగా ఉన్నత తరగతుల్లో పాఠ్యపుస్తకాలు తీసుకొస్తున్నారు.

ప్రాథమిక తరగతులపై ప్రత్యేక దృష్టి

1-5 తరగతులపై ప్రత్యేక దృష్టి సారించారు. కింది స్థాయిలో పునాది అభ్యాసం సరిగ్గా లేకపోతే, పైతరగతుల్లో పిల్లలు వెనుకబడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అక్షరాల ఉచ్చారణ, చక్కగా చదవడం, మాట్లాడే నైపుణ్యం, సంఖ్యలు అర్థం చేసుకోవడానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు.

- తెలుగు, ఆంగ్లం, గణితంలో క్రమబద్ధమైన పురోగతి ఉండేలా పాఠ్యాంశాలు రూపొందిస్తున్నారు.
- ఆటలు, ప్రాజెక్టు ఆధారిత, అన్వేషణాత్మక అభ్యాసానికి చోటు కల్పించారు.
- బట్టీపట్టి జ్ఞాపకం ఉంచుకునే విధానానికి భిన్నంగా అర్థవంతమైన తరగతి గది బోధన, టీచర్ మార్గదర్శకత్వంలో పిల్లలు ఉత్సాహంగా నేర్చుకునేలా సిలబస్‌ను తీసుకొస్తున్నారు.

సామర్థ్య ఆధారిత మూల్యాంకనం

బహుళైచ్ఛిక, సామర్థ్య ఆధారిత ప్రశ్నలు, నిజజీవిత కార్యాచరణలు, పజిల్స్, కేస్ స్టడీలు, విశ్లేషణాత్మక ప్రశ్నలను తీసుకొస్తున్నారు.

- ప్రతి అధ్యాయం, యూనిట్ స్థాయిలో అభ్యాస ఫలితాలను స్పష్టంగా పేర్కొంటారు.
- పాఠ్య పుస్తకాల చివర పాఠ్య లక్ష్యాలను చేర్చనున్నారు.
- అన్ని విషయాల్లో వయసుకు తగిన సరళ భాషను వినియోగిస్తున్నారు. ప్రాథమిక తరగతుల్లో భాషాభివృద్ధి క్రమంగా పెంచుతారు.

రాష్ట్ర అంశాలకు పెద్దపీట

- సాంఘికశాస్త్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక సంస్కృతి, భౌగోళిక పరిస్థితులు, చరిత్ర, జీవనోపాధులు, పాలన, నిర్వహణ అంశాలను పాఠ్యాంశాల్లో చేరుస్తారు.
- సాంఘికశాస్త్రం, ఈవీఎస్, సామాన్యశాస్త్రం పాఠ్య పుస్తకాల్లో స్థానిక అంశాలు, ఉదాహరణలు జోడిస్తున్నారు.
- రాజకీయ ప్రచారం లేకుండా, లింగ సమానత్వం పాటించేలా, పాఠశాలలు రాజకీయాలకు దూరంగా ఉండేలా, పిల్లల్లో సమానత్వ భావన పెంచేలా పాఠ్యాంశాలు రూపొందిస్తున్నారు.
- పాత చిత్రాల స్థానంలో నాణ్యమైన, సందర్భోచిత చిత్రాలు వినియోగిస్తున్నారు.

వనం.. భక్తజన సంద్రం

తాడ్వాయి, న్యూస్‌టుడే: తెలంగాణలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం భక్తజనంతో కిక్కిరిసింది. వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకొనేందుకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. సంక్రాంతిని పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశాలోని పలు ప్రాంతాల నుంచి లక్షల మంది తరలివచ్చారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ రద్దీని పర్యవేక్షించారు. గద్దెల ప్రాంగణం నిండిపోవటంతో గ్రిల్స్ మూసివేయించారు. భక్తులు గద్దెలపైకి కాకుండా ప్రాంగణం నుంచే అమ్మవార్లను దర్శించుకునేలా కట్టుదిట్టం చేశారు. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత రద్దీ కొద్దిగా తగ్గుముఖం పట్టడంతో భక్తులను తిరిగి గద్దెలపైకి అనుమతించారు. హనుమకొండ, భూపాలపల్లి, కాటారం వైపుల నుంచి ప్రైవేటు వాహనాలు భారీగా తరలిరావడంతో వన్‌వే విధానం అమలు చేశారు. శుక్రవారం సుమారు ఆరు లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అంచనా.

గద్దెల ప్రాంగణంలో భక్తుల సందోహం



ఉద్యోగం నుంచి తొలగించిన వ్యక్తికి ఆర్థిక ప్రయోజనాలు చెల్లించాల్సిందే

- టీజీఎస్ఆర్టీసీ కేసులో హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు

ఈనాడు, దిల్లీ: పనిష్మెంట్ కింద ఉద్యోగం నుంచి తొలగించిన వ్యక్తికి అప్పటివరకూ చట్టబద్ధంగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలన్నీ వడ్డీతో సహా చెల్లించాల్సిందేనని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. పనిష్మెంట్ కింద ఉద్యోగం కోల్పోయిన కొందరు వ్యక్తులు తమకు అప్పటివరకూ రావాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ప్రయోజనం కల్పించాలని 2019లో హైకోర్టును ఆశ్రయించగా ఉన్నత న్యాయస్థానం 2025 ఫిబ్రవరిలో వారికి అనుకూలంగా తీర్పునిచ్చింది. తనకు చెల్లించాల్సిన ప్రయోజనాలు యజమాని కారణంగా ఆలస్యమైతే 6% వడ్డీతో వాటిని పొందే హక్కు సదరు ఉద్యోగికి ఉంటుందని హైకోర్టు పేర్కొంది. ప్రత్యేకంగా ఏదైనా నిషేధం ఉంటే తప్పితే.. మిగిలిన సమయాల్లో ఆర్థిక ప్రయోజనాలన్నీ ఇవ్వాల్సిందేనంది. ఆ తీర్పును సవాల్ చేస్తూ టీజీఎస్ఆర్టీసీ దాఖలు చేసిన అప్పీల్‌ను శుక్రవారం జస్టిస్ దీపాంకర్‌దత్త, జస్టిస్ సతీష్‌చంద్రశర్మల ధర్మాసనం కొట్టేసింది. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేనందున పిటిషన్లను డిస్మిస్ చేస్తున్నామంది.

జలజీవన్ కార్పొరేషన్ రూ.5,000 కోట్ల రుణానికి ప్రభుత్వం గ్యారంటీ

ఉత్తర్వులు విడుదల

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ జలజీవన్ నీటి సరఫరా కార్పొరేషన్ రూ.5,000 కోట్ల రుణం తీసుకునేందుకు ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చింది. ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఆ సంస్థ నేషనల్ బ్యాంకు ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ (నాబ్‌ఫిడ్) నుంచి ఈ రుణం స్వీకరించవచ్చు. రాష్ట్రంలో జలజీవన్ మిషన్ కింద రక్షిత మంచినీటి పథకాల నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వం తాజాగా రుణం కోసం ఇచ్చిన అనుమతి వల్ల ఈ కార్పొరేషన్ రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు వనరులు సమీకరించుకునేలా పరిమితి పెరుగుతుంది. ఈ పథకాల నిర్మాణ సమయంలో చెల్లించాల్సిన వడ్డీ మొత్తాన్ని ఆ సంస్థ సమీకరించుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఈ పనులకు రూ.2,962 కోట్లు చెల్లిస్తుంది. ఒక వేళ ఆ సంస్థ రుణాలు చెల్లించలేని సందర్భంలో మాత్రమే ప్రభుత్వ గ్యారంటీ వర్తిస్తుంది. ఈ రుణం తీర్చేందుకు అవసరమైన వనరులను కూడా ఆ సంస్థ సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు త్వరితగతిన 34% రిజర్వేషన్లు కల్పించాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌ఛార్జి నూకానమ్మ

ఈనాడు, అమరావతి: నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలు త్వరితగతిన చట్టరూపం దాల్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌ఛార్జి నూకానమ్మ కోరారు. ఇప్పటికే సంబంధిత దస్త్రానికి న్యాయశాఖ ఆమోదంతోపాటు అడ్వకేట్ జనరల్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయమని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైకాపా ప్రభుత్వం స్థానిక సంస్థలతో నామినేటెడ్ పోస్టులకు ముడిపెట్టి బీసీలకు చట్టప్రకారం పదవులు దక్కకుండా అన్యాయం చేసిందన్నారు. దీన్ని సరిదిద్దుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చట్టపరంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం కల్పించాలన్నారు. ఇప్పటికే సాధారణ ఎన్నికలు, రాజ్యసభ సభ్యుల ఎంపికలోనూ కూటమి పార్టీలు బీసీలకే సింహభాగం కేటాయించి వెన్నుదన్నుగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు.

మహారాష్ట్ర ప్రజలది శక్తిమంతమైన తీర్పు

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, అమరావతి: ముంబయి, పుణె కార్పొరేషన్ ఎన్నికల్లో మహారాష్ట్ర ప్రజలు స్పష్టమైన, శక్తిమంతమైన తీర్పు ఇచ్చారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. భాజపా కూటమి పాలనను మహారాష్ట్ర ప్రజలు స్వాగతించినందునే.. స్పష్టమైన విజయం అందించారని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో తాను పాల్గొన్న విషయాన్ని గుర్తుచేస్తూ, ఆదరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

మహారాష్ట్ర స్థానిక ఎన్నికల్లో భాజపా విజయం ప్రజల విశ్వాసానికి నిదర్శనం: ఏపీ భాజపా

ఈనాడు, అమరావతి: మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో భాజపా విజయం ప్రజాస్వామ్యంలో ప్రజల విశ్వాసానికి నిదర్శనమని ఆ పార్టీ ఏపీ మీడియా ఇన్‌ఛార్జ్ కిలారు దిలీప్ పేర్కొన్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో భాజపాకు దక్కిన స్పష్టమైన మెజార్టీ పారదర్శక పాలనకు ప్రజలు ఇచ్చిన మద్దతు అని శుక్రవారం ఒక ప్రకటనలో చెప్పారు. "విపక్ష పార్టీలు తప్పుడు ప్రచారాలు, ఆరోపణలు చేసినా.. మహారాష్ట్ర ప్రజలు స్థిరమైన పాలనను, అభివృద్ధిని ఎంచుకున్నారు. ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి, సుపరిపాలనకు భాజపా నిరంతరం పనిచేస్తుంది" అని తెలిపారు.

పుస్తక నిలయం.. దివ్యాంగులకూ సౌకర్యం



తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ప్రత్యేక గ్రంథాలయం నిర్మిస్తున్నారు. 50వేల పుస్తకాలతో పాటు డిజిటల్ ఫార్మాట్‌లో మూడు లక్షల పుస్తకాలు అందుబాటులో ఉండనున్నాయి. మొదటి అంతస్తు నుంచి రెండో అంతస్తుకి చక్రాల కుర్చీలో దివ్యాంగులు వెళ్లేలా ప్రత్యేక ర్యాంపులు ఏర్పాటు చేశారు. 'నాలెడ్జ్ రిసోర్స్ సెంటర్' పేరిట దేశంలోని ఐఐటీల్లోకెల్లా పెద్ద గ్రంథాలయం నిర్మిస్తున్నామని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు. త్వరలోనే ప్రారంభిస్తామని, 24 గంటలూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

–ఈనాడు, సంగారెడ్డి

27 ఏళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు..



పెద్దతండాలో తల్లిదండ్రులు రూప్‌సింగ్, దేవీబాయిలతో రవీందర్

రేగోడ్, న్యూస్‌టుడే: జాతరలో తప్పిపోయిన బాలుడు 27 ఏళ్ల అనంతరం తల్లిదండ్రుల చెంతకు చేరిన ఘటన శుక్రవారం తెలంగాణలోని మెదక్ జిల్లా రేగోడ్ మండలం పెద్దతండాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. పెద్దతండాకు చెందిన రూప్‌సింగ్, దేవీబాయి దంపతులకు ఐదుగురు కుమారులు. చిన్న వయసులోనే ఓ కుమారుడు మరణించాడు. మరో కుమారుడైన రవీందర్(ప్రస్తుత వయసు 30) జిల్లాలోని అల్లాదుర్గం బేతాళస్వామి జాతరలో మూడేళ్ల వయసు ఉన్నప్పుడు తప్పిపోయాడు. ఆ బాలుడిని నాగల్‌గిద్ద మండలం దామరగిద్ద తండాకు చెందిన శ్యామ్‌నాయక్, చాందీబాయి చేరదీసి పెంచుకున్నారు. మూడేళ్ల కిందట రూప్‌సింగ్ మరో కుమారుడు గణేశ్ ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ దామరగిద్ద తండాకు చెందింది కావడంతో రూప్‌సింగ్ కుటుంబ సభ్యులు తరచూ దామరగిద్దకు వెళ్తున్నారు. ఇటీవల వెళ్లినప్పుడు అక్కడ తమ ఆవేదనను గ్రామస్థులతో పంచుకున్నారు. ఐదుగురు కుమారుల్లో ఒకరు చిన్నప్పుడే చనిపోయాడని, మరో కుమారుడు రవీందర్.. జాతరలో తప్పిపోయాడని, ఇప్పుడు గణేశ్ ప్రాణాలు కోల్పోయాడని కన్నీరుమున్నీరయ్యారు. ఆ వివరాలు విన్న గ్రామస్థులు రవీందర్ గురించి చెప్పడంతో.. పుట్టుమచ్చల ఆధారంగా తమ కుమారుడేనని గుర్తించారు. సంక్రాంతి రోజు తన భార్యా పిల్లలతో రవీందర్ పెద్దతండాకు వచ్చారు. కుమారుడు తిరిగి రావడంతో ఆ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తంచేశారు.

విద్యార్థుల నేత్ర సంరక్షణలో రాష్ట్రానికి గుర్తింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు, కళ్లద్దాల పంపిణీలో రెండేళ్లుగా అమలుచేస్తున్న విధానాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కిందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ వెల్లడించింది. 2024-25, 2025-26 విద్యా సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యసాధనలో చూపిన చొరవ, రాష్ట్రంలో అమలవుతున్న ఉత్తమ విధానాలను ఇతర రాష్ట్రాల్లో అమలుచేసేందుకు త్వరలో మార్గదర్శకాలు జారీచేస్తామని కేంద్రం వెల్లడించిందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అలాగే 2026-27లో కంటి అద్దాల పంపిణీ వార్షిక లక్ష్యాన్ని 90 వేల నుంచి.. 2.50 లక్షలకు పెంచిందని పేర్కొంది. రాష్ట్రానికి జాతీయ స్థాయి గుర్తింపు దక్కడంపై అధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అభినందించారు. జిల్లాల వారీ పరీక్షల పురోగతి, సమర్థ పర్యవేక్షణతో ఆశించిన ఫలితాలు సాధ్యమయ్యాయని అంధత్వ నివారణ కార్యక్రమం రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు.

(c) eenadu